www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి



శనివారం | 24-3-2018 | పేజీలు: 18 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 338 | విజయవాడ సిటీ

శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ. 10.06 తదుపరి అష్టమి; నక్షత్రం: మృగశిర మ. 3.42 తదుపరి ఆరుద్ర; వర్జ్యం: రా. 11.38-1.09; దుర్ముహూర్తం: ఉ. 6.20-7.57; అమృతఘడియలు: ఉ. 7.22-8.53, తె. 4.55 మొదలు; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.20; సూర్యాస్తమయం: 6.24

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

# ఇక కాంగ్రెస్ అవిశ్వాసం!

- 27న చేపట్టాలని మల్లికార్జున ఖర్గే నోటీసు
- టీడీపీ, వైసీపీ కలిపితే మొత్తం 73 మంది
- లోక్‌సభలో అవిశ్వాసం చేపట్టక తప్పదు
- ఆరో రోజూ టీడీపీ తీర్మానం బుట్టదాఖలు
- ఏపీపై కుట్రలు.. బలహీనపరిచే వ్యూహం
- టీడీపీ దెబ్బతింటే రాష్ట్రానికే దెబ్బ: చంద్రబాబు



15

శుక్రవారం రాజ్యసభలో అధ్యక్ష స్థానాన్ని చుట్టుముట్టిన టీడీపీ, విపక్ష సభ్యులు

కేంద్ర ప్రభుత్వంపై 'అవిశ్వాసం' ముట్టడి మరింత ముమ్మరమైంది. ఇప్పటికే టీడీపీ, వైసీపీ నిత్యం నోటీసులు ఇస్తుండగా... తాజాగా విపక్ష కాంగ్రెస్ కూడా జత కలిసింది. మోదీ ప్రభుత్వంపై అవిశ్వాసం ప్రకటిస్తూ గురువారం నోటీసులు అందించింది. వెరసి... మంగళవారం సభ ముందుకు మూడు అవిశ్వాస నోటీసులు రానున్నాయి. వాటిని స్వీకరిస్తారా? 'సభ ఆర్డర్‌లో లేదు' అని బుట్టదాఖలు చేస్తారా? వేచి చూడాల్సిందే!



## ఏపీకి అన్యాయం చేయలేదు

- నిస్పృహతోనే అవిశ్వాసాలు
- పార్లమెంటు జరగనివ్వడం లేదు
- ప్రజల్లోకి వెళ్లి వివరించండి
- టెక్నాలజీని వాడుకోండి
- బీజేపీ ఎంపీలకు ప్రధాని పిలుపు

18

## దక్షిణాది సమరం!

- పన్నుల పంపకంలో కేంద్రం వివక్ష
- 2011 జనాభా ప్రకారం పంపిణీ
- తీవ్రంగా వ్యతిరేకించిన బాబు
- గొంతు కలిపిన కర్ణాటక, కేరళ
- దక్షిణాది భేటీకి కేరళ పిలుపు
- సంసిద్ధత వ్యక్తంచేసిన రాష్ట్రాలు

18



## ఆప్‌కు లాభం

- 20 మంది ఎమ్మెల్యేల అనర్హతపై ఊరట

కేంద్రం నోటిఫికేషన్‌ను రద్దు చేసిన ఢిల్లీ హైకోర్టు

18

వాటాలు తేలక తన్నుకున్నారు 5

పీఆర్ కమీషనరేట్‌లో బాహాబాహీ

కొట్టుకొన్న ఉన్నతాధికారులు

గ్రూప్-1లో టాప్ 522.5

తుది మార్కులు విడుదల 2

నవమి సెలవు సోమవారం



# ఏపీ మా హీరో

## బాబు మాటతో నవ్యాంధ్ర బాట!

- ప్లాంటు వేరే రాష్ట్రంలో పెట్టాలనుకున్నాం
- మా నిర్ణయాన్ని సీఎం గంటలో మార్చారు
- ఆయన చొరవ, సహకారంవల్లే ఇది సాధ్యం
- ఏపీకి రావాలని నా మిత్రులకూ సూచిస్తా
- 'హీరో' సీఎండీ పవన్ ముంజాల్ ప్రకటన
- కృష్ణపట్నం-కియ మధ్య ఆటోమొబైల్ క్లస్టర్
- హీరో రాకతో ఏపీకి 'పెట్టుబడుల ప్రాధాన్యం'
- భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని వస్తాయి
- పెట్టుబడులకు అత్యుత్తమంగా నవ్యాంధ్ర
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- హీరో ద్విచక్ర వాహన పరిశ్రమకు భూమిపూజ
- చిత్తూరు జిల్లాలో 600 ఎకరాల్లో
- రూ.1,600 కోట్లతో ప్లాంటు ఏర్పాటు




హీరో మోటార్స్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, హీరో మోటార్స్ సీఎండీ పవన్ ముంజల్, పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి

తిరుపతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఇసుజు! శరవేగంగా సిద్ధమవుతున్న కియ! ఇప్పుడు... 'హీరో'! నవ్యాంధ్ర ఆటోమొబైల్ హబ్‌గా రూపుదిద్దుకుంటోంది. ప్రతిష్ఠాత్మకమైన ద్విచక్ర వాహన తయారీ సంస్థ 'హీరో' పరిశ్రమ ఏర్పాటు లాంఛనంగా ప్రారంభమైంది. చిత్తూరు జిల్లా సత్యవేడు మండలం మాదనపాళెం వద్ద 600 ఎకరాల్లో ఏర్పాటు కానున్న హీరో మోటార్స్ ద్విచక్ర వాహన పరిశ్రమకు సంస్థ

మిగతా 2వ పేజీలో...

నిజానికి ఈ ప్లాంటును దక్షిణాదిలోనే మరో రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం. అయితే చంద్రబాబు ఆ రోజు మా ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం చేస్తూ మాట్లాడుకున్నాం. మా నిర్ణయాన్ని మార్చుకుని, ఏపీకొచ్చేలా గంటలోనే మమ్మల్ని ఒప్పించారు.

- పవన్ ముంజల్



# అహం తొలగితేనే పరమాత్మ దర్శనం



ఒకప్పుడు దేవదానవులకు యుద్ధం జరిగింది. దేవతలు గెలిచారు. ఆ విజయానికి కారణం తమ శక్తియుక్తులేనన్న గర్వం వారిలో పెరిగింది. దీన్ని కనిపెట్టిన పరమాత్మ.. భూమ్యాకాశపర్యంతం ఒక దుర్నిరీక్షమైన ప్రకాశంలా అవతరించాడు. దేవతలకు ఆశ్చర్యం వేసింది. ఆ కాంతి ఏమిటా అని ఆలోచించారు. దాన్ని పరిశీలించి రమ్మని అగ్నిహోత్రుణ్ని పంపారు. ఆయన అక్కడికి వెళ్లగానే.. 'నీవు ఎవరు' అనే ప్రశ్న ఆ ప్రకాశం నుంచి వినిపించింది. 'నేను అగ్నిహోత్రుణ్ని. అన్నిటినీ కాల్చేస్తాను' అన్నాడాయన. 'ఏదీ ఆ గడ్డిపోచను కాల్చు చూద్దాం' అన్నదా ప్రకాశం. ఆయన ఎంత ప్రయత్నించినా గడ్డిపోచను కాల్చలేక అవమాన భారంతో వెనుదిరిగాడు. తర్వాత వాయువు వెళ్లి.. గడ్డిపోచను ఇసుమంతైనా కదల్చలేక తిరుగుముఖం పట్టాడు. మూడోమారు ఇంద్రుని వెళ్లిరమ్మన్నారు దేవతలు. అప్పుడాయన.. అగ్నిహోత్రుడికి, వాయుదేవుడికి శృంగభంగం చేసిందంటే ఆ ప్రకాశానికి ఎంత శక్తి ఉన్నదోకదా.. అని ఆయన నడుస్తూ ఆలోచించడం ప్రారంభించాడు. ఆలోచించిన కొద్దీ.. ఆ వెలుగు పరమాత్మ స్వరూపమేనని అర్థమైంది. ఇంద్రుడికి ఆ ఎరుక కల్గగానే ఆ ప్రకాశం అంతరించి పరమ కరుణాస్వరూపిణి అయిన ఉమా దేవి ఆకాశమధ్యంలో గోచరించింది. ఆ తల్లికి చేతులెత్తి నమస్కరించాడు స్వర్గాధిపతి. 'నీవు చూచినది ఆ పరబ్రహ్మ స్వరూపం. ఈ ప్రపంచానికీ సమస్త దేవాసురులకు అన్నిటికీ కారణం ఆయనే. సృష్టిలోని అన్ని రూపాలూ ఆ పరమాత్మవే' అని అంబ అమరేంద్రుడికి బోధించింది. ఈ కథలో.. అగ్నికి, వాయువుకు అవమానం జరిగింది వారి మనసు నొప్పించేందుకు కాదు. అహంభావాన్ని తొలగించడం కోసం. అహంభావం ఉన్నవారికి పరమాత్మ దర్శనం కాదు. ఆ పొర ఎప్పుడైతే తొలగిపోతుందో ఆ క్షణమే పరబ్రహ్మస్వరూపం అవగతమవుతుందని కేనోపనిషత్తులోని ఈ కథ చెబుతుంది.

-చంద్రశేఖరేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామి

('జగద్గురు బోధలు' నుంచి)

Paramjyothi పరంజ్యోతి

# గ్రూప్-1లో టాప్ 522.5

- రెండు మూడు స్థానాల్లో 519.5 , 511.5
- తుది మార్కులు విడుదల

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 (36/2016) అభ్యర్థుల తుది మార్కులను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. గత ఏడాది ఆగస్టులో 750 మార్కులకు మెయిన్స్ నిర్వహించారు. 78 పోస్టుల భర్తీ కోసం ఈ నెల 12 నుంచి 23 వరకు 75 మార్కులకు ఇంటర్వ్యూలు జరిగాయి. మొత్తం 151 మంది అభ్యర్థుల తుది మార్కులను శుక్రవారం విడుదల చేశారు. సాంకేతిక కారణాలతో ఇద్దరు అభ్యర్థులను తిరస్కరించినట్లు ఏపీపీఎస్సీ పేర్కొంది. అంటే తుది సెలెక్షన్ జాబితాలో 149 మంది అభ్యర్థులే మిగులుతారు. అభ్యర్థుల రోల్ నెంబరు, జెండర్, కమ్యూనిటీ, మెయిన్స్‌లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూలో పొందిన మార్కులు, మొత్తం మార్కులను ఏపీపీఎస్సీ తన వెబ్‌సైట్లో పొందుపరిచింది. అభ్యర్థులు వారు ఇచ్చుకున్న పోస్టు ప్రిఫరెన్స్, రిజర్వేషన్, పోస్టుల సంఖ్య ఆధారంగా గ్రూప్-1 సర్వీసెస్ ఉద్యోగానికి ఎంపిక చేస్తారు.

## టాపర్లు వీరే...

361205167 రోల్ నెంబర్ కలిగిన అభ్యర్థి (ఓసీ కేటగిరి-పురుష) 825 మార్కులకుగాను 522.5 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. సదరు అభ్యర్థి మెయిన్స్‌లో 750 మార్కులకు గాను 463.5 మార్కులు, ఇంటర్వ్యూలో 75 మార్కులకు గాను 59 మార్కులు పొందారు.

- రోల్ నెంబరు 361303161 కలిగిన అభ్యర్థి (ఓసీ కేటగిరీ-పురుష) 519.5 మార్కులు సాధించి సెకండ్ టాపర్‌గా నిలిచాడు. సదరు అభ్యర్థి మెయిన్స్‌లో 457 మార్కులు, ఇంటర్వ్యూలో 62.5 మార్కులు పొందారు.
- రోల్ నెంబరు 361100184 కలిగిన అభ్యర్థి (ఓసీ కేటగిరి-పురుష) 825 మార్కులకుగాను 511.5 మార్కులు సాధించి థర్డ్ టాపర్‌గా నిలిచాడు. ఈ అభ్యర్థికి మెయిన్స్‌లో 445.5 మార్కులు, ఇంటర్వ్యూలో 66 మార్కులు లభించాయి.

# ఏపీ.. మా హీరో



హీరో మోటార్స్ సీఎండీ పవన్ ముంజల్‌ను సత్కరిస్తున్న సీఎం

(మొదటి పేజీ తరువాయి)

సీఎండీ పవన్ ముంజల్ సమక్షంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేశారు. దక్షిణాదిలోనే మరో రాష్ట్రంలో ప్లాంటును ఏర్పాటు చేయాలన్న తమ నిర్ణయాన్ని... చంద్రబాబు గంటలోనే మార్చుకునేలా చేశారని పవన్ ముంజల్ తెలిపారు. "నిజానికి... ఈ ప్లాంటును దక్షిణాదిలోనే మరో రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం. ఆ మేరకు అంతా సిద్ధం చేశాం. అయితే... ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ రోజు మా నివాసానికి వచ్చారు. రాత్రి భోజనం చేస్తూ మాట్లాడుకున్నాం. మా నిర్ణయాన్ని మార్చుకుని, ఏపీకి వచ్చేలా గంటలోనే మమ్మల్ని ఒప్పించారు" అని ముంజల్ తెలిపారు. ముఖ్యమంత్రి చొరవ, సహకారం లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదన్నారు. "రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి వాతావరణం ఉంది. ప్రభుత్వ సహకారం లభిస్తోంది. ఏపీలో పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిందిగా మా మిత్రులకు కూడా సిఫారసు చేస్తాను" అని అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక్కడ హీరో మోటార్స్ యూనిట్ పూర్తయితే తమ సంస్థ ఏటా 1.1 కోట్ల ద్విచక్ర వాహనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యానికి చేరుకుంటుందని తెలిపారు.

### తరలి రండి: సీఎం

600 ఎకరాల్లో రూ.1600 కోట్ల పెట్టుబడితో హీరో మోటార్స్ ప్లాంటు ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఏపీలో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారు. హీరో మోటార్స్ కుటుంబంతో నాకు మంచి సంబంధాలున్నాయి. అందుకే సీఎండీని ఒప్పించి పరిశ్రమను చిత్తూరు జిల్లాకు తీసుకురాగలిగాం" అని చంద్రబాబు వివరించారు. ఏపీలో ఏర్పాటు కానున్నది హీరో మోటార్స్ 8వ యూనిట్ అని... ఇక్కడ ఏటా 18 లక్షల వాహనాలు తయారు చేస్తారని తెలిపారు. మొత్తం మూడు దశల్లో రూ.1600 కోట్లు పెట్టుబడి పెడతారని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికే ఉత్పత్తులు ప్రారంభించాలని 'హీరో'ను కోరారు.

రాష్ట్రంలో మూడు విడతలుగా జరిగిన భాగస్వామ్య సదస్సులో రూ.18.55 లక్షల కోట్లతో ఎంవోయూలు కుదుర్చుకున్నామని, ఈ పరిశ్రమల ద్వారా 44 లక్షల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయని చంద్రబాబు తెలిపారు. "రవాణా, విద్యుత్తు సౌకర్యాలతో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి 24 గంటలూ ప్రభుత్వం అందుబాటులో ఉంటుంది. ఎలాంటి ఇబ్బందులొచ్చినా ఒక్క ఫోన్ కాల్‌తో పరిష్కరిస్తాం" అని భరోసా ఇచ్చారు. మంచి నాయకత్వం, శాంతిభద్రతలు, వనరులు ఉన్నాయి కాబట్టి భవిష్యత్తులో హీరోలాంటి పరిశ్రమలు అనేకం వస్తాయన్నారు. "ఇప్పటికే చిత్తూరు జిల్లాలో అపోలో టైర్లు, అశోక్ లేల్యాండ్ కంపెనీలకు భూమి పూజ జరిగింది. అనంతపురంలో కియ పరిశ్రమ పనులు వేగంగా సాగుతున్నాయి. చిత్తూరు-అనంతపురం, విశాఖ-చెన్నైలతో పాటు కృష్ణపట్నం ఓడరేవు నుంచి బెంగళూరు-చెన్నై మీదుగా పారిశ్రామిక కారిడార్ ఏర్పాటవుతుంది" అని చంద్రబాబు వివరించారు. కృష్ణపట్నం నుంచి కియ మోటార్స్ వరకు చిత్తూరు మీదుగా నాలుగు లేన్ల రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగున్నరేళ్లుగా పరిశ్రమల ప్రగతి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి, శాఖ కార్యదర్శి సాల్మన్ అరోకియా రాజ్, సిద్ధార్థ జైన్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**ఇదీ హీరో...**

- ఏపీలో ఏర్పాటవుతున్నది 'హీరో' 8వ యూనిట్.
- 1600 కోట్ల పెట్టుబడి.. 15వేల మందికి ఉపాధి
- 18 లక్షల ద్విచక్ర వాహనాల ఉత్పత్తి సామర్థ్యం



# ప్రభుత్వంపై 73% సంతృప్తి

- ప్రశ్నపత్రాల లీక్ వదంతులపై చర్యలు
- 'ఇసుక' వ్యతిరేక ప్రచారంపై అప్రమత్తం
- ఆర్‌టీజీ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి శాతం 73కు పెరిగింది. గతంలో కంటే 5% మేర ఇది ఎక్కువ. 14 రకాల ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించగా గృహనిర్మాణ శాఖపై మినహా మిగిలిన శాఖల్లో 90% సంతృప్తి ఉందని తేలింది. అదే సమయంలో ఇసుక విధానంపై 84% మంది సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు శుక్రవారమిక్కడ ఆర్టీజీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆర్‌టీజీ ఇప్పటివరకు 31 శాఖలతో అనుసంధానమైందని అధికారులు వివరించారు. పరీక్షల సమయంలో ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని నిరాధార వదంతులు, ఫిర్యాదులు వస్తే అలా చేసిన వారిని తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. 'టెట్' నిర్వహణపై వస్తున్న ప్రతికూల వార్తలను పరిశీలించి.. అన్నింటికీ స్పష్టమైన వివరణ ఇవ్వాలన్నారు. పరీక్షా ఫలితాల్లో పారదర్శకత కనిపించాలని సూచించారు. దేశంలోనే మొదటిసారిగా ఆన్‌లైన్‌లో టెట్ విజయవంతంగా నిర్వహించిన అధికారులను, ఎలాంటి అవకతవకలు లేకుండా పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తోన్న సిబ్బందిని అభినందించారు. బెల్టుషాపుల పట్ల కఠినంగా ఉండాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించారు. దాదాపు 19వేల మంది నుంచి ఉచిత ఇసుకపై అభిప్రాయం తీసుకుంటే.. అందులో 3వేల మంది అసంతృప్తి వ్యక్తం చేశారు.

## సాహిత్య అకాడమీ సలహా మండలిలో శిఖామణి



యానాం, మార్చి 23: కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగ కమిటీ సలహా మండలి సభ్యుడిగా యానాంకు చెందిన ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు కర్రి సంజీవరావు(శిఖామణి) ఎంపికయ్యారు.

## ఆర్అండ్‌బీ ఈఎన్‌సీగా సుబ్బారావు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాలశాఖ ఇన్‌చార్జి ఇంజనీరింగ్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ)గా ఎం. సుబ్బారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుబ్బారావు ప్రస్తుతం ఆర్అండ్‌బీలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. రాష్ట్ర రహదారులతోపాటు, ఆంధ్రప్రదేశ్ రోడ్డు అభివృద్ధి సంస్థ(ఏపీఆర్‌డీసీ) బాధ్యతలను కూడా ప్రభుత్వం ఆయనకు అప్పగించింది.

## నవమి సెలవు సోమవారం

అమరావతి: శ్రీరామనవమి పండగ సందర్భంగా ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. తిరుమల తిరుపతి కేలండర్ ప్రకారం ఆదివారం నవమి కాగా, భద్రాచలంలో సోమవారం సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నారు.

## దేశంలో ప్రప్రథమంగా సంజ్ఞల నిఘంటువు

- విడుదల చేసిన కేంద్ర మంత్రి థార్‌చంద్ గెహ్లాట్

న్యూఢిల్లీ, మార్చి 23: మూగ, చెవిటి వారికి ఉపయుక్తంగా వుండేలా దేశంలోనే మొట్టమొదటి సారిగా సంజ్ఞల నిఘంటువు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం ఓ కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రి థార్‌చంద్ గెహ్లాట్ దీనిని విడుదల చేశారు. సంజ్ఞలను ఉపయోగించే వారి మధ్య సారూపత్యను తీసుకురావటం, మూగ, చెవిటి వారి మధ్య భావప్రసారానికి వున్న అడ్డంకులను తొలగించటమే లక్ష్యంగా భారతీయ సంజ్ఞాభాష పరిశోధన, శిక్షణాలయం దీనిని రూపొందించింది. ఈ నిఘంటువులో 3000 హిందీ, ఆంగ్ల పదాలు, వాటి సంజ్ఞా చిత్రాలను పొందుపరిచారు. ఈ నిఘంటువుని సీడీ, బుక్ రూపంలో పొందవచ్చు.



# పోలవరంలో అంతా భేష్

**కాంక్రీటు పనుల్లో వేగం.. నాణ్యతా బాగుబాగు.. మసూద్ కమిటీ కితాబు**

- వాప్కోస్‌తో థర్డ్ పార్టీ తనిఖీకి సూచన
- కేంద్రం నుంచి రాష్ట్రానికి చేరిన నివేదిక
- సీఎం కార్యాలయంలో అందజేత
- మంత్రులు, ఎమ్మెల్యేలకూ పంపిణీ

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనుల్లో అంతా సవ్యంగానే జరుగుతోందని కేంద్ర జలసంఘం చైర్మన్ ఎస్.మసూద్ హుస్సేన్ నేతృత్వంలోని కమిటీ పేర్కొంది. పనులు, నాణ్యత, పునరావాసంపై ఈయన ఆధ్వర్యంలో కేంద్ర జలవనరుల శాఖ నిపుణుల కమిటీని నియమించిన సంగతి.. ఆ కమిటీ సభ్యులు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు పోలవరంలో పర్యటించిన విషయం తెలిసిందే. సదరు కమిటీ తన నివేదికను కేంద్ర జలవనరుల కమిషనర్‌కు అందజేసింది. కేంద్రం దానిని రాష్ట్ర జల వనరుల శాఖకు పంపగా.. ఆ శాఖ ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయంలో శుక్రవారం నివేదించింది. నివేదిక ప్రతులను రాష్ట్ర మంత్రులకు, శాసనసభ్యులకు, మీడి యా ప్రతినిధులకూ పంపిణీ చేసింది. మసూద్ కమిటీ తన నివేదికలో పోలవరం పనులపై సంతృప్తి వ్యక్తం చేసింది. పనుల్లో వేగం పెరిగిందని.. నాణ్యతా ప్రమాణాలూ బాగున్నాయని కితాబిచ్చింది. థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ తనిఖీని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ వాప్కోస్ ద్వారా చేయించాక మరింత స్పష్టత వస్తుందని పేర్కొంది. మసూద్ తన నివేదికలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు బాగున్నాయని పేర్కొనడం రాష్ట్ర జల వనరుల శాఖకు అమిత సంతోషాన్నిచ్చింది.

### నివేదికలో ఏముందంటే..

'ప్రాజెక్టు ప్రధాన పనుల్లో అత్యంత కీలకమైన స్పిల్ వే, స్పిల్ చానల్ కాంక్రీటు పనులు ప్రధాన కాంట్రాక్టు సంస్థ ట్రాన్‌స్ట్రాయ్ నుంచి కొత్త కాంట్రాక్టు సంస్థ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీకి అప్పగించే ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. నవయుగ రంగంలోకి దిగాక పనుల్లో వేగం పెరిగింది. స్పిల్ వే కాంక్రీట్ పనులు ఇప్పటిదాకా రోజుకు 1700 క్యూబిక్ మీటర్ల మేర జరిగితే.. నవయుగ వచ్చాక 3000 క్యూబిక్ మీటర్లకు పెరిగింది. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం నిర్మాణంలో భాగంగా చేపట్టిన డయాఫ్రమ్ వాల్ పనులు 74 శాతం మేర పూర్తయ్యాయి. ఈ పనుల్లో థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఉంటే బాగుంటుంది. కాఫర్ డ్యాం నిర్మాణం 2019 మార్చి నాటికి పూర్తవుతుంది. టన్నెల్ ద్వారా కుడి ప్రధాన కాలువను అనుసంధానం చేసే పనులు సమాంతరంగా చేపట్టాలి. పోలవరం నిర్మాణం పూర్తయితే ఉభయ గోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 7.2 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని మసూద్ కమిటీ పేర్కొంది. 540 గ్రామాల్లోని 28.5 లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపింది.

## పోలవరం పర్యావరణ అనుమతులపై సమాధానమివ్వండి

- కేంద్ర రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులపై జవాబివ్వాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖకు, పోలవరంప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)కి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిస్సా, చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టుపై జాతీయ హరిత ధర్మాసనం(ఎన్‌జీటీ)లో విచారణ చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ స్వచ్ఛంద సంస్థ 'రేలా' సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## పోలవరానికి మరో కమిషన్

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో మరో జాతీయ స్థాయి బృందం పర్యటించనుంది. ఇటీవల జాతీయ పర్యావరణ, గిరిజన సంక్షేమ కమిటీ నిపుణుల కమిటీలు పోలవరం పనులు, ఇతర అంశాలను పరిశీలించాయి. తాజాగా... గిరిజన సంక్షేమ కమిషన్ పోలవరం ప్రాంతంలో పర్యటించనుంది. గిరిజనుల నుంచి సేకరించిన భూములకు చెల్లించిన పరిహారం, కొత్త భూసేకరణ చట్టం మేరకు కల్పిస్తున్న పునరావాసం తదితర అంశాలను ఈ కమిషన్ పరిశీలిస్తుంది.

## ఫేస్‌బుక్‌తో ఒక్కటైన ప్రేమజంట

- అసోం యువతి, సిక్కోలు యువకుడు
- వేడుకగా వివాహం

సీమూరు(కవిటి), మార్చి 23: నేనీ దరినీ.. నువ్వా దరినీ.. ఫేస్‌బుక్ కలిపింది ఇద్దరినీ- అని పాడుకుంటున్నారు ఆ నూతన దంపతులు. అసోంకు చెందిన యువతి, శ్రీకాకుళానికి చెందిన యువకుడికి ఫేస్‌బుక్ పరిచయంతో మనసులు కలిశాయి. పెద్దలను ఒప్పించి ఏడడుగులు వేశారు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం సీమూరు గ్రామానికి చెందిన జనపాన మధుసూదనరావు సింగపూర్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈయనకు అసోంలోని విష్ణుపూర్‌కు చెందిన ప్రభుత్వ పాఠశాల టీచర్ తుల్లికాదాస్‌తో 2014లో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైంది. అనంతరకాలంలో ఈ పరిచయం ప్రేమగా మారి శుక్రవారం వివాహం చేసుకున్నారు.



దంపతులు మధుసూదనరావు, తుల్లికాదాస్



## 12 గంటలు బురదలో..

- రైలు నుంచి జారిపడిన యువతి

ఆకివీడు, మార్చి 23: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడిన యువతి 12 గంటలపాటు మృత్యువుతో పోరాడింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని శ్రీరామపురానికి చెందిన జయంతి రాజేశ్వరి (21) బీఈడీ చదువుతోంది. గురువారం ఉదయం ఆమె విజయవాడకు వచ్చింది. సాయంత్రం పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణమైంది. రాత్రి 9 గంటల సమయంలో ఆకివీడు గుమ్ములూరు సెంటర్ రైల్వేగేటు సమీపంలో జయంతి కాలుజారి రైలులోనుంచి కింద పడింది. ట్రాక్ పక్కనే ఉన్న బురదగుంటలో పడిపోయింది. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో.. రైల్వేగేటు కీమన్ గోపాలకృష్ణ జయంతిని గుర్తించారు. ఇతర కార్మికులతో కలిసి ఆమెను ఆస్పత్రికి తరలించారు.

## ప్రమాదం పెట్టిన 'పరీక్ష'

కర్నూలు జిల్లా కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థులు శుక్రవారం పరీక్ష రాసేందుకు వెళ్తుండగా... వీరు ప్రయాణిస్తున్న ఆటో ప్రమాదానికి గురైంది. ఆటోలో ఉన్న 23 మంది విద్యార్థులు గాయపడ్డారు. వీరేశ్ అనే విద్యార్థికి కాలు విరగడంతో... అంబులెన్స్‌లో, స్ట్రెచర్ మీద పడుకునే ఇలా పరీక్ష రాశాడు. ఇక... విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలం టీఎన్ వలస పాఠశాల సమీపంలోనూ ఆటో బోల్తా కొట్టడంతో... పదోతరగతి పరీక్ష రాసి తిరిగి వెళ్తున్న ఒక విద్యార్థి మరణించాడు. మరో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు.



అంబులెన్స్‌లోనే పరీక్ష రాస్తున్న వీరేశ్

## లోకం తీరు




భయపడాల్సిన అవసరం ఏమీ లేదు సార్.. అవి మనకు తగిలేవి కాదులేండి !

**ఉష్ణోగ్రతలు**

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 38.3 | 21.3 |
| చిత్తూరు | 40.2 | 27.4 |
| గుంటూరు | 40.1 | 24.1 |
| విజయవాడ | 38.6 | 25.0 |
| ప్రకాశం | 37.2 | 27.5 |

## నెలాఖరులో ఎండలు తీవ్రం

విశాఖపట్నం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాయలసీమ, కోస్తాల్లో ఎండ తీవ్రత పెరిగింది. పడమర గాలులతో వాతావరణం మరింత వేడెక్కింది. మూడు రోజులగా కర్నూలు, అనంతపురంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. కాగా.. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని, నెలాఖరు నుంచి ఏప్రిల్ తొలివారం వరకు ఎండలు భారీగా పెరుగుతాయని హెచ్చరించింది. కాగా, రాష్ట్రంలో ఈనెల 27, 28 తేదీల్లో చాలాచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశముందని ఆర్టీజీలో ప్రభుత్వం పేర్కొంది.



## బీజేపీ చీప్ పాలిటిక్స్

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ చీప్ పాలిటిక్స్ చేస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 29లోపు కావేరి బోర్డును ఏర్పాటు చేయాలి. కానీ, త్వరలో కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసం బీజేపీ కావేరిబోర్డు ఏర్పాటులో తీవ్ర జాప్యం చేస్తోంది.

-కమల్‌హాసన్, ఎంఎన్ఎం అధ్యక్షుడు



## చైనాతో మనకు మిత్రశత్రుత్వం

భారత్, చైనా స్నేహసంబంధాల నుంచి ప్రపంచం నేర్చుకోవాల్సి ఉంది. చైనాతో మనకు ఉన్నది మిత్రశత్రుత్వం. విభేదాలను అంగీకరిస్తూనే ఆ దేశంతో కలిసి ముందుకు సాగుతుంటాం.

- ఐక్యరాజ్యసమితిలో భారత రాయబారి సయీద్ అక్బరుద్దీన్

## సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమలలో శుక్రవారం దాదాపు 70వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 14గంటలు, దివ్యదర్శనానికి 2గంటల సమయం పడుతోంది. ఆదివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శనివారం లాటరీ ద్వారా జారీచేసే సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.com లో సంప్రదించాలి.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



## యాంటిఆక్సిడెంట్లతో మనోవ్యాధికి చెక్

లండన్, మార్చి 23: కొన్ని రకాల యాంటిఆక్సిడెంట్లు, అమైనో యాసిడ్లకు మనో వ్యాధిని నయం చేసే గుణాలున్నాయని పరిశోధనలో వెల్లడైంది. టారిన్ అనే అమైనో యాసిడ్‌తో పాటు ఎన్ ఎసిటైల్ సిస్టిన్, సి విటమిన్‌లు మనో వ్యాధి చికిత్సకు ఉపయోగపడతాయని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్ పరిశోధకులు తెలిపారు.

## వ్యాయామం ఆపితే కుంగుబాటే

మెల్‌బోర్న్, మార్చి 23: మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి. అయితే వ్యాయామాన్ని మధ్యలో ఆపేస్తే కుంగుబాటుకు గురయ్యే అవకాశం ఉందని పరిశోధనలో వెల్లడైంది. ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ అడిలైడ్ పరిశోధకులు ఈ విషయాన్ని వెల్లడించారు. కుంగుబాటుకు దూరంగా ఉండాలంటే వారంలో కనీసం 150 నిమిషాలైనా వ్యాయామం చేయాలని చెబుతున్నారు.

# గీతంలో 'సంఘర్ష్'


నమూనాలను పరిశీలిస్తున్న ఎన్ఎం భావే

సాగర్‌నగర్ (విశాఖపట్నం), మార్చి 23: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, ఆటోమోటివ్ క్లబ్, గీతం ఎయిరో మోడలింగ్ క్లబ్, సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం 'సంఘర్ష్' శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. విద్యార్థులు తయారుచేసిన వాహన నమూనాలతో టెక్ ఎక్స్‌పోను ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ఎం భావే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మెకానికల్ ఇంజనీరింగ్ రంగంలో నూతన ఆవిష్కరణలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు.









## నేటి నుంచి
# రాములోరి బ్రహ్మోత్సవాలు





- ఒంటిమిట్టలో రాత్రికి అంకురార్పణ
- నభూతో అనిపించేలా నిర్వహిస్తాం: టీటీడీ ఈవో

ఒంటిమిట్ట, మార్చి23 : కడప జిల్లాలోని ఏకశిలా నగరి ఒంటిమిట్టలో రాములోరి బ్రహ్మోత్సవాల సంరంభానికి శనివారం రాత్రి అంకురార్పణ జరగనుంది. ముందుగా వేకువజామున 4 నుంచి 6 గంటల వరకు శ్రీ సీతారామలక్ష్మణ సమేత మూలవరులకు వేదమంత్రోచ్ఛారణల మధ్య స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. తరువాత ఉత్సవ మూర్తులకు వేడుకగా విశేష పూజ నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు మంగళ వాయిద్యాల నడుమ టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు, వేదపండితులు అంకురార్పణతో బ్రహ్మోత్సవ ఆరంభానికి శ్రీకారం చుడతారు. కాగా.. నేటి నుంచి జరిగే కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను నభూతో అన్న రీతిలో జరిపిస్తామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఒంటిమిట్టలోని టీటీడీ భవనంలో కలెక్టర్ బాబురావునాయుడు, ఎస్పీ అట్టాడ బాబూజీ, టీటీడీ జేఈవో పోలా భాస్కర్, విప్ మేడా మల్లికార్జునరెడ్డిలతో కలిసి.. శుక్రవారం సాయంత్రం శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో సింఘాల్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగంతో పూర్తి సమన్వయం చేసుకొని బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు దాదాపు పూర్తయినట్టు చెప్పారు. గత అనుభవనాల దృష్ట్యా లోటుపాట్లకు తావివ్వకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ ఏడాది ఎన్నివేల మంది భక్తులు వచ్చినా అందరికీ అన్నప్రసాదాలు పంపిణీ చేస్తామని తెలిపారు. అందుకోసం 230 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆలయ పరిసరాలలో నాలుగు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తుల సేవలందించేందుకు 1200 మంది శ్రీవారి సేవకులు, 850 మంది స్కౌట్ సిబ్బంది కలిసి మొత్తం 2 వేల మంది సేవకులను నియమిస్తున్నట్టు వెల్లడించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు వేల హైరెజల్యూషన్ గల 15 ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కల్యాణం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు.. స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని సింఘాల్ తెలిపారు. భద్రత కోసం 2వేల మంది పోలీస్ సిబ్బందిని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.


కల్యాణ వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో, కలెక్టర్, ఎస్పీ

## పుట్టపర్తిలో గవర్నర్ నరసింహన్

పుట్టపర్తి, మార్చి 23: అనంతపురం జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయిబాబా మహాసమాధిని తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ శుక్రవారం దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో గవర్నర్ బెంగళూరుకు చేరుకొన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పుట్టపర్తి చేరుకుని సాయికుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని నరసింహన్ దర్శించుకొన్నారు.


సత్యసాయి మహాసమాధికి నమస్కరిస్తున్న గవర్నర్ నరసింహన్


ఇంటి ముందు మోటరు సైకిల్ అడ్డుపెట్టి బిగిస్తున్న చెడ్డీ గ్యాంగ్

# ఏలూరులో చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్

- ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసులు
- గంటపాటు బిక్కుబిక్కుమంటూ బాధితులు

ఏలూరు క్రైం, మార్చి 23: రాష్ట్రంలో కలకలం సృష్టిస్తున్న చెడ్డీ గ్యాంగ్ పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో ప్రత్యక్షమైంది. గంటపాటు నగరంలోని ఒక ఇంటి వద్ద గ్యాంగ్ సభ్యులు హల్‌చల్ సృష్టించారు. ఆ ఇంట్లోని రెండు కుటుంబాలు తాము ఆపదలో ఉన్నామంటూ ఫోన్‌చేసినా పోలీసులు స్పందించలేదు. ఏలూరు శాంతినగర్ 8వ రోడ్డులో న్యాయవాది దేవరపల్లి సత్యనారాయణ ఇంటి పై భాగంలో.. కింది భాగంలో ఆక్వా రైతు సరెళ్ల రామకృష్ణ కుటుంబంతో ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఆరుగురు చెడ్డీ గ్యాంగ్ ముఠా సభ్యులు ఆ ఇంటి ఆవరణలోకి ప్రవేశించి ఒక మోటారు సైకిల్‌ను ప్రధాన ద్వారానికి అడ్డుగాపెట్టి కట్టివేశారు. తలుపును పగుల కొడుతుండగా మేల్కొన్న రామకృష్ణ కుటుంబసభ్యులు వెంటనే లైట్లు వేసి కేకలు వేశారు. అయినా ఆ గ్యాంగ్ అక్కడి నుంచి కదలక పోవడంతో ఫోన్ ద్వారా ఇంటిపైన ఉన్న న్యాయవాదికి సమాచారం ఇచ్చారు. ఆయన కిందకు రావడానికి ప్రయత్నించినా తలుపులు రాకపోవడంతో పోలీసు కంట్రోల్ రూమ్‌కు కాల్ చేశారు. స్థానికులకు ఫోన్లు చేసి మేల్కొలిపారు. చివరకు ఇరుగు పొరుగు వచ్చేటప్పటికి ఆ గ్యాంగ్ సభ్యులు కాలికి బుద్ధి చెప్పారు. అనంతరం స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసుల నుంచి స్పందన కొరవడింది. ఎట్టకేలకు శుక్రవారం ఉదయం ఏలూరు డీఎస్పీ ఈశ్వరరావుకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాబోయ్ ఏనుగులు..



కొత్తూరు, మార్చి 23: శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మదనాపురం సమీపంలో ఏనుగులు తిష్ఠ వేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత నాలుగు రోజులుగా నివగాం వద్ద తిష్ఠవేసిన ఏనుగులు శుక్రవారం మదనాపురం వైపు రావడంతో గ్రామస్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

# అన్నా దీక్ష!

ఏడేళ్ళ తరువాత అదే లోక్‌పాల్ కోసం అన్నా హజారే మళ్ళీ నిరవధిక నిరాహారదీక్షకు కూర్చున్నారు. అప్పటిమాదిరిగానే ఇప్పుడు కూడా రామ్‌లీలా మైదానమే వేదిక. ఆర్నెల్ల ముందస్తు హెచ్చరిక ద్వారా లోక్‌పాల్ విషయంలో మోదీ ప్రభుత్వాన్ని వేగంగా కదిలించగలుగుతానని ఆయన అనుకున్నారు. కానీ, ఇందుకు భిన్నంగా రామ్‌లీలా మైదానానికి దేశవ్యాప్తంగా తరలివస్తున్న కార్యకర్తలను అడ్డుకోవడానికి మాత్రమే ప్రభుత్వం కదిలిందన్నది హజారే ఆరోపణ. రైళ్ళను రద్దుచేయడం, ఢిల్లీ పొరుగు రాష్ట్రాలనుంచి కార్యకర్తలతో వస్తున్న బస్సులను గాలించడం ఇత్యాది విన్యాసాలతో తన సభకు జనం రాకుండా మోదీ చేశారన్నది హజారే అభియోగం. కారణాలు ఏమైనప్పటికీ, ఏడేళ్ళక్రితం నాటి జనసందోహం, మీడియా ప్రతినిధుల హడావుడి, టెలివిజన్ చానెళ్ళ ప్రత్యక్ష ప్రసారాలు ఇప్పుడు లేవు. అన్నా ముందున్న వారి సంఖ్య పదివేలకు మించకపోవచ్చును కానీ, గతంలో మాదిరిగానే ఈ దేశంలో మరో విస్తృతమైన ఉద్యమాన్ని సృష్టించాలన్న బలమైన ఆకాంక్ష, మోదీ ప్రభుత్వంపై విస్పష్టమైన ఆగ్రహం వారి కళ్ళలో కనిపిస్తున్నాయనీ, మరోమారు దేశవ్యాప్త తిరుగుబాటు ఖాయమని కొందరు సంతోషిస్తున్నారు. దీక్షకు కూర్చొనే ముందు హజారే కొద్దినెలలుగా దేశవ్యాప్తంగా పర్యటించి నలభైరెండు సభల్లో మాట్లాడారు. ఏడేళ్ళక్రితం హజారే ప్రతి అడుగునూ, మాటనూ మీడియా వొడిసిపట్టుకుంది. అన్నా ఇప్పటి పర్యటనలేవీ మీడియా అంతగా గుర్తించలేదు. ఇందుకు అసలు కారణం అధికారంలో మోదీ ఉండటమేననీ, మోదీ ప్రభుత్వం వేగంగా పావులు కదిపి మీడియాను నియంత్రించగలిగిందని కొందరి విమర్శ. వీటిని అటుంచితే, అప్పట్లో మాదిరిగా ఒక ఉద్యమఊపు ఇప్పటికైతే ఇంకా రాలేదన్నది నిజం. వేదికమీద ఆయనకు అటూ ఇటూ ఉన్న వారిలో కర్ణాటక, హర్యానా రాష్ట్రాలకు చెందిన ఇద్దరు మాజీ లోకాయుక్తలు మాత్రమే ప్రముఖంగా చెప్పుకోవలసినవారు. అన్నా ఉద్యమంతోనే ఎదిగి వచ్చి, ఏడాదికాలంలోనే దూరమై, ఎన్నికల రంగంలోకి దూకి ఢిల్లీకి ముఖ్యమంత్రి అయిన కేజ్రీవాల్ వంటివారు ఇప్పుడు పక్కనలేరు. అన్నా ఇదేదీ లోటుగా అనుకున్నట్టు లేదు. తన కొత్త ఉద్యమం ఎట్టిపరిస్థితుల్లోనూ కేజ్రీవాల్ వంటివారిని సృష్టించకూడదని ఆయన ఎప్పుడో సంకల్పం చెప్పుకున్నారు. అందుకు అనుగుణంగానే, వివిధ రాష్ట్రాలనుంచి ఓ పాతికమందిని ఎంపికచేసి కీలక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. భవిష్యత్తులో తాము రాజకీయపార్టీ ఏర్పాటు చేయబోమనీ, ఉన్నవాటిలో చేరబోమని వారితో ప్రమాణపత్రాలు కూడా రాయించుకున్నారు.

ఆర్నెల్లక్రితమే అన్నా తన డిమాండ్లు ప్రభుత్వం ముందుంచారు. నెరవేర్చాలని కోరుతూ లేఖలు రాశారు. మోదీ ప్రభుత్వం లోక్‌పాల్ నియామకం విషయంలో చేస్తున్న తాత్సారం ఆయనకు ఆగ్రహం కలిగిస్తున్నది. గత అవినీతి వ్యతిరేక ఉద్యమం జన లోక్‌పాల్ లక్ష్యంగానే సాగిన విషయం తెలిసిందే. విపక్షంలో ఉన్న బీజేపీ హజారేకు మద్దతు పలుకుతూ ఆయన ఉద్యమాన్ని అద్భుతంగా ఉపయోగించుకుంది. 2013లో యూపీఏ ప్రభుత్వం లోక్‌పాల్–లోకాయుక్తల చట్టం చేయడం, ఇప్పటివరకూ లోకాయుక్త నియామకం జరగకపోవడం తెలిసిందే. లోక్‌పాల్‌ను నియమించాలంటే పాలకులకు ఎంతో నైతికస్థైర్యం ఉండాలి. ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిత్యమూ డేగకళ్ళతో తమను పరీక్షించే, పర్యవేక్షించే వ్యవస్థలను సృష్టించడానికి పాలకులకు చేతులు రావు. ప్రశాంత్ భూషన్ తన ప్రజాప్రయోజన వ్యాజ్యంతో సుప్రీంకోర్టును తరుముతున్నందున, న్యాయస్థానం ప్రభుత్వాన్ని పలుమార్లు హెచ్చరించడంతో చివరకు ఇటీవలే ప్రభుత్వం ఇదిగో అదిగో అనడం ఆరంభించింది. గత ఏడాది ఏప్రిల్‌లోనే సుప్రీంకోర్టు శాసించినా ఈ విషయంలో కదలికలేకపోవడంతో చివరకు ప్రశాంత్ భూషణ్ కోర్టు ధిక్కారాస్త్రాన్ని కూడా ప్రయోగించారు. సుప్రీంకోర్టుకు ఏప్రిల్ మొదటివారంలో ప్రభుత్వం ఏం చెప్పుకుంటుందన్నది అటుంచితే, ఈ విషయంలో ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరించడం లేదన్నది వాస్తవం. రైతుల సమస్య పరిష్కారం కోసం స్వామినాథన్ కమిటీ సూచనలను అమలు చేయాలని కూడా అన్నా హజారే డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరవరలను నిర్ణయించే సీఏసీపీకి రాజ్యాంగ హోదాను, ప్రత్యేక ప్రతిపత్తిని ఇవ్వాలన్న ఆయన డిమాండ్ అత్యంత ముఖ్యమైనది. ఎన్నికల సంస్కరణలకు సంబంధించి అన్నా ప్రతిపాదిస్తున్న అంశాల్లో అభ్యర్థులను తిరస్కరించే, వెనక్కు పిలిపించే హక్కు కూడా ఉన్నది. ఇప్పుడు అన్నా ఎంతకాలం దీక్షను కొనసాగించగలరన్నది కాక, తన డిమాండ్ల విషయంలో మోదీ ప్రభుత్వాన్ని లవలేశమైనా కదిలించగలరా అన్నది ప్రధానం.

# 'మనిషిని పండించేవి పొలాలే'

ఆధునిక హిందీ కవితా ప్రపంచంలోనే కాకుండా భారతీయ సాహిత్యంలోనూ తన కవితలతో ఒక ప్రత్యేకతను చాటిన మహాకవి కేదార్ నాథ్ సింగ్ ఇక లేరు. ఈ నెల 21 వ తేదీ ( సోమవారం) రాత్రి అనారోగ్యంతో ఆయన ఢిల్లీలో మరణించారు. 2013 సంవత్సరానికి గాను దేశంలోనే సర్వోన్నత సాహిత్య గౌరవం, అత్యంత ప్రతిష్టాత్మకమైన 'భారతీయ జ్ఞానపీఠ్ అవార్డు'ను పొందిన ప్రశస్థ కవి కేదార్ నాథ్ సింగ్. హిందీ సాహిత్యంలో జ్ఞానపీఠ్ పురస్కారాన్ని పొందిన వారిలో కేదార్ నాథ్ పదవ వ్యక్తి.

ఈ మహాకవి ఉత్తరప్రదేశ్ లోని బలియా జిల్లాలో చకియా గ్రామంలో 1934 లో జులై ఒకటిన జన్మించారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ., పిహెచ్. డి పట్టాలు పొందారు. బలియాలో కొంత కాలం అధ్యాపకుడుగా పనిచేసిన తరువాత న్యూఢిల్లీ లోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో భారతీయ భాషా కేంద్రంలో ఆచార్యుడిగా, విభాగాధిపతిగా కేదార్‌నాథ్ సింగ్ పని చేసారు. ఆయన సృజనాత్మక సాహిత్య యాత్ర 1950 నుంచే ప్రారంభమైంది. మొదటి కవితా సంకలనం 'అభి బిల్కుల్ అభి' 1960లో అచ్చయింది. తదనంతరం 'జమీన్ పక్ రహీ హై', 'యహాం సే దేఖో', 'అకాల్ మే సారస్', 'బాఘ్', 'ఉత్తర్ కబీర్ ఔర్ అన్య కవితాయే', 'తాల్ స్తాయ్ ఔర్ సైకిల్' ల్లాంటి కవితా సంకలనాలు వారి కలం నుంచి వెలువడ్డాయి.

కేదార్ నాథ్ సింగ్ తన కవితలలో 'మనిషి'ని వెతుకుతారు. 'మనిషి' ని ప్రతిష్టించాలనుకుంటారు. కవిత్వం పదాలలో బందీ అయిందనో లేదా పదాల వ్యాకరణానికి పరిమితమయిందనో కేదార్‌నాథ్ సింగ్ భావించరు . 'భాష వచ్చిన వారు ఎందుకు మౌనంగా ఉన్నారని' ఓ కవితలో ఆయన ప్రశ్నిస్తారు. ఈ ప్రశ్నలో కేదార్ నాథ్ సింగ్ మనిషిలోని జవాబుదారీతనానికి పర్యాయపదంగా భాషను చూస్తారు. భాష మనిషి అస్తిత్వానికి చిహ్నం అని ఆయన భావిస్తారు. అందుకే అందులో ఎలాంటి పొరపాట్లు జరగకూడదు. 'చల్లదనంతో పదాలు మరణించవు, సాహసలేమితో అవి మరణిస్తాయి'

> కేదార్‌నాథ్ సింగ్ కవితలు స్పష్టంగా, సరళంగా, సహజంగా మామూలు భాషలో ఉంటాయి, కవితలు ఎంత సహజంగా, సరళంగా ఉంటాయో అంతే లోతైన భావాలను వ్యక్తం చేస్తాయి. మనిషిని ఉన్నతీకరించడంతో బాటు ప్రపంచ సౌందర్యాన్ని మానవీయ కోణంతో ఆవిష్కరించిన మహా కవి; మాటలనే కవితలుగా మలచిన మహా శిల్పి కేదార్‌నాథ్ సింగ్. 'మాట్లాడుతాను, అందుకే రాస్తాను' అని సగర్వంగా ఆయన ప్రకటించారు.



1934 – 2018

అని మరో కవితలో ఆయన అంటారు. పదాలు నిజానికి మనిషికి పర్యాయపదం. మనిషి అంటే ఇక్కడ చైతన్యంతో ఉండే మనిషి. బ్రతికున్న మనిషి. బ్రతుకు ఇక్కట్లను, ప్రకృతి, జీవితంలో సరితూగని సంబంధాల వైరుధ్యాలను ఎదుర్కొనే ధైర్య, సాహసాలు కలిగి ఉండే మనిషి. 'మిత్రులకు చెప్పాను, మౌనంగా ఉంటే ఏమీ లాభం లేదని, పొలాల వైపు పరుగెత్తాను, పదాలు ఎక్కడైనా పండి పోయాయేమోనని' కవి అంటారు. మాట్లాడితేనే భాషకు సార్థకత. మాట్లాడితేనే వ్యక్తుల వ్యక్తిత్వం బయట పడుతుంది. అందుకే కవి పదాల పరిస్థితిని తెలుసుకోవడానికి పొలాల వైపు పరుగెత్తుతారు. పొలాలలో పదాలు పండుతాయని కవి ప్రగాఢ విశ్వాసం. ఇక్కడ కూడ పదాలు మనిషికి పర్యాయపదమే. మనిషిని పండించేవి పొలాలే. పండించి మనిషిని సుదృఢ పరచేవి పొలాలే. కీర్తి, కిరీటాలతో ముంచెత్తేవి పొలాలే. 'పండిన ధాన్యం లోపల పదాలు ఉండే పూర్తి అవకాశం ఉండేది'. ధాన్యం పండడం ఒక జీవన ప్రక్రియ. పదాలు కూడ జీవితాన్ని విస్తరింపజేస్తాయి. అయితే అన్నీ పదాలు కాదు. బ్రతుకు కొలిమిలో, శ్రమ వేడిలో, మట్టి శక్తిలో పండిన పదాలు మాత్రమే జీవితాన్ని విస్తరించ గలవు. అలాంటి పదాల రహస్యాన్ని పొందడం కోసం ధాన్యం లోపల ప్రవేశించి అమ్మ గొంతును వినడానికి ఇసురు రాయి క్రిందకు వెళ్ళడానికి కవి ఆతురత పడతారు. కవిత్వం, భాష, జీవితం, మనిషి, మానవీయ పురుషార్థం, ప్రజాస్వామ్య కర్తవ్యం వీటన్నిటినీ ఒకేసారి రంగరించి వ్యక్తం చేయడం అందరికీ సాధ్యమయ్యే పని కాదు. ఒక మహాస్వాప్నికుడు, క్రాంతి ద్రష్టకు మాత్రమే అది సాధ్యం.

మహోన్నత పోరాటం తరువాత దేశం దాస్య శృంఖలాలను తెంచుకుని స్వాతంత్ర్యం పొందింది. వలసపాలకుల కబంధ హస్తాలనుంచి దేశం విముక్తమయిన చారిత్రక సందర్భంలో ఒక నూతన భవిష్యత్తు నిర్మాణం కోసం సృజనాత్మక ఆలోచనలకు అంకురార్పణ చేయడానికి అన్ని అవకాశాలు ఉన్న సమయంలో కేదార్ నాథ్ సింగ్ యువ గొంతుకతో ఆధునిక హిందీ కవిత్వ రంగంలో ప్రవేశిస్తారు. కొత్త భవిష్యత్తు నిర్మాణం కోసం పరితపిస్తున్న 'మనిషి' ప్రతినిధి అయిన కవి బజారు నుంచి దేశ పటాన్ని కొంటారు. రైతు బిడ్డ అయిన కవి దేశ పటంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వెతికినా తన ఇల్లు కనబడదు. 'ప్రపంచపు గొప్ప పటంలో, దొరకలేదు, దొరక లేదు నా ఇల్లు'. మరి ఆ ఇంటి ముంగిట్లో 'అమ్మ రెండు తులసి మొక్కలను పెంచింది, నాన్న ఊడల మర్రి చెట్టును'. ఈ పంక్తులు స్వతంత్ర భారత దేశ వాస్తవికతను ఆవిష్కరిస్తాయి.

స్వతంత్ర భారతదేశపు వైరుధ్యాలతో గతం, భవిష్యత్తు తలపడినప్పుడు ఉద్భవించే ప్రశ్నలు కేవలం వ్యక్తి వరకు పరిమితం కాకుండ మొత్తం సమాజాన్ని కదిలిస్తాయి. సామాజిక బాధ్యతను గుర్తెరిగిన కవి వైరుధ్యాలకు, వ్యక్తిగత పోకడలకు గురవ్వకుండ ప్రజలకు దిక్సూచిగా నిలబడుతాడు. ప్రశ్నిస్తాడు. 'నన్ను నేను ప్రశ్నించుకుంటాను, నదిలో నిలబడిన వంతెన గొప్పదా? లేదా మనుషుల లోపల వ్రేలాడుతున్నది గొప్పదా? ఏది గొప్పది?' కేదార్‌నాథ్ సింగ్ కవితలు అత్యంత స్పష్టంగా, సరళంగా, సహజంగా మామూలు భాషలో ఉంటాయి, కవితలు ఎంత సహజంగా, సరళంగా ఉంటాయో అంతే లోతైన భావాలను వ్యక్తం చేస్తాయి. ఇద్దరు మిత్రులు కలుసుకున్నప్పుడు పరస్పరం కరచాలనం చేస్తారు. 'అతని చేయిని నా చేతిలోకి తీసుకుని ఆలోచించాను, ఈ ప్రపంచం కూడ అతని చేయిలాగే వెచ్చగ, అందంగా ఉండాలని'. ప్రపంచ సౌందర్యం ఒంటరితనంలో లేదు. మనుషుల పరస్పర కలయికలో ఉంది. కేదార్ నాథ్ సింగ్ తమ రచనల ద్వారా మనిషిని ఉన్నతీకరించడంతో బాటు ప్రపంచ సౌందర్యాన్ని మానవీయ కోణంతో ఆవిష్కరించిన గొప్ప కవి. మాటలనే కవితలుగా మలచిన మహా శిల్పి. 'మాట్లాడుతాను, అందుకే రాస్తాను' అని సగర్వంగా ప్రకటించారు.

■ ఆచార్య వి. కృష్ణ

# ఫేస్‌బుక్ అంగట్లో అమ్మకానికి ప్రజాస్వామ్యం

మీ స్వభావాన్ని బట్టి మీరు ఏ రాష్ట్రంలో నివసిస్తే బాగుంటుంది? టీవీ సీరియల్ 'డౌన్‌టన్ అబ్బే'లో మీరు ఏ పాత్రలాంటివారు? ఏ జాతి శునకం మీ స్వభావానికి అనుకూలం?... 213కోట్లమందికి పైగా మసలుకొనే ఫేస్‌బుక్ మహారణ్యంలో మీ స్నేహితులలో పరిచయస్థులలో ఇలాంటి ఆన్‌లైన్ క్విజ్‌లలో తమకు వచ్చి ఫలితాల్ని షేర్ చేయటం మీ కంట పడే ఉంటుంది. ఒక్కోసారి అవి చికాకు పుట్టించేవిగా, అర్థంపర్థంలేనివిగా, సమయం వృథా చేసేవిగా అనిపించవచ్చు. కానీ వాటి ఆకర్షణకు లోబడకుండా నిలదొక్కుకోవటం కష్టమైన పనే. ఎలాగూ ఈ ఫలితాల్ని షేర్ చేసేది మన ఫ్రెండ్స్‌కూ ఫేమిలీకీ మాత్రమే కదా, ఏదో చిన్నపాటి సరదాయే కదా అనుకుంటాం. అవునా, అంతేనా?

కాదు. దీని వెనక పెద్ద మతలబే ఉంది.

ఫేస్‌బుక్ వ్యాపారం చేసేది మీ సమాచారంతోనే. మీ సమాచారాన్ని వర్గీకరించి ప్రకటనకర్తలకు అమ్ముకోవటం ద్వారానే ఆ కంపెనీ కోట్లాది లాభాల్ని గడిస్తుంది. కుటుంబంతోనూ, మిత్రులతోనూ నిరంతరం "కనెక్ట్" అయి ఉండటం అన్న పేరు మీద మీరు వీలైనంత ఎక్కువగా లైక్‌లు, షేర్‌లు, కామెంట్లు చేసేలా అది మిమ్మల్ని ప్రోత్సహిస్తుంది. అయితే దీనంతటి వెనకా ఇంకా పెద్ద కథే నడుస్తుందన్న సంగతి ఒక ఎథికల్ హ్యాకర్‌గా, భద్రతా నిపుణునిగా, సమాచార విశ్లేషకునిగా నాకు తెలుసు. మొత్తం ప్రజాస్వామ్య పునాదులే ప్రమాదంలో పడ్డాయి.

మీ స్వభావం నిరంతరం అంచనాకు గురవుతున్నది. 'డెమోగ్రాఫిక్స్' అనే పదాన్ని చాలామంది వినే ఉంటారు. ప్రకటనకర్తలు తమ వినియోగదారుల్ని అర్థం చేసుకొనేందుకు వారిని వయసుపరంగా, లింగపరంగా, జాతిపరంగా విడదీయటాన్ని డెమోగ్రాఫిక్స్ అంటారు. దీనికి భిన్నమైనవి 'సైకోగ్రాఫిక్స్' (స్వభావ గణాంకాలు). అంటే వినియోగదారుల్ని వారి వ్యక్తిత్వాలు, విలువలు, అభిప్రాయాలు, స్వభావాలు, ఆసక్తులు, జీవనశైలుల వారీగా విడదీయటం. మీరు ఎలాంటివారో, దేనికి ఎలా స్పందిస్తారో ప్రకటనకర్తలు తెలుసుకొనేందుకు ఇవి సాయపడతాయి.

చరిత్రలో ఇప్పటిదాకా డెమోగ్రాఫిక్స్ తెలుసుకోవటం సులువేకానీ, సైకోగ్రాఫిక్స్ తెలుసుకోవటం చాలా కష్టంగా ఉండేది. ఇపుడు ఫేస్‌బుక్ ఈ సమాచారాన్ని తవ్వుకొనేందుకు ఒక గనిలా తయారైంది. ప్రతిరోజూ కోట్లాది మంది ప్రజలు తమ జీవితాల గురించీ, ఆశల గురించీ సమాచారాన్ని భారీ మొత్తంలో ఈ కంపెనీకి ధారాదత్తం చేస్తున్నారు. ఈ సమాచారాన్ని మంచికి వాడుకుంటే ఏ నష్టమూ లేదు. ఉదాహరణకు మీరు కళ్ళద్దాల గురించి సెర్చ్ చేసినపుడు కళ్ళద్దాల కంపెనీ ప్రకటనలు ఫేస్‌బుక్‌లో మీకు కనిపిస్తే మంచిదే. కానీ మీరు పంచుకొనే సమాచారాన్ని కుట్రపూరితంగా మీ అభిప్రాయాల్ని ప్రభావితం చేసేందుకూ, ఒకేరకమైన అభిప్రాయాలు మాత్రమే ప్రతిధ్వనించే వేర్వేరు గదులుగా సమాజాన్ని ముక్కలు చేసేందుకూ వాడుకుంటే అది ప్రమాదం. ఇలా జరిగేందుకు ఫేస్‌బుక్ అవకాశం కల్పించింది.

ఈ అవినీతి జరిగిన సమయంలో బ్రిటిష్ సంస్థ అయిన 'కేంబ్రిడ్జి అనలిటికా' స్టీవ్ బానన్ ఆధ్వర్యంలో ఉండేది. అప్పట్లో ఆయన అమెరికా అధ్యక్ష పదవి అభ్యర్థి అయిన డొనాల్డ్ ట్రంప్‌కు ముఖ్య సలహాదారు. 2016 అధ్యక్ష పదవి ఎన్నికలకు కొంత కాలం ముందు నుంచీ ఈ సంస్థ ఫేస్‌బుక్ ద్వారా పొందిన సైకోగ్రాఫిక్ సమాచారాన్ని వాడుకుని అమెరికన్ ఓటర్ల స్వభావాన్ని అంచనా వేసేందుకు ప్రయత్నించింది. ఎందుకంటారా? ఆ ఓటర్ల కోసమే ప్రత్యేకించి తయారు చేసిన రాజకీయ సందేశాల్ని వారికి పంపి, వారు ఓటు వేసే తీరును ప్రభావితం చేసేందుకు.

ఒకప్పుడు కేంబ్రిడ్జి అనలిటికా ఉద్యోగి అయిన క్రిస్టఫర్ వైలీ ఇటీవలే ఈ కుట్రను బట్టబయలు చేసాడు. కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ ఫేస్‌బుక్ యూజర్ల నుంచి రాబట్టిన సమాచారం ద్వారా వారి అంతరంగ భయాల్ని లక్ష్యంగా చేసుకొని ప్రచార పద్ధతుల్ని ఎలా మలచిందో అతను బయటపెట్టాడు.

ఇందుకు ఫేస్‌బుక్ ఎలా అనుమతినిచ్చింది?

ఫేస్‌బుక్ మీ సమాచారాన్ని కేవలం అమ్ముకోవటం మాత్రమే చేయదు. 2000వ సంవత్సరం నుంచీ ఫేస్‌బుక్ తన యూజర్లను పరిశోధించాలనుకొనే అకడమిక్ పరిశోధకులకు ఆ అవకాశాన్ని కల్పిస్తోంది. పైకి సులభంగా కనిపించే ప్రశ్నల ద్వారా మీ వ్యక్తిత్వాన్ని, భావజాలాన్ని అంచనాకట్టే పనిలో ఎందరో మనస్తత్వ నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు తమ కెరీర్లు చక్కబెట్టుకున్నారు. సోషల్ మీడియా క్విజ్‌లలో కనిపించే ప్రశ్నలలాగానే ఈ ప్రశ్నలు పైకి రాజకీయాలతో ఏ సంబంధమూ లేనట్టుగానే కనిపిస్తాయి. ఇలాగే 2015లో అలెగ్జాండర్ కోగన్ అనే పరిశోధకుడు తన సొంత క్విజ్‌ను ఒకదాన్ని డెవలప్ చేసుకునేందుకు ఫేస్‌బుక్ అనుమతినిచ్చింది. ఇలాంటి చాలా క్విజ్‌ల మాదిరిగానే అతను రూపొందించిన క్విజ్ కూడా ఫేస్‌బుక్‌లో మీరు పంచుకొన్న సమాచారాన్ని, అంటే మీ పేరూ, ప్రొఫైల్ పిక్చరూ, వయస్సూ, పుట్టిన రోజూ; మీ టైమ్‌లైన్‌లో మీరు రాసిన ప్రతి పోస్టూ; మీ మొత్తం ఫ్రెండ్స్ జాబితా; మీ ఫోటోలూ, మీరు ట్యాగ్ చేయబడిన ఫోటోలూ; విద్యార్హతలూ; స్వస్థలమూ, ప్రస్తుత నివాస స్థలమూ; మీరు లైక్ చేసిన ప్రతి పోస్టూ; మీరు వాడుతోన్న డివైజ్, వెబ్ బ్రౌజర్ల వివరాలూ... ఇలా అన్నింటినీ రాబడుతుంది. అలెగ్జాండర్ కోగన్ ఈ సమాచారం మొత్తాన్నీ తీసుకెళ్ళి కేంబ్రిడ్జి అనలిటికాకు అప్పజెప్పాడు. ఇది ఫేస్‌బుక్ నియమావళికి విరుద్ధమే. కానీ ఆ సంస్థకు తన నియమాల్ని అమలుచేయటంలో అంత పట్టింపు లేదు కాబోలు.



> మనం ఫేస్‌బుక్‌లో షేర్ చేసే సమాచారం మన ఆశల్నీ భయాల్నీ వెల్లడిస్తుంది. పైకి చాలా అమాయకంగా కనిపించే ఫేస్‌బుక్ క్విజ్‌లు నిజానికి అంత అమాయకమైనవేం కావు. ఫేస్‌బుక్ లాంటి విస్తృతమైన వేదికలు ప్రజల సమాచారాన్ని వాడుకొని, ఓటర్లుగా వారికి ఉండే నిర్ణయాత్మక శక్తిని వారి చేతుల్లోంచి లాక్కొని ఎన్నికల ప్రచారకర్తల చేతుల్లో పెట్టడమంటే ప్రజాస్వామ్యాన్ని హత్య చేయటమే. ఫేస్‌బుక్ వాడేవారందరికీ నా సలహా ఏమిటంటే, ఫేస్‌బుక్‌ను కొంత అపనమ్మకంతో వాడటం అన్ని విధాలా శ్రేయస్కరం.

ఈ సమాచారాన్ని విశ్లేషించటం ద్వారా ఏ యూజర్‌కి ఏ అంశంపై ఆసక్తి ఉన్నదో, ఎలాంటి రాజకీయ సందేశాలు వారిని ఆకట్టుకుంటాయో, ఎలాంటి భాష వాడి ఆ సందేశాల్ని రక్తికట్టించాలో, వారిని ప్రేరేపించే విధంగా సందేశాల్ని ఎలా మలచాలో, వాటిని వారి చేత ఎలా షేర్ చేయించాలో కేంబ్రిడ్జి అనలిటికా ఓ అంచనాకి వచ్చింది. షాపింగ్ లిస్ట్‌లాగా ఆ సంస్థ ఓటర్లకు సంబంధించిన ఒక స్వభావాల, లక్షణాల చిట్టాను తయారు చేసింది. ఉదాహరణకి ఈ గుట్టంతా రట్టు చేసిన క్రిస్టఫర్ వైలీకి పరిశోధకుడు అలెగ్జాండర్ కోగన్ పంపిన ఒక మెయిల్ ఇలా సాగుతుంది: "మీరు పైపైన ఒక అంచనాకు రాగలిగేలా ఒక షాపింగ్ లిస్ట్‌ను పంపిస్తున్నాను. ఇవేగాక ఈ క్విజ్‌ల ఆధారంగా మరింత సూక్ష్మమైన అంశాలనూ తెలుసుకోవచ్చు. ప్రస్తుతానికి వీటి ద్వారా మీకు మరింకా ఏం అవసరమో ఒక అంచనా వస్తుంది: విశాల దృక్పథం, జాగరూకత, బహిర్ముఖత్వం, ఒప్పుకునేతత్వం, జీవితంపై సంతృప్తి, ఐక్యూ, రాజకీయ దృక్పథం--సంప్రదాయవాదా? ఉదారవాదా?... ఆసక్తులేమిటి, తుపాకుల్ని ఇష్టపడతాడా?" ఇలా చాలా అంశాల్ని అతను ఒక షాపింగ్ లిస్ట్‌లాగా కేంబ్రిడ్జి అనలిటికాకు పంపాడు.

దీని ఆధారంగా కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ ఎంపిక చేసిన కొన్ని వెబ్‌సైట్లను, ప్రకటనలను, బ్లాగులను ఫేస్‌బుక్ యూజర్ల దృష్టిలో పడే విధంగా వారి ముందుకు తీసుకువెళ్ళింది. వైలీ మాటల్లో చెప్పాలంటే: "ఒకసారి వాటిని చూసారంటే, క్లిక్ చేసారంటే, ఇక మాయల లోయలోకి జారిపోయినట్టే". ఇలా ఓటింగ్ తీరును ప్రభావితం చేసే అబద్ధపు వార్తల్ని, తప్పుడు సమాచారాన్ని, పరస్పర విరుద్ధమైన సందేశాల్ని అమెరికన్ ప్రజలపై చల్లారు. ఈ విధంగా ఫేస్‌బుక్ యూజర్లకు స్నేహితులతోను కుటుంబసభ్యులతోను ఉన్న అనుబంధాలు ఆర్థిక, రాజకీయ లబ్ధి కోసం వాడుకోబడ్డాయి.

తన యూజర్ల భద్రతను కాపాడే అవకాశం ఫేస్‌బుక్‌కు ఉంది. కానీ అది ఆ పని చేయలేదు. తన వేదికపై ఆప్‌లు తయారు చేసుకొనేలా డెవలపర్లను ప్రోత్సహించింది. తద్వారా ఈ ఆప్‌లకు భారీ స్థాయిలో యూజర్ల సమాచారాన్ని వాడుకొనేందుకు అవకాశమిచ్చింది. వీరికి వర్తించే నియమాలైతే ఉన్నాయి కానీ, వాటిని అమలుచేసిన దాఖలా లేదు. ఈ ఆప్‌ల ద్వారా జరిగిన చెల్లింపుల్లోంచి 30% ఆదాయాన్ని మాత్రం ఫేస్‌బుక్ దండుకొంది.

'అబ్జర్వర్'కు ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో క్రిస్టొఫర్ వైలీ మాట్లాడుతూ ఇలా అన్నాడు: "రాజకీయాలు సంస్కృతిని బట్టి వుంటాయి. మీరు ప్రజల్ని మారిస్తే సంస్కృతీ మారిపోతుంది." ఇదే పద్ధతిలో కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ ప్రజల్ని దారి మళ్ళించింది. ప్రజల సమాచారాన్ని ఫేస్‌బుక్ ద్వారా సేకరించి వారి అభిప్రాయాల్ని, ప్రవర్తనను తనకు అనుకూలమైన దిశకు తిప్పింది. ఇందుకోసం వారు "ఫేక్ న్యూస్" (అబద్ధపు వార్తలు)ను కూడా వాడుకున్నారు. కేంబ్రిడ్జి అనలిటికా ఉద్యోగి ఒకరు వీటి గురించి ఇలా వ్యాఖ్యానించారు: "జనం వీటిని నమ్మితే చాలు, ఇవి నిజం కానవసరం లేదు."

అమెరికన్ సమాజం దీన్ని ఊహించలేదు. అమెరికన్ వయోజనుల్లో 62% మంది వార్తలు తెలుసుకోవటానికి సోషల్ మీడియా పైనే ఆధారపడతారు. వీరిలో చాలామంది అబద్ధపు వార్తల్ని చదివి అవే నిజమని నమ్మారు. కేంబ్రిడ్జి అనలిటికా పథకం పారింది. ట్రంప్‌కు అనుకూలమైన 115 అబద్ధపు వార్తలు ఫేస్‌బుక్‌లో ఏకంగా 3కోట్ల సార్లు షేర్ అయ్యాయి. నిజానికి ప్రధాన స్రవంతి వార్తల కంటే ఈ అబద్ధపు వార్తలే ఫేస్‌బుక్‌లో ఎక్కువసార్లు షేర్ అయ్యాయి. ప్రజల మానసిక ప్రపంచంపై చేసిన ఈ దాడికి ప్రతిఫలంగా ట్రంప్ ప్రచార నిధుల నుంచి కేంబ్రిడ్జి అనలిటికాకు భారీ మొత్తంలో చెల్లింపులు జరిగాయి.

ఈ సైకోగ్రాఫిక్ అంచనాలతోనూ, ఓటర్లను వ్యక్తిగతస్థాయిలో లక్ష్యం చేసుకొని సాగే ప్రచారంతోనూ అమెరికాలో ప్రజాస్వామిక సంవాదం ఇప్పుడు ఒక కొత్త మలుపు తిరిగింది. ప్రజల ముందు బహిరంగంగా సాగే ప్రచారం ఇప్పుడు గుసగుసల ప్రచారంగా మారింది. ప్రజల ఆశల్ని భయాల్ని గ్రహించి వాటిని రెచ్చగొట్టే విధంగా వారిలో ప్రతి ఒక్కరి చెవుల్లో ఈ రహస్య ప్రచారం సాగింది. ఒక కేంబ్రిడ్జి అనలిటికా ఉద్యోగి మాటల్లో చెప్పాలంటే: "మనిషిని ముందుకు నడిపించేవి ప్రాథమికంగా అతని ఆశలు, భయాలు... మా ఉద్యోగం ఏమిటంటే, పైకి కనిపించని ఈ ఆశల్ని భయాల్ని అర్థంచేసుకోవటం. ఎన్నికల పోరులో గెలిపించేవి వాస్తవాలు కాదు, భావోద్వేగాలు."

మనం ఫేస్‌బుక్‌లో షేర్ చేసే సమాచారం మన ఆశల్నీ భయాల్నీ వెల్లడి చేస్తుంది. పైకి చాలా అమాయకంగా కనిపించే ఫేస్‌బుక్ క్విజ్‌లు నిజానికి అంత అమాయకమైనవేం కావు. ఫేస్‌బుక్ లాంటి విస్తృతమైన వేదికలు ప్రజల సమాచారాన్ని వాడుకొని, ఓటర్లుగా వారికి ఉండే నిర్ణయాత్మక శక్తిని వారి చేతుల్లోంచి లాక్కొని ఎన్నికల ప్రచారకర్తల చేతుల్లో పెట్టడమంటే ప్రజాస్వామ్యాన్ని హత్య చేయటమే. ఫేస్‌బుక్ వాడేవారందరికీ నా సలహా ఏమిటంటే, ఫేస్‌బుక్‌ను కొంత అపనమ్మకంతో వాడటం అన్ని విధాలా శ్రేయస్కరం.

■ తిమొతీ సమ్మర్స్
మేరీలాండ్ యూనివర్సిటీ

('ది కన్వర్సేషన్')

## జనవాక్యం

### జన్మనిచ్చిన వాళ్లే భారమా?

వాళ్లు లేకుంటే మనమున్నామా? ప్రపంచముందా? మానవ జాతికి మనుగడ ఉండేదా? అలాంటి తల్లిదండ్రులకు మనమిస్తున్న విలువేమిటి? మా చిన్నతనంలో ఏ ఊరిలో చూసినా వృద్ధ తల్లిదండ్రుల జీవితాలకు లోటే ఉండేదికాదు. ఎదిగొచ్చిన కొడుకులు వారిని బాధ్యతగా చూసుకొనేవారు. తర్వాతి తరానికి ఆదర్శంగాను, మార్గదర్శకంగానూ ఉండేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. బిడ్డల అభివృద్ధికి తమ జీవితాలను ధారబోసిన తల్లిదండ్రులను అన్యాయంగా గాలికొదిలేస్తున్నారు. ప్రత్యక్ష దైవాలైన అమ్మ నాన్నలను రోడ్డున పడవేయడం, ఆసుపత్రులలో వదిలేయడం.. చివరకు ప్రాణాలు కూడా తీస్తున్నారు. గుంటూరు నుండి 80 ఏళ్ల తల్లిని తీసుకొచ్చి ఇప్పుడే వస్తానంటూ భువనగిరిలో నడురోడ్డున వదిలేసి పోయాడొకడు. కరీంనగర్ నుండి తల్లిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఆసుప్రతిలో వదిలేసి పోయాడు మరొకడు. పెద్ద చదువులు చదువుకున్న వాళ్లు, పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు కూడా మానవత్వం మరచి ఇలా చేస్తుండడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

మేం గొప్పోళ్లమని చంకలు గుద్దుకొంటున్న మనల్ని ఈ స్థాయికి తెచ్చిందెవ్వరు? మన తల్లిదండ్రులే కదా. మన చదువులకని, బట్టలకని, రోగాలకనీ వాళ్లు తినోతినకో సంపాదనలోని ప్రతిపైసా ఖర్చుపెట్టిందెవ్వరు? అలాంటి తల్లిదండ్రులకు మనం తిండిపెట్టలేమా? వైద్యం చేయించలేమా? మనల్ని కని సాకిన అమ్మనాన్నల కనీస అవసరాలు తీర్చలేని మనమేం నాగరికులం? మాతృదేవోభవ, పితృదేవో భవ వంటి సుభాషితాలను మనమెంతవరకు అర్థం చేసుకొన్నాం? భార్యాపిల్లల మీద చూపించే ప్రేమను తల్లిదండ్రుల మీద ఎందుకు చూపలేక పోతున్నాం?

ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ఇప్పటికైనా ప్రవర్తన మార్చుకొని తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలి.

– **పాండురంగడు**, విజయవాడ

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన మెయిల్:
editpage@andhrajyothy.com

# సీమ నీటి కోసం గళం విప్పండి!

దక్షిణాది ఆరు రాష్ట్రాల జలవనరుల ప్రత్యేక సదస్సు ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర జలవనరుల సహాయమంత్రి అర్జున్ మేఘవాల్ మాట్లాడుతూ 'దేశంలోని నదీ జల వివాదాలపై జాతీయస్థాయిలో ఒకే ట్రిబ్యునల్ ఏర్పాటు చేసేందుకు పార్లమెంటు సమావేశాలలో బిల్లు ఆమోదానికి పెడుతున్నట్లు' వెల్లడించారు. పార్లమెంట్‌లో జల చట్టానికి రాజ్యాంగ సవరణ చేయబోతున్న ఈ సందర్భంలో రాయలసీమ నీటి సమస్యపై ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీలోని 11వ షెడ్యూలులో పొందుపరిచిన ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపు అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలి.

బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇది ఆహ్వానించదగ్గ విషయమే. అయితే ఇదే సందర్భంలో విభజన హామీలలో అతి ముఖ్యమైన రాయలసీమ నీటి ప్రాజెక్టులపై కూడా దృష్టిపెట్టాలి. ప్రత్యేక హోదా, విభజనహామీ అంశాలపై పార్లమెంటులోను, బయట ఆందోళనలు సాగిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 11వ షెడ్యూలులో పేర్కొన్న హంద్రీనీవా, గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టుల నీటి కేటాయింపు గురించి మాట్లాడకుండా సీమ సమస్యలపై కూడా గళం విప్పాలి.

రాయలసీమ ప్రతి సందర్భంలోనూ మోసపోతూనే వున్నది. 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రణాళికా సంఘం ఆమోదించిన కృష్ణాపెన్నార్ ప్రాజెక్టును రాజకీయ నాయకులు లేకుండా చేసి, నాగార్జునసాగర్ ప్రాజెక్టుతో సీమ నీటికి అడ్డుకట్టవేశారు. ఖోస్లా కమిటీ సిఫార్సు చేసిన సిద్దేశ్వరం సాగునీటి ప్రాజెక్టును రద్దుచేసి, శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మించడంతో కృష్ణా జలాలపై సాగునీటి హక్కులు లేకుండా పోయాయి. కృష్ణా జలాలపై రాయలసీమకు సర్వహక్కులూ హరించబడ్డాయి.

కృష్ణానదీ జలాల వివాదాల పరిష్కారానికి ఏర్పడిన మొదటి బచావత్ ట్రిబ్యునల్ (1976) 811 టీఎంసీల కృష్ణా నదీజలాలలో అత్యధికభాగం నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజ్‌లకు కేటాయింపులు చేసి, రాయలసీమ కేసీ కెనాల్ (1870) తుంగభద్ర (1945) ప్రాజెక్టుల ద్వారా కేవలం 133.70 టీఎంసీలు మాత్రమే మిగిల్చారు. రాయలసీమ భవిష్యత్ అవసరాలకోసం నిర్మించే ప్రాజెక్టులకు నీరు లేకుండా చేశారు. ఆనాటికి నిర్మించిన ప్రాజెక్టులకు మాత్రమే కృష్ణా నదీ జలాలలో సర్వహక్కులు కల్పిస్తూ కరువు ప్రాంతాలలో భవిష్యత్తులో నిర్మించే నీటి ప్రాజెక్టులకు నీటి హక్కులు లేకుండా బచావత్ ట్రిబ్యునల్ నిర్ణయించింది. మిగులు జలాలతో ఆ నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు ప్రాంతాలకు ఉపయోగపడే హంద్రీనీవా, గాలేరునగరి, వెలుగొండ, తెలుగుగంగ ప్రాజెక్టులు, తెలంగాణ ప్రాంతంలోని మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు ఉపయోగపడే కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎస్.ఎల్.బి.సి ప్రాజెక్టులు నిర్మింప తలపెట్టింది. దాదాపు 227 టీఎంసీల మిగులు జలాల అంచనాతో 8 జిల్లాల్లో దాదాపు 30 లక్షల ఎకరాలకు సాగునీటి కోసం 30వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ప్రాజెక్టులకు బ్రిజేష్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు లేకుండా మొండిచేయి చూపి, మిగులు జలాలను కూడా మిగలకుండా పై రాష్ట్రాలకు పంచేసింది. 2013 బ్రిజేష్ ట్రిబ్యునల్ తీర్పు అమలులోకి వస్తే 2050 వరకు కృష్ణా నదీ జలాల కేటాయింపులు మార్చడం సాధ్యంకాదు. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాలలో నిర్మించిన ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటి ? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా రెండు రాష్ట్రాలకు కృష్ణా నదీజలాలను పంచటానికి కేంద్ర ప్రభుత్వం బ్రిజేష్ ట్రిబ్యునల్‌ను పొడిగించింది. విభజన చట్టం సెక్షన్ 89, 11వ షెడ్యూల్ పై ప్రస్తుతం బ్రిజేష్ ట్రిబ్యునల్ విచారణ జరుపుతున్నది. మరొక వైపు కృష్ణా నదీజలాల వివాదాలపై సుప్రీం కోర్టులో కూడా విచారణ జరుగుతున్నది. బ్రిజేష్ ట్రిబ్యునల్‌లో కాని సుప్రీం కోర్టులోగాని కరువు ప్రాంతాలలో మిగులు జలాలపై నిర్మించిన ప్రాజెక్టులకు న్యాయం జరుగుతుందనే గ్యారెంటీ లేదు.

> 1956 జల చట్టానికి సవరణ చేయబోతున్న దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని 11వ షెడ్యూల్‌ను సెక్షన్ 89లోకి మార్చాలి. ప్రాజెక్టులవారీగా కృష్ణ జలాలను పంపకం చేసేందుకు వీలుగా విభజన చట్టానికి సవరణ చేయాలి.



రాయలసీమ ప్రాజెక్టులకు నికర జలాలు లేకుండా నీటి సమస్యను ఎదుర్కొంటున్న ఈ తరుణంలో జైరాం రమేశ్ చెప్పినట్లు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రాజ్యాంగ చట్టాన్ని ఉపయోగించి నికర జలాల కేటాయింపులు జరపాలి. రాయలసీమ ప్రాజెక్టులకు నీటి రక్షణలు కల్పించేందుకు, నికర జలాల కేటాయింపులు జరపాలనే ఉద్దేశంతో విభజన చట్టం 11వ షెడ్యూలులో చేర్చారు. 'విభజన వల్ల రాయలసీమ ప్రయోజనం కోసం కృష్ణా నదిపై నిర్మిస్తున్న నీటి పారుదల ప్రాజెక్టులు దెబ్బతినవచ్చునని ఆనాడు వెంకయ్యానాయుడు మరికొందరు నా దృష్టికి తీసుకొచ్చిన తరువాత హంద్రీనీవా, తెలుగు గంగ, గాలేరు నగరి, వెలుగొండ, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయడానికి విభజన చట్టం 11వ షెడ్యూలులో పొందుపరచడం జరిగిందని' విభజన చట్టం రూపొందించిన ఆనాటి కేంద్ర మంత్రి జైరాం రమేశ్ ఆంధ్రప్రదేశ్ విభజనపై తాను రాసిన పుస్తకంలో పేర్కొన్నారు.

రాజ్యాంగంలోని 262 అధికరణాన్ని అనుసరించి దేశంలో అంతర్‌రాష్ట్ర జల వివాదాల పరిష్కారానికి 1956లో పార్లమెంటు జలచట్టాన్ని రూపొందించింది. ఆ తరువాత ఇప్పుడు.. దేశంలో ఒకే ట్రిబ్యునల్ ఏర్పాటుకు రాజ్యాంగ సవరణను ప్రస్తుత పార్లమెంటులో ప్రవేశపెడుతున్న సందర్భంలో జల వివాదాలకు సంబంధించిన అంశాలను కూలంకషంగా చర్చించాలి. 1987లో ఆమోదించి, 2001లో సవరించిన జాతీయ జలవిధానంలో సాగునీటి వ్యవస్థలో సామాజిక న్యాయం పాటించాలని చెప్పిన అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. 1983లో జాతీయ జలవనరుల పరిషత్తు 'నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ఇతర ప్రాంతాల నుండి నీటిని తరలించాలని' చేసిన సూచనలను, 'వీలైనంత మేరకు ఉపరితల జల వనరులను సమంగా న్యాయంగా పంపిణీ చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, తీవ్ర నిర్లక్ష్యానికి గురై అత్యల్ప వర్షపాతం గల ప్రాంతాలకు నీటి సౌకర్యం కల్పించాలని' జయతీఘోష్ కమిషన్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకొని ఈ సిఫార్సులన్నింటికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలి. అంతరాష్ట్ర జలవివాదాల సవరణబిల్లు 2017పై అధ్యయనం చేసి స్థాయీ సంఘం చేసిన సిఫార్సులపై, నదుల అనుసంధానంపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ నివేదికపై పార్లమెంటులో చర్చ జరగాలి.

దేశంలోని వివిధ నదీ జలాలకు సంబంధించిన ట్రిబ్యునళ్లను రద్దు చేసి ఒకే ట్రిబ్యునల్ ఏర్పాటుకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి 1956 జల చట్టానికి సవరణ చేయబోతున్న దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని 11వ షెడ్యూల్‌ను సెక్షన్ 89లోకి మార్చాలి. ప్రాజెక్టులవారీగా కృష్ణా జలాలను పంపకం చేసేందుకు వీలుగా విభజన చట్టానికి సవరణ చేయాలి. ఈ చట్ట సవరణ కోసం ఆంధ్రప్రదేశ్ ఎంపీలు తమతమ రాజకీయాలను పక్కనపెట్టి పార్లమెంట్‌లో గళం విప్పాలి. హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగు గంగ, వెలుగొండ ప్రాజెక్టులకు నికర జలాల కోసం పోరాడాలి.

■ మాయకుంట్ల శ్రీనివాసులు
అధ్యక్షులు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ

## సభా పర్వం

# ఇళ్లిచ్చారు.. నిధులేవి?

- వెయ్యికోట్లకు యూసీలిస్తే.. కేంద్రం ఇచ్చింది రూ.180 కోట్లే
- ఇందిరమ్మ ఇళ్ల అవినీతిపై విజిలెన్స్ చేతులెత్తేసింది: మంత్రి కాల్వ



అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వానికి అక్టోబరులో రూ.1018 కోట్ల యూసీలు సమర్పిస్తే.. రూ.180 కోట్లు మాత్రమే విడుదల చేశారని మంత్రి కాల్వ శ్రీనివాసులు తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే రూ.500 కోట్లు విడుదల చేసి ఇళ్ల నిర్మాణాలను కొనసాగిస్తోందని చెప్పారు. వెంకయ్యనాయుడు చొరవతో ఇళ్లైతే మంజూరు చేశారు కాని, నిధు లు అడిగితే కేంద్రం మొండిచేయి చూపుతోందని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం మండలిలో గృహనిర్మాణంపై జరిగిన చర్చకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంతిల్లు కల సాకారం చేయాలని సీఎం చంద్రబాబు పట్టుదలతో ఉన్నట్లు చెప్పారు. బీఎల్‌సీ విభాగంలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కేంద్రానికి అక్టోబరులో రూ.3,000 కోట్ల బిల్లులు పంపామని, ఇందులో రూ.1018 కోట్లకు యూసీలు కూడా ఇచ్చామన్నారు. ప్రతినెలా 30వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నా.. బిల్లుల చెల్లింపులో టెక్నికల్‌గా అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు సకాలంలో వస్తే ఇబ్బందులు తగ్గుతాయని వివరించారు. 2011లో జరిగిన సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే ప్రకారం ఏపీలో ఇళ్లు లేని పేదలు 5.85 లక్షల మంది ఉన్నారు. ఈ సర్వేను ప్రామాణికంగా తీసుకుని కేంద్రం రాష్ట్రానికి 1.23 లక్షల ఇళ్లను మంజూరు చేసిందన్నారు. కానీ, ఆ సర్వే గుర్తించినదానికన్నా రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు మూడింతలున్నారని మంత్రి తెలిపారు. వీరందరికీ ఇళ్లు నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. 2019 మార్చినాటికి దేశవ్యాప్తంగా కోటి ఇళ్లను నిర్మించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికి 35 లక్షల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఇందులో ఏపీలో 23వేల ఇళ్లు పూర్తయ్యాయని చెప్పా రు. పట్టణాల్లోని పేదల కోసం కేంద్రం 1.58కోట్ల ఇళ్లను మంజూరు చేసిందని, నిధుల విడుదలలో తీవ్రజాప్యం జరుగుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున 2016-17, 2017-18, 2018-19 సంవత్సరాలకు గాను రూ.5.59 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఇందులో ఎస్సీలకు 1,25,494 ఇళ్లు కేటాయించామని, వారి రిజర్వేషన్ శాతం కంటే ఇది చాలా ఎక్కువ అని చెప్పారు. అలాగే, ఎస్టీలకు 29,823 కేటాయించామని, వారికి రిజర్వేషన్ ప్రకారం రావాల్సిన సంఖ్య కంటే ఇది 3.5 శాతం ఎక్కువ అని తెలిపారు.

### విజిలెన్సే చేతులెత్తేసింది.. ఇంకెవరిపై చర్యలు తీసుకోవాలి

గత ప్రభుత్వహయాంలో ఇందిరమ్మ గృహనిర్మాణాల్లో జరిగిన అవకతవకలు తేల్చలేక విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేతులెత్తేసిందని మంత్రి కాల్వ చెప్పారు. టీడీపీ ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లవుతున్నా ఇప్పటి వరకు ఇందిరమ్మ అక్రమార్కులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని సభ్యులు వి. బాలసుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ కేసులను విజిలెన్స్ అప్పగించిందని.. వారు 149 గ్రామాల్లోని 1289 ఇళ్లను విచారించి 1262 అక్రమాలు జరిగినట్టు గుర్తించారని మంత్రి తెలిపారు. రూ.8.4 కోట్ల మేర ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. ప్రతి గ్రామంలో లక్షల ఇళ్లు తిరిగి విచారణ చేయడం అసాధ్యమంటూ విజిలెన్స్ చేతులెత్తేసిందన్నారు. దళారులుగా చలామణి అయిన కాంగ్రెస్ నేతలు వారి పేర్లపై కాకుండా.. ఇందిరమ్మ కమిటీలు, లబ్ధిదారుల పేర్లతో డబ్బులు డ్రా చేసినట్టు తెలిపారు. గృహనిర్మాణ శాఖ ఉద్యోగుల్లో 23 మందిని తాత్కాలికంగా తొలగించామని, 48 మంది డిస్మిస్ చేశామని, మరో ఇద్దరికి గ్రేడ్ తగ్గించామని చెప్పారు. సాక్ష్యాలతో దొరికిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టామని తెలిపారు.




# 60-70 ఏళ్లకైనా పూర్తవుతాయా?

- 17 జాతీయ విద్యాసంస్థలకు 680 కోట్లేనా?
- అసలు రావలసింది రూ.9,654 కోట్లు
- మోదీ జేబులో నుంచి ఇస్తున్నారా?
- గుజరాత్‌కో, ఎన్నికల రాష్ట్రాలకే ఇస్తారా?
- చీఫ్‌విప్, టీడీపీ ఎమ్మెల్యేల ఆగ్రహం
- కేంద్రం ఇవ్వలేదని గుండెలపై చెయ్యేసి చెప్పండి
- గంటాకు విష్ణుకుమార్‌రాజు సవాల్
- విద్యాసంస్థలపై అసెంబ్లీలో వాడీవేడి చర్చ

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి):విభజన చట్టంలో పేర్కొన్న జాతీయ విద్యాసంస్థల స్థితిగతులపై శాసనసభలో టీడీపీ, బీజేపీ మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌కు మాత్రమే నిధులిస్తున్నారని.. లేదంటే ఎన్నికలు జరిగే రాష్ట్రాలకే కేటాయింపులు ఉంటున్నాయని అధికారపక్షం మండిపడింది. ఈ అంశంపై శుక్రవారం సభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. రాష్ట్రానికి 17 జాతీయ విద్యా సంస్థలు కేటాయించారని.. అయితే వాటికి అరకొర నిధులే ఇచ్చారని.. ఇలాగైతే 60-70 ఏళ్లు గడచినా అవి అందుబాటులోకి రావని చీఫ్‌విప్ పల్లె రఘునాథరెడ్డి, విప్ కూన రవికుమార్, టీడీపీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, రామానాయుడు, శ్రావణ్‌కుమార్ ధ్వజమెత్తారు. '17 జాతీయ విద్యాసంస్థలకు రూ.9654 కోట్లు రావాల్సి ఉండగా.. రూ.680 కోట్లే కేటాయించారు. అందులోనూ 3% నిధులు మాత్రమే రాష్ట్రానికి ఇచ్చారు. విభజన హామీల అమలు కోరితే కేంద్రం రాష్ట్రంపై కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది' అని పల్లె ఆరోపించారు. స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) పెట్టుకోండి.. నిధులిస్తామని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అంటున్నారని..ఈశాన్య రాష్ట్రాలు ఎస్‌పీవీ పెట్టుకోలేదని..అయినా ఎందుకు నిధులిచ్చారని నిలదీశారు. 'సెంటిమెంటుకు నిధులివ్వాలా అని జైట్లీ అవహేళన చేశారు. ఏ సెంటిమెంటుకోసం ఈశాన్య రాష్ట్రాలకు నిధులిచ్చారు? రాష్ట్రం కోసం పోరాటం చేస్తున్న సీఎం చంద్రబాబుపై బీజేపీ, జగన్, పవన్ విమర్శలు చేస్తున్నారు. అన్యాయం చేసిన కేంద్రాన్ని మాత్రం ప్రశ్నించడం లేదు' అని ఆక్షేపించారు. మోదీ దేశం మొత్తానికీ గాక గుజరాత్‌కే ప్రధానిలా వ్యవహరించడం వల్లే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు, ఆపార్టీ ఎమ్మెల్యేలు కల్పించుకోవడంతో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర విద్యాసంస్థలకు నిధులు కేటాయిస్తున్నామని, భూములకు సంబంధించిన క్లియరెన్సులు ఇప్పటికీ పూర్తిగా ఇవ్వలేదని బీజేపీ సభ్యులు అనగా.. అరకొర నిధులిచ్చారని టీడీపీ సభ్యులు మండిపడ్డారు. విభజన జరిగిన నాలుగేళ్లయినా.. జాతీయ విద్యాసంస్థల ఏర్పాటుకు రూ.4 వేల కోట్లు కూడా కేంద్రం కేటాయించలేదని టీడీపీ ఎమ్మెల్యే సుగుణమ్మ విమర్శించారు. రాష్ట్ర బీజేపీ నేతలు ఢిల్లీ ప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడాలని రామానాయుడు హితవు పలికారు. ఆయా సంస్థలకు నిధులు ఇదే విధంగా కేటాయించుకుంటూ పోతే అవి అందుబాటులోకి వచ్చేటప్పటికి 60-70 ఏళ్లు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలులో ట్రిపుల్ ఐటీ పెట్టి.. నిధులు కేటాయించకుండా తరగతులు మాత్రం ఎక్కడో తమిళనాడులోని కాంచీపురంలో పెట్టారని విప్ కూన రవికుమార్ ఆక్షేపించారు.



### బీజేపీపై బురద జల్లాలని టీచింగ్ బాగా ఇచ్చారు..

జాతీయ విద్యాసంస్థలకు కేంద్రం నిధులు కేటాయించడం లేదన్న టీడీపీ ఆరోపణలపై విష్ణుకుమార్‌రాజు స్పందించారు. 'గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పు... కేంద్రం నిధులు ఇవ్వలేదని..' అని మానవ వనరుల మంత్రి గంటా శ్రీనివాసరావుకు ఆయన సభలో సవాల్ విసిరారు. 'టీడీపీ సభ్యులు చెప్పిందే.. చెబుతున్నారు. వినీవినీ విసుగెత్తుతోంది. బీజేపీపై బురద జల్లాలని టీచింగ్ బాగా ఇచ్చారు. తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు' అని ఎద్దేవాచేశారు. 'విద్యాసంస్థలకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన భూమికి విలువ కట్టి టీడీపీ మాట్లాడుతోంది. ఇదేం రియల్‌ఎస్టేట్ కంపెనీనా? భూమిని ఎవరైనా ఎత్తుకుపోతారా' అని ఆయన ప్రశ్నించారు. టీడీపీ సభ్యులు చెప్పే ఆవుకథ రోజూ వింటున్నామని బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ అన్నారు.

## ఫ్యాకల్టీ లేదు.. సదుపాయాల్లేవు

- తాత్కాలిక భవనాల్లోనే తరగతులు
- మంత్రి గంటా శ్రీనివాసరావు ఆవేదన

'రాష్ట్రానికి మంజూరు చేసిన 7 జాతీయ విద్యాసంస్థలకు రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించలేదు.. సపోర్టింగ్ స్టాఫ్ లేరు.. మౌలిక సదుపాయాల్లేవు.. తాత్కాలిక భవనాల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. విభజన చట్టం ప్రకారం చేయాల్సినవి కేంద్రం చేయలేదు' అని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తంచేశారు. సభలో జరిగిన చర్చకు ఆయన సమాధానవిచ్చారు. నాలుగేళ్లలో శాశ్వత భవనాల కోసం ఒక్క ఇటుక కూడా కూడా వేయలేదని వాపోయారు. కర్నూలు ట్రిపుల్ ఐటీ తరగతులు తమిళనాడులోని కాంచీపురంలో నిర్వహిస్తున్నారని, అలాగే మిగిలిన సంస్థలు కూడా ఇతర వర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు చివరి చాయిస్‌గా మన సంస్థలను ఎంచుకుంటున్నారని చెప్పారు. సీఎంతో పాటు తాము అనేక పర్యాయాలు నిధుల కోసం కేంద్రానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. ఐఐటీ (తిరుపతి), ఐఐఎస్ఈఆర్ (తిరుపతి), ఐఐఎం (విశాఖపట్నం), ట్రిపుల్ ఐటీ (కర్నూలు), సెంట్రల్ వర్సిటీ (అనంతపురం), గిరిజన వర్సిటీ (విజయనగరం), ఎన్ఐటీ (తాడేపల్లిగూడెం)లకు 2401.16 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఐఐఎంకు సంబంధించి ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయిందని.. ఐఐటీ, ఐఐఎస్ఈఆర్, నిట్ ప్రహరీ గోడలు 75 శాతం పూర్తయ్యాయని, మిగిలిన మూడు సంస్థల ప్రహరీ గోడలు ఇంకా ప్రారంభం కాలేదని వెల్లడించారు. నిధులు కోసం పోరాటానికి బీజేపీ కూడా కలిసి రావాలని కోరారు. 'కోడిని కోసి తింటే చికెన్ పార్టీ అంటారు.. మేకను కోసం తింటే మటన్ పార్టీ అంటారు.. మధ్యతరగతి ప్రజలను కోసి తింటే .. అది బీజేపీ' అని ఎద్దేవాచేశారు.

# ఫ్లైట్ బుక్ చేస్తా.. ఖర్చులిస్తా.. ఐటీ కంపెనీలను తీసుకొస్తారా?



### అసెంబ్లీలో విపక్షానికి లోకేశ్ సవాల్

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): "మీకు ఫ్లైట్ టికెట్లు బుక్ చేస్తా. హోటల్ రూమ్ ఖర్చులు కూడా నేనే భరిస్తా. విమర్శలు చేసే వారు, రెండు ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తీసుకురాగలరా?" అని ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతిపక్షానికి అసెంబ్లీలో సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఏర్పాటయ్యే ఐటీ కంపెనీలకు 21రోజుల్లోనే భూములు ఇవ్వడం సహా అన్ని అనుమతులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. "దొంగ అబ్బాయి, దొంగ పేపర్ అని నాపై ఆరోపణలు చేస్తున్నారు. 13 కేసుల్లో ఏ1గా ఉన్న వ్యక్తి బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రానికి కంపెనీలు రాకుండా, యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు దక్కకుండా చేయడానికి కుట్రపూరితంగా వార్తలు రాయిస్తున్నారు. దేశంలోనూ, విదేశాల్లోనూ విశ్రాంతి లేకుండా ముఖ్యమంత్రి, నేను నిరంతరం పెట్టుబడుల కోసం కష్టపడుతున్నాం. మేం ఒప్పించి తీసుకొస్తున్న కంపెనీలను అడ్డుకోవడం కోసం అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు" అంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్, ఆయన మీడియాను ఉద్దేశించి ఘాటైన విమర్శలు చేశారు. శుక్రవారం శాసనసభలో 'విశాఖలో ఫ్రాంక్లిన్ టెంప్లిటన్, ఐటీ కంపెనీలకు భూకేటాయింపు' అనే అంశంపై టీడీపీ సభ్యుడు గణేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ స్పందించారు. చర్చల కోసం వెళ్లిన తమకు ఐటీ కంపెనీలు టీ కూడా ఇవ్వలేదని, కేవలం బాటిల్ నీళ్లు ఇచ్చారని చెప్పారు. "ఫ్రాంక్లిన్ కంపెనీ ఏపీకి వచ్చింది. దాని కోసం సీఎం, నేను అమెరికాలో స్వయంగా ఆ కంపెనీకి వెళ్లి ఒప్పించాం. వాక్ టు వర్క్ పద్ధతిలో ఆ కంపెనీ ఏర్పాటుకానుంది. దీనివల్ల రూ.455 కోట్ల పెట్టుబడి, 2,500 ఉద్యోగాలు రాబోతున్నాయి" అని లోకేశ్ వివరించారు. మంగళగిరిలో ఐటీ కంపెనీలకోసం 70 ఎకరాలు కేటాయిస్తే అంత ఎందుకు అని విమర్శించారని, కానీ ఇప్పుడు పెద్దఎత్తున కంపెనీలు అక్కడికి తరలి వస్తున్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. "తిరుపతికి జోహో కంపెనీ వచ్చింది. సైబరాబాద్ తరహాలో తిరుపతి, విశాఖపట్నం, అనంతపురం, అమరావతిలో ఐటీ క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నాం. ప్రపంచంలోనే ఉత్తమ ఫిన్‌టెక్ హబ్‌గా విశాఖ అభివృద్ధి చెందుతోంది" అని వివరించారు. లక్ష ఐటీ ఉద్యోగాలు, రెండు లక్షల ఎలక్ట్రానిక్స్ తయారీ ఉద్యోగాలను రాష్ట్రానికి తీసుకురావాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని.. ఇప్పటికే 15,550 ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం ఉద్యోగాలు వచ్చాయని లోకేశ్ వివరించారు. "ఒక్క ఫాక్స్‌కాన్ కంపెనీలోనే 14 వేల మంది మహిళలు పనిచేస్తున్నారు. ఐటీలో 16,583 ఉద్యోగాలు కల్పించాం. మరో 40 వేల ఉద్యోగాలకల్పనకు వివిధ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నాం. ఇండియా బీపీవో స్కీమ్ ద్వారా 19,380 ఉద్యోగాలు కల్పించాం" అని వివరించారు.



బందరులో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నేతలు



ఒంగోలులో జిల్లాకోర్టు ఎదుట రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

## ఒంగోలులో న్యాయవాదుల రాస్తారోకో

మచిలీపట్నం/ఒంగోలు, మార్చి 23: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ శుక్రవారం మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకు కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ అధికార ప్రతినిధి పేర్నినాని తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రత్యేక హోదా, హామీల అమలు డిమాండ్లతో ప్రకాశం జిల్లాలో న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. ఒంగోలు జిల్లాకోర్టులో విధులను బహిష్కరించి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# అది చీకటి రోజే

- పార్లమెంట్ నిరవధిక వాయిదా అంశంపై హోదా సాధన సమితి
- 27న రాజ్యాంగ పరిరక్షణ దినం
- 28న విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ
- ఆపరేషన్ గరుడ శివాజీ వ్యక్తిగతం

విజయవాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అవిశ్వాసం నోటీసులపై చర్చ జరపకుండా, పార్లమెంట్‌ను నిరవధికంగా వాయిదా వేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందని, వచ్చే మంగళవారం పార్లమెంట్‌ను వాయిదా వేయాలనుకుంటున్నారన్న సమాచారం తమకు అందిందని, అదే జరిగితే ఆరోజును చీకటి దినంగా పాటిస్తామని ప్రత్యేక హోదా సాధనసమితి నాయకులు వెల్లడించారు. ఆ రోజు రాత్రి ఒక గంట పాటు దీపాలను ఆపివేసి కేంద్రానికి నిరసన తెలుపుతామని ప్రకటించారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకువెళ్లాలని, అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరితే ఇంతవరకు పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు పార్లమెంట్‌లో అఖిలపక్షం వేయాలని టీడీపీ పార్లమెంట్ సభ్యులకు చెప్పడమేమిటని ప్రశ్నించారు. మరోవైపు బీజేపీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా చేయిస్తోందని, తెలంగాణా, తమిళనాడు పార్లమెంట్ సభ్యులచేత అనవసర ఆందోళన చేయిస్తోందని అన్నారు. సభ ఆర్డర్‌లో లేదంటూనే వారికి అవసరమైన బిల్లులను మాత్రం పాస్ చేయించుకుంటున్నారని విమర్శించారు. ఏపీ విషయంలో తాము చేసింది కరెక్టేనని ప్రజలు నమ్ముతున్నారని చెపుతున్న బీజేపీ... తనకు మద్దతుగా ఆందోళనకు పిలుపు ఇచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేసేందుకు విద్యార్థి యువజన విభాగాలను ఏర్పాటు చేయడానికి ఈ నెల 28న విజయవాడలో సమావేశం జరుగుతుందని, ఒక జేఏసీ ఏర్పాటవుతుందని తెలిపారు. 27న రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోని అంబేద్కర్ విగ్రహాల ఎదుట రాజ్యాంగ పరిరక్షణ దినాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు. వేరువేరుగా కాకుండా ఈ అంశంపై ఏకాభిప్రాయం ఉన్న పార్టీలు, సంఘాలు ఒకే గొడుగు కిందకు వచ్చి ఉద్యమం చేయాలని కోరుతున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ దక్షిణాది రాష్ట్రాలపై ఆపరేషన్ గరుడ స్కెచ్‌ను రూపొందించిందన్న విషయంలో ప్రత్యేక హోదా సాధన సమితికి ఎలాంటి సంబంధం లేదని, అది హీరో శివాజీ వ్యక్తిగత ప్రకటన అని నాయకులు వెల్లడించారు.

# వాటాలు తేలక తన్నుకున్నారు!



- లంచం పంపకంలో బాహాబాహీ
- కొట్టుకొన్న పీఆర్ ఉన్నతాధికారులు
- కార్యాలయంలోనే తలపడిన వైనం

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఓ అడిషనల్ కమిషనర్, ఆయన కింద పనిచేసే సూపరింటెండెంట్ తమ కార్యాలయంలోనే బాహాబాహీకి దిగడం పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో కలకలం రేపింది. ఓ ఉద్యోగి సర్వీసు విషయంలో గురువారం మాటమాటా పెరిగి పరస్పరం దూషించుకున్నారని సమాచారం. అంతటితో ఆగకుండా వారిద్దరు తమ చేతులకు కూడా పనిచెప్పినట్టు చెబుతున్నారు. ఈ కార్యాలయవర్గాలు ఇచ్చిన సమాచారం ప్రకారం, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ జడ్పీ జూనియర్ అసిస్టెంట్.. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖకు మారేందుకు కమిషనరేట్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. తన ఫైలును కదిలించడం కోసం ఆ ఉద్యోగి బాగానే లంచాలు సమర్పించుకొన్నాడు. ఆ మొత్తం 1.40 లక్షలు దాకా ఉండొచ్చునని అనుమానిస్తున్నారు. ఆ సొమ్మును పంచుకొనే విషయంలో కమిషనరేట్‌లోని అడిషనల్ కమిషనర్‌కు, సూపరింటెండెంట్‌కు మధ్య తలలు కలవలేదు. వాటాలు వేసు కోవడంలో తేడాలు రావడంతో, వారిద్దరు గురువారం ఘర్షణకు దిగారు. హోదాలు మరిచి గోదాలోకి దిగి తన్నుకొన్నారు. అనంతరం ఒకరిపై ఒకరు డైరెక్టర్ రంజిత్ భాషాకు ఫిర్యాదు చేసుకొన్నారు. ఇటీవలే బాధ్యతలు తీసుకొన్న ఆయన.. తమ అధికారుల తీరుతో నిశ్చేష్టులయ్యారు.

### అయితే.. ఓకే..

**'కమీషన'రేట్‌లో కయ్యం!**

నిబంధనలకు విరుద్ధంగా ఒక విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర విభాగాలకు మార్చడం, సీనియారిటీని తుంగలో తొక్కి పదోన్నతులు కల్పించడంలో కమిషనరేట్ కార్యాలయం ఆరితేరిందని పలువురు విమర్శిస్తున్నారు. గుంటూరు జిల్లాలోని ఓ మండలపరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్‌ను పంచాయతీరాజ్‌శాఖలో బిల్లు కలెక్టర్‌గా నియమించేందుకు వచ్చిన ప్రతిపాదనను అధికారులు వీలు కాదని తేల్చేశారు. అయితే ఆ ఉద్యోగి భారీగా ముడుపులు సమర్పించుకోవడంతో ఆయన పని సులువుగా అయిపోయిందని సమాచారం. కోస్తా జిల్లాలకు చెందిన ఓ ఎమ్మెల్యే సిఫారసుతో ఓ జడ్పీ ఉద్యోగిని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు మార్చాలని వచ్చిన ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించింది. అయితే ఆ ఉద్యోగి నుంచి ముడుపులు తీసుకొని, ఆయన పనిని పంచాయతీరాజ్ కమిషనరేట్ అధికారులు చక్కబెట్టారని తెలుస్తోంది. రోస్టర్ పాయింట్ల ఆధారంగా వికలాంగ ఉద్యోగులకు కల్పించాల్సిన పదోన్నతుల్లో మెరిట్‌ను తుంగలో తొక్కారని చెబుతున్నారు.

### కమిషనరేట్ కథే వేరు..

పంచాయతీరాజ్‌శాఖ కమిషనరేట్‌లో సర్వీసు సంబంధ విషయాలు చూసే సిబ్బంది ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని ఆ శాఖ ఉద్యోగులే వాపోతున్నారు. కర్నూలు జిల్లా పరిషత్‌కు చెందిన ఓ నాలుగో తరగతి ఉద్యోగి వద్ద ముడుపులు తీసుకుని...పంచాయతీ కార్యదర్శి పోస్టుకు కన్వర్షన్ చేశారు. ఆ తరువాత అతని నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్టు ప్రభుత్వం గుర్తించి.. తొలగించింది. సస్పెన్షన్‌కు ముందుదాకా ఆ పోస్టులో తీసుకున్న జీతాన్ని వసూలు చేయాలని కూడా ఆదేశించింది. దీనిపై అతడు తాను లంచాలు ఇచ్చిన అధికారులను కలిశాడు. పని కాలేదు కాబట్టి, తన డబ్బులు తనకు ఇవ్వాలని పట్టుబట్టాడు. వారు కుదరదనడంతో, డీల్ సమయంలో రికార్డు చేసిన మాటలను వారికి వినిపించి తన దారికి తెచ్చుకొన్నాడు. దొంగకు తేలు కుట్టినట్లు ఆ ఉద్యోగి ఇచ్చిన డబ్బులు తిరిగిచ్చేశారు.

# నిజాయితీ పోలీస్ కావాలి

- రాష్ట్ర డీజీపీకి ఏసీబీ చీఫ్ లేఖ
- 300మందిని ఇవ్వాలని విజ్ఞప్తి

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): "అవినీతి ఆరోపణలులేని 300మంది నిజాయితీ కలిగిన పోలీసులను మాకు కేటాయించండి" అని పోలీసుశాఖను అవినీతి నిరోధకశాఖ కోరింది. రాష్ట్రంలో అవినీతిపరుల భరతం పడుతూ సంచలన కేసులు నమోదు చేస్తోన్న ఏసీబీని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బాగా బలోపేతం చేసింది. ప్రత్యేక కోర్టులు, తగిన మౌలిక వసతులు, ప్రతి జిల్లాలోనూ సొంత భవన నిర్మాణం, 1100 ద్వారా ఫిర్యాదుల బదిలీ..ఇలా అన్నివిధాలా ఏసీబీ దూసుకెళుతోంది. ఈ నేపథ్యంలో పాతికేళ్ల తర్వాత ఏసీబీలో పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ప్రస్తుతం ఏసీబీలో ఉన్న సిబ్బందికి అదనంగా 350 మందిని నియమించుకోవడానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీనిపై రాష్ట్ర డీజీపీ మాలకొండయ్యకు ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ తాజాగా లేఖ రాశారు. రేంజ్‌ల వారీగా ఖాళీలను వివరిస్తూ..డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఎవరెవరు ఎంతమంది కావాలో పేర్కొన్నారు. దర్యాప్తులో ప్రావీణ్యం, అవినీతికిపై సమాచార సేకరణ, గోప్యత పాటించే నైజం, వీటన్నిటికన్నా ముఖ్యంగా నిజాయితీ, సమాజం పట్ల బాధ్యత ఉండే పోలీసులను తమకు కేటాయించాలని కోరినట్లు తెలిసింది.

## నేషనల్ పూల్ ముంచేసింది!

- నీట్‌లో 5వేల లోపు ర్యాంకు సాధించింది 200 మందే
- సగం సీట్లు కోల్పోయిన ఏపీ విద్యార్థులు
- జాతీయస్థాయిలో సీటు పొందలేని దుస్థితి
- అంచనాల్లో అధికారులు బోల్తా

అమరావతి, విజయవాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నీట్‌లో నేషనల్ పూల్ గురించి ఎన్నో గొప్పలు చెప్పారు.. మనం 400 సీట్లు ఇస్తే.. జాతీయస్థాయిలో 12వేల సీట్లు వస్తాయని అంచనా వేశారు.. కానీ నేషనల్ పూల్ మనవాళ్లని నిలువునా ముంచేసింది. 'నీట్'గా సర్దుకోమని చెప్పకనే చెప్పింది. జాతీయస్థాయిలో మనవాళ్లు కనీసం సీట్లు కూడా పొందే అవకాశం లేకుండా పోయింది. ఇదే సమయంలో ఏపీలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల నుంచి 400లకుపైగా పీజీ సీట్లు నేషనల్ పూల్‌కి కేటాయించాల్సి వచ్చింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 1.25 లక్షల మంది విద్యార్థులు నీట్‌కు క్వాలిఫై కాగా, ఏపీ నుంచి 6వేల మంది మాత్రమే అర్హత సాధించారు. సొంత రాష్ట్రంలో కాకుండా వేరే రాష్ట్రాల్లోని మంచి కాలేజీలో సీటు పొందాలంటే 5వేల లోపు ర్యాంకు వచ్చి ఉండాలి. 5వేల లోపు ర్యాంకులు వచ్చిన వారిలో మనవాళ్లు 200 మంది మాత్రమే ఉన్నారు. ఏపీలో 800లకు పైగా పీజీ మెడికల్ సీట్లు ఉన్నాయి. నేషనల్ పూల్‌లో ఏపీని చేర్చడం వల్ల 50 శాతం సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించాలి. ఈ లెక్క ప్రకారం మనవాళ్లు జాతీయస్థాయిలో 500 సీట్లు అయినా పొందాలి. అలాజరగలేదు. జాతీయస్థాయిలో సీట్లు రాకపోగా.. ఏపీలోని మంచి సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులు తన్నుకుపోనున్నారు.

### మనలో మనకే పోటీ!

5వేల లోపు ర్యాంకు సాధించిన విద్యార్థులు కూడా ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా ఏపీలోనే సీటు పొందేందుకు మొగ్గు చూపుతుండటంతో.. ఉన్న 400 సీట్లలో మనలో మనకే పోటీ నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది. ఇదంతా ఉన్నతాధికారుల అవగాహనా రాహిత్యం వల్లే జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా అన్ని జాతీయస్థాయి పరీక్షల్లో ఏపీ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తుంటారు. దాని ఆధారంగానే మన విద్యార్థులకు మంచి ర్యాంకులు వస్తాయని అధికారులు భావించారు. కానీ నీట్‌లో మైనస్ మార్కులు ప్రవేశపెట్టడంతో ఊహించని ఫలితాలు వచ్చాయి.

### దరఖాస్తులకు ఆహ్వానం

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో నీట్ కటాఫ్ మార్కులు పొంది అర్హులైన అభ్యర్థుల నుంచి పీజీ మెడికల్, డెంటల్, డిప్లమా కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 31వ తేదీ రాత్రి 8 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. కాంపిటెంట్ అథారిటీ స్టేట్ కోటాలో సీట్లు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, మిగతా వివరాలను యూనివర్శిటీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఆ ప్రకటనలో ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయ నియామకాలు జరుగుతుండటంతో బీఈడీ కోర్సుకు మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలంటే సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు శిక్షణ తప్పనిసరి. ఇందుకు బాటలు వేస్తున్న కోర్సుల్లో బీఈడీ (బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్) ఒకటి. ప్రైవేట్ రంగంలో మంచి అవకాశాలు లభిస్తుండటం వల్ల కూడా బీఈడీ కోర్సుకు డిమాండ్ పెరిగింది. బీఈడీ కోర్సులో ప్రవేశానికి వీలు కల్పించే ఎడ్‌సెట్ (ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)కు రెండు తెలుగు రాష్ట్రాల్లో నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను చూద్దాం..



కెరీర్ గైడ్

# ఉపాధ్యాయవృత్తికి తొలి అడుగు..

# ఎడ్‌సెట్ విజయం

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాల్లో ముఖ్యమైంది బీఈడీ కోర్సు. దాంతో ఈ కోర్సులో ప్రవేశానికి పోటీ కూడా ఎక్కువగానే ఉంటోంది. ఎడ్‌సెట్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. నిబంధనల మేరకు గత కొన్నేళ్ల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులకు కూడా ఈ కోర్సులో ప్రవేశం కల్పిస్తుండటం విశేషం. బీఈడీ కోర్సులో తెలుగు, ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, బయోలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్ మెథడాలజీలు ఉంటాయి. విద్యార్థులు తమ విద్యానేపథ్యం ఆధారంగా మెథడాలజీని ఎంచుకోవాలి.

## అర్హత

**50** శాతం మార్కులతో (బీసీ / ఎస్సీ / ఎస్టీ విద్యార్థులకు 40 శాతం చాలు) బీఏ / బీఎస్సీ / బీఎస్సీ (హోమ్ సైన్స్) / బీకామ్ / బీసీఏ / బీబీఎం / బీబీఏ లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు / తత్సమాన కోర్సులు చేసిన వారు ఎడ్‌సెట్ రాయొచ్చు. బీఈ / బీటెక్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే కోర్సులో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లను చదివి ఉండాలి. కనీసం 50 శాతం (తెలంగాణలో 55 శాతం) మార్కులను సాధించాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంచుకున్న మెథడాలజీని బట్టి అర్హత ప్రమాణాలు మారుతుంటాయి. అవి..

- **మ్యాథమెటిక్స్:** బీఏ / బీఎస్సీ (మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌గా) లేదా బీసీఏ (ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా) బీఈ / బీటెక్ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లు చదివి ఉండాలి).
- **బయోలాజికల్ సైన్స్:** బోటనీ, జువాలజీ లేదా సంబంధిత లైఫ్ సైన్సెస్ సబ్జెక్ట్‌లతో బీఎస్సీ / బీఎస్సీ (హోమ్ సైన్స్) లేదా బీసీఏ (ఇంటర్మీడియెట్‌లో బయోలాజికల్ సైన్స్ చదివి ఉండాలి).
- **ఫిజికల్ సైన్స్:** బీఎస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ / సంబంధిత మెటీరియల్ సైన్స్ సబ్జెక్ట్‌లతో) / బీసీఏ (ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లు చదివుండాలి).
- **సోషల్ స్టడీస్:** బీఏ / బీకామ్ / బీబీఏం లేదా బీసీఏ (ఇంటర్మీడియెట్‌లో సోషల్ సైన్సెస్ చదివి ఉండాలి).
- **ఇంగ్లీష్:** బీఏ (స్పెషల్ ఇంగ్లీష్) / ఎంఏ (ఇంగ్లీష్).
- **వయసు:** జూలై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.

## రాత పరీక్ష ఇలా

మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. వీటికి 120 నిమిషాల్లో జవాబులు గుర్తించాలి. మొత్తం మార్కులు 150. ప్రశ్నపత్రం తెలుగు / ఇంగ్లీష్ / ఉర్దూలో ఉంటుంది.

| విభాగం | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| పార్ట్ - ఎ జనరల్ ఇంగ్లీష్ | 25 | 25 |
| పార్ట్ - బి జనరల్ నాలెడ్జ్ | 15 | 15 |
| టీచింగ్ ఆప్టిట్యూడ్ | 10 | 10 |
| సబ్జెక్ట్ | 100 | 100 |

పార్ట్ - ఎ, పార్ట్ - బి అందరికీ కామన్‌గా ఉంటాయి.

రెండు తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. వెబ్‌సైట్‌లో మాక్‌టెస్ట్‌ను కూడా పొందుపరిచారు. రెండు రాష్ట్రాల్లోనూ పరీక్షా విధానం ఒకటే. మెథడాలజీని బట్టి పరీక్షలో అడిగే సబ్జెక్ట్‌లు వేరుగా ఉంటాయి. మ్యాథమెటిక్స్‌ను ఎంచుకున్న విద్యార్థులకు 100 ప్రశ్నలు మ్యాథమెటిక్స్ నుంచి వస్తాయి.

- ఫిజికల్ సైన్స్ విద్యార్థులకు ఫిజిక్స్ నుంచి 50 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు.
- బయోలాజికల్ సైన్సెస్‌లో బోటనీ నుంచి 50 ప్రశ్నలు, జువాలజీ నుంచి 50 ప్రశ్నలు వస్తాయి.
- సోషల్ స్టడీస్‌లో జాగ్రఫీ నుంచి 35 ప్రశ్నలు, హిస్టరీ నుంచి 30 ప్రశ్నలు, సివిక్స్ నుంచి 15 ప్రశ్నలు, ఎకనామిక్స్ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు.
- ఇంగ్లీష్ మెథడాలజీని ఎంచుకున్న విద్యార్థులకు 100 ప్రశ్నలు ఇంగ్లీష్ నుంచి వస్తాయి.

## సన్నద్ధత ఇలా

### పార్ట్ - ఎ:

- **జనరల్ ఇంగ్లీష్:** మెరుగైన ర్యాంక్ సాధించడంలో ఈ విభాగానిది ప్రధాన పాత్ర అని చెప్పొచ్చు. ఇందులో ఆంగ్ల భాషపై విద్యార్థుల కనీస పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా పదో తరగతి స్థాయి ప్రశ్నలు వస్తాయి. కాబట్టి సిలబస్‌ను అనుసరిస్తూ పదో తరగతి వరకు ఉండే ఇంగ్లీష్ గ్రామర్ సంబంధిత అంశాలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.

### పార్ట్ - బి:

- **జనరల్ నాలెడ్జ్:** ప్రపంచవ్యాప్తంగా సామాజికంగా, రాజకీయంగా, శాస్త్ర - సాంకేతిక తదితర రంగాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలపై అభ్యర్థుల అవగాహనను ఈ విభాగంలో పరీక్షిస్తారు. ఇందు కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనించాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొత్త పథకాలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన పెంచుకోవాలి. ఇతర దేశాలతో భారత్ చేసుకుంటున్న ఒప్పందాలు, ప్రధాని పర్యటనలు, అవార్డులు, క్రీడలు, శాస్త్ర - సాంకేతిక పరిశోధనలు, ఎన్నికలు, ప్రభుత్వ విధానాల్లో మార్పులు, చట్టాలు, వార్తల్లో వ్యక్తులు, నియామకాలను సమగ్రంగా ఫాలో కావాలి.
- పరీక్ష తేదీకి ముందు ఆరు నుంచి ఎనిమిది నెలల కాలంలో చోటుచేసుకున్న పరిణామాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వివిధ దేశాలు - వాటి రాజధానులు, కరెన్సీ, భౌగోళిక ప్రాధాన్యం లాంటి అంశాలను చదవాలి. వివిధ దేశాల సంస్కృతి, నాగరికతలను ప్రతిబింబించే ముఖ్యమైన కట్టడాలు, వాటిని నిర్మించిన ప్రదేశాలు, పండగలు, ముఖ్యమైన గ్రంథాలు - రచయితల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి. ఆరు నుంచి పదో తరగతి వరకు సైన్స్, సోషల్ స్టడీస్‌లో ఉండే ప్రాథమిక అంశాలను గుర్తు పెట్టుకోవాలి.
- **భౌతిక, రసాయన శాస్త్రాలు:** ఇందులో అనువర్తనాలకు ప్రాధాన్యం ఉంటుంది. పాఠ్యాంశాల వారీగా ముఖ్యమైన సిద్ధాంతాలు, నిర్వచనాలు, నియమాలను పాయింట్ల రూపంలో రాసుకుని పునశ్చరణ చేసుకోవాలి. ఇంటర్ పాఠ్యాంశాలను క్షుణ్నంగా చదవాలి. యాంత్రిక శాస్త్రం, విద్యుత్, అయస్కాంతత్వం నుంచి ఎక్కువ ప్రశ్నలు రావడానికి ఆవకాశం ఉంది. రసాయన శాస్త్రంలో... మూలక, భౌతిక రసాయన శాస్త్రాలకు ఇంటర్మీడియట్ పుస్తకాలు, కర్బన రసాయన శాస్త్రానికి డిగ్రీ స్థాయి వరకు పాఠ్యాంశాలు చదవాలి. ఈ మూడు అంశాల నుంచి దాదాపు సమాన సంఖ్యలో ప్రశ్నలు వస్తుంటాయి.
- **జీవశాస్త్రం:** ఇందులో జంతువుల విసర్జక వ్యవస్థ, కిరణజన్య సంయోగక్రియలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

## సాంఘిక శాస్త్రం

- ఈ విభాగంలో అధిక ప్రాధాన్యం భూగోళశాస్త్రానికే (35 మార్కులు). కాబట్టి అదనపు సమయం కేటాయించుకోవాలి. అట్లాస్, మ్యాప్ సాయంతో చదివితే గుర్తుంచుకోవడం తేలిక. పౌరశాస్త్రంలో భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ, రాజనీతి సిద్ధాంతాలు, భావనలు, అంతర్జాతీయ సంబంధాలపై దృష్టి కేంద్రీకరించాలి.
- ఆర్థిక శాస్త్రంలో సూక్ష్మ అర్థశాస్త్రం నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. భారత ఆర్థికాభివృద్ధిపై కూడా ప్రశ్నలు వస్తాయి. ముఖ్యంగా పంచవర్ష ప్రణాళికలు, పన్నులు, ద్రవ్య విధానం, బ్యాంకింగ్, జనాభా అంశాలపై ప్రశ్నలు రావచ్చు. సంబంధిత వర్తమాన అంశాలను తెలుసుకోవాలి.
- చరిత్రలో సాధారణంగా ఆధునిక యుగం నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తుంటాయి. ముఖ్యంగా సాంస్కృతిక పునరుజ్జీవనం, మత సంస్కరణోద్యమం, ఐరోపా, అమెరికాల్లో అనేక విప్లవాలు, ప్రపంచ యుద్ధాలు, నానాజాతి సమితి, ఐక్యరాజ్య సమితి అంశాలను చదవాలి. భారతదేశ చరిత్రకు సంబంధించి స్వాతంత్ర్య ఉద్యమంలోని వివిధ దశలు, సింధు నాగరికత, బౌద్ధ, జైన మతాలు, మౌర్యులు, గుప్తులు, ఆధునిక దక్షిణ భారతదేశ చరిత్రపై దృష్టి కేంద్రీకరించాలి.

- **ఇంగ్లీష్:** ఈ సబ్జెక్ట్‌కు సంబంధించి 8, 9, 10, ఇంటర్ తరగతుల్లో చదివిన ఇంగ్లీష్ ఆధారంగా 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. ఈ విభాగంలోని టాపిక్‌లు.. i) Language functions ii) Elements of Phonetics iii) Grammar iv) Phrasal Verbs (idioms) v) Writing skills vi) Study skills vii) Reference skills b) Syllabus prescribed for Optional English at B.A. Degree Level (B.A.Special English) / Modern Literature Syllabus in English - 50 Questions (50 marks)

## గణితం

- ఇందులో చాలా ముఖ్యమైన పాఠ్యాంశాలు... సమితులు, సంబంధాలు, ప్రమేయాలు, వర్గ సమీకర ణాలు, ద్విపద సిద్ధాంతం, ప్రస్తారాలు, సంయోగాలు, మాత్రికలు, త్రికోణమితి, అనుక్రమాలు, శ్రేణులు, అవకలనీయం, సమాకలనం, అవకలన సమీకరణాలు, సమూహాలు, వలయాలు, రుజువర్తనలు తదితరాలు. సూత్రాలను ఒక క్రమపద్ధతిలో రాసుకుని రోజూ పునశ్చరణ చేసుకోవాలి. ప్రతిరోజు అభ్యాసం చేయాలి.

## టీచింగ్ ఆప్టిట్యూడ్

- ఈ విభాగంలో అభ్యర్థికి బోధనపై ఏ మేరకు అభిరుచి ఉందో తెలుసుకునే విధంగా ప్రశ్నలు ఇస్తారు. సంబంధిత రంగంపై విద్యార్థుల అవగాహనను పరీక్షించేలా... పిల్లల్లో నేర్చుకోవడంలో వ్యత్యాసాలను గుర్తించడం, కమ్యూనికేషన్ సామర్థ్యం, జనరల్ ఇంటెలిజెన్స్ స్థాయిలను అంచనా వేస్తారు. ఈ విభాగంలో ప్రశ్నలో ఇచ్చిన సందర్భాన్ని విచక్షణతో ఆలోచించి సమయస్ఫూర్తితో సమాధానాలను గుర్తించాలి. మంచి ఉపాధ్యాయుడికి ఉండాల్సిన లక్షణాలు, తరగతి గదిలో వివిధ సందర్భాల్లో ఉపాధ్యాయులు పాటించాల్సిన ప్రమాణాల ఆధారంగా ఇందులో ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్ - సిలో అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్టు ప్రకారం డిగ్రీ స్థాయివరకు ప్రశ్నలు ఇస్తారు కాబట్టి వాటిపై అవగాహన ఏర్పరచుకోవాలి. ఎడ్‌సెట్ పరీక్షను ఏ సబ్జెక్టులో రాసినప్పటికీ ప్రశ్నపత్రం మాత్రం 8 నుంచి డిగ్రీ చివరి సంవత్సరం పాఠ్యపుస్తకాలను అనుసరించే ఉంటుంది. కాబట్టి ప్రిపరేషన్‌లో గైడ్లకంటే పాఠ్యపుస్తకాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. పాతప్రశ్నపత్రాలను పరిశీలించి సంబంధిత సబ్జెక్టులో ఏయే అంశాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారు అనే అంశంపై అవగాహన పెంచుకోవాలి. వీలైనన్ని మోడల్ ప్రశ్నపత్రాలు సాధన చేయాలి.

## సీట్ల కేటాయింపు

- ఎడ్‌సెట్‌లో 25 శాతం మార్కులను (38 మార్కులు) కనీస అర్హతగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అర్హత మార్కుల విషయంలో ఎటువంటి పరిమితులు లేవు. ప్రతి మెథడాలజీలో 85 శాతం సీట్లను స్థానిక విద్యార్థులతో (లోకల్), 15 శాతం సీట్లను అన్ రిజర్వ్‌డ్ కోటా కింద భర్తీ చేస్తారు.
- తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, కుప్పంలోని ద్రావిడ యూనివర్సిటీలు స్టేట్ వైడ్ యూనివర్సిటీలు. వీటిల్లో 85 శాతం సీట్లను మూడు ప్రాంతాల వారికి కేటాయిస్తారు. మిగతా 15 శాతం ఓపెన్ కోటా కింద ఉంటాయి.
- ఆంధ్రా యూనివర్సిటీ (శ్రీకాకుళం, కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి), ఉస్మానియా యూనివర్సిటీ (నల్లగొండ, ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, మెదక్), శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీల (నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం) పరిధి ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.
- సబ్జెక్ట్‌లోని అడిగే ప్రశ్నల క్లిష్టత డిగ్రీ స్థాయిలో ఉంటుంది.
- జనరల్ ఇంగ్లీష్‌లో రీడింగ్ కాంప్రెహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్, టెన్సెస్, స్పెల్లింగ్, వొకాబ్యులరీ, సినానిమ్స్, యాంటోనిమ్స్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ సెంటెన్సెస్ (సింపుల్, కాంపౌండ్, కాంప్లెక్స్), వాయిసెస్, డైరెక్ట్ స్పీచ్, ఇన్ డైరెక్ట్ స్పీచ్ నేర్చుకోవాలి.

**ఆంధ్రప్రదేశ్‌లో ఎడెసెట్ నిర్వహణ బాధ్యతలను శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ - తిరుపతి పర్యవేక్షిస్తుంది.**

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 5, 2018.
- రూ. 500 అపరాధ రుసుంతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2018.
- పరీక్ష తేదీ: ఏప్రిల్ 19, 2018
- పరీక్ష కేంద్రాలు: అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, గుంటూరు, విజయవాడ, భీమవరం, కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, ఒంగోలు, నంద్యాల, నెల్లూరు, తిరుపతి, విజయనగరం, శ్రీకాకుళం.
- వెబ్‌సైట్: http://sche.ap.gov.in/EDCET

**తెలంగాణలో ఎడెసెట్ నిర్వహణ బాధ్యతలను ఉస్మానియా యూనివర్సిటీ - హైదరాబాద్ పర్యవేక్షిస్తుంది.**

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 20, 2018.
- రూ. 500 అపరాధ రుసుంతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30, 2018.
- పరీక్ష తేదీ: మే 31, జూన్ 1.
- పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, వరంగల్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి.
- వెబ్‌సైట్: http://edcet.tsche.ac.in/

# జాబ్ కార్నర్

## ప్రాజెక్ట్ ఇంజనీర్లు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, హుగ్లీ డాక్ & పోర్ట్ ఇంజనీర్స్ లిమిటెడ్ ఉమ్మడి సంస్థ హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్- ఒప్పంద ప్రాతిపదికన కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: చీఫ్ ప్రాజెక్ట్ ఇంజనీర్, సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్
- వయసు: చీఫ్ ఇంజనీర్‌కు 65 ఏళ్లు, సీనియర్ ఇంజనీర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (సివిల్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి. సీనియర్ ఇంజనీర్ ఉద్యోగాలకు డిప్లొమా (సివిల్) అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశించిన మేర అనుభవం తప్పనిసరి.
- ఒప్పంద వ్యవధి: రెండేళ్లు
- నెల వేతనం: చీఫ్ ఇంజనీర్లకు మొదటి ఏడాది రూ1,55,000 రెండో ఏడాది రూ.1,60,000 సీనియర్ ఇంజనీర్లకు మొదటి ఏడాది రూ.1,10,000 రెండో ఏడాది రూ.1,13,500 ఇస్తారు. అదనపు పనిగంటల నిమిత్తం రూ.4,500 ఇస్తారు.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ: ఏప్రిల్ 18, 19
- దరఖాస్తు ఫీజు: రూ.200
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 5
- వెబ్‌సైట్: www.cochinshipyard.com

## ఆయిల్ ఇండియా

ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్) - కాకినాడలోని కేజీబీ ప్రాజెక్టుకోసం తాత్కాలిక ప్రాతిపదికన ఫైర్ సర్వీస్ ఆఫీసర్ నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- ఒప్పంద వ్యవధి: ఆర్నెల్లు
- అర్హత: బీఈ (ఫైర్ ఇంజనీరింగ్) / బీటెక్ (సేఫ్టీ& ఫైర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు నాటికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి.
- వేతనం: నెలకు రూ.40,000
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 2
- అభ్యర్థులు సంప్రదించాల్సిన చిరునామా: Training & Placement Office, Swarnotsav Bhavan, Jawaharlal Nehru Technological University, Kakinada- 533003
- వెబ్‌సైట్: www.oil-india.com

## ఐఆర్‌ఎస్‌డీసీ

ఇండియన్ రైల్వే స్టేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌ఎస్‌డీసీఎల్)- కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: **17**
- ఉద్యోగాలు: సీనియర్ ఎక్స్‌పర్ట్ (ప్లానర్ 1, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 1, ట్రాన్స్‌పోర్ట్ ప్లానర్ 1, ప్రాపర్టీ డెవలప్‌మెంట్ 1, కాంట్రాక్ట్ స్పెషలిస్ట్ 2, కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ 1, ఫైనాన్షియల్ అప్రైజల్ 1), కంపెనీ సెక్రటరీ 1, ఆర్కిటెక్ట్ / అర్బన్ ప్లానర్ 3, ఇంజనీర్స్ 5
- అర్హత: ఉద్యోగాన్ని అనుసరించి సంబంధిత విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ / ఎంబీఏ / (డిగ్రీ / డిప్లొమా) (హోటల్ మేనేజ్‌మెంట్) / సీఏ / ఐసీడబ్ల్యుఏ/ బీఈ (సివిల్/ ఎలక్ట్రికల్ / మెకానికల్) పూర్తి చేసి ఉండాలి.
- వయసు: 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 6
- వెబ్‌సైట్: www.irsdc.com

## లా ఆఫీసర్లు

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) - క్లాట్ 2018 స్కోరు ద్వారా లా ఆఫీసర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: **12**
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎల్ / ఎల్ఎల్‌బి డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డిస్టెన్స్ / పార్ట్ టైం కోర్సులు చేసిన అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. పీజీ/ పీజీ డిప్లొమా (కమర్షియల్/ లేబర్/ ట్యాక్సేషన్ లాస్) చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- వయసు: మార్చి 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక: క్లాట్ 2018 స్కోరు ఆధారంగా 1:10 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు.
- వెయిటేజీ వివరాలు: క్లాట్ స్కోరుకు 75 శాతం, ఇంటర్వ్యూకి 25 శాతం వెయిటేజీ ఇస్తారు.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఏప్రిల్ 2
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మే 2
- వెబ్‌సైట్: http://careers.bhel.in/

## ట్రైనీ క్యాబిన్ క్రూ

ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఏఎస్ఎల్) - ట్రైనీ క్యాబిన్ క్రూ ఉద్యోగాల భర్తీకోసం అవివాహిత పురుషులు& మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **16** (మహిళలకు 8 ఖాళీలను కేటాయించారు.)
- వయసు: మార్చి 15 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
- అర్హత: ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు డిగ్రీ / డిప్లొమా (హోటల్ మేనేజ్‌మెంట్ / క్యాటరింగ్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
- శిక్షణా కేంద్రం: ఢిల్లీ
- దరఖాస్తు ఫీజు: రూ.1500
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 6
- వెబ్‌సైట్: www.airindia.in

## తెలంగాణలో పోస్ట్‌మెన్ ఉద్యోగాలు

- **ఖాళీల వివరాలు:** అన్ని డివిజన్లలో కలిపి మొత్తం 132 పోస్ట్‌మెన్ ఖాళీలు ఉన్నాయి. జనరల్ వర్గానికి 76, ఎస్సీలకు 14, ఎస్టీలకు 6, ఓబీసీలకు 36 ఖాళీలను కేటాయించారు. హైదరాబాద్ హెడ్‌క్వార్టర్ రీజియన్‌లో 75, హైదరాబాద్ రీజియన్‌లో 57 ఖాళీలు ఉన్నాయి. హైదరాబాద్ రీజియన్‌లో 4 మెయిల్ గార్డ్ ఖాళీలు ఉన్నాయి.
- **వయసు:** అభ్యర్థుల వయసు దరఖాస్తునాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ / ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీ & ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఇస్తారు. మూడేళ్ల సర్వీసు ఉన్న 40 ఏళ్లలోపు ప్రభుత్వోద్యోగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంపిక: అభ్యర్థులను ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు. ఇందులో ఎ, బి, సి అనే మూడు పార్టులు ఉంటాయి. పార్టు - సిలో రెండు ఉపవిభాగాలు ఉంటాయి. పార్టు ఎ, బిలకు ఒక్కోదానికి 25 మార్కులు, పార్టు - సికి 50 (ఒక్కో ఉపవిభాగానికి 25 మార్కులు) మార్కులు కేటాయించారు. 2 గంటల పరీక్ష సమయంలో 100 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి ప్రశ్నకూ 1 మార్కు కేటాయించారు. అన్నీ ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష పదోతరగతి స్థాయిలో ఉంటుంది.
- **ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే:** జనరల్ అభ్యర్థులకు పార్టు ఎ, బిలతోపాటు పార్టు సిలోని రెండు ఉపవిభాగాల్లో ఒక్కోదానిలో కనీసం 10 మార్కులు రావాలి. అదే ఓబీసీలకు 9 మార్కులు, ఎస్సీ / ఎస్టీలకు 8 మార్కులు వస్తే చాలు. అంటే పరీక్ష మొత్తమ్మీద జనరల్ అభ్యర్థులకు కనీసం 40 మార్కులు, ఓబీసీలకు 37, ఎస్సీ / ఎస్టీలకు 33 మార్కులు రావాలి. ఈ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రతి పోస్టల్, ఆర్ఎంఎస్ డివిజన్లకు వేర్వేరుగా మెరిట్ లిస్టులను రూపొందిస్తారు. ఈ మెరిట్ లిస్ట్ ఆధారంగానే పోస్టింగ్ ఇస్తారు.
- **ముఖ్య సమాచారం**
  - పరీక్ష కేంద్రం: హైదరాబాద్
  - వేతనం: నెలకు రూ.21,700తోపాటు ఇతర అలవెన్స్‌లు ఇస్తారు.
  - ప్రొబెషన్: రెండేళ్లు
  - దరఖాస్తు ఫీజు: రూ.100
  - పరీక్ష ఫీజు: రూ.400 (ఎస్సీ / ఎస్టీ / మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
  - ఆన్‌లైన్లో ప్రైమరీ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: ఏప్రిల్ 21
  - పోస్టాఫీసుల్లో ఫీజు చెల్లించేందుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 25
  - ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 28
  - వెబ్‌సైట్: www.telanganapostalcircle.in www.indiapost.gov.in

# నవమి నైవేద్యాలు...

శ్రీరామ నవమిని ప్రజలంతా ఎంతో భక్తి శ్రద్ధలతో చేసుకుంటారు. సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. రాముడికి ఎంతో ప్రీతిపాత్రమైన పానకం, వడపప్పు, సెనగ గుగ్గిళ్లు, చలిమిడి, క్యారెట్ కోశాంబరి నైవేద్యంగా సమర్పిస్తారు.





### పానకం:

**కావలసినవి:** బెల్లం - నాలుగు టేబుల్ స్పూన్లు (తరుగు), నీళ్లు- రెండు కప్పులు, శొంఠి, యాలకులపొడి- కొద్దిగా, మిరియాలు (కచ్చాపచ్చాగా చేసి)- కొన్ని.

**తయారీ:** నీళ్లల్లో బెల్లం వేసి గరిటెతో కలిసి కరిగించాలి. ఆ నీళ్లను వడకట్టి, అందులో యాలకుల పొడి, శొంఠి, మిరియాల పొడి వేసి కలిపితే పానకం రెడీ.

### పచ్చి చలిమిడి

**కావలసినవి:** బెల్లం తరుగు- అర కప్పు, బియ్యప్పిండి- కప్పు, నీళ్లు- కొద్దిగా.

**తయారీ:** బియ్యప్పిండిలో బెల్లం వేసి బాగా కలపాలి. తరువాత తగినన్ని నీళ్ల చల్లుతూ ముద్దలా చేస్తే పచ్చి చలిమిడి సిద్ధం. ఎండుద్రాక్ష, జీడిపప్పులను కూడా చలిమిడిలో వేయొచ్చు.



### వడపప్పు



**కావలసినవి:** పెసరపప్పు- పావుకప్పు

**తయారీ:** రెండు గంటల పాటు నీళ్లల్లో పెసరపప్పు నానబెట్టాలి. తర్వాత నానిన పప్పును గిన్నెలోకి తీయాలి. కావాలనుకుంటే పచ్చిమామిడి ముక్కలు, పచ్చిమిర్చి, కొద్దిగా ఉప్పు కూడా కలపొచ్చు.

### సెనగ గుగ్గిళ్లు



**కావలసినవి:** సెనగలు- ఒక కప్పు, కరివేపాకులు - కొన్ని, పసుపు- చిటికెడు, ఆవాలు, జీలకర్ర- ఒక్కొక్కటి పావు టీస్పూను చొప్పున, పచ్చి కొబ్బరి తురుము- ఒక టేబుల్‌స్పూను, పచ్చిమిర్చి- ఒకటి (సన్నగా తరిగి), ఇంగువ- చిటికెడు, నూనె- సరిపడా.

**తయారీ:** సెనగలను రాత్రంతా నీళ్లల్లో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం కుక్కర్‌లో వేసి, అందులో పావుకప్పు నీళ్లు, ఉప్పు, పసుపు కలపాలి. స్టవ్ సిమ్‌లో ఉంచి, రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. ఉడికిన సెనగలను కుక్కర్‌లోంచి తీసి పక్కన ఉంచాలి. ఒక పాన్‌లో నూనె వేడిచేసి ఆవాలు, జీలకర్రలు వేగించాలి. తర్వాత కరివేపాకు, ఇంగువ, ఎండు మిర్చి వేయాలి. పచ్చికొబ్బరి తురుమువేసి కలపాలి. చివరిగా ఉడికించిన సెనగలను వేసి కలపాలి.

### క్యారెట్ కోశాంబరి:

**కావలసినవి:** క్యారెట్ తరుగు- ఒక కప్పు, పెసరపప్పు- మూడు టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ- ఒకటి, ఉప్పు- కొద్దిగా. తాలింపుకు నూనె- ఒక టీస్పూను, ఆవాలు- ముప్పావు టీస్పూను, పచ్చిమిర్చి- ఒకటి (తరిగి), ఇంగువ- చిటికెడు.

**తయారీ:** పెసరపప్పును నీళ్లలో గంటసేపు నానబెట్టాలి. ఒక గిన్నెలో క్యారెట్ తరుగు, నానబెట్టిన పెసరపప్పు వేసి, నిమ్మకాయ రసం పిండి కలపాలి. సిద్ధం చేసుకున్న తాలింపులో కొద్దిగా ఉప్పు కలపాలి.





గుడ్‌ఫుడ్

## బెల్లంతో బరువు తగ్గుతారు...

బెల్లం అనగానే నోరూరుతుంది. నాలుక తీయదనపు అనుభూతితో నిండిపోతుంది. ఇక బెల్లం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలూ ఎక్కువే. చర్మం, శిరోజాల అందచందాలను బెల్లం ఇనుమడింపచేస్తుంది. శరీర బరువును సైతం తగ్గిస్తుంది! ఇలా బెల్లంతో ఎన్నో లాభాలున్నాయి. అవేమిటంటే...

- బెల్లం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది.
- తీపి తినాలన్న ఆరాటం తగ్గుతుంది.
- పాలల్లో బెల్లం తరుగును వేసి తాగితే ఎముకలు దృఢంగా ఉంటాయి.
- కీళ్లు, ఆర్థ్రరైటిస్ లాంటి ఎముకల బాధలు పోతాయి.
- బెల్లం తింటే బరువు తగ్గుతారు. ఇందులో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది.
- పొటాషియం శరీరంలోని ఎలక్ట్రొలైట్స్‌ను సమతులం చేస్తుంది. కండరాలను పెంచడమేగాక పటిష్టం చేస్తుంది.
- జీవక్రియ సరిగా అయ్యేట్టు సహాయపడుతుంది.
- శరీరంలోని రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అంతేకాదు రక్తంలోని హిమోగ్లోబిన్ ప్రమాణాన్ని పెంచుతుంది.
- ఐరన్, ఫొలేట్‌లు బెల్లంలో బాగా ఉండడం వల్ల రక్తహీనత తగ్గుతుంది. ఎర్రరక్త కణాలు కూడా సాధారణ ప్రమాణంలో కొనసాగుతాయి.
- బెల్లం వాడకం వల్ల శరీరంలోని ఎనర్జీ లెవల్స్ పెరుగుతాయి.
- వైద్యుల సలహా మేరకు గర్భిణులు బెల్లం తింటే ఎంతో మంచిది. ఈ టైములో ఆడవాళ్ళు ఎదుర్కొనే రక్తహీనత, ఐరన్ లేమి సమస్యలు బెల్లం తినడం వల్ల తగ్గుతాయి.
- శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంతో పాటు చర్మ సౌందర్యాన్ని పెంచే విటమిన్లు, మినరల్స్ కూడా ఇందులో ఉన్నాయి.
- మెరిసే చర్మం కావాలనుకునేవాళ్లు నిత్యం కొద్దిగా బెల్లం తినాలి.
- మొటిమలు, మచ్చలు రాకుండా... చర్మం మృదువుగా ఉండేలా చేస్తుంది.
- చర్మం ముడతలు పడడాన్ని తగ్గిస్తుంది. చర్మం మీద మచ్చలను పోగొడుతుంది.
- డార్క్ స్పాట్స్‌ను నిరోధిస్తుంది.
- బెల్లంలోని ఐరన్... శిరోజాలు పటిష్టంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.
- వెంట్రుకలు కూడా బాగా పెరుగుతాయి.
- వెయిట్ లాస్ డైట్‌లో బెల్లం ఎంతో ముఖ్యమైంది.
- జలుబు, దగ్గు, తలనొప్పులకు బెల్లం బాగా పనిచేస్తుంది. గొంతుమంటను తగ్గిస్తుంది.
- బెల్లంలో కేలరీలు కూడా ఎక్కువగా ఉంటాయి కాబట్టి మితంగా తింటే మంచిది. అతిగా తింటే శరీర బరువు పెరిగే అవకాశం ఉంది. బ్లడ్ షుగర్ ప్రమాణాల్లో తేడాలు తలెత్తుతాయి.
- రక్తపోటు, గుండెజబ్బుల రిస్కు తగ్గిస్తుంది.
- కాలేయం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.
- రోజూ కొద్దిగా బెల్లం తినడం వల్ల శ్వాసకోశ సంబంధమైన అస్తమా, బ్రాంకైటిస్ వంటివి తగ్గుతాయి.

కిచెన్‌వేర్

## ఫుడ్ అండ్ మసాలా జార్

ఇక్కడ కనిపిస్తున్న కిచెన్ ప్రోడక్ట్ 'సిక్స్ సెట్ యాక్రలిక్ స్పైస్ సీజనింగ్ ఫుడ్ అండ్ మసాలా జార్'. ఈ జార్‌లో ఆరు మసాలా ఐటమ్స్‌ను ఆరు సెక్షన్లలో భద్రపరచుకోవచ్చు. ఇది కలర్‌ఫుల్ స్పైస్ జార్ కావడంతో చూడడానికి ఎంతో అందంగా కూడా కనపడుతుంది. వంటిట్లో మసాలాల స్టోరేజీకి ఎంతో అనుకూలంగా ఉంటుంది. చిన్నదిగా ఉండి స్పేస్ తక్కువగా ఆక్రమిస్తుంది. పైగా రకరకాల రంగులతో ఈ జార్ ట్రాన్స్‌పరెంట్‌గా ఉండడం వల్ల ఏ మసాలా ఎందులో ఉందో సులభంగా తెలిసిపోతుంది. ఈ సిక్స్ సెట్ జార్ డిజైన్ వివిధ రంగుల్లో ఆకట్టుకునేలా ఉంటుంది. మన్నికైన, పర్యావరణహితమైన ప్లాసిక్‌ని ఈ జార్ తయారీకి ఉపయోగించారు. దీని ఖరీదు: 400/- రూపాయలు.



'శ్రీరామ... నీ నామమెంత రుచిరా..' అని భక్తిపారవశ్యంతో పాడుకోవడమే కాదు... శ్రీరామ నవమికి పసందైన వంటకాలు చేసుకుని... వాటిని ఆరగిస్తూ 'శ్రీరామ... ఎంతో రుచిరా!' అనొచ్చు. నవమి పర్వదినాన... వెరైటీ వంటకాల్ని చేసుకోండి. వాటిని ఆస్వాదిస్తూ తినేయండి...

వంటిల్లు



### కీరదోస పచ్చడి



**కావలసినవి:** కీర దోస -200 గ్రాములు (తొక్క తీసి, తరిగి), పచ్చిమిర్చి- నాలుగు (సన్నగా తరిగి), నూనె- ఒక టీస్పూను, ఆవాలు- పావు టీస్పూను, చింతపండు గుజ్జు- ఒక టీస్పూను, జీలకర్ర- అర టీస్పూను, ఉప్పు- తగినంత.

**తయారీ:**

- పాన్‌లో నూనె వేడెక్కాక కీర దోస ముక్కలు వేసి రెండు నిమిషాలు వేగించాలి.
- వేగిన ముక్కల్ని పక్కకు తీసి ఆవాలు, జీలకర్రను వేగించాలి.
- ఈ మిశ్రమంలో పచ్చిమిర్చి తరుగు, ఉప్పు, చింతపండు గుజ్జు కూడా వేసి కలపాలి.
- వేడి చల్లారాక ఈ ముక్కల్ని బ్లెండర్‌లో వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి.
- అందులో కొద్దిగా ఉప్పు వేసి కలపాలి. ఈ పచ్చడిని వేడి వేడి అన్నంలో లేదా చపాతీలతో తింటే బాగుంటుంది.

### రవ్వ కేసరి

**కావలసినవి:** బొంబాయిరవ్వ- ఒక కప్పు, చక్కెర- ముప్పావు కప్పు, జీడిపప్పు, ఎండుద్రాక్షలు- ఒక టేబుల్‌స్పూను, నెయ్యి- అరకప్పు, యాలకులపొడి- కొద్దిగా, నీళ్లు- నాలుగు కప్పులు.

**తయారీ:**

- జీడిపప్పు, ఎండుద్రాక్షలు నెయ్యిలో వేగించాలి.
- వెడల్పాటి కడాయి తీసుకుని బొంబాయిరవ్వను సువాసన వచ్చేదాకా నెయ్యిలో వేగించాలి.
- వేగించిన రవ్వలో యాలకులపొడి వేసి బాగా కలపాలి.
- ఒక గిన్నెలో నీళ్లు పోసి అవి ఉడుకుపట్టాక, వేగించిన రవ్వను కొద్ది కొద్దిగా పోస్తూ ఉండకట్టకుండా మధ్య మధ్యలో గరిటెతో కలపాలి.
- వేగించిన జీడిపప్పులు ఎండుద్రాక్షలను ఇందులో వేయాలి.
- పంచదారను కూడా ఉడుకుతున్న బొంబాయిరవ్వలో కలపాలి. మిశ్రమం కొద్దిగా జారుగా అవుతుంది. కంగారుపడనవసరం లేదు. దీంట్లో కాస్త నెయ్యి వేయాలి.
- మూత పెట్టి రెండు మూడు నిమిషాలు స్టవ్ మీద ఉడికిస్తే కమ్మటి రవ్వకేసరి తినేయొచ్చు

# శ్రీరామ.. ఎంతో రుచిరా!

### పరుప్పు వడ

**కావలసినవి:** మినపప్పు- ఒక కప్పు, ఉల్లిపాయ తరుగు -ముప్పావు కప్పు, అల్లం- చిన్నముక్క, పచ్చిమిర్చి- రెండు, ఇంగువ- చిటికెడు, కరివేపాకు-కొద్దిగా, కొత్తిమీర-గుప్పెడు, నూనె- వేపుడుకు తగినంత, ఉప్పు- రుచికిసరిపడా.

**తయారీ:**

- మినపప్పు బాగా కడిగి రెండు గంటలు నీళ్లల్లో నానబెట్టాలి.
- పప్పు నానిన తర్వాత నీటిని వడకట్టాలి.
- నానిన మినపప్పు నుంచి కొద్దిగా పప్పు విడిగా తీసి అందులో ఉప్పు వేసి బ్లెండర్‌లో కొన్ని సెకన్లు తిప్పాలి. గ్రైండ్ చేసేటప్పుడు కొన్ని నీళ్లు చిలకరించాలి.
- కచ్చాపచ్చాగా నలిగిన పిండిని ఒక పాత్రలోకి తీయాలి.
- మిగిలిన మినపప్పును మెత్తగా గ్రైండ్ చేయాలి.
- ఈ రెంటిని ఒక గిన్నెలో వేసి బాగా కలపాలి.
- ఇలా చేయడం వల్ల వడలు కరకరలాడతాయి.
- ఈ పిండిలో సన్నగా తరిగిన ఉల్లిపాయ తరుగు, అల్లం, పచ్చి మిర్చి తరుగు, ఇంగువ, కరివేపాకు, కొత్తిమీర వేసి బాగా కలపాలి.
- సన్నని మంటపై కడాయి పెట్టి నూనె పోసి బాగా వేడిచేయాలి.
- పిండిని కొద్దిగా తీసుకుని చేతిపై వడలా చేసి వేడెక్కిన నూనెలో వేయాలి. ఇలా పిండి మొత్తాన్ని వడలుగా చేసి కరకరలాడేట్టు వేగించాలి. వీటిని కొబ్బరి, పల్లీ, టొమాటో చట్నీలతో తింటే ఇంకా రుచిగా ఉంటాయి.



### మ్యాంగో రసగుల్లా

**కావలసినవి:** పనీర్-రెండుకప్పులు, మైదా- ఒక కప్పు, చక్కెర- ఒక కప్పు, మామిడిపండు గుజ్జు- ఒక కప్పు, పాలు- అరకప్పు, మ్యాంగో ఎసెన్స్- అర టీస్పూను, యాలకుల పొడి- అర టీస్పూను, పిస్తా పప్పులు- ఎనిమిది (సన్నగా తరిగి), కుంకుమపువ్వు - కొద్దిగా.

**తయారీ:**

- పనీర్, మామిడిపండు గుజ్జు, మైదాలను మెత్తగా పిండిముద్దలా చేయాలి.
- ఈ పిండిని చిన్న ఉండలుగా చేయాలి.
- ఒక గిన్నెలో రెండు కప్పుల నీళ్లు పోసి వేడిచేయాలి.
- అందులో చక్కెర, యాలకులపొడి వేయాలి.
- అది తీగ పాకంలా అయ్యేవరకూ స్టవ్‌మీద ఉంచి గరిటెతో కలుపుతుండాలి.
- తయారైన పాకం మీద ఏర్పడిన పొరను గరిటెతో మెల్లగా తీసేయాలి.
- ఇందులో చేసి పెట్టుకున్న ఉండల్ని వేసి మూత పెట్టి సన్నటి మంటపై ఉడికించాలి.
- మధ్య మధ్యలో మూత తీసి ఉండలు విరిగిపోకుండా ఉన్నాయా.. లేదా అనేది చూడాలి.
- తర్వాత మ్యాంగో ఎసెన్స్ వేసి స్టవ్ ఆపేయాలి.
- రసగుల్లాలు చల్లారిన తర్వాత వాటిపై పిస్తా పలుకులు, కుంకుమపువ్వు చల్లాలి.
- వీటిని ఫ్రిజ్‌లో పెట్టి తింటే చల్లచల్లగా, తియ్యతియ్యగా ఉండి వేసవి వేడి నుంచి సేద తీరుస్తాయి.

### మెంతి పులావ్



**కావలసినవి:** బియ్యం- 200 గ్రాములు, మెంతి కూర -200 గ్రాములు, నెయ్యి- రెండు టేబుల్‌స్పూన్లు, జీలకర్ర- అర టీస్పూను, లవంగాలు- ఐదు, నల్ల మిరియాలు-పది, యాలకులు-రెండు, దాల్చినచెక్క పొడి- కొద్దిగా, పచ్చిమిర్చి- రెండు, అల్లం-వెల్లుల్లి పేస్టు- ఒక టేబుల్‌స్పూను, పచ్చి బఠానీ గింజలు- అర కప్పు, క్యాప్సికం- ఒకటి (సన్నగా తరిగి), ఉప్పు- రుచికి సరిపడా.

**తయారీ:**

- బియ్యాన్ని అరగంట నీళ్లల్లో నానబెట్టాలి.
- కుక్కర్‌లో నెయ్యి వేడిచేయాలి.
- అందులో జీలకర్ర, నల్లమిరియాలు, యాలకులు, లవంగాలు, దాల్చినచెక్క పొడి వేసి వేగించాలి.
- ఒక నిమిషం అవి వేగాక పచ్చిమిర్చి, బఠానీగింజలు, క్యాప్సికం ముక్కలు, అల్లంవెల్లుల్లి పేస్టు వేయాలి.
- ఇవి ఉడికిన తర్వాత మెంతి కూర వేసి వేగించాలి.
- అందులో బియ్యం, ఉప్పు, నీళ్లు పోసి కుక్కర్ మూత పెట్టి మూడు విజిల్స్ వచ్చే దాకా ఉడికించాలి.
- కాసేపైన తర్వాత కుక్కర్ మూత తీస్తే ఘుమఘుమలాడే మెంతి పులావ్ రెడీ.





పిల్లలూ... 'కింగ్ కాంగ్' సినిమా చూశారా? అందులో గొరిల్లా హీరోయిన్‌ను ఇష్టపడుతుంది. ఒక గొరిల్లా మనిషిని ఇష్టపడటం ఎలా సాధ్యం? అని అనిపించవచ్చు. కానీ చాలా అంశాల్లో ఏప్స్‌కీ, మనుషులకీ పోలికలు ఉంటాయి. జంతువుల్లో తెలివైనవి కూడా అవే. గొరిల్లా, ఒరాంగుటాన్, చింపాజీ, బొనబోస్, గిబ్బన్స్....ఇవన్నీ ఏప్స్ కేటగిరీ కిందకే వస్తాయి. మరి ఏప్స్ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు తెలుసుకుందామా!

# ఏప్స్.. అచ్చం మనలాగే!

- మానవుల్లో మాదిరిగా వీటిలో కూడా ఎ, బి, ఎబి, రక్తవర్గాలున్నాయి.
- వీటి డీఎన్ఎ 98 శాతం మానవులను పోలి ఉంటుంది. అందుకే అవి కూడా జలుబు, ఫ్లూ, న్యుమోనియా వంటి జబ్బుల బారినపడుతుంటాయి.
- మనుషుల్లో ఉండే విధంగా ఏప్స్‌లోనూ ఫింగర్ ప్రింట్స్ ఉంటాయి.
- సాధారణంగా వీటి చేతులు, కాళ్లకన్నా పొడవుంటాయి.
- ప్రతిరోజూ 40 పౌండ్ల ఆహారాన్ని జీర్ణించుకుంటాయి. ఇవి పండ్లు, మొక్కలను ఆహారంగా తీసుకుంటాయి.
- గొరిల్లాలు, చింపాజీలు తల్లిపై ఎక్కువ కాలం ఆధారపడతాయి.
- గొరిల్లాలో గర్భధారణ కాలం తొమ్మిదినెలలు ఉంటుంది. మూడు నుంచి నాలుగు పౌండ్ల బరువున్న శిశువులకు జన్మనిస్తాయి.
- జంతువుల్లో ఎక్కువ బాల్యం ఒరాంగుటాన్‌లో ఉంటుంది. ఆరేళ్ల వరకు బేబీ ఒరాంగుటాన్ తల్లి సంరక్షణలోనే ఉంటుంది.
- మనుషుల్లో మాదిరిగా ఏప్స్‌లోనూ అభివృద్ధి చెందిన మెదడు ఉంటుంది. టీవీ చూడటాన్ని, ఆటలు ఆడటాన్ని ఏప్స్ ఇష్టపడతాయి.
- ఏప్స్‌లో అతి చిన్నది గిబ్బన్. పెద్దది గొరిల్లా.



## టిర్‌హేనియన్ సముద్రం!

టిర్‌హేనియన్ సముద్రం మెడిటేరియన్ సముద్రంలో భాగం. ఇటలీ, ఫ్రాన్స్ దేశాలు ఈ సముద్రంతో తీరప్రాంతం కలిగి ఉన్నాయి. కోర్సికా, సర్డినియా, సిసిలీ ద్వీపకల్పాలకు మధ్యన, లిగురియన్, లోనియన్ సముద్రాలతో అనుసంధానమై ఉంటుంది. ఎల్బా, ఇవోలీ ద్వీపకల్పాలు ఇందులో ఉన్నాయి. దీని లోతు 12 వేల అడుగులు.

## షుగర్ క్యాండీ తయారీ!


**కావలసిన వస్తువులు:**
టూత్‌పిక్
క్లాత్ క్లిప్
మంచి నీళ్లు - 1 కప్పు
పంచదార- 3 కప్పులు
పొడవైన గాజు సీసా

**ప్రయోగం చేసే విధానం!**

- కడాయిలో నీళ్లు పోసి పొయ్యిమీద మరగబెట్టాలి.
- మరిగిన నీళ్లలో కొంచెం కొంచెం పంచదార పోస్తూ పూర్తిగా కరిగేలా తిప్పాలి.
- ద్రావణాన్ని పూర్తిగా చల్లారనివ్వాలి.
- తరువాత జాగ్రత్తగా సీసాలో పోయాలి.
- టూత్‌పిక్‌ను క్లాత్‌క్లిప్ మధ్యలో ఉంచి సీసా మూతి పై భాగంలో ఉంచాలి. టూత్‌పిక్ కింది భాగం సీసాలో అడుగు భాగానికి కొంచెం పైకి అందేలా వేలాడుతూ ఉండాలి.
- ఈ సీసాను జాగ్రత్తగా భద్రపరచాలి. 3 నుంచి 7 రోజుల్లో షుగర్ క్యాండీ తయారవుతుంది.




## అందమైన లోకం.. అల్లకల్లోలం!




రెండో ప్రపంచ యుద్ధ మేఘాలు కమ్ముకున్న సమయం అది. దక్షిణ ఫ్రాన్స్‌లో మారుమూల ఊరు. ప్రకృతికి నిలయమైన ఆ ప్రదేశంలో ఓ పిల్లాడు ఉండేవాడు. ఆటిజమ్ డిజార్డర్‌తో బాధపడేవాడు. ఏదీ సరిగ్గా అర్థం చేసుకోలేడు. ఎవరితోనూ సరిగ్గా మాట్లాడలేడు కూడా. ఎంతో అల్లారుముద్దుగా పెరుగుతున్న ఆ పిల్లాడికి చుట్టూ ఉండే ప్రకృతి అంటే చాలా ఇష్టం. జంతువులు, పక్షులను ఎంతో ప్రేమిస్తాడు. వాటికి ఏం జరిగినా తట్టుకోలేడు. ముఖ్యంగా తన ఇంటికి సమీపంలోని సరస్సులో వాలే ఫ్లెమింగోలంటే మరీనూ! అతని కళ్ల ముందు ప్రపంచం ఒక్కసారిగా ముక్కలవుతుంది. ఆటీ జర్మనీ సైనికుల వల్ల. వాళ్లంతే పట్టణాన్ని ధ్వంసం చేస్తారు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే 'ఫ్లెమింగో బోయ్' పుస్తకం ఇతివృత్తం. మైఖేల్ మోర్పుర్గో రచించిన ఈ నవల ఇటీవలే మార్కెట్లోకి విడుదలైంది. ముఖ్యంగా పిల్లల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. మనుషులకూ, జంతువులకూ ఉండే అనుబంధాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశాడు మైఖేల్.

## పటంలో గుర్తించండి?

ఈ పటంలో నంబర్ల స్థానంలో ఉన్న ప్రసిద్ధ కోటలను గుర్తించండి?




**టీచర్:** బంటీ! హోటల్ స్పెల్లింగ్ రాయమంటే HOEL మాత్రమే రాశావు. T ఏమైంది?
**బంటి:** తాగేశాను టీచర్.
**టీచర్:** !!!



**వెంగళప్ప:** ఈ డాక్టర్ గతంలో హోటల్‌లో పనిచేసి ఉంటాడని నా నమ్మకం రా!
**వీరేశం:** అంత కరెక్ట్‌గా ఎలా చెప్పగలవు?
**వెంగళప్ప:** ఇందాక ఇంజెక్షన్ చేశాక డబ్బులు లేవంటే క్లినిక్‌లో టవల్స్ ఉతికించాడు.
**వీరేశం:** !!!

## క్విజ్

మతం, వాటిని స్థాపించిన వ్యక్తులను జతచేయండి

| | |
|---|---|
| 1) బౌద్ధమతం | ఎ) అక్బర్ |
| 2) అద్వైత సిద్ధాంతం | బి) రామానుజాచార్యులు |
| 3) విశిష్టాద్వైత సిద్ధాంతం | సి) శంకరాచార్యులు |
| 4) మొదటి సిక్కు గురువు | డి) పార్శ్వనాథుడు |
| 5) దీన్-ఇ-ఇలాహి | ఇ) గౌతమబుద్ధుడు |
| 6) జైనమతం | ఎఫ్) గురునానక్ |




## సరైన నీడను గుర్తించండి





### సమాధానాలు

క్విజ్
1- ఇ, 2- సి, 3- బి, 4- ఎఫ్, 5- ఎ, 6-డి
పటంలో గుర్తించండి?
1- ఝాన్సీ కోట
2 - దౌలతాబాద్ ఫోర్ట్
3 - గోల్కొండ కోట
4 - మైసూర్ ప్యాలెస్



పేపర్ కళ

## బబ్లీ బన్నీ!

స్టెప్ 1: ఎ4 కాగితాన్ని బొమ్మలో చూపించిన విధంగా మడవండి. మళ్లీ అన్‌ఫోల్డ్ చేయండి.
స్టెప్ 2: స్టెప్ 1నే రిపీట్ చేయండి. అయితే సారి వేరే వైపు ఇలా చేయాలి. మళ్లీ మడతలు తీసేయండి.
స్టెప్ 3: కాగితాన్ని ఈ సారి సగానికి మడవండి, మళ్లీ అన్‌ఫోల్డ్ చేయండి.
స్టెప్ 4: త్రిభుజాకారం వచ్చేలా కాగితాన్ని చిత్రంలో చూపించిన విధంగా ఫోల్డ్ చేయండి. అప్పుడు మీకు త్రిభుజాకారంలోకి కాగితం మారతుంది.
స్టెప్ 5: మళ్లీ డైమండ్ ఆకారంలోకి మారేలా అడుగు ఉన్న కాగితాన్ని పైకి మడవండి. (చిత్రంలో చూడండి)
స్టెప్ 6: డైమండ్ షేప్ కుడి, ఎడమభాగాలను మరొక్కసారి మడవండి.
స్టెప్ 7: కాగితాన్ని రివర్స్ చేసి మిగిలి ఉన్న కుడి ఎడమ భాగాలను లోపలికి ఫోల్డ్ చేయండి (బొమ్మలో చూడండి)
స్టెప్ 8: కాగితాన్ని ఫ్లిప్ చేయండి.
స్టెప్ 9: మళ్లీ డైమండ్ ఆకారంలోకి మరేలా కాగితాన్ని ఫ్లిప్ చేయండి.
స్టెప్ 10: మరొక్కసారి కాగితాన్ని ఫ్లిప్ చేయండి. కుడివైపు భాగాన్ని వెనుకవైపునకు మడవండి.
స్టెప్ 11: చిత్రంలో చూపించిన విధంగా మడవండి.
స్టెప్ 12: మళ్లీ కాగితాన్ని ఫ్లిప్ చేసి, కుడివైపునకు మడవండి (చిత్రంలో చూడండి)
స్టెప్ 13: ఎడమవైపు భాగాన్ని కుడివైపునకు తిప్పండి
స్టెప్ 14: ఎడమవైపు భాగాన్ని మధ్యలోకి మడవండి
స్టెప్ 15: మళ్లీ ఎడమవైపు భాగాన్ని వెనుకవైపునకు తిప్పండి (చిత్రంలో చూడండి)
స్టెప్ 16: చిత్రంలో చూపించిన విధంగా రెండు కాగితం చివరి భాగాలను విడదీయండి
స్టెప్ 17: చిత్రంలో చూపించిన విధంగా మడవండి
స్టెప్ 18: అప్పుడు సూది ఉన్న వైపు రంధ్రం ఏర్పడుతుంది. దాంట్లో గాలి ఊదండి. అప్పుడు కుందేలు తల ఆకారంలోకి వస్తుంది.
స్టెప్ 19: అందంగా కళ్లు, ముక్కు, నోరు గీయండి. అంతే కుందేలు రెడీ!




కొమడో డ్రాగన్స్ ఒక నిమిషం కన్నా తక్కువ సమయంలో 5 పౌండ్ల మాంసం తినేస్తాయి. ఎక్కువగా తీసుకున్న ఫ్యాట్‌ను అవి తోకలో నిలువ చేసుకుంటాయి.

భళా





ఎరుపు చుక్కలకు తగలకుండా..
దారి కనుక్కోండి

## ద్వంద్వ సాక్ష్యం

ఒక గ్రామపెద్ద గుర్రాన్ని కొత్వాలు దొంగిలించి, చాలా పొడుగుగా ఉండే దాని తోక కత్తిరించి పొట్టిచేసి తన ఇంటి పెరట్లో కట్టేసుకున్నాడు. గుర్రం ఎక్కడిదని చూసినవాళ్లు అడిగితే దూర గ్రామం నుంచి కొనితెచ్చానన్నాడు.

కొత్వాలు ఇంటికి వెళ్లిన గ్రామపెద్ద, తన గుర్రాన్ని చూసి గుర్తించి, న్యాయాధికారి వద్ద కొత్వాలు మీద ఫిర్యాదు చేశాడు. "మీ గుర్రాన్ని గుర్తించ



గలవారెవరైనా ఉన్నారా?" అని న్యాయాధికారి అడిగితే, గ్రామపెద్ద తన గుర్రాన్ని ఊరి దుకాణదారు బాగా తెలుసన్నాడు.

న్యాయాధికారి దుకాణదారుడను పిలిపించి "నీకు గ్రామపెద్ద గారి గుర్రం బాగా తెలుసా" అన్నాడు.

వెంటనే కొత్వాలు, "గ్రామపెద్ద గారి గుర్రం తోక చాలా పొడుగని దుకాణదారుకు మాత్రం తెలియదా?" అన్నాడు.

దుకాణదారుడు చిక్కుల్లో పడ్డాడు. అతను గుర్రం చుట్టూ ఒకసారి తిరిగి వచ్చి, "అయ్యా ఈ గుర్రాన్ని ముందు నుంచి చూస్తే గ్రామపెద్దగారిదిలాగుంది. వెనుక నుంచి చూస్తే మరి కొత్వాలుగారిదిలాగుంది," అన్నాడు.

అందరూ గొల్లున నవ్వారు. న్యాయాధికారి ఆ గుర్రం గ్రామపెద్దదేనని తీర్పు చెప్పాడు.

(చందమామ సౌజన్యంతో)

## జాతీయ పుష్పం

తామర మన జాతీయ పుష్పం. దీని శాస్త్రీయ నామం నెలుంబో న్యూసిఫెరా గెయార్టిన్. బురద గుంటల్లో పెరిగినా అందంగా వికసిస్తుంది. పవిత్రత, సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తుంది.



విభిన్నం



బైబిల్... క్రైస్తవుల పవిత్ర గ్రంథం. దీనికి శాశ్వత రూపం కల్పించాలన్నది వరంగల్‌లోని రిటైర్డ్ ఉద్యోగి **వడ్డేపల్లి గోపాల్** సంకల్పం. అనుకున్నదే తడవుగా ఆ ఆలోచనలకు ఆయన రూపం ఇచ్చారు. ఎప్పటికీ చెరిగిపోని విధంగా ఇత్తడి రేకులపై బైబిల్‌ను నిక్షిప్తం చేస్తున్నారు. దాని ప్రత్యేకతేంటో గోపాల్ మాటల్లోనే...

# బైబిల్ గోపాల్!

సరిగ్గా పన్నెండేళ్ల కిందట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ చేశాను. ఉద్యోగ బాధ్యతల్లో ఇన్ని రోజులూ తీరిక లేకుండా గడిపిన నాకు ఒక్కసారిగా ఖాళీ దొరికే సరికి ఏంచేయాలో తోచలేదు. పలుమార్లు బైబిల్ చదివాను. అప్పుడే ఒక ఆలోచన వచ్చింది. ఈ పవిత్ర గ్రంథాన్ని ఎప్పటికీ గుర్తుపెట్టుకొనేలా రూపొందిస్తే ఎలా ఉంటుందని! అలా 2010 అక్టోబర్‌లో తొలిసారిగా ఎగ్జిక్యూటివ్ బాండ్ పేపర్‌పై బైబిల్ రాయడం మొదలుపెట్టాను. అలా రాసే సరికి మొత్తం 1,029 పేజీలు వచ్చింది. ఈ పుస్తకం బరువు 20 కిలోలు. మొదలు పెట్టిన ఏడాదిన్నరకు... అంటే 2012 జూన్‌లో పుస్తకం పూర్తయింది. ఆ పుస్తకంలో క్రీస్తు మాటలను ఎరుపు రంగులో, కీర్తనలను ఆకుపచ్చ రంగులో, వివరణలను నీలి రంగుతో రాశాను. కానీ నాకు అంతటితో తృప్తి అనిపించలేదు. అందుకే ఆ తరువాత 26 మంది రచయితలు రాసిన 626 క్రీస్తు కీర్తనలతో 'క్రైస్తవ కీర్తనలు' అనే గ్రంథం రాశాను.

**విభిన్నం... శాశ్వతం...**

వరంగల్‌లోని రంగంపేటలో నేను ఉంటున్నా. 1982లో వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో అటెండర్‌గా ఉద్యోగంలో చేరాను. రచయితగా, గాయకుడిగా, శిల్పిగా, చిత్రకారుడిగా విభిన్న కళల్లో నాకు ప్రవేశం ఉంది. అవన్నీ ఎప్పుడో అప్పుడు నా ప్రయాణంలో ఉపయోగపడుతూనే ఉంటాయి. బైబిల్ రాస్తున్న తరుణంలో ప్రపంచంలో ఎవరూ చేయని విధంగా పవిత్ర గ్రంథాన్ని విభిన్నంగా అందించాలనుకున్నాను. అది ఎలాంటి వాతావరణం, పరిస్థితుల్లోనైనా చెక్కుచెదరకుండా ఉండాలనేది నా అభిలాష. అందుకే కలకాలం ఉండేలా ఇత్తడిని ఎంచుకున్నా. గత ఏడాది జూన్‌లో బాల్‌పాయింట్ పెన్నుతో ఇత్తడి రేకులపై బైబిల్ రాయడం మొదలుపెట్టాను. ఇప్పటి వరకు 266 పేజీలు అయ్యాయి. మరో 800 పేజీలు రాయాల్సి ఉంది. మొత్తం 1,062 పేజీల్లో ఇత్తడి బైబిల్ తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాను. ఇది సుమారు 45 కిలోల బరువుంటుంది. నా శ్రమ మాట అటుంచితే, ఒక్క ఇత్తడికి రూ.60 వేలు ఖర్చయింది.

**దైవ భక్తే నడిపిస్తోంది...**

ఇలా చేతి రాతలో బైబిల్ రాయడం ఎందుకని కొందరు అడిగారు. దానికి నా జవాబు ఒక్కటే... క్రీస్తు ప్రేరణతోనే క్రైస్తవ సమాజానికి ఏదైనా చేయాలనే తపనతో బైబిల్‌ను చేతి రాతతో రాస్తున్నా. గతంలో 'సంఖ్యల




ప్రాధాన్యం, యేసేబు కథతో కలవరం, నయమాను కుష్ఠు రోగి, ప్రార్థన, కృప' పుస్తకాలను రాశాను. దైవ భక్తే నన్నిలా నడిపిస్తోంది. భగవంతుడి కృప ఉంటే... మరిన్ని రూపాల్లో బైబిల్‌ను లిఖించేందుకు ప్రయత్నించాలన్నది నా ఉద్దేశం. ఈ బైబిల్‌ను చదవాలనుకొనేవారు ఎవరైనా సరే... రంగంపేటలో నా ఇంటికి రావచ్చు. వివరాలకు నా సెల్ నెంబర్ 94910 65030.

• **కక్కెర్ల అనిల్‌కుమార్‌గౌడ్,** వరంగల్ రూరల్
ఫొటోలు: సంపెట సుధాకర్‌గౌడ్

---

వైరల్

ఇంకో గంటలో పరీక్ష.... మెదడును తినేసే ఒత్తిడి.. రేపు ఏంటి? అనే ఆందోళన? ఒకవేళ పరీక్ష పాసైతే... ! ఫర్లేదు. కానీ పాసైనా, మంచి మార్కులు రాకపోతే? అసలు ఏకంగా ఫెయిలైపోతే? బుర్ర హీటెక్కిపోయింది అతనికి. అందుకే ప్రశ్నించాలనుకున్నాడు. అందుకే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు.... ర్యాంకుల వెంట పరుగులెత్తే ఈ విద్యావిధా






నాన్ని ప్రశ్నించాడు. తక్షణ మార్పు వస్తుందనుకోవడం అత్యాశే. కానీ కనీసం తన బాధను వెళ్లగక్కాలనుకున్నాడు. దీని కోసం సోషల్ మీడియాను వేదికగా చేసుకొన్నాడు. ముంబయికి చెందిన విద్యార్థి చేసిన ఆ ఫేస్‌బుక్ పోస్ట్ ఇలా సాగింది...

"'త్రీ-ఇడియట్స్' సినిమా చూశాక ఈ కాలేజీల వైఖరిలో మార్పు వస్తుందని ఆశించాను. కానీ నాదంతా వట్టి భ్రమేనని అర్థం కావడానికి ఎంతో కాలం పట్టలేదు. ఇంకా మా (విద్యార్థుల) పరిస్థితి ఇంకా 'ప్రెషర్‌కుక్కర్'లానే ఉంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఒక పిల్లాడికి బ్యాట్‌మ్యాన్ కామిక్ బుక్ చదవమని చెబితే హ్యాపీగా తిరగేస్తాడు. కానీ దాని మీద పరీక్ష పెడితే మాత్రం ఆ కామిక్ బుక్ మీదే అతనికి ద్వేషం పుడుతుంది. పరీక్షలు, ర్యాంకులు ఎందుకు? మమ్మల్ని ఇంకా క్రుంగదీయడానికా? నేను సింగర్, డాన్సర్, ఫిలిం డైరెక్టర్ కావాలనుకుంటే నాకివి ఏ విధంగా పనికివస్తాయి? అసలు మేం నేర్చుకొనే పైథాగరస్ సిద్ధాంతం జీవితంలో ఏ సందర్భంలోనైనా ఉపయోగపడుతుందా? అసలు సైడ్స్ ఆఫ్ స్క్వేర్‌ను బలవంతంగా నేర్చుకోవాల్సిన అవసరం మాకేంటి? ఏమో మీరు అనుకున్న దారిలో కాకపోవచ్చు. మీరు ఊహించని రీతిలో మేం మంచి పేరు తెచ్చుకోవచ్చేమో! మమ్మల్నిలా వదిలేయండి. అయినా, నాకు గంటలో పరీక్ష మొదలవుతుంది. నేను వెళ్లాలి" అంటూ ముగించాడు ఆ విద్యార్థి. దీనికి కామెంట్లు పోటెత్తాయి. "మా తరం దీని గురించి చేసేదేం లేదు. ఇంక అంతా మీ యువతరం చేతుల్లోనే ఉంది" అని ఒకరు స్పందించారు. మరొకరైతే- "ఈ పరిస్థితి ప్రతి భారతీయ విద్యార్థి ఎదుర్కొనేదే" అంటూ కామెంట్ చేశారు. మొత్తానికి పరీక్షలు, మార్కుల వేటలో ఒత్తిడి పెంచుతోన్న ప్రస్తుత విద్యావ్యవస్థపై ఈ పోస్ట్ మరోసారి చాలా అంశాలను చర్చకు తెచ్చింది.

---

# నడుము నొప్పికి నల్లతుమ్మ

మీకు మీరే డాక్టర్!



- ఎండిన నల్ల తుమ్మ కాయలు, బెరడు, బంక ఈ మూడింటినీ సమంగా కలిపి చూర్ణం చేసుకుని, ఒక స్పూను మోతాదులో రోజూ రెండు పూటలా తీసుకుంటూ ఉంటే, నడుము నొప్పి తగ్గుతుంది. నడుముకు శక్తీ, బలమూ కలుగుతాయి.
- పూటకు పావు కప్పు లేత నల్ల తుమ్మ ఆకుల రసాన్ని మూడు పూటలా సేవిస్తే, బహిష్టు సమయంలో వచ్చే రక్తస్రావం ఆగిపోతుంది.
- చెట్టు బెరడు కషాయాన్ని పుక్కిలించినా, లేదా ఈ చెట్టు నుంచి తీసిన చిన్న బంక ముక్కను నోట్లో ఉంచుకున్నా, నోటిలోని అల్సర్లు మానిపోతాయి.
- అర తులం బంక చూర్ణాన్ని అరకప్పు ఆవు పాలలో కలిపి రెండు పూటలా తీసుకుంటే, విరిగిన ఎముకలు త్వరగా అతుకుతాయి. నల్ల తుమ్మ చెట్టు కాయల చూర్ణం తీసుకున్నా ఇదే ప్రయోజనం కలుగుతుంది.
- గింజ పట్టని, లేత కాయలను నీడన ఎండించి చూర్ణం చేసుకోవాలి. ఆ చూర్ణానికి సమానంగా ఖండశర్కర పొడి కలిపి, పూటకు రెండు స్పూన్ల చొప్పున నీటితో సేవిస్తూ ఉంటే పలుచబడిన వీర్యం చిక్కబడుతుంది.

## డైలీ సుడోకు - 139

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 9 | 2 | | 1 | | | 4 | |
| 7 | | | | 2 | 5 | 3 | 9 | 6 |
| | | 3 | 8 | | | | 2 | |
| 6 | 4 | 9 | | | | 5 | 8 | |
| 8 | 5 | | | | | | 3 | 2 |
| | 3 | 1 | | | | 4 | 7 | 9 |
| | 8 | | | | 9 | 2 | | |
| 3 | 7 | 6 | 2 | 5 | | | | 4 |
| | 2 | | | 3 | | 7 | 6 | |

**ఎలా పూరించాలి?**

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 138 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 4 | 8 | 7 | 2 | 5 | 3 | 6 | 1 |
| 7 | 3 | 6 | 9 | 1 | 8 | 4 | 5 | 2 |
| 2 | 5 | 1 | 3 | 4 | 6 | 8 | 9 | 7 |
| 3 | 9 | 2 | 5 | 7 | 4 | 6 | 1 | 8 |
| 1 | 8 | 4 | 2 | 6 | 3 | 9 | 7 | 5 |
| 6 | 7 | 5 | 8 | 9 | 1 | 2 | 3 | 4 |
| 8 | 2 | 7 | 1 | 3 | 9 | 5 | 4 | 6 |
| 4 | 1 | 9 | 6 | 5 | 2 | 7 | 8 | 3 |
| 5 | 6 | 3 | 4 | 8 | 7 | 1 | 2 | 9 |

# ఏం ఉన్నావమ్మా?

ఎంతోమంది యువకుల కలల రాణి తమన్నా! అందానికి ఆధార్ కార్డులా... కేరాఫ్ అడ్రస్సులా... ప్రతి సినిమాలోనూ తళ తళ తెల్లగా మెరిసే మిల్కీ బ్యూటీని తమిళ సినిమా 'కన్నే కలైమానే'లో చూసినోళ్ళంతా 'ప్రియతమా... ఏం ఉన్నావమ్మా?' అంటున్నారు. అందులో వ్యంగ్యమూ... వింత అర్థమూ... రెండూ ఉన్నాయి. కావాలంటే ఒక్కసారి ఇన్‌సెట్ ఫొటో చూడండి! ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటిస్తున్న 'కన్నే కలైమానే' ఫస్ట్‌లుక్ అది! 'వాట్ ఎ ఫర్‌ఫెక్ట్ వే టు స్టార్ట్ మై డే' అని సోషల్ మీడియాలో తమన్నా పోస్ట్ చేశారు. డీ-గ్లామర్ లుక్‌లో ఆమెను చూసి ప్రేక్షకులు ఒకింత షాకయ్యారు. ఇదేమీ తొలిసారి కాదు... తమన్నా డీ-గ్లామర్ లుక్‌లో నటించడం! ప్రభుదేవా సరసన నటించిన 'అభినేత్రి'లో ఇంచుమించు ఇటువంటి లుక్‌లోనే కనిపించారు. విజయ్ సేతుపతి హీరోగా నటించిన తమిళ సినిమా 'ధర్మదురై'లోనూ ఇంతే. చీరకట్టులో మేకప్ లేకుండా కనిపించారు. ఇప్పుడీ 'కన్నే కలైమానే'! తెలుగులో ఎక్కువగా గ్లామర్ పాత్రల్లో కనిపించే తమన్నా... తమిళంలో మాత్రం ఇందుకు భిన్నమైన పాత్రలు చేస్తున్నారు.



తమన్నా

# 'ట్యాక్సీవాలా' ఫస్ట్ గేర్

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ట్యాక్సీవాలా'. ప్రియాంక జవాల్కర్, మాళవిక నాయర్ కథానాయికలు. రాహుల్ సాంకృత్యన్ దర్శకుడు. యు.వి క్రియేషన్స్, జీఏ2 పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. శుక్రవారం 'ట్యాక్సీవాలా ఫస్ట్ గేర్' పేరుతో ఓ వీడియోను విడుదల చేశారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమాను వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. త్వరలో టీజర్‌ను విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.



# నా ఆరేళ్ల వయసులో రేప్ చేశాడు



డైసీ ఇరానీ

అనేక హిందీ, తమిళ సినిమాల్లో బాల నటిగా నటించిన డైసీ ఇరానీ తన బాల్యంలో ఎదురైన లైంగిక వేధింపులను వెల్లడించారు. ఆరేళ్ల వయసులో ఓ సినిమా షూటింగ్ కోసం మద్రాస్ వెళ్లినప్పుడు..తనకు సంరక్షకుడుగా ఉన్న వ్యక్తే తనను రేప్ చేశాడని ఆమె తెలిపారు. 'అప్పుడు నాకు ఆరేళ్లు. హమ్ పాంచీ ఏక్ దాల్ సినిమా షూటింగ్ కోసం ఓ సంరక్షకుడితో కలిసి మద్రాస్ వెళ్లాను. హోటల్ గదిలో అతను నన్ను బెల్టుతో కొట్టాడు. నన్ను రేప్ చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అప్పుడు నేను అనుభవించిన బాధ ఇంకా గుర్తుంది' అని 60ఏళ్ల డైసీ ఇరానీ ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'ఆ వ్యక్తి ఇప్పుడు లేడు. చనిపోయాడు. అతని పేరు నవాజ్. అప్పట్లో ప్రముఖ గాయకుడైన జోహ్రాభాయ్ అంబాలేవాలీకి బంధువు. ఔట్‌డోర్ షూటింగ్‌లకు వెళ్లాల్సి వచ్చినప్పుడు నాకు గార్డియన్‌గా నవాజ్‌ను మా అమ్మ నియమించింది' అని డైసీ ఇరానీ గుర్తుచేసుకున్నారు. 'మా అమ్మ నన్ను హీరోయిన్ చేయాలనుకుంది. నన్ను స్టార్‌గా చూడాలనుకుంది.అప్పుడు నాకు 15 ఏళ్లు. నాకు చీరకట్టి, ఛాతి భాగంలో ప్యాడింగ్‌లు పెట్టి.. ఓ నిర్మాత దగ్గర వదిలిపెట్టి వెళ్లిపోయింది. సోఫాలో నా పక్కన కూర్చొన్న ఆ నిర్మాత, నన్ను తడమటం మొదలెట్టాడు. అతని బుద్ధి నాకు అర్థమైంది. వెంటనే ఆ స్పాంజ్‌లను అతని చేతిలో పెట్టాను. దీంతో అతను భయపడిపోయాడు. నన్ను నేను కాపాడుకోవడానికి అప్పుడు అంతకంటే నాకేం తోచలేదు' అని కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న వేధింపులను డైసీ ఇరానీ వివరించారు.



అల్లు అర్జున్

# సారీ... లేట్ అయింది!

**- దేవిశ్రీ ప్రసాద్**

"సోషల్ మీడియాలో ఇన్‌స్టాగ్రామ్‌దే ఇప్పుడు హవా. లేటెస్ట్‌గా ఏది ట్రెండింగ్‌లో ఉంటే, అందులో తన హవాను చూపించడం అల్లు అర్జున్ ప్రత్యేకత. ఆ మధ్య ఆయన ఇన్‌స్టాలో దేవిశ్రీ ప్రసాద్ గురించి ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. దేవిశ్రీప్రసాద్ ఫొటోను పోస్ట్ చేసి 'ఏం వాయిస్తున్నావన్నది కాదు (వాయిద్యాల కూర్పు కాదు), ఏం వినిపిస్తున్నావన్నదే సంగీతం" అని రాశారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం విన్నాక ఈ వాక్యాన్ని తాను సృష్టించినట్టు కూడా అందులో తెలిపారు. ఈ ఫొటోను తాజాగా దేవిశ్రీ చూసి స్పందించారు. లవ్లీ పోస్ట్ పెట్టినందుకు అల్లు అర్జున్‌కి థాంక్స్ చెప్పారు. బన్నీ పెట్టిన పోస్ట్‌ను కాస్త ఆలస్యంగా చూసినందుకు క్షమాపణలు చెప్పారు. 'హౌ స్వీట్ ఆఫ్ యు బన్నీ భాయ్' అని కూడా అందులో రాశారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన పాటలన్నీ ప్రేక్షకాదరణ పొందినవే కావడం విశేషం.

# మేలో ముహూర్తం!


ప్రతి సినిమాలోనూ పాత్రకు తగ్గట్టు కొత్తగా కనిపించాలని ప్రయత్నించే హీరోల్లో మంచు మనోజ్ ఒకరు. త్వరలో ప్రారంభం కానున్న కొత్త సినిమాలో సరికొత్తగా కనిపించడానికి ప్రస్తుతం ఆయన కసరత్తులు చేస్తున్నారు. 'ఒక్కడు మిగిలాడు' తర్వాత చిన్న విరామం తీసుకున్న ఈ యువ హీరో, ఇప్పుడు కొత్త సినిమా కథా చర్చల్లో ఉన్నారు. చందూ అనే యువకుణ్ణి దర్శకుడిగా పరిచయం చేస్తూ, మనోజ్ హీరోగా నటించబోయే ఈ సినిమా మే నెలలో ప్రారంభం కానుందని తెలుస్తోంది. పూజా కార్యక్రమాలతో పాటు రెగ్యులర్ షూటింగ్ కూడా అదే నెలలో ప్రారంభించాలని అనుకుంటున్నారట! 'ఒక్కడు మిగిలాడు'లో కెప్టెన్ పాత్ర కోసం బరువు పెరిగిన మనోజ్, ఈలోపు కొత్త మేకోవర్‌లోకి వచ్చేస్తారట!




మంచు మనోజ్

# ఆలియాభట్‌కు గాయాలు...

బాలీవుడ్ బ్యూటీ ఆలియాభట్‌కు గాయాలయ్యాయి. తాజాగా ఆమె అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ సరసన 'బ్రహ్మాస్త్ర' చిత్రంలో నటిస్తోంది. నలభై రోజుల క్రితం బల్గేరియాలో చిత్రీకరణ ప్రారంభమైంది. అక్కడ సినిమాకు అత్యంత కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెకిస్తున్నారు. ఓ స్టంట్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో అలియా భుజానికి, మణికట్టుకి గాయమైందట. అయినప్పటపికీ అలియా కట్టు కట్టుకుని షూటింగ్‌కి వచ్చిందట. భుజానికి బలమైన గాయం కావడంతో వైద్యులు నాలుగు వారాలు బెడ్‌రెస్ట్ తీసుకోమన్నారని చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. తనకెంతో ఇష్టమైన బల్గేరియాలో షూటింగ్ అనగానే ఎగిరి గంతేసింది ఆలియా. ముంబై ఎయిర్‌పోర్ట్‌లో బయలుదేరినప్పటి నుంచీ బల్గేరియా చేరుకునే వరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు షేర్ చేసిన విషయం తెలిసిందే. బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు.



ఆలియాభట్




# జీనత్ అమన్ ఆరోపణ... అరెస్టు



జీనత్ అమన్

సినీ తారలపై లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయి. బాలీవుడ్ నాటితరం నటి జీనత్ అమన్ చేసిన ఫిర్యాదుతో సర్ఫరాజ్ అలియాస్ అమన్ ఖన్నా అనే వ్యాపారిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ ఆస్తి ఒప్పందానికి సంబంధించి రూ.15.40 కోట్లు మోసం చేయడమే కాకుండా, తనపై అత్యాచారం చేశాడని సర్ఫరాజ్‌పై ఆమె ఆరోపించారు. 'జీనత్ అమన్ గురువారం రాత్రి జుహూ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు ఆధారంగా నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టాం. కేసును క్రైం బ్రాంచ్‌కు అప్పగించాం. దర్యాప్తు కొనసాగుతుంది' అని డీసీపీ క్రైం నిసార్ తంబోలి తెలిపారు. తన వెంటపడి వేధిస్తున్నాడంటూ ఈ ఏడాది జనవరిలో కూడా జీనత్ సర్ఫరాజ్‌పై ఓ కేసు పెట్టారు. ఆ కేసులో అరెస్టైన ఆయన నెలరోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. తాజాగా జీనత్ సర్ఫరాజ్‌పై రేప్, చీటింగ్ ఆరోపణలు చేశారు.

# 'ప్రశ్నిస్తా'రట!



"'ప్రశ్నిస్తా' అనే పదంలోనే ఎన్నెన్నో అర్థాలున్నాయి. మా సినిమాలో ఎవరు ఎవరిని ప్రశ్నిస్తారు? ఏమని ప్రశ్నిస్తారు? అసలు ప్రశ్నించాల్సిన అవసరం ఎందుకొచ్చింది? వంటి అంశాలు కీలకం" అని అంటున్నారు రాజా వన్నెంరెడ్డి. ఆయన దర్శకత్వం వహిస్తోన్న 'ప్రశ్నిస్తా' ఇటీవల హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి 'జెమిని' కిరణ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. బాబి క్లాప్‌కొట్టారు. బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత సత్యారెడ్డి మాట్లాడుతూ "మా అబ్బాయిని హీరోగా పెట్టి చేస్తున్న చిత్రమిది. కమర్షియల్ హంగులన్నీ ఉంటాయి. సందేశం ఉంటుంది. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుగుతోంది. ఒక పది రోజులు గ్యాప్ తర్వాత మరో షెడ్యూల్ చేస్తాం. ఆ తర్వాత ఫారిన్‌లో ఔట్‌డోర్‌లో చిత్రీకరిస్తాం" అని అన్నారు. ఐదు పాటలుంటాయని సంగీత దర్శకుడు ప్రేమ్ తెలిపారు. మంచి పాత్రల్లో నటిస్తున్నట్టు హీరో మనీష్‌బాబు, నాయిక అక్షిత తెలిపారు. ఈ చిత్రానికి సమర్పణ: బి.శేషుబాబు, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: సతీష్ రెడ్డి, సహ నిర్మాతలు: కె.నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి.

# వినోదం అప్పుడు.. ఇప్పుడు!



సుజన్, తనిష్క్

సుజన్, తనిష్క్ జంటగా యు.కె. ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న 'అప్పుడు-ఇప్పుడు' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. చలపతి పువ్వల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఉషారాణి కనుమూరి, విజయరామకృష్ణంరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ఇటీవల విడుదల చేశారు. ఫీల్‌గుడ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. శివాజీరాజా, పేరుపురెడ్డి శ్రీనివాస్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కల్యాణ్ సమి, సంగీతం: పద్మానావ్ భరద్వాజ్.



# దెయ్యంగా భూమిక?

రీ ఎంట్రీలోనూ భూమికకు వరుసగా అవకాశాలు వస్తున్నాయి. కథానాయికగా అగ్రహీరోలు అందరి సరసనా ఆడిపాడిన నటి భూమిక. యోగా గురువు భరత్ ఠాకూర్‌ని వివాహం చేసుకుని, ఓ బిడ్డకు తల్లయ్యాక కొన్నాళ్లు తెలుగు తెరకు దూరమయ్యారు. గతేడాది నాని నటించిన 'ఎంసీఏ'తో తెలుగులో రీ ఎంట్రీ ఇచ్చారు భూమిక. ఆ సినిమాలో ఆమెకు చాలా మంచి పేరు వచ్చింది. "భరత్‌ఠాకూర్ నాకు అన్నవుతారో లేదో తెలియదు కానీ, భూమిక మాత్రం వదిన అవుతుంది" అని నాని కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆ సినిమా తర్వాత భూమిక ఇప్పుడు మరో సినిమాకు సంతకం చేశారు. కన్నడ నుంచి తెలుగులోకి రీమేక్ అవుతోన్న 'యూటర్న్'లో ఆమె దెయ్యం పాత్రను అంగీకరించినట్టు సమాచారం. సమంత కీలక పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. కన్నడ దర్శకుడు పవన్‌కుమార్ తెలుగులోనూ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

## తగ్గిన విదేశీ మారక నిల్వలు

ముంబై : వరుసగా రెండు వారాలపాటు పెరిగిన భారత్ విదేశీ మారక నిల్వలు మార్చి 16తో ముగిసిన వారంలో 15.24 కోట్ల డాలర్లు తగ్గి 42,133.4 కోట్ల డాలర్లకు చేరాయి. బంగారం నిల్వలు మాత్రం 1.32 కోట్ల డాలర్లు పెరిగి 2,156.2 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 41 లక్షల డాలర్లు పెరిగి 153.8 కోట్ల డాలర్లకు చేరాయని భారత రిజర్వు బ్యాంక్ (ఆర్‌బిఐ) తెలిపింది. ఐఎంఎఫ్ వద్ద భారత్ నిల్వలు కూడా 55 లక్షల డాలర్లు పెరిగి 207.7 కోట్ల డాలర్లకు చేరాయి.

# రూ. 2,000 కోట్లతో విస్తరణ

**రెండో రన్‌వే పూర్తి స్థాయిలో అభివృద్ధి.. గంటకు 50 విమానాల రాకపోకలకు ఏర్పాట్లు**

**రెండేళ్లకల్లా 2.6 కోట్ల మంది ప్రయాణికులు : జీఎంఆర్ విమానాశ్రయ సిఇఒ ఎస్‌జికె కిశోర్**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ విమానాశ్రయంలో నానాటికీ పెరుగుతున్న ప్రయాణికుల తాకిడిని తట్టుకునేందుకు ప్రస్తుతం ఉన్న టెర్మినల్ విస్తరణ పనులు రెండు వేల కోట్ల రూపాయలతో చేపడుతున్నట్టు జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్‌జికె కిశోర్ తెలిపారు. జీఎంఆర్ విమానాశ్రయం పది సంవత్సరాల వేడుక సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. విమానాశ్రయ విస్తరణ ప్రణాళికల గురించి వివరించారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్ ద్వారా ఏడాదికి 1.8 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా విస్తరణ పూర్తయ్యే నాటికి 2.6 కోట్ల మంది రాకపోకలు సాగించే సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులనే ఉపయోగించుకుంటూ వీలైనంత ఎక్కువ మంది రాకపోకలు సాగించేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం నామమాత్రంగా పని చేస్తున్న రెండో రన్‌వేను పూర్తి స్థాయి రన్‌వేగా మార్చబోతున్నట్టు కిశోర్ చెప్పారు. ప్రస్తుతం విమానాశ్రయం నుంచి గంటకు 26 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయని, రెండో రన్‌వే కూడా పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చే సరికి గంటకు 50 విమానాలు రాకపోకలు సాగించగలుగుతాయని ఆయన అన్నారు.

ప్రస్తుతం తమ నిపుణుల బృందం ఇదే స్థాయి విమానాశ్రయాలున్న జర్మనీ వంటి దేశాల్లో పర్యటిస్తున్నదని, ఆయా విమానాశ్రయాల్లో వసతులను అధ్యయనం చేస్తున్నదని, వారి నివేదిక ఆధారంగా ఆ విమానాశ్రయాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఇక్కడ ప్రపంచ శ్రేణి వసతుల కల్పనకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. వాస్తవానికి హైదరాబాద్ విమానాశ్రయం ద్వారా గరిష్ఠంగా నాలుగు కోట్ల మంది రాకపోకలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించామని, ఆ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇప్పుడు 1.6 కోట్ల మంది రాకపోకలు సాగించే వసతులుండగా దాన్ని అధిగమించామని కిశోర్ అన్నారు. విస్తరణ ప్రణాళికలన్నీ రెండేళ్లలో పూర్తవుతాయని ఆయన తెలిపారు. విమాన ప్రయాణికుల్లో వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 22 నుంచి 24 శాతం వృద్ధి నమోదవుతుందని భావిస్తున్నామని, వచ్చే ఏడాది అది 20 శాతం వరకు ఉండవచ్చునని ఆయన చెప్పారు. ప్రయాణికుల సంఖ్యలో పెరుగుదలకు దీటుగా ఎప్పటికప్పుడు అనుమతులు తీసుకుని వేగంగా విస్తరణ కార్యక్రమాలు చేపట్టడం జీఎంఆర్ వ్యూహమన్నారు. మొదటి టెర్మినల్ విస్తరణ పూర్తయిన తర్వాత రెండో టెర్మినల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ప్రస్తుతం హైదరాబాద్ విమానాశ్రయం ద్వారా చిన్న విమానాలు, ఎటిఆర్‌లు ఎక్కువగా నడుస్తున్నాయని, ఏ శ్రేణి విమానాలు ఎన్ని నడుస్తున్నాయనే అంశాన్ని బట్టి గంటకు ఎన్ని విమానాల రాకపోకలు చేపట్టగలమనేది ఆధారపడి ఉంటుందని కిశోర్ చెప్పారు. హైదరాబాద్ విమానాశ్రయంలో జీఎంఆర్‌కు 63 శాతం వాటాలుండగా తెలంగాణ ప్రభుత్వానికి 13 శాతం వాటా ఉన్నదని, మిగతా వాటాలు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, మలేసియా ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ బెర్హాద్ చేతిలో ఉన్నాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా జీఎంఆర్ తన వాటాను యథాతథంగా కొనసాగిస్తుందని తెలిపారు.



హైదరాబాద్ విమానాశ్రయ విస్తరణ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్, జిఎం రావు

## రెండు వారాల్లో ఎయిరిండియా బిడ్డింగ్

**పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్‌ఎన్ చౌబే**

ఎయిరిండియాలో వాటాల విక్రయానికి సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణలకు రెండు వారాల్లో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్‌ఎన్ చౌబే చెప్పారు. జీఎంఆర్ విమానాశ్రయం పదేళ్ల వేడుకకు హాజరైన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బిడ్డర్లకు నికర విలువ ఎంత ఉండాలి, ఇతరత్రా అర్హతలేమిటి అన్నవి నోటిఫికేషన్‌లో ఉంటాయని ఆయన చెప్పారు. ఎయిరిండియాలో వ్యూహాత్మకంగా వాటాలు విక్రయించేందుకు సంబంధించిన విధివిధానాలను మంత్రుల స్థాయి బృందం పరిశీలిస్తున్నదని ఆయన తెలిపారు. 50 వేల కోట్ల రూపాయల రుణభారంలో కుంగిపోయిన ఎయిరిండియాలో వాటాల విక్రయానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) సూత్రప్రాయంగా అనుమతి తెలిపిందని ఆయన అన్నారు. అంతకు ముందు సభలో మాట్లాడుతూ దేశంలో విమానయాన రంగం విస్తరణకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో విమాన ప్రయాణికుల సంఖ్యలో దేశం 20 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఆయన తెలిపారు. మనకు అన్నింటా గట్టి పోటీదారుగా భావించే చైనాలో కూడా ఈ వృద్ధిరేటు 13 శాతానికే పరిమితం అయిందని, వృద్ధిరేటులో మనం ప్రపంచ దేశాలన్నింటితో పోల్చితే అగ్రస్థానంలో ఉన్నామని చౌబే చెప్పారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు దీటుగా ముంబై, ఢిల్లీలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. నవీ ముంబైలో 15 వేల కోట్ల రూపాయలు, ఢిల్లీకి సమీపంలోనే ఏర్పాటు చేయతలపెట్టిన రెండో విమానాశ్రయంలో మరో 15 వేల కోట్ల రూపాయలు ఇన్వెస్ట్ చేస్తున్నట్టు చెప్పారు.

## దేశంలోనే అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్

హైదరాబాద్ విమానాశ్రయం ఆవరణలో సకల వసతులతో ఎయిర్‌పోర్ట్ సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ప్రకటించారు. ఈ ఎయిర్‌పోర్ట్ సిటీ పూర్తి స్థాయి కనెక్టివిటీతో అత్యంత ఆధునికంగా ఉంటుందని ఆయన అన్నారు. ఇక్కడ దేశంలోనే అతి పెద్ద కన్వెన్షన్ కమ్ ఎగ్జిబిషన్ సెంటర్ నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో 20 వేల మంది కూర్చునే వసతి ఉంటుందని ఆయన చెప్పారు. ఇందులో 1500 గదులతో స్టార్ హోటళ్లు, లక్షన్నర చదరపు అడుగుల విస్తీర్ణంలో వసతులు అందుబాటులో ఉంటాయని రావు తెలిపారు. తెలంగాణను ప్రపంచ పర్యాటకులు, వ్యాపార, పారిశ్రామికవేత్తలకు ఆకర్షణీయ గమ్యంగా మార్చాలని ముఖ్యమంత్రి కెసిఆర్ భావిస్తున్న దృష్ట్యా రానున్న కాలంలో ఏర్పడే డిమాండుకు ఇది ఆలంబనగా నిలుస్తుందని ఆయన చెప్పారు. ఇది బిజినెస్ పోర్ట్, హెల్త్ పోర్ట్, ఎడ్యుకేషన్ పోర్ట్, ఫన్ పోర్ట్, లాజిస్టిక్ పోర్ట్, ఏరోస్పేస్ పోర్ట్ పేరిట భిన్న విభాగాలతో సర్వసమగ్రంగా తయారవుతుందని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక సహా ఎగ్జిబిషన్, కన్వెన్షన్ సెంటర్‌కు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అంతకు ముందు శంకుస్థాపన చేశారు.

## టాటా చేతికి భూషణ్ స్టీల్

**» డీల్ విలువ రూ.35,000 కోట్లు !**

న్యూఢిల్లీ : దివాలా తీసిన భూషణ్ స్టీల్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయనున్నట్లు టాటా స్టీల్ ప్రకటించింది. భూషణ్ స్టీల్ కొనుగోలు కోసం దాఖలు చేసిన బిడ్‌ను కంపెనీ గెలుచుకుందని తెలిపింది. అయితే ఎంత మొత్తానికి ఈ కంపెనీని కొనుగోలు చేయనుందనేది మాత్రం వెల్లడించలేదు. అయితే పరిశ్రమ వర్గాల ప్రకారం డీల్ విలువ దాదాపు 35,000 కోట్ల రూపాయలు ఉండొచ్చని అంచనా. పూర్తిగా నగదు చెల్లించి టాటా స్టీల్ ఈ డీల్‌ను పూర్తి చేయనుంది. భూషణ్ స్టీల్ కొనుగోలుతో టాటా స్టీల్..దేశంలోనే అతిపెద్ద ఉక్కు తయారీదారుగా అవతరించనుంది. ప్రస్తుతం టాటా స్టీల్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1.3 కోట్ల టన్నులుగా ఉండగా భూషణ్ కొనుగోలుతో అదనంగా 56 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం వచ్చి చేరనుంది. ఈ నెల 22న భూషణ్ స్టీల్ లిమిటెడ్ రుణదాతల కమిటీ.. తాము దాఖలు చేసిన బిడ్ గెలిచినట్లు ప్రకటించిందని టాటా స్టీల్ తెలిపింది. ఎన్‌సిఎల్‌టి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అనుమతులకు లోబడి ఈ కొనుగోలు ఉంటుందని తెలిపింది. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ 2016 (ఐబిసి)లోని కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ (సిఐఆర్‌పి) కింద భూషణ్ స్టీల్ కొనుగోలుకు సంబంధించి టాటా స్టీల్ సమర్పించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను ఆమోదించారని తెలిపింది. 48,100 కోట్ల రూపాయల రుణాలను చెల్లించలేకపోవటంతో బ్యాంకులు భూషణ్ స్టీల్ ఆస్తులను వేలం వేయటంతో జెఎస్‌డబ్ల్యు స్టీల్ సహా కంపెనీకి చెందిన ఉద్యోగులు కొందరు ప్రైవేట్ ఈక్విటీ సంస్థతో కలిసి భూషణ్ స్టీల్ కొనుగోలుకు బిడ్లు దాఖలు చేశాయి.

## ఈ ఏడాది 200 నియామకాలు

**» జెడిఎ సాఫ్ట్‌వేర్ ఇంక్ వెల్లడి**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రిటైల్, సప్లయ్ చెయిన్ సొల్యూషన్స్‌ను అందిస్తున్న జెడిఎ సాఫ్ట్‌వేర్ ఇంక్.. 200 మంది ఉద్యోగులను నియమించుకునేందుకు రెడీ అవుతోంది. ప్రస్తుతం జెడిఎకు ప్రపంచవ్యాప్తంగా 4,300 మంది ఉద్యోగులుండగా ఒక్క భారత్‌లో 2,100 మంది ఉద్యోగులున్నారని సంస్థ సిఇఒ గిరీష్ రిషి వెల్లడించారు. జెడిఎ సాఫ్ట్‌వేర్‌కు ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరుల్లో రెండు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)ను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా కొత్తగా 200 మంది నిపుణులను నియమించుకోనున్నట్టు ఆయన చెప్పారు. సప్లయ్ చెయిన్‌లో ఉపయోగించే ఇంటెలిజెంట్ ఎడ్జ్ టెక్నాలజీలైన మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఐఒటి, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్‌లో సామర్థ్యాలను పెంచుకునేందుకు మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి)తో సంయుక్తంగా పరిశోధన కార్యకలాపాలను చేపట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు. భారత మార్కెట్లో షాపర్స్ స్టాప్, దాల్మియా సిమెంట్స్, ఆదిత్య బిర్లా, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్ సహా మరికొన్ని సంస్థలకు సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కంపెనీ 40కి పైగా దేశాల్లో సేవలందిస్తోందని, 2017లో టర్నోవర్ 100 కోట్ల డాలర్లుగా ఉందని రిషి తెలిపారు. సంస్థ ఏటా 18 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటూ వస్తోందని చెప్పారు.

## టి-స్కేల్‌కు 5 స్టార్టప్‌ల ఎంపిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పిడబ్ల్యుసి, కో క్రియేషన్ కన్సల్టింగ్ భాగస్వామ్యంలో టి-హబ్ నిర్వహించిన టి-స్కేల్ ప్రోగ్రామ్‌కు ఐదు స్టార్టప్ కంపెనీలు ఎంపికయ్యాయి. 70కి పైగా స్టార్టప్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని టి-హబ్ సిఇఒ జయ్ కృష్ణన్ తెలిపారు. స్టార్టప్‌ల వ్యాపారానికి సంబంధించి 12 సెషన్ల ప్రోగ్రామ్ నిర్వహించిన అనంతరం ఐదు కంపెనీలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు ఆయన చెప్పారు. ఎంపిక స్టార్టప్స్‌కు అవసరమైన భాగస్వామ్యాలను కల్పించటంతో పాటు కస్టమర్ అక్విజిషన్ కోసం టి-హబ్, పిడబ్ల్యుసి తోడ్పాటునందించనుందని తెలిపారు. టి-హబ్, పిడబ్ల్యుసి షార్ట్‌లిస్ట్ చేసిన స్టార్టప్‌ల్లో ఇన్‌స్టాగ్రీన్, ఐఒటిఆర్ఎల్, ఫైండ్‌ఫ్యాక్ట్స్, ఇండియాబైట్స్, నెబులే ఉన్నాయి.

# ఢీ అంటే ఢీ

**చైనా-అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రతరం**

**చైనా సరుకులపై 6,000 కోట్ల డాలర్ల సుంకాలు**

**128 అమెరికా వస్తువులపై సుంకం విధింపు**

**ప్రపంచ వాణిజ్య మార్కెట్లో దిగ్గజ దేశాలైన అమెరికా, చైనాలు సమర శంఖాన్ని పూరించాయి. ప్రత్యర్థి దేశ ఉత్పత్తులను అడ్డుకునేందుకు సుంకాల గోడలు కడుతున్నాయి. రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య మొదలైన ఈ వాణిజ్య యుద్ధం అన్ని దేశాలను కుదిపేసే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.**



వాషింగ్టన్/బీజింగ్: ప్రపంచ మార్కెట్‌ను వాణిజ్య యుద్ధ మేఘాలు కమ్మేశాయి. అమెరికా, చైనాలు ట్రేడ్ వార్‌ను పతాక స్థాయికి తీసుకెళ్లాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా ఉత్పత్తులపై 6,000 కోట్ల డాలర్ల భారీ సుంకాలను విధించారు. తమ మేధోసంపత్తి హక్కులను చైనా దొంగిలిస్తోందన్న నెపంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. మేధోసంపత్తి హక్కుల చౌర్యానికి సంబంధించి ఏడు నెలలపాటు దర్యాప్తు జరిపిన యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్).. నివేదికను సమర్పించిన ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అమెరికా కంపెనీల సాంకేతికత వారి స్థానిక సంస్థలకు బదిలీ అయ్యేలా చైనా ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యాలు, ఈక్విటీ వాటాలు, విదేశీ పెట్టుబడులపై నియంత్రణలతోపాటు విదేశీ యాజమాన్యాలపై ఆంక్షలు విధిస్తోందని నివేదికలో పేర్కొంది. "చైనాతో కొన్నేళ్లుగా ఈ సమస్యపై చర్చించినా ఫలితం లేకపోయింది. చైనా అనుచిత, మార్కెట్ వక్రీకరణ వ్యవహార శైలికి బదులిచ్చేందుకు అమెరికా అందుబాటులో ఉన్న సాధనాలన్నింటినీ ఉపయోగించనుంది. చైనా అక్రమ వాణిజ్య విధానాలు కేవలం మాకే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మా వర్తక భాగస్వాములందరికీ అత్యంత సవాలుగా మారింది" అని యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రాబర్ట్ లైట్‌హైజర్ పేర్కొన్నారు.

యుఎస్‌టిఆర్ నివేదిక సమర్పించిన మరుసటినాడే చైనాపై భారీగా సుంకాలు వడ్డిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం గమనార్హం. సుంకం విధించబోతున్న చైనా ఉత్పత్తుల జాబితాను 15 రోజుల్లో విడుదల చేయడంతోపాటు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్లుటిఒ) వద్ద చైనా వాణిజ్య విధానాలను సవాలు చేయాలని యుఎస్‌టిఆర్‌ను ట్రంప్ ఆదేశించారు. చైనాతో అమెరికా వాణిజ్య లోటు 50,400 కోట్ల డాలర్ల స్థాయిలో ఉందని ట్రంప్ అన్నారు.

### మమ్మల్ని వాడుకోవాలనుకోవద్దు: ట్రంప్

అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికాను వాడుకొని లబ్ధి పొందాలనుకునే రోజులు ముగిశాయని ట్రంప్ అన్నారు. అమెరికాతో వాణిజ్యంలో అనుచిత విధానాలు అవలంబించేవారితోపాటు తమ వాణిజ్య లోటును పెంచుతున్న దేశాలపై చర్యలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు.

### 20 లక్షల ఉద్యోగాలు కోల్పోయాం: వైట్‌హౌజ్

చైనాతో భారీ స్థాయి వాణిజ్య లోటు కారణంగా 20 లక్షల ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చిందని వైట్‌హౌజ్ పేర్కొంది. చైనాపై దిగుమతి సుంకాల విధింపును సమర్థించుకుంది.

### ఇయు దేశాలపై లోహ సుంకాల రద్దు

యూరోపియన్ యూనియన్ (ఇయు) దేశాలతోపాటు వాణిజ్య భాగస్వాములపై గతంలో విధించిన స్టీల్, అల్యూమినియం దిగుమతి సుంకాలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ దేశాల నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే స్టీల్‌పై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకం విధించింది.

### దెబ్బకు దెబ్బ!

ట్రంప్ చర్యలకు ప్రతీకారంగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు విధించింది. మొత్తం 128 వస్తువులపై 300 కోట్ల డాలర్ల విలువైన సుంకాలను వడ్డించింది. కాకపోతే బిగ్ టికెట్ ఐటమ్స్‌ను మినహాయించింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు తెగిపోకుండా ఉండాలంటే అమెరికా వివేకంతో నిర్ణయాలు తీసుకోవాలని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ చైనా చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలకు భంగం కలిగితే చూస్తూ ఊరుకోమని మంత్రిత్వ శాఖ ప్రతినిధి హు చన్‌యింగ్ అన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామన్నారు. చైనా సుంకం విధించిన అమెరికన్ వస్తువుల జాబితాలో పంది మాంసం, పళ్లు, వైన్, సీమ్‌లెస్ స్టీల్ ట్యూబ్స్, రీసైకిల్డ్ అల్యూమినియం కూడా ఉన్నాయి.

### అంతర్జాతీయ వాణిజ్యంలో సవాళ్లు: సురేష్ ప్రభు

న్యూఢిల్లీ : అమెరికా రక్షణాత్మక విధానాలను అనుసరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్య పెను సవాళ్లను ఎదుర్కొంటోందని, ఈ నేపథ్యంలో భారత్ ఎగుమతులు పెరిగేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు అన్నారు. చైనా సహా అన్ని ప్రధాన వర్తక భాగస్వాములకు వ్యతిరేకంగా అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. చైనా దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 6,000 కోట్ల డాలర్ల దిగుమతి సుంకాలను విధించారు. అంతేకాకుండా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలను పెంచారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొన్న సవాళ్లను సురేష్ ప్రభు ప్రస్తావించారు.

### ఆర్థిక వృద్ధికి విఘాతం: రాజన్

అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వృద్ధి పునరుద్ధరణకు విఘాతం కలుగవచ్చని ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ హెచ్చరించారు. ఇది అంత తేలికగా తీసుకునే పరిణామం కాదన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోలుకుంటున్న సమయంలో ఏ దేశమైనా వాణిజ్య యుద్ధాలకు దూరంగా ఉండాలన్నారు.

### జగడాలు వద్దు: శక్తికాంత దాస్

వాణిజ్య పరంగా ప్రపంచంలోని అగ్రగామి దేశాలైన చైనా-అమెరికా మధ్య మొదలైన జగడాలపై జి-20 సమావేశాల్లో భారత ప్రతినిధి శక్తికాంతదాస్ ఆందోళన వ్యక్తం చేశారు. అది వారి ఆర్థిక వ్యవస్థకు ఏమేర ప్రయోజనకరమని ఇరు దేశాల ప్రభుత్వాలు విశ్లేషించుకోవాల న్నారు. పరస్పరం చర్చించుకొని వివాదాన్ని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### భారత్ చొరవ చూపాలి: ఫిక్కీ

అమెరికా-చైనాలతో వాణిజ్య యుద్ధం మొదలుకాకుండా చూడటంలో భారత్ కీలకపాత్ర పోషించాలని ఫిక్కీ అభిప్రాయపడింది. లేదంటే ప్రపంచ వాణిజ్య పురోగతి పట్టాలు తప్పవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది.

## శ్రీసిటీలో లిబరల్ ఆర్ట్స్ వర్సిటీ

**» రాజన్, కార్పొరేట్ దిగ్గజాల నేతృత్వంలో ఏర్పాటు**

**» తొలుత రూ.750 కోట్ల పెట్టుబడులు**

ముంబై : భారత రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, కార్పొరేట్ దిగ్గజాలు, ప్రముఖ విద్యావేత్తల సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో లిబరల్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. క్రెయా యూనివర్సిటీ పేరుతో దీన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ విశ్వవిద్యాలయం తొలి దశలో 750 కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని ఇండస్‌ఇండ్ బ్యాంక్ చైర్మన్, యూనివర్సిటీ సూపర్‌వైజరీ బోర్డ్ చైర్మన్ ఆర్ శేషసాయి తెలిపారు. దాతృత్వ కార్యకలాపాల్లో భాగంగా కార్పొరేట్లు దీనికి సహకారం అందిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ యూనివర్సిటీలో మొదటి బ్యాచ్ 2019 జూలైలో ప్రారంభం అవుతుందని, ప్రవేశాలు నవంబరులో ప్రారంభం అవుతాయన్నారు. హాస్టల్‌తో కలిపి ఫీజు 7-8 లక్షల రూపాయలుంటుందని చెప్పారు. తొలుత శ్రీసిటీలోని ఐఎఫ్ఎంఆర్ క్యాంపస్ నుంచి కోర్సుల నిర్వహణ జరుగుతుందని, తర్వాతి కాలంలో యూనివర్సిటీకి మారిపోతుందన్నారు. 200 ఎకరాల ఈ క్యాంపస్ ఏర్పాటవుతుందని, 2020నాటికి ఇది సిద్ధమవుతుందని ఆయన చెప్పారు. లిబరల్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో నాలుగేళ్ల రెసిడెన్షియల్ అండర్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తామని, బిఏ (హానర్స్), బిఎస్‌ఇ (హానర్స్)కు ఇవి సమానమని తెలిపారు. వీటికి యుజిసి నుంచి అనుమతులు కోరినట్టు శేషసాయి తెలిపారు. మెరిట్ ఆధారంగానే ప్రవేశాలు ఉంటాయని చెప్పారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా సుందర్ రామస్వామి, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా మాజీ బ్యాంకర్ ఎన్ వాఘుల్, సభ్యులుగా జెఎస్‌డబ్ల్యు గ్రూప్‌చైర్మన్ సజ్జన్ జిందాల్, ఎం అండ్ ఎం గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ఉన్నారు. రాజన్ క్రెయా గవర్నింగ్ కౌన్సిల్ అడ్వైజర్‌గా ఉన్నారు.

## ప్యాకేజింగ్ చట్టానికి సన్నాహాలు

**» ఐఐపి డైరెక్టర్ ఎన్‌సి సాహ**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయంగా ప్యాకేజింగ్ చట్టం తెచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపి) డైరెక్టర్ ఎన్‌సి సాహ తెలిపారు. ఆహార ఉత్పత్తుల ప్యాకేజింగ్ భద్రతకు సంబంధించి తాము ప్రత్యేక అధ్యయనాన్ని నిర్వహించామని, ఇందుకు సంబంధించిన వివరాలను భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ)కు సమర్పించామని చెప్పారు. ప్యాకేజింగ్ చట్టానికి సంబంధించి ముసాయిదాపై అన్ని వర్గాలు అభిప్రాయాలు తెలియజేస్తున్నాయన్నారు. దీనికి ఎస్ఎస్ఎస్ఎఐతోపాటు పార్లమెంట్ ఆమోదం లభిస్తే చట్టంగా మారే అవకాశం ఉందని చెప్పారు. ప్యాకేజింగ్ చట్టం ద్వారా ఉత్పత్తుల వినియోగదారులకు మరింత భద్రత లభిస్తుందన్నారు. 'ప్యాకేజింగ్ ఫర్ న్యూ మిలీనియమ్‌పై శుక్రవారంనాడిక్కడ రెండు రోజుల సదస్సు ప్రారంభమైన సందర్భంగా సాహ మాట్లాడారు. ఐఐపి విస్తరణలో భాగంగా బెంగళూరు, గువహతి, కాకినాడ, అహ్మదాబాద్‌లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కాకినాడలో సెంటర్ ఏర్పాటు కోసం ఏపి ప్రభుత్వం 25 ఎకరాల స్థలాన్ని ఇచ్చినట్టు సాహ తెలిపారు. కర్ణాటక ప్రభుత్వ నాలుగు ఎకరాల స్థలం ఇచ్చిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని కేంద్రం విస్తరణకుగాను ఐదు ఎకరాల స్థలం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామన్నారు. విస్తరణ ద్వారా పిజి డిప్లొమాలో చేరే విద్యార్థుల సంఖ్యను 35 నుంచి 100కు పెంచుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.ఇందుకు సంబంధించిన మెమోరాండమ్‌ను ప్రభుత్వాన్ని సమర్పించినట్టు ఐఐపి హైదరాబాద్ మాజీ చైర్మన్ ఎవిపిఎస్ చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం దేశీయ ప్యాకేజింగ్ మార్కెట్ 2,700 కోట్ల డాలర్లుగా ఉందని, 2020నాటికి 3,200 కోట్ల డాలర్లను తాకే అవకాశం ఉందని సాహ చెప్పారు. ఐఐపి ఆఫర్ చేస్తున్న వివిధ కోర్సులను ఇప్పటికే 5,000 మంది పూర్తి చేశారన్నారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి | రూపాయి డాలర్ | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 32596.54 | 9998.05 | 30835 | 38465 | 65.01 | 70.04 |
| ↓ 409.73 | ↓ 116.70 | ↑ 160 | ↓ 15 | ↑ | ↑ |

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

# డిసిహెచ్ఎల్ వెంకట్రామ్ రెడ్డిపై మరో కేసు

- యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్‌ను

**రూ 30 కోట్ల మేర వంచించినట్టు సిబిఐ ఆరోపణ**

న్యూఢిల్లీ : యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీని 30.54 కోట్ల రూపాయల మేరకు మోసగించిన ఆరోపణలపై దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ ఛైర్మన్ టి వెంకట్రామ్ రెడ్డి మరికొందరిపై సిబిఐ కేసు నమోదు చేసింది. నేరపూరితమైన కుట్రలో భాగంగా 2011లో దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ జారీ చేసిన స్వల్ప కాలిక అన్‌సెక్యూర్డ్ రిడీమెబుల్ ఎన్‌సిడిల్లో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్‌తో పెట్టుబడులు పెట్టించారనీ ఈ సొమ్ము వెనక్కి రాకపోవడంతో బీమా సంస్థ 30.54 కోట్ల రూపాయల మేర నష్టాన్ని చవిచూసిందని సిబిఐ పేర్కొంది. ఈ కుట్రలో భాగస్వాములుగా పేర్కొంటూ బీమా కంపెనీ ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగం (చెన్నై) మాజీ డిజిఎం ఎ బాలసుబ్రమణియన్, మాజీ చీఫ్ మేనేజర్ కె ఎల్ కుంజిల్వార్‌పైనా కేసు నమోదు చేశారు. వీరు కాకుండా రేటింగ్ సంస్థ కేర్ (ప్రతినిధి సిఇఒ రాజేష్ మొకాషి), ఐడిఎఫ్‌సి (ప్రతినిధి సిఎఫ్ఒ సునీల్ కక్కర్)ను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. నేరపూరిత కుట్రలో భాగంగా 2011 జూలై-అక్టోబర్ మధ్య కాలంలో కె ఎల్ కుంజిల్వార్ మూడు ఆఫీస్ నోట్స్‌ను పుటప్ చేశారని సిబిఐ పేర్కొంది. ఈ నోట్స్ ప్రకారం దక్కన్ క్రానికల్ జారీ చేసిన 364 రోజుల కాలవ్యవధి, 11.25 శాతం వార్షిక వడ్డీ ఉన్న ఎన్‌సిడిల్లో 10 కోట్ల రూపాయల చొప్పున ఇన్వెస్ట్ చేసేందుకు ప్రతిపాదించారని తెలిపింది.. ఏమాత్రం ఆలోచన చేయకుండా బాల సుబ్రమణియన్ వీటికి ఆమోదం తెలిపినట్టుగా సిబిఐ పేర్కొంది. కేర్ సంస్థ ఈ ఎన్‌సిడిలకు పి1 ప్లస్ రేటింగ్ ఇవ్వడంతో బీమా సంస్థ ఇన్వెస్ట్‌మెంట్ శాఖ కూడా దానినే నమ్మినట్టుగా పేర్కొంది. ఐడిఎఫ్‌సి ద్వారా ఈ డిబెంచర్లను కొనుగోలుచేసినట్టు తెలిపింది. కేవలం ఏడాది కాలంలో కేర్ తన రేటింగ్‌ను పి1ప్లస్ నుంచి ఏకంగా 'డి' కి తగ్గించినట్టుగా వెల్లడించింది.



## రూ. 1,394 కోట్ల మోసం కేసులో
# టోటెమ్ ఇన్‌ఫ్రా ప్రమోటర్లు అరెస్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి) : టోటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రమోటర్లయిన తొట్టెంపూడి సలలిత్, తొట్టెంపూడి కవితలను కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) అరెస్ట్ చేసింది. ఎనిమిది బ్యాంకుల కన్సార్షియాన్ని 1,394 కోట్ల రూపాయల మేర మోసం చేసిన కేసులో వీరిద్దరిని అరెస్ట్ చేసినట్లు సిబిఐ అధికారులు తెలిపారు. కీలకమైన మౌలిక సదుపాయాల కంపెనీలకు టోటెమ్ ఇన్‌ఫ్రా సబ్ కాంట్రాక్టర్‌గా పనిచేసిందని తెలిపింది. బ్యాంకుల కన్సార్షియంలోని ఒక బ్యాంక్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ప్రమోటర్లపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు వెల్లడించింది. టోటెమ్ ఇన్‌ఫ్రాకు మంజూరు చేసిన 313.84 కోట్ల రూపాయల రుణాలు 2012 జూన్‌లో మొండి బకాయిలుగా మారాయని, కంపెనీ కారణంగా తమకు నష్టం వాటిల్లిందంటూ యుబిఐ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వివిధ ప్రాజెక్టుల కోసం బ్యాంకుల నుంచి ప్రమోటర్లు మొత్తం 1,394.43 కోట్ల రూపాయల రుణాలు తీసుకుని వాటిని వ్యక్తిగత ఖాతాలకు మళ్లించారని సిబిఐ తెలిపింది. కాగా 400 కోట్ల రూపాయల పన్ను బకాయిలు చెల్లించకపోవటంతో 2015లో ఆదాయ పన్ను శాఖ విడుదల చేసిన డిఫాల్టర్ల జాబితాలో టోటెమ్ ఇన్‌ఫ్రా కూడా ఉంది. అంతేకాకుండా ఈ కంపెనీ ప్రమోటర్లను పట్టించిన వారికి 15 లక్షల రూపాయల రివార్డును కూడా ఆదాయ పన్ను శాఖ ప్రకటించింది.

### వంద శాతం కేటాయింపులు: యుబిఐ

టోటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మోసం కేసులో వంద శాతం ప్రొవిజన్ ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ రుణం విషయంలో బ్యాంకుపై ఎలాంటి ప్రభావం చూపించదని పేర్కొంది. 8 బ్యాంకుల కన్సార్షియం నుంచి 1,394.43 కోట్ల రూపాయల రుణాలు తీసుకుందని ఇందులో ఈ ఏడాది జనవరి 31 నాటికి బ్యాంకు వాటా 313.84 కోట్ల రూపాయలు (రూ.163.64 కోట్ల అన్‌అప్లైడ్ వడ్డీ కలుపకుని)గా ఉందని యూనియన్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా 2012లోనే టోటెమ్ ఖాతాను మొండి బకాయి (ఎన్‌పిఎ)గా ప్రకటించినట్లు వెల్లడించింది. ఆ తర్వాతే కన్షార్షియం సభ్యులతో కలిసి రికవరీ ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొంది. ఈ ఖాతాకు సంబంధించి వంద శాతం కేటాయింపులు చేయటంతో బ్యాంకుపై ఎలాంటి ప్రభావం పడలేదని స్పష్టం చేసింది.

# ఆన్‌రాక్ దివాలాలో బ్యాంకులు బలి?

## ఇన్‌సాల్వెన్సీ చర్యల్లో నాటకీయ మలుపులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): విదేశీ భాగస్వామ్యంలో ఏర్పాటైన ఆన్‌రాక్ అల్యూమినియం రుణాల వసూలు విషయంలో బ్యాంకులు భారీ ఎత్తునే నష్టానికి సిద్ధం కావాల్సి ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. ఆన్‌రాక్ విషయంలో బ్యాంకులు అనాలోచితంగా వ్యవహరించాయన్న విమర్శలు కూడా వస్తున్నాయి. ఎస్‌బిఐ సారథ్యంలోని బ్యాంకుల కన్సార్షియానికి ఆన్‌రాక్ చెల్లించాల్సిన రుణాల మొత్తం 3,242 కోట్ల రూపాయలు. ఇది కాకుండా మరో 9.6 కోట్ల డాలర్లు (సుమారు 617 కోట్ల రూపాయలు) విదేశీ వాణిజ్య రుణాలను కూడా ఆన్‌రాక్ వినియోగించుకుంది. ఈ మొత్తంలో 1,275 కోట్ల రూపాయలను చెల్లించి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆన్‌రాక్ చెబుతోంది. దీనికి బ్యాంకులు అంగీకరించినా 50 శాతంపైగా సొమ్ముకు నీళ్లొదులుకోవాల్సిందే. దివాలా చట్టాల కింద ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించి పరిష్కారానికి వెళ్లినా అంతకంటే ఎక్కువ గిట్టుబాటు కాకపోవచ్చని అంటున్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అంగీకరిస్తే ఆన్‌రాక్ ప్లాంట్ యాజమాన్యం చేజారదు. ఎన్‌సిఎల్‌టి ద్వారా రిజొల్యూషన్ జరిగితే మూడో పక్షం రంగంలోకి వచ్చే అవకాశం ఉంటుంది.

**ఇదీ జరిగింది...**

- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఒకటైన రస్ అల్‌ఖైమాతో 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ఎంఒయు కుదుర్చుకుంది. దీని ప్రకారం రస్ అల్‌ఖైమా ప్రభుత్వ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ, హైదరాబాద్‌కు చెందిన పెన్నా సిమెంట్ గ్రూప్‌తో కలిసి జాయింట్ వెంచర్‌లో 15 లక్షల టన్నుల వార్షిక సామర్థ్యంలో ఆన్‌రాక్ అల్యూమినియం ప్లాంట్‌ను విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 6000 కోట్ల రూపాయల పెట్టుబడితో అల్యూమినియం రిఫైనరీ, స్మెల్టర్, 225 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ప్రతిపాదించారు. 2013 మార్చి నాటికి ప్లాంట్ సిద్ధమైంది.
- ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థం బాక్సైట్‌ను సరఫరా చేసేందుకు అప్పట్లోనే ఎపిఎండిసితోనూ ఒప్పందం కుదుర్చుకున్నారు.
- మారిన రాజకీయ పరిణామాలు, బాక్సైట్ తవ్వకాలకు విశాఖ గిరిజనుల నుంచి ఎదురవుతున్న ప్రతిఘటన నేపథ్యంలో బాక్సైట్ సరఫరా ఒప్పందాన్ని ఎపిఎండిసి ఉపసంహరించింది.
- దీనిపై ఆన్‌రాక్ అల్యూమినియం.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి ఆర్బిట్రేషన్ నోటీసులు ఇచ్చింది. దానిని కేంద్రం తిరస్కరించింది.
- గతేడాది ఆన్‌రాక్ రుణాలను చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నందున ఇన్‌సాల్వెన్సీ చట్టాల ప్రకారం పరిష్కరించాలని ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించింది. అప్పట్లో ఎన్‌సిఎల్‌టి ఈ పిటిషన్‌ను తిరస్కరించి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించింది.
- బ్యాంకులతో చర్చలు జరిపి వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద బ్యాంకులకు 1,275 కోట్ల రూపాయలను చెల్లించేందుకు ఆన్‌రాక్ ప్రతిపాదించింది. ఎస్‌బిఐ గతేడాది ఆఖరులో ఈ ప్రతిపాదనకు అంగీకరించినట్టుగా చెబుతున్నారు. అయితే బ్యాంకుల కన్సార్షియంలోని ఇతర బ్యాంకులు మాత్రం ఇందుకు సుముఖంగా లేవని అంటున్నారు. ఒటిఎస్‌కు ఆమోదించిన విషయం ఎస్‌బిఐ రెగ్యులేటరీ సంస్థ ఆర్‌బిఐకి చెప్పకపోవడం వల్ల ఆర్‌బిఐ ఎన్‌సిఎల్‌టికి వెళ్లాల్సిందిగా బ్యాంకర్లను ఆదేశించింది.
- ఆర్‌బిఐ ఆదేశం ప్రకారం ఎస్‌బిఐ ఎన్‌సిఎల్‌టిలో పిటిషన్ దాఖలు చేసింది. దీనిని సవాలు చేస్తూ ఎన్‌సిఎల్‌టి ప్రొసీడింగ్స్‌పై స్టే ఇవ్వాల్సిందిగా కోరుతూ ఆన్‌రాక్ హైదరాబాద్ హైకోర్టును ఈ నెల రెండో వారంలో ఆశ్రయించింది. హైకోర్టు ఉభయ పక్షాల వాదనలు విన్నతర్వాత స్టే మంజూరు చేసింది.
- బ్యాంకుల్లో వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌పై భిన్నాభిప్రాయాలు ఉన్న కారణంగా ఇప్పుడిక ఈ కేసు ఎలాంటి మలుపు తీసుకుంటుందో హైకోర్టు ఆదేశాలు ఎలా ఉంటాయో అన్నది ఆసక్తికరంగా మారింది.

# రూ.250 కోట్లకు కుచ్చుటోపీ!

- ఎస్‌బిఐకి నాదెళ్ల జువెలరీ ఝలక్
- నకిలీ దస్తావేజులతో రుణాలు
- సిబిఐకి బ్యాంకు అధికారుల ఫిర్యాదు




చెన్నై(ఆంధ్రజ్యోతి): చెన్నైలో మరో నగల దుకాణ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)కు కుచ్చుటోపీ పెట్టింది. నగరానికి చెందిన నాదెళ్ల జువెలరీ.. ఎస్‌బిఐ నుంచి రూ.250 కోట్ల రుణం తీసుకుని మోసగించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)కి ఫిర్యాదు అందింది. చెన్నైలోని ఎస్‌బిఐ ఉన్నతాధికారులు శుక్రవారం ఆ నగల సంస్థపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. చెన్నై సహా పలు ప్రాంతాల్లో ఏడు శాఖలు కలిగిన నాదెళ్ల జువెలరీ... నగల కోసం నెలసరి చిట్టీలు కట్టినవారికే సొమ్ములు చెల్లించలేక గతేడాది అక్టోబరులోనే దివాలా తీసింది. 2010 నుంచి ఈ సంస్థ నకిలీ దస్తావేజులతో ఎస్‌బిఐలో రూ.250కోట్ల రుణాలు పొంది తిరిగి చెల్లించలేదు. ఇటీవలే 14 బ్యాంకుల్లో రూ.824 కోట్ల మేరకు రుణాలు పొంది మోసగించిన కనిష్క్ గోల్డ్ సంస్థ వ్యవహారం సద్దుమణగక ముందే మరో నగల సంస్థ బండారం బయటపడటం సంచలనం రేకెత్తిస్తోంది.

## కామ్‌వాల్ట్ హైదరాబాద్ సెంటర్ విస్తరణ

COMMVAULT

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఎంటర్‌ప్రైజ్ బ్యాకప్, రికవరీ, క్లౌడ్ సంస్థ కామ్‌వాల్ట్.. హైదరాబాద్ సెంటర్‌ను విస్తరించినట్లు ప్రకటించింది. విస్తరణలో భాగంగా మాదాపూర్ అసెండాస్ వి ఐటి పార్క్‌లో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. 250 సీటింగ్ సామర్థ్యంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. భవిష్యత్‌లో ఈ సెంటర్‌లో మరో 250 మందికి ఉద్యోగాలు కల్పించవచ్చని పేర్కొంది. భారత మార్కెట్లో కార్యకలాపాల విస్తరణకు కంపెనీ కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే డేటా మేనేజ్‌మెంట్, ప్రొటెక్షన్ సొల్యూషన్స్‌లో మెరుగైన టెక్నాలజీలను ఆఫర్ చేయటమే కాకుండా ఉద్యోగుల సంఖ్యను పెంచుకోనున్నట్లు తెలిపింది.

# రుణ స్కామ్‌లో మాజీ జిఎం

- ఐడిబిఐ బ్యాంక్‌లో రూ.445 కోట్ల ఘరానా మోసం
- చేపల చెరువుల పేరుతో టోకరా.. నకిలీ పత్రాలతో బురిడీ
- భట్టు రామారావుతో పాటు 30 మందిపై కేసు



న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): ఐడిబిఐని రూ.445 కోట్లు ముంచిన ఆరోపణలపై బ్యాంక్ మాజీ జనరల్ మేనేజర్ (జిఎం) భట్టు రామారావుతోపాటు మరో 30 మందిపై సిబిఐ కేసు నమోదు చేసింది. నకిలీ పత్రాలతో కిసాన్ క్రెడిట్ కార్డులు (కెసిసి) పొందడంతో పాటు చేపల పెంపకం కోసం రుణాలు తీసుకొని బ్యాంక్‌కు రూ.445.32 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టారని దర్యాప్తు ఏజెన్సీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. 2009-12 మధ్యకాలంలో 21 గ్రూపులకు చెందిన 220 మంది రూ.192.98 కోట్ల విలువైన రుణాలు పొందారని సిబిఐ వెల్లడించింది. అప్పట్లో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ బ్రాంచీలో జిఎంగా పనిచేసిన భట్టు రామారావుతో కలిసి మోసపూరిత ఉద్దేశంతో ఈ రుణాలు పొందారని, అందుకోసం ఫోర్జరీ డాక్యుమెంట్లు సమర్పించారని ఆరోపించింది. అంతేకాదు, తాకట్టు పెట్టిన ఆస్తులను కూడా పెంచి చూపారని తెలిపింది. రుణ నిధులను తమ పొదుపు ఖాతాల్లోకి మళ్లించుకొని, వ్యక్తిగత అవసరాలకు వాడుకొన్నారని దర్యాప్తు ఏజెన్సీ ఆరోపించింది. రుణం తీసుకున్న కొద్దికాలం తర్వాత మొండిపద్దులుగా మారిన ఈ బకాయిలు సెప్టెంబర్ 2017 నాటికి వడ్డీతో కలుపుకొని రూ.445 కోట్లకు చేరుకున్నాయి.

బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న వారిలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరితోపాటు తెలంగాణలోని అదిలాబాద్ జిల్లాలకు చెందినవారు అధికంగా ఉన్నారు. వీరు రుణ వసతి పొందేందుకు రామారావుతో పాటు బ్యాంక్ రిటైర్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ (దక్షిణ చెన్నై) ఆర్ దామోదరన్, బ్యాంక్‌లో తాకట్టు ఆస్తుల విలువ లెక్కింపుదారుల కమిటీతో కుమ్మక్కై మోసాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి సిబిఐ తన ఎఫ్ఐఆర్‌లో ఆదిలక్ష్మీ గ్రూపునకు చెందిన ముప్పిడి లక్ష్మణ్ రావు, ఎస్ సుధాకర్ గ్రూపునకు చెందిన సమయమంతుల సుధాకర్, ఎన్‌వి సుబ్బరాజు గ్రూపునకు చెందిన నడింపల్లి వెంకట సుబ్బరాజు, నడింపల్లి రామరాజు, కెఎస్‌వి ప్రసాద రాజు, తోరం చిన్న వెంకటేశ్వరరావు, పాతూరి సునీల్ చౌదరి, బెల్లాల చంద్రశేఖర్ రెడ్డి పేర్లను చేర్చింది.

### గుంటూరులోనూ బినామీ బాగోతం

బాపట్ల, రేపల్లె, గుంటూరు- అమరావతి రోడ్డులోని కొన్ని గ్రామాల్లో చేపల చెరువుల పేరుతో రుణాలు తీసుకున్నారు. అక్కడ చేపలూ లేవు.. చెరువులూ లేవు. సత్తెనపల్లి గిడ్డంగిలో వరిపొట్టు బస్తాలను నిల్వ చేసి... దానిని ధాన్యంగా చూపించి కోట్ల కొద్దీ రుణం పొందారు. ఐడిబిఐలో బోగస్ రుణాల వ్యవహారంలో రేపల్లె, బాపట్ల, గుంటూరు తదితర ప్రాంతాల్లో గతంలో 100-150 మందిపై కేసులు నమోదు అయ్యాయి.

## బులియన్

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 31,760 | --- | 31,820 | 31,450 | 30,860 |
| క్రితం ముగింపు | 31,540 | 31,480 | 31,610 | 31,350 | 30,690 |
| 22 క్యారెట్లు | 29,410 | --- | 29,270 | 29,120 | 29,390 |
| క్రితం ముగింపు | 29,210 | 29,200 | 29,080 | 29,070 | 29,230 |
| వెండి (కిలో) | 39,500 | --- | 39,500 | 39,600 | 41,600 |
| క్రితం ముగింపు | 39,500 | 39,800 | 39,500 | 39,600 | 41,600 |

**రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.75 — నెక్ (100 గుడ్లు)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 315.00 | చిత్తూరు | 363.00 |
| వరంగల్ | 317.00 | చెన్నై | 370.00 |
| విజయవాడ | 310.00 | నమక్కల్ | 360.00 |
| గోదావరి | 310.00 | బెంగళూరు | 350.00 |
| విశాఖపట్నం | 325.00 | ముంబై | 355.00 |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 62.00 | విజయవాడ | 63.00 |
| కరీంనగర్ | 63.00 | గుంటూరు | 63.00 |
| వరంగల్ | 62.00 | ఒంగోలు | 65.00 |
| మహబూబ్‌నగర్ | 62.00 | చిత్తూరు | 71.00 |
| కర్నూలు | 62.00 | నెల్లూరు | 71.00 |
| విశాఖపట్నం | 67.00 | అనంతపురం | 66.00 |
| గోదావరి | 63.00 | | |

**ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| యుఎస్ డాలర్ | 59.32 | 68.78 |
| పౌండ్ | 83.74 | 97.11 |
| యూరో | 73.17 | 84.86 |
| ఆస్ట్రేలియా డాలర్ | 45.74 | 52.92 |
| బహ్రెయిన్ దినార్ | 160.64 | 184.09 |
| కువైట్ దినార్ | 179.91 | 223.97 |
| ఒమని రియాల్ | 157.31 | 179.98 |
| సౌదీ రియాల్ | 15.77 | 18.69 |
| సింగపూర్ డాలర్ | 45.12 | 53.44 |
| యుఎఇ దిరమ్ | 16.14 | 18.87 |

# మార్కెట్.. ఢమాల్

## సెన్సెక్స్ 410 పాయింట్లు డౌన్.. 10000 పాయింట్ల దిగువ నిఫ్టీ

- 5 నెలల కనిష్ఠానికి సూచీలు
- రూ.1.57 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
- మార్కెట్లను కమ్మేసిన వాణిజ్య యుద్ధ మేఘాలు

ముంబై: మిన్నంటిన వాణిజ్య యుద్ధ భయాలు ప్రపంచ మార్కెట్లతోపాటు భారత దలాల్‌స్ట్రీట్‌ను మరోసారి కుదిపేశాయి. బిఎస్ఇ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 410 పాయింట్లు పతనమై ఐదు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోగా.. ఈ ఏడాదిలో తొలిసారిగా నిఫ్టీ 10 వేల దిగువ స్థాయికి జారుకుంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా ఉత్పత్తులపై 6,000 కోట్ల డాలర్ల సుంకాలు విధించారు. ఇందుకు ప్రతీకారంగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై సుంకాలను పెంచే యోచనలో ఉంది. ఈ పరిణామం అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ తీవ్రతను మరింత పెంచనుందన్న భయాలతో స్టాక్ మార్కెట్‌వర్గాలు పెద్ద ఎత్తున అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో సెన్సెక్స్ 409.73 పాయింట్లు (1.24 శాతం) క్షీణించి 32596.54 వద్ద ముగిసింది. గత ఏడాది అక్టోబరు 23 తర్వాత సూచీకిదే కనిష్ఠ స్థాయి. ఇక నిఫ్టీ 116.70 పాయింట్లు (1.15 శాతం) పతనమై 9998.05 స్థాయికి జారుకుంది. 2017 అక్టోబర్ 11న నిఫ్టీ 9984.80 వద్ద ముగింపును నమోదు చేసుకుంది. బ్లూచిప్ కంపెనీలతోపాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లోనూ అమ్మకాల ఒత్తిడి పెరిగింది. దాంతో బిఎస్ఇ స్మాల్ ఇండెక్స్ 1.54 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 1.36 శాతం తగ్గాయి.

> వాణిజ్య యుద్ధ భయాలతోపాటు ముడి చమురు ధరల పెరుగుతూపోతున్న కారణంగా మార్కెట్లో ఊగిసలాటలు తీవ్రతరమైన నేపథ్యంలో సూచీలు క్రమంగా పట్టు కోల్పోతున్నాయి. సూచీలు పతాక స్థాయి నుంచి 10 శాతం వరకు కరెక్షన్‌కు గురయ్యాయి. ముఖ్యంగా మెటల్, పిఎస్‌యు బ్యాంకుల షేర్లు భారీగా నష్టపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికల్లా మార్కెట్‌పై ఒత్తిడి కాస్త తగ్గవచ్చు.
>
> **– వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్**

### లక్షన్నర కోట్లు హాంఫట్..

పోటెత్తిన అమ్మకాల ప్రవాహంలో రూ.1.57 లక్షల కోట్ల విలువైన మదుపర్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. బిఎస్ఇలోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,57,268.54 కోట్లు తగ్గి రూ.139,30,643 కోట్లకు పరిమితమైంది.



### నాలుగో వారం నష్టాల్లోనే

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలు నమోదు చేసుకోవడం ఇది వరుసగా నాలుగోవారం. ఈ వారంలో సెన్సెక్స్ 579.46 పాయింట్లు (1.75 శాతం) కోల్పోగా.. నిఫ్టీ 197.10 పాయింట్లు (1.93 శాతం) నష్టపోయింది.




### అంతర్జాతీయంగా బేరిష్ ట్రెండే..

ట్రేడ్ వార్ తీవ్రతరమైన నేపథ్యంలో మదుపర్లలో సెంటిమెంట్ మరింత బేరిష్‌గా మారింది. అమెరికన్ వాల్‌స్ట్రీట్‌తోపాటు ఆసియా, యూరప్ మార్కెట్ సూచీలు సైతం నష్టాల్లోనే ముగిశాయి.

### రియల్టీ, మెటల్, బ్యాంకింగ్ స్టాక్స్‌పై భారీ ఒత్తిడి

వారాంతం ట్రేడింగ్‌లో రియల్టీ, మెటల్, బ్యాంకెక్స్, క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, పిఎస్‌యు, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్ల అమ్మకాల ఒత్తిడి తీవ్రతరమైంది. లోహ రంగానికి చెందిన సెయిల్, జిందాల్ స్టీల్, వేదాంత, హిండాల్కో, నేషనల్ అల్యూమినియం, హిందుస్థాన్ జింక్, టాటా స్టీల్, ఎన్‌ఎండిసి, జెఎస్‌డబ్ల్యు స్టీల్ కంపెనీల షేర్లు గరిష్ఠంగా 6.58 శాతం వరకు నష్టపోయాయి. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 24 నష్టాల్లో ముగిశాయి. యెస్ బ్యాంక్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్ స్టాకులు 4 శాతం వరకు పతనమయ్యాయి. టాటా మోటార్స్, ఎల్ అండ్ టి, బజాజ్ ఆటో, డాక్టర్ రెడ్డీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, విప్రో, హెచ్‌డిఎఫ్‌సి, సన్‌ఫార్మా, హీరో మోటోకార్ప్, హెచ్‌యుఎల్, మారుతి సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, ఒఎన్‌జిసి, ఐటిసి, టిసిఎస్, ఎన్‌టిపిసి షేర్లు గరిష్ఠంగా 2.10 శాతం వరకు మార్కెట్ విలువను కోల్పోయాయి. ఐటి, మీడియా రంగాల స్టాకులు మాత్రం పాజిటివ్ జోన్‌లో కొనసాగాయి. అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోల్ ఇండియా, ఏషియన్ పెయింట్స్ 0.99 శాతం వరకు లాభపడ్డాయి.

రంగాల వారీగా చూస్తే.. రియల్టీ 3.31 శాతం, మెటల్ 2.89 శాతం, బ్యాంకెక్స్ 2.08 శాతం దిగజారాయి. ఫైనాన్స్ 1.73 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.56 శాతం, హెల్త్‌కేర్ 1.48 శాతం, పిఎస్‌యు 1.30 శాతం, ఎనర్జీ 1.15 శాతం తగ్గాయి.

### వారం గరిష్ఠానికి రూపాయి

వాణిజ్య యుద్ధ భయాలు ఈక్విటీలను దెబ్బతీసినప్పటికీ దేశీయ కరెన్సీ విలువను పెంచాయి. డాలర్‌తో రూపాయి మారకం రేటు 0.16 శాతం మెరుగై 65.01 వద్ద స్థిరపడింది. దాంతో మారకం విలువ వారం గరిష్ఠానికి బలపడింది.

ఆంధ్రజ్యోతి

విజయవాడ • శనివారం 24 మార్చి 2018

# రియల్ ఎస్టేట్



# దుబాయ్‌లో మనకో ఇల్లు

అంతర్జాతీయ వాణిజ్య హబ్‌గా రూపుదిద్దుకున్న దుబాయ్‌లో రియల్ ఎస్టేట్ రంగం అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది. ఇక్కడ రెసిడెన్షియల్ ప్రాపర్టీల్లో పెట్టుబడులకు విదేశీ పౌరులు ఆసక్తి చూపిస్తున్నారు. అంతర్జాతీయ వాణిజ్య హబ్‌గా, నెట్‌వర్క్ కేంద్రంగా దుబాయ్‌కి ఉన్న ప్రత్యేకతలతోపాటు అక్కడ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం, ప్రోత్సాహకాలు, ఇతర ప్రత్యేకతలు ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్నాయి. దుబాయ్‌లో ఇల్లు కొనుక్కునేలా ప్రోత్సహిస్తున్నాయి.

## రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ కొత్తపుంతలు

## భారీగా కొంటున్న భారతీయులు

### రూ.కోటి ఇల్లు కొంటే రెసిడెన్షియల్ వీసా

దుబాయ్‌లో కోటి రూపాయలకన్నా ఎక్కువ ధర కలిగిన ఇంటిని కొనుగోలు చేస్తే ప్రభుత్వం నివాస వీసాను ఇస్తోంది. ఈ నేపథ్యంలోనే సంపన్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు దుబాయ్‌లో ఇళ్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపార పనులపై తరచూ దుబాయ్ సందర్శించేవారు ఈ విషయంలో ముందున్నారు. నివాస గృహాల ధరలు తక్కువగా ఉండటం కూడా దుబాయ్ రియల్టీపై ఇతర దేశస్తుల ఆసక్తికి ముఖ్యకారణం. హైదరాబాద్‌లోని మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ల ధర కోటి రూపాయలకు పైనే ఉంటుంది. బెంగళూరు, ముంబైవంటి నగరాల్లో రేట్లు హైదరాబాద్ కంటే ఇంకా చాలా ఎక్కువ. దుబాయ్‌లో ఒక మోస్తరు అపార్ట్‌మెంట్ 50-60 లక్షల రూపాయలకు కూడా లభిస్తుంది. లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల ధరలు కోట్లలో ఉంటాయి. అది వేరే విషయం. విదేశీ ప్రయాణాలపై ఆసక్తి ఉన్న చాలా మంది ఐటి ఉద్యోగులు, సినీ, క్రీడా రంగాల సెలబ్రిటీలు, వ్యాపారస్తులు, సంపన్నులు దుబాయ్‌లో ఇళ్లను కొనుగోలు చేస్తున్నారు.

### వాణిజ్యానికి కీలక కేంద్రం

ఒకవైపు సముద్రం.. మరోవైపు ఎడారి తప్ప మరే ప్రత్యేకతలు లేని ఈ చిన్న గల్ఫ్ రాజ్యం గత కొన్నేళ్లలో అంతర్జాతీయ వాణిజ్యానికి కీలక కేంద్రంగా ఎదిగింది. టూరిజం, ఫైనాన్స్, ఇంటర్నెట్, హెల్త్‌కేర్, రిటైల్ షాపింగ్‌కు కేరాఫ్‌గా మారింది. బహుళ అంతస్తుల భారీ సౌధం బూర్జ్ ఖలీఫా, అబ్బురపరిచే పామ్ జుమేరా, సముద్రంలో విస్తరించి ఉన్న అనేక చిన్న చిన్న దీవులు....దుబాయ్ ప్రత్యేక ఆకర్షణ. భారతీయులతో సహా ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన వారు ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం కోసం తరలివస్తుండటంతో దుబాయ్ అత్యాధునిక అంతర్జాతీయ నగరంగా రూపుదిద్దుకొంది. ప్రస్తుతం దుబాయ్ జనాభా 28 లక్షలు. 2030నాటికి దీని జనాభా 50 లక్షలకు చేరుకుంటుదన్న అంచనాతో ఇక్కడ భారీ ఎత్తున గృహ నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు చేపడుతున్నారు.

### మోసాలకు తావులేదు..

దుబాయ్‌లోని టాప్ 10 రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఆరు ప్రభుత్వరంగానికి చెందినవే. వీటిలో ప్రభుత్వానిదే మెజార్టీ వాటా. అందుబాటు ధరల్లో గృహాలు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందువల్ల రియల్ వ్యాపారంలో మోసాలకు ఆస్కారం లేకుండాపోయింది. ప్రభుత్వ చట్టాలు కూడా కఠినంగా ఉంటాయి. దుబాయ్ రియల్టీ రంగం పూర్తిగా వ్యవస్థీకృతమైంది. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఆధారితంగా రియల్ ఎస్టేట్ లావాదేవీలు జరుగుతాయి. ప్రాపర్టీ ఎవరి పేరు మీద ఉన్నదీ సులభంగా తెలిసిపోతుంది. కాబట్టి ఇంటి కొనుగోళ్ల విషయంలో ఎలాంటి సంశయం ఉండదు. ప్రాపర్టీ కొనుగోలు చేసిన కొన్ని రోజుల్లోనే కొనుగోలుదారు పేరు మీదకు మారిపోతుంది.

### పన్నుల బెడద లేదు

ఇంటిని కొనుగోలు చేసే సమయంలో మన దగ్గర జిఎస్‌టి (12 శాతం), రిజిస్ట్రేషన్ చార్జీలు (ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఉంటుంది) చెల్లించాల్సి ఉంటుంది. కానీ దుబాయ్‌లో కేవలం 4 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. ఒకవేళ కొనుగోలు చేసిన ఇంటిని అద్దెకు ఇస్తే 8-9 శాతం రాబడి వస్తుంది. దీనిపై ఎలాంటి పన్ను ఉండదు. ఇంటిని స్వల్పకాలం లేదా దీర్ఘకాలం అద్దెకు ఇవ్వవచ్చు. ఇంటిని కొనుగోలు చేసిన వారికి ఉచితంగానే పార్కింగ్ ఏరియాను ఇస్తారు. ఇంటి విస్తీర్ణాన్ని బట్టి ఇది ఆధారపడి ఉంటుంది.

### ఏడాదిలో రూ.30,000 కోట్ల పెట్టుబడులు

దుబాయ్ పశ్చిమాసియా దేశాలకు ప్రధాన కేంద్రంగా ఉంది. ఆసియా, పశ్చిమదేశాల మధ్య కీలకమైన కూడలిగా ఉంది. అనేక దేశాలకు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించడం సులభం. హైదరాబాద్ వంటి నగరాల నుంచి మూడు నాలుగు గంటల్లో దుబాయ్ చేరుకోవచ్చు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా పలువురు ప్రముఖులు దుబాయ్‌లో ఇళ్లను కొనుగోలు చేసినట్టు ప్రాపర్టీ కన్సల్టింగ్ సంస్థ రెయిన్ అండ్ హార్న్ వెల్లడించింది. గత ఏడాదిలో భారత సంతతికి చెందిన వారు 7,000 గృహాలను కొనుగోలు చేశారు. వీటి విలువ సుమారు 30,000 కోట్ల రూపాయలు. అంతకు ముందు ఏడాదిలో 22,000 కోట్ల రూపాయల విలువైన గృహాల కొనుగోళ్లు జరిగాయి.

### రాబడీ ఉంటుంది..

నివాసం కోసం కొందరు, పెట్టుబడి దృక్పథంతో మరికొందరు దుబాయ్‌లో ప్రాపర్టీలను కొనుగోలు చేస్తున్నారు. కొత్తగా రూపుదిద్దుకుంటున్న దుబాయ్‌లో గృహాలను కొనుగోలు చేస్తున్న వారి సంఖ్యనే అధికంగా ఉంది. దుబాయ్‌లో ఇల్లు కొనుక్కుంటే మరి దాని నిర్వహణ ఎలా అనే బెంగ అక్కరలేదు. ఆన్‌లైన్‌లోనే ఇంటిని హాయిగా అద్దెకు ఇవ్వొచ్చు. డెవలపర్ లేదా మొత్తం ప్రాజెక్టును కొనుగోలు చేసిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు మన తరఫునే అపార్ట్‌మెంట్, ఇల్లును లీజుకు ఇస్తుంది. నెలనెలా రాబడి మన ఖాతాలో జమచేస్తుంది. ఇన్వెస్ట్‌మెంట్ కోసమే ఇల్లు కొనుగోలు చేసినవారు ధరలు పెరిగినప్పుడు అమ్ముకొని లాభాలు కూడా చేసుకోవచ్చు.

- ఆంధ్రజ్యోతి బిజినెస్

## ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తీసుకున్నారా?

రెసిడెన్షియల్ ఫ్లాట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు, విల్లాల కొనుగోలు సందర్భంలో వినిపించే ఓ పత్రం 'ఆక్యుపెన్సీ సర్టిఫికెట్'. ఇది అత్యంత కీలకమైన డాక్యుమెంట్. విధిగా ప్రభుత్వ సంస్థల నుంచి తీసుకొని తీరాలి.

### ఎందుకంటే?

అపార్ట్‌మెంట్, ఇల్లు, విల్లా.. ఏదైనా సరే నిర్మాణానికి కొన్ని నిబంధనలుంటాయి. ప్రభుత్వం, స్థానిక సంస్థల రెగ్యులేషన్లు ఉంటాయి. వీటికి లోబడే అనుమతులిస్తారు. నిర్మాణం వాటి ప్రకారమే జరగాలి. నిర్మాణానికి అనుమతులచ్చిన సంస్థనే ఆఖరులో నిర్మాణం అంతా నియమ నిబంధనలకు లోబడే జరిగిందనీ, ఇంట్లో నివాసముండటం సురక్షితమేనని నిశ్చయించుకున్న తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తుంది.

### ఎవరు జారీ చేస్తారు ?

గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేటషన్లు, నగరాభివృద్ధి సంస్థలు ఇలా ఏ సంస్థ పరిధిలో నిర్మాణం జరిగితే ఆ సంస్థనే నిర్మాణ అనుమతులు ఆఖరులో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. నిబంధనలు పాటించలేదన్న అభిప్రాయం కలిగితే, నిబంధనలకు తగ్గట్టు నిర్మాణ డిజైన్‌ను లేదా నిర్మాణాన్ని మార్చాల్సిందేనని స్పష్టం చేస్తారు.

### ఉంటేనే మౌలిక వసతులు

గతంలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉంటేనే ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ జరిగేది. ఇప్పుడులేకున్నా అనుమతిస్తున్నారు. ఇంటి పన్ను కట్టాలన్నా, విద్యుత్ కనెక్షన్, వాటర్ కనెక్షన్ తీసుకోవాలన్నా ఈ సర్టిఫికెట్ తప్పనిసరి. ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌లో భవనం భద్రత, శానిటేషన్, వాటర్ పిట్స్, సెట్ బ్యాక్స్, పార్కింగ్ ఇలా అన్ని అంశాలు ఉంటాయి. బ్యాంకు రుణాలకు కూడా అక్యుపెన్సీ సర్టిఫికెట్ కీలకం. నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టుల్లో ఇది లేకుంటే రుణాలురావడం కష్టం. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల విషయంలో మాత్రం వాయిదాల ప్రకారం రుణాన్ని ఇస్తారు. ఆఖరు వాయిదా రుణాన్ని విడుదల చేసేనాటికి అక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. సాధారణంగా నిర్మాణం మొత్తం పూర్తయిన తర్వాతనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తారు. మధ్యలో ఇచ్చారంటే ఏదో మతలబు ఉందని అర్థం. ఆ తర్వాత బిల్డర్ తాను విధిగా కల్పించాల్సిన సౌకర్యాల బాధ్యత నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది.

### రెండు రకాలు

సాధారణంగా టెంపరరి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ మొదట 90 రోజులకు ఇస్తారు. తర్వాత 90 రోజులలో సంబంధిత అధికారులు ఇన్‌స్పెక్షన్ చేసి ఒరిజినల్ సర్టిఫికెట్ జారీచేస్తారు. ఈ సర్టిఫికెట్ దరఖాస్తు చేసిన 30 రోజుల్లో జారీ చేస్తారు. ఏడు మీటర్ల ఎత్తు లేదా 100 ఎస్‌ఎఫ్‌టి భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చికం.

### సర్టిఫికెట్ లేదంటే అనుమానించాల్సిందే...

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని భవనం సురక్షితమా కాదా అంటే కాదనే చెప్పాలి. నిబంధనలను పాటించకపోతే, నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తే అక్యుపేషన్ సర్టిఫికెట్ రాదు. అక్రమనిర్మాణాలకు అసలే ఇవ్వరు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ప్రాపర్‌గా తీసుకున్నారా లేదా కూడా కొనుగోలుదారులు చెక్ చేసుకోవాలి. అక్రమంగా కట్టిన పై అంతస్తులను బోగస్ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌తో కొందరు డెవలపర్లు అంటగడుతుంటారు. దీనివల్ల బ్యాంకు నుంచి రుణం రాదు, అనుకోని ప్రమాదం జరిగితే బీమా కూడా వర్తించదు.



▸▸ మీ ఆఫీస్.. మా ఆఫీస్... మన ఆఫీస్

## కో వర్కింగ్ స్పేస్‌కు భలే డిమాండ్

### ఖర్చు తక్కువ లాభమెక్కువ

రోజురోజుకు పెరుగుతున్న రియల్టీ, రెంటల్ ధరలతో కార్పొరేట్ సంస్థలు, స్టార్టప్స్, చిన్న వ్యాపార సంస్థలు.. కో వర్కింగ్ స్పేస్ పట్ల మక్కువ చూపుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో వృద్ధి జోరందుకోవటంతోపాటు వ్యాపార కార్యకలాపాలు ఊపందుకుంటుండటంతో ప్రధానంగా మెట్రో నగరాల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) సంస్థలు, స్టార్టప్స్ తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు కో వర్కింగ్ స్పేస్‌ను ఎంచుకుంటున్నాయి. కో వర్కింగ్ ప్లేస్‌లో ప్లగ్ అండ్ ప్లే విధానంలో అన్ని రకాలైన సేవలు అందుబాటులో ఉండటం, సొంతంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసే ఖర్చుతో పోలిస్తే ఇక్కడ తక్కువ ఖర్చుతోనే అన్ని సదుపాయాలు ఉండటం ఈ సంస్థలను అమితంగా ఆకర్షిస్తోంది. ఐటి రంగానికి కీలకంగా ఉన్న ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, పుణెలో కో వర్కింగ్ స్పేస్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. దేశవ్యాప్తంగా 15.4 లక్షల మంది ఫ్రీలాన్సర్లు, లక్ష మంది స్టార్టప్స్, 15.4 లక్షల ఎస్‌ఎంఇలు, 1.03 కోట్ల ఎంటర్‌ప్రైజెస్ ఈ విభాగానికి కీలకంగా ఉన్నాయి. మరోవైపు కో వర్కింగ్ స్పేస్ సంస్కృతి ఇప్పుడిప్పుడే ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తోంది. ఈ విభాగంలో అంతర్జాతీయ సంస్థలతో పాటు దేశీయ సంస్థలు పెద్ద ఎత్తున కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

### ఏటా 20 శాతం వృద్ధి

కో వర్కింగ్ స్పేస్ విభాగంలో ఏటా 20 శాతం వృద్ధి నమోదవుతోంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఐడబ్ల్యుజి కంట్రీ హెడ్ హర్ష్ లాంబ. ఐటి, ఐటి ఆధారిత కంపెనీలు ప్రధాన నగరాల నుంచి ద్వితీయ నగరాల బాట పడుతుండటం కలిసి వస్తుందని అంటున్నారాయన. ఇందులో భాగంగానే ఐడబ్ల్యుజి విశాఖపట్నం, కోయంబత్తూర్, తిరుచ్చి, విజయవాడ వంటి నగరాలకు విస్తరిస్తోంది. కో వర్కింగ్ స్పేసెస్‌లో భిన్న రకాలైన వ్యక్తుల మధ్య పనిచేయటమే కాకుండా విభిన్న రంగాల గురించి తెలుసుకునే అవకాశం ఉండటంతో నవతరం దాదాపు వీటిని ఎంచుకుంటూ వస్తోంది. ఇదే సమయంలో టాలెంట్‌ను అందిపుచ్చుకోవటం కోసం కార్పొరేట్ సంస్థలు కూడా ఈ బాటలోకి అడుగుపెడుతున్నాయి.

### రెండేళ్లలో కోటి చదరపు అడుగులకు..

ప్రస్తుతం దేశంలో కో వర్కింగ్ స్పేస్ సంస్థల చేతుల్లో 25-30 లక్షల చదరపు అడుగుల స్థలం ఉంది. 2020 నాటికి ఇది 90 లక్షల నుంచి కోటి చదరపు అడుగులకు విస్తరించే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం స్టార్టప్, ఎస్‌ఎంఇలు.. కో వర్కింగ్ స్పేస్‌పై ప్రధానంగా దృష్టి పెడుతున్నప్పటికీ భవిష్యత్తులో ఇది కార్పొరేట్ రంగం కూడా దీనికి మక్కువ చూసే అవకాశం ఉంది.

నేటి యువతరం పరిమిత స్థలంలో ఒకేచోట కూర్చుని ఉద్యోగం చేయటానికి ఆసక్తి చూపించకపోవచ్చని ఈ విభాగంలోని కంపెనీలు అంచనా వేస్తున్నాయి. ఇదే రానున్న రోజుల్లో తమకు కలిసి వచ్చే అంశమని భావిస్తున్నాయి. దీంతో ఈ విభాగంపై దేశీయ కంపెనీలే కాకుండా అంతర్జాతీయ కంపెనీలు కన్నేశాయి. రీగస్, స్పేసెస్, సిగ్నేచర్, ఓపెన్ ఆఫీస్, కోరా వంటి పేర్లతో కో వర్కింగ్ స్పేస్ సదుపాయాలను కల్పిస్తోంది ఇంటర్నేషనల్ వర్క్‌ప్లేస్ గ్రూప్ (ఐడబ్ల్యుజి). ఈ సంస్థ దేశవ్యాప్తంగా 16 నగరాల్లో 20 వేల సీట్ల సామర్థ్యంగల 104 స్పేసెస్‌ను నిర్వహిస్తోంది. వచ్చే ఏడాదిన్నర, రెండేళ్ల కాలంలో ఈ సంఖ్యను రెట్టింపు చేసే దిశగా సన్నాహాలు చేస్తోంది. ఐడబ్ల్యుజితోపాటు మరో అంతర్జాతీయ సంస్థ వి వర్క్, దేశీయ సంస్థలైన రెంట్ ఎ డెస్క్, కో వర్క్ జోన్, షేర్డ్ ఆఫీస్ స్పేస్, 91 స్ప్రింగ్ బోర్డ్ స్పేస్, హ్యాచ్ స్టేషన్, అవర్ హబ్, ది వ్యాలీ, జాక్ యువర్ స్టార్టప్ వంటి సంస్థలు ఈ విభాగంలో కార్యకలాపాలను సాగిస్తున్నాయి. ఐడబ్ల్యుజి ఇప్పటికే హైదరాబాద్‌లో 1,500 సీట్ల సామర్థ్యంతో కూడిన 8 కో వర్కింగ్ ప్లేసెస్‌ను నిర్వహిస్తోంది. ఏడాదిలోగా ఈ సంఖ్యను రెండింతలు పెంచాలని చూస్తోంది. ఈ సంస్థ విశాఖపట్నంలోనూ ఒక కో వర్కింగ్ స్పేస్‌ను నిర్వహిస్తోంది. ఈ ఏడాది విజయవాడకు విస్తరించాలని నిర్ణయించుకుంది. ఐడబ్ల్యుజి తర్వాత హైదరాబాద్‌లో రెంట్ ఎ డెస్క్.. కో వర్కింగ్ స్పేస్‌లో కీలకంగా ఉంది. ఈ సంస్థ హైదరాబాద్‌లో మూడు వర్కింగ్ స్పేస్‌లను నిర్వహిస్తోంది. కో వర్క్ జోన్ హైదరాబాద్ సహా ప్రధాన నగరాల్లో సేవలందిస్తోంది. ఈ సంస్థ స్టార్టప్స్ కోసం ప్రత్యేకంగా క్యాబిన్స్ కూడా ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం దేశంలో అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన టి-హబ్‌తో కూడా జట్టు కట్టింది.

- ఆంధ్రజ్యోతి బిజినెస్

## గ్లోబల్ అట్రాక్షన్ హైదరాబాద్

హైదరాబాద్ రియల్టీలో అంతర్జాతీయ పెట్టుబడులు పెరుగుతున్నాయి. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ మందగమనంలో ఉన్నప్పటికీ హైదరాబాద్ మాత్రం దూసుకుపోతున్నది. ప్రధాన నగరాలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణెలో రియల్టీ నిరుత్సాహంగానే ఉంది. 2013-14తో పోలిస్తే అమ్మకాల్లో తరుగుదల ఉంది. ఢిల్లీలో దాదాపు 67 శాతం తిరోగమనం ఉంది. బెంగళూరు 21 శాతం పడిపోయింది. ఇదే కాలంలో హైదరాబాద్‌లో మాత్రం రియల్టీ అమ్మకాల్లో 32 శాతం వృద్ధి ఉన్నట్టు అనరాక్ అనే ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ వెల్లడించింది. అమ్మకాల్లో వృద్ధి ఉన్నప్పటికీ టాప్ ఫోర్ నగరాలు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, పుణెతో పోలిస్తే హైదరాబాద్‌లో విక్రయిస్తున్న ఇళ్ల పరిమాణం తక్కువే.



### హైదరాబాద్ రియల్టీలో జోరుకు ఇవీ కారణాలు

- ప్రభుత్వం ప్రోయాక్టివ్‌గా ఉండటం. మెట్రో రైలు, స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్, మెట్రోను ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానం చేయాలన్న ప్రతిపాదన, ఎలివేటెడ్ కారిడార్ల ప్రతిపాదన.. హైదరాబాద్ ప్రాపర్టీ మార్కెట్‌పై ఆసక్తిని పెంచుతున్నాయి.
- ప్రత్యేక హోదా విషయంలో ఏర్పడిన అనిశ్చితి కారణంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పెట్టుబడులపై ఆసక్తితో ఉన్నవారు కూడా ఇప్పుడు వెనకంజవేస్తున్నారు. ఈ పరిణామం కూడా హైదరాబాద్‌కు కలిసివస్తోంది. అమరావతిలో పెట్టుబడుల కోసం నగదు సిద్ధం చేసుకున్న కొందరు ప్రవాస భారతీయులు ఇప్పుడు హైదరాబాద్‌వైపు మొగ్గు చూపిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ చేసి అమరావతిలో పరిస్థితి సానుకూలంగా మారగానే అక్కడ ప్రాఫిట్ బుక్ చేసుకొని అమరావతిలో ఇన్వెస్ట్ చేయవచ్చన్నది వారి ఆలోచన.
- కొత్త ఐటి కంపెనీల ఏర్పాటు కారణంగా నానక్‌రామ్ గూడ, గచ్చిబౌలి వంటి ప్రాంతాలతోపాటు చిలుకూరు, శంషాబాద్, యాదాద్రి భువనగిరి, వికారాబాద్ వంటి ప్రాంతాలకు కూడా రియల్టీ విస్తరిస్తోంది. చౌకగా ప్రాపర్టీలు లభిస్తుండటం వల్ల కొనుగోళ్లు కూడా పెరుగుతున్నాయి.
- కొద్ది రోజుల క్రితమే మెర్సర్ క్వాలిటీ లివింగ్ విషయంలో హైదరాబాద్‌కు అత్యుత్తమ ర్యాంక్ ఇచ్చింది. గ్లోబల్‌గా హైదరాబాద్ ర్యాంక్ 142. ఈ విషయంలో చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, ఢిల్లీ కూడా హైదరాబాద్ కంటే వెనకే ఉన్నాయి. క్వాలిటీ లివింగ్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ మెరుగైన స్థానంలో ఉండటం వరుసగా ఇది నాలుగో సంవత్సరం.

గుంటూరు టూ గుజరాత్

# జీజీహెచ్‌లో మోకీలు శస్త్రచికిత్స లైవ్

**» తొలి సర్జికల్ వర్క్‌షాప్ విజయవంతం**

గుంటూరు (మెడికల్) మార్చి 23: అంతర్జాతీయ ఆర్థోపెడిక్ వైద్య సదస్సులో భాగంగా గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన మోకీలు మార్పిడి శస్త్రచికిత్సను గుజరాత్‌లోని వాపిలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. మార్చి 23, 24, 25 తేదీల్లో దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో నిర్వహించే మోకీలు ఆపరేషన్‌లను అక్కడ ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. ఇందులో భాగంగా గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, డాక్టర్ జీవర ప్రసాద్, డాక్టర్ పి.అనిల్‌బాబు వైద్య బృందం మోకీలు మార్పిడి ఆపరేషన్ చేసింది. గుజరాత్‌లోని సభా వేదికపై డాక్టర్ మార్కోస్ (ఢిల్లీ), డాక్టర్ డిసోజా (బ్రెజిల్) కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. విదేశీ వైద్య ప్రతినిధులు అడిగిన సందేహాలకు ఆపరేషన్ చేస్తూనే డాక్టర్ నరేంద్రరెడ్డి సమాధానాలు ఇచ్చారు. 23 దేశాల నుంచి హాజరైన వైద్యులు తిలకించారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి పొదిల ప్రసాద్ బ్లాక్‌లోని మాడ్యులార్ ఆపరేషన్ థియేటర్‌లో సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు శస్త్ర చికిత్స పూర్తిచేశారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగం, ఉన్నతి ఫౌండేషన్, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ దీనిని నిర్వహించాయి. ప్రభుత్వాస్పత్రిలో అత్యంత నాణ్యంగా మోకీలు మార్పిడి ఆపరేషన్ చేయడంపై విదేశీ డాక్టర్లు అభినందనలు తెలిపారు. కాగా, లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ తో జీజీహెచ్ ఖ్యాతి మరోసారి అంతర్జాతీయ స్థాయికి చేరిందని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శస్త్రచికిత్స ముగిసిన తర్వాత గుంటూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ఆయన వైద్యులను అభినందించారు.



జీజీహెచ్‌లో జరుగుతున్న శస్త్రచికిత్సను లైవ్‌లో గుజరాత్‌లో తిలకిస్తున్న డాక్టర్లు డిసౌజా, మార్కోస్



డాక్టర్ నరేంద్రరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి పుల్లారావు

## సమ్మిళిత వృద్ధికి అధిక ప్రాధాన్యం

**» అసెంబ్లీలో మంత్రి యనమల**

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆదాయం లేకుండా నూరు శాతం ప్రభుత్వంపై ఆధారపడే వర్గాలను దృష్టిలో ఉంచుకుని సమ్మిళిత వృద్ధిని సాధించేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. యువజన సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్టు చెప్పారు. రాష్ట్రంలో వృద్ధిరేటు 11.22శాతం ఉండగా దేశంలో 6.6 శాతంగా ఉందని చెప్పారు. వృద్ధిరేటు పెరగాలంటే ఎక్కువ మందికి ఉద్యోగాలు రావాలని, దీనికోసం యూత్ పాలసీ తీసుకువస్తున్నామని చెప్పారు. శుక్రవారం శాసనసభలో 'సమ్మిళిత వృద్ధి'పై జరిగిన చర్చలో టీడీపీ సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, ఎంఎస్‌రాజు, బీసొమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్‌అండ్‌బీకి బదిలీ అయిన రోడ్లకు నిధుల కేటాయింపు విషయంలో వ్యత్యాసం లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. పంచాయతీరాజ్ నుంచి మొత్తం 6,036 కిలోమీటర్ల పొడవైన రోడ్లు ఆర్‌అండ్‌బీకి బదిలీ అయ్యాయని చెప్పారు. శుక్రవారం శాసనసభలో టీడీపీ సభ్యులు గౌతు శ్యామ్ సుందర్ శివాజీ, రామాంజనేయులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. బదిలీ అయిన కంకర, మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలంటే రూ.4,600కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని కోరినట్లు మంత్రి తెలిపారు.

## అన్ని వర్సిటీలకూ ఒకే కేలండర్ : మంత్రి గంటా

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు ఒకే కేలండర్ అందుబాటులోకి తెస్తామని మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన శాసన మండలిలో మాట్లాడుతూ ఆ కేలండర్ ప్రకారమే విద్యార్థులకు తరగతులు, పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల కేంద్రీయ యూనివర్సిటీలు నిర్వహించే పరీక్షలకు రాష్ట్ర విద్యార్థులు సన్నద్ధులయ్యే అవకాశం కలుగుతుందన్నారు. ప్రస్తుతం ఒక్కో వర్సిటీకి ఒక్కో కేలండర్ ఉండటంతో విద్యార్థులు స్కాలర్‌షిప్పులు, ఫెలోషిప్‌ల రూపంలోనూ, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో చదువుకునే అవకాశాలను విద్యార్థులు కోల్పోతున్నారని మంత్రి వివరించారు.

### 52కోట్లతో మహాయాన బుద్ధిస్టు సర్క్యూట్

రాష్ట్రాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా మహాయాన బుద్ధిస్టు సర్క్యూట్‌ను ప్రారంభించామని మంత్రి అఖిలప్రియ అన్నారు. రూ.52.34కోట్లతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. బౌద్ధారామాలైన నాగార్జునకొండ, అమరావతి, శాలిహుండం, తొట్లకొండ, భావికొండను సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

## బాలల హక్కుల పరిరక్షణ మన బాధ్యత: పరిటాల

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులపై అవగాహన కల్పించడంతోపాటు వాటి పరిరక్షణ బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరూ స్వీకరించాలని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత అన్నారు. విజయవాడ మధురానగర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నూతన కార్యాలయాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో ఆచారం పేరుతో వెయ్యి మంది బాలబాలికలతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అలాంటి వాటిని అరికట్టడంలో తమ శాఖ ముందుచూపుతో వ్యవహరిస్తుందని అన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా పెళ్లిళ్లు జరిగితే 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ప్రభుత్వ విప్ కె.రవికుమార్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మహిళా శిశు సంక్షేమ కార్యదర్శి కె.సునీత, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ హైమావతి పాల్గొన్నారు.

## ఐదు పద్దులకు ఏకగ్రీవ ఆమోదం

అమరావతి: వార్షిక బడ్జెట్‌కు సంబంధించి పలు శాఖలకు చెందిన ఐదు పద్దులకు శాసనసభ శుక్రవారం ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. 2018-19 సంవత్సరానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల నిర్వహణకు రూ.3,200కోట్లు కేటాయించాలని కోరుతూ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ప్రవేశపెట్టిన పద్దును సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆబ్కారీశాఖ నిర్వహణకురూ.450కోట్లు కేటాయించాలని కోరుతూ ఎక్సైజ్ మంత్రి కేఎస్ జవహర్, హోం, విపత్తుల నిర్వహణకు రూ.6,226 కోట్లు కేటాయించాలని కోరుతూ మంత్రి చినరాజప్ప వేర్వేరుగా ప్రతిపాదించిన పద్దులకు సభ ఆమోదముద్ర వేసింది. అదేవిధంగా వాణిజ్య పన్నులశాఖ, రవాణాశాఖ ప్రవేశపెట్టిన మరో రెండు పద్దులపై చర్చ అనంతరం సంబంధిత మంత్రులు చేసిన ప్రతిపాదనలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎమ్మెల్యేలు రామానాయుడు, సూర్యారావు, రాధాకృష్ణ, చాంద్ బాషా, జీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మెప్మా సమాఖ్యలకు 10 అవార్డులు




కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న దృశ్యం

న్యూఢిల్లీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఏపీకి చెందిన 10 పట్టణ సమాఖ్యలకు స్వచ్ఛత ఎక్సలెన్స్ అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ పూరి చేతుల మీదుగా శుక్రవారం ఢిల్లీలో సమాఖ్య సభ్యులు అందుకున్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నందుకు ఈ అవార్డులు వరించాయి. మొత్తం దేశవ్యాప్తంగా 57 అవార్డులు ప్రకటించగా అందులో ఏపీకి 10 వచ్చాయి. వీటిలో గుంటూరుకు 2, నరసరావుపేట, తెనాలి, సత్తెనపల్లి, చీరాల, చీమకుర్తి, సామర్లకోట, నెల్లిమర్ల, సాలూరు పట్టణ మెప్మా సమాఖ్యలు ఒక్కో అవార్డును పొందాయి.

## ఘనవ్యర్థాల నిర్వహణకు కమిటీలు

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బహిరంగ మలవిసర్జన, ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి టెక్నికల్, ప్రాజెక్టు సమీక్ష కమిటీలను నియమిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యదర్శి బి.రామాంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. టెక్నికల్ కమిటీలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు, ఏఎస్‌సీఐ, జీఐజెడ్, బోర్డా, సీడీడీ టెక్నాలజీ పార్టనర్స్, స్వచ్ఛత కార్యక్రమంపై పనిచేస్తున్న ప్రముఖ యూనివర్సిటీల నిష్ణాతులు, నీరి, యూనిసెఫ్, టాటా ట్రస్టు ప్రతినిధులు ఉంటారు. ప్రాజెక్టు సమీక్ష చేసి ఆమోదించే కమిటీకి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి చైర్మన్‌గా, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యదర్శి వైస్ చైర్మన్‌గా, పీఆర్, ఆర్డీ డైరెక్టర్, తాగునీటి కార్పొరేషన్ ఎండీ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు, ఎస్‌పీసీ ఎండీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

## కాటేసిన క్షణికావేశం!

**» బెజవాడలో దంపతుల ఆత్మహత్య**

**» అనారోగ్యం, వ్యాపారంలో నష్టాలు**



గుడూరు కృష్ణ, సత్యవతి (ఫైల్)

విజయవాడ(చిట్టినగర్) మార్చి 23: క్షణికావేశం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ఇల్లు అమ్మి అప్పులు తీర్చే విషయంలో వచ్చిన మాట పట్టింపుతో ఆ దంపతుల జీవితాలు అర్థంతరంగా కడతేరిపోయాయి. విజయవాడ కొత్తపేట అడ్డరోడ్డు సింహాద్రివీధిలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, గుడూరు కృష్ణ (56), సత్యవతి దంపతులు. కృష్ణ కొబ్బరికాయల వ్యాపారం చేస్తుంటే, సత్యవతి టైలరింగ్ చేస్తూ.. సొంతంగా బట్టల దుకాణం ప్రారంభించింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలిద్దరికీ పెళ్లి చేశారు. కుమారుడు బెంగళూరులో సీఏ చదువుతున్నాడు. కృష్ణకు షుగర్ ఉంది. దీనికితోడు బట్టల వ్యాపారంలో బాగా నష్టపోయారు. సుమారు రూ.25 లక్షలు అప్పులు తీర్చేందుకు విజయవాడలో వేరే ప్రాంతంలో తమకున్న ఇంటిని అమ్మాలని కృష్ణ భావించాడు. ఇల్లు అమ్మడాన్ని సత్యవతి వ్యతిరేకించింది. దంపతుల మధ్య మాటామాటా పెరిగింది. ఈ వ్యవహారంలో కృష్ణ బాగా మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఏదో పని మీద భార్య బయటకుపోయిన సమయంలో.. లుంగీతో ఫ్యాన్ కడ్డీకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటికి తిరిగి వచ్చిన సత్యవతి.. భర్త మృతిని తట్టుకోలేకపోయింది. లోపల నుంచి ఇంటి తలుపులు వేసేసింది. ఆయన ఉరి వేసుకున్న లుంగీని మెడ భాగంలో కత్తిరించి, తానూ ఆ లుంగీతోనే ఆత్మహత్య చేసుకుంది. ముందురోజు రాత్రి ఇంటి అమ్మకం విషయమై పెద్ద అల్లుడు రమేశ్ దగ్గర కృష్ణ ప్రస్తావించాడు. రేపు ఉదయం ఇంటికి వస్తాను. అక్కడ మాట్లాడుకొందామని తన మామను రమేశ్ ఇంటిని పంపించాడు. ఆ విషయం మాట్లాడదామని అటువైపు వచ్చిన రమేశ్, ఇంటి తలుపులు వేసి ఉండటంతో బద్దలుకొట్టి చూడగా, అత్తామామ మృతదేహాలు కనిపించాయి.

బకాయిలు చెల్లించకపోతే..

## మిల్లర్లపై క్రిమినల్ కేసులు

**» మంత్రి ప్రత్తిపాటి**



అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైస్ మిల్లర్లు సీఎంఆర్(కస్టమ్-మిల్లింగ్ రైస్) బకాయిలు చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. అవసరమనుకుంటే ఆర్ఆర్ యాక్ట్ కింద ఆయా మిల్లుల యజమానుల నుంచి రికవరీ చేయాలని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్లను మంత్రి ఆదేశించారు. మంత్రి పుల్లారావు శుక్రవారం సచివాలయంలో పౌర సరఫరాలశాఖ ముఖ్యకార్యదర్శి రాజశేఖర్, ఎండీ సూర్యకుమారితో కలిసి 13 జిల్లాల మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా మిల్లర్ల నుంచి రావాల్సిన పాత బకాయిలు, ధాన్యం సేకరణ, స్టాక్ గురించి తెలుసుకున్నారు. సీఎంఆర్‌కు సంబంధించి మిల్లర్ల నుంచి బకాయిలు రావలసి ఉందని అధికారులు తెలిపారు. దీంతో మంత్రి పైవిధంగా ఆదేశించారు. పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్లుల్లో బియ్యం లావాదేవీలు కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చెయ్యాలన్నారు. కొన్ని చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనం, గర్భిణులు, బాలింతలకు సరఫరా చేస్తున్న బియ్యం నాసిరకంగా ఉంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నాసిరకం బియ్యం సరఫరాకు మేనేజర్లు అడ్డుకట్ట వేసేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకానికి స్వర్ణ, ఎన్‌ఎల్ ఆర్ వంటి బియ్యం రకాలు అందించేలా చూడాలన్నారు.

### డెయిరీలను ప్రోత్సహించాలి: మంత్రి ఆది

రాష్ట్రంలోని ప్రతి పశు వైద్యాధికారి తమ పరిధిలో ఒక డెయిరీని ఏర్పాటు చేయించేందుకు కృషి చేయాలని పశుసంవర్ధకశాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి అన్నారు. సచివాలయంలో శుక్రవారం పశు సంవర్ధకశాఖ ప్రగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధంగా పాడి పరిశ్రమను ప్రోత్సహించాలన్నారు. తద్వారా రాష్ట్రంలో కొత్తగా మరో 1500 డెయిరీ యూనిట్లు వస్తాయని చెప్పారు. ప్రతి కుటుంబానికీ రూ.పది వేల ఆదాయం వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ముద్ర, ఇతర కార్పొరేషన్ రుణాలతో డెయిరీలను, పాడి గేదెల పెంపకాన్ని చేపట్టాలన్నారు. 2 ఆవులు లేదా గేదెలు, 5 గొర్రెలు, లేదా మేకలు, 20 కోళ్లతో ఒక కుటుంబం సంతోషంగా జీవించవచ్చని చెప్పారు.

# రెండేళ్లలో లక్ష

## రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ప్రోత్సాహం



**» త్వరలో కొత్త పాలసీ**

**» ఎలక్ట్రిక్ వాహన సంవత్సరంగా 2018**

**» సంస్థల ప్రతినిధులతో సీఎం భేటీ**




సచివాలయం ప్రాంగణంలో బ్యాటరీ బస్సును ప్రారంభించి, దానిలో ప్రయాణిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండేళ్లలో లక్ష ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్) అధికారులతో సీఎం సమావేశమయ్యారు. అంతకుముందు చైనాకు చెందిన బీవైడీ, హైదరాబాద్‌కు చెందిన గోల్డ్‌స్టోన్ ఇన్‌ఫ్రాటెక్ సంయుక్తంగా తయారుచేసిన ఎలక్ట్రిక్ బస్సును పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి బస్సులో సచివాలయ ప్రాంగణంలో ప్రయాణించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ వాహన సంవత్సరంగా 2018ను ప్రకటించాం. కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు యువతకు విస్తృతంగా ఉపాధి కల్పించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల తయారీని ప్రోత్సహిస్తామని, తయారీదారులకు భారీగా ప్రోత్సాహకాలు అందిస్తామని, ఇందుకు సంబంధించిన పాలసీని త్వరలో రూపొందిస్తామని చెప్పారు. విజయవాడ, విశాఖ, తిరుపతిలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంతో వాతావరణ కాలుష్యంలో వచ్చిన మార్పులను అంచనా వేస్తామన్నారు. మొదటగా 10వేల వాహనాలను ప్రభుత్వ కార్యకలాపాల కోసం ప్రయోగాత్మకంగా తీసుకుంటామని చెప్పారు. ఏపీఎస్‌ఆర్టీసీలోనూ ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాహనాల చార్జింగ్ యూనిట్లను ఎక్కువచోట్ల ఏర్పాటు చేసేలా ప్రోత్సాహకాలను ప్రోత్సహిస్తామన్నారు. ఇది వారికి ఆదాయ వనరుగా మారుతుందన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లో విద్యుత్‌శాఖ ద్వారా నేరుగా చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తామన్నారు. వాహనాల తయారీ యూనిట్లు, స్టార్టప్‌లకు సంబంధించి ఎంఎస్ఎంఈలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. ఈఈఎస్‌ఎల్ భాగస్వామ్యంతో పైలట్‌ప్రాజెక్టుగా రాష్ట్రంలో 300 ఎలక్ట్రిక్ వాహనాలను ప్రారంభిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. పవన విద్యుత్‌లో దేశంలోనే అత్యధిక ఉత్పత్తి సాధించినందుకు గాను అత్యుత్తమ కార్యదక్షత కలిగిన సంస్థగా అవార్డు దక్కినందుకు నెడ్‌క్యాప్‌ను సీఎం అభినందించారు. 2016-17లో 2187.45మెగావాట్ల పవన విద్యుత్ ఉత్పత్తి చేశామని నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్ బాబు వివరించారు.

**ఎలక్ట్రిక్ బస్సు ప్రత్యేకతలు**

ఎలక్ట్రిక్ బస్సును 3 గంటలు చార్జింగ్ చేస్తే 250 నుంచి 300 కి.మీ. ప్రయాణం చేయవచ్చు. 25 నుంచి 31 సీట్లు ఉంటాయి. ఏసీ, నాన్ ఏసీ కూడా ఉన్నాయి. పవర్ స్టీరింగ్, ఏసీ, డిస్క్ బ్రేక్, యాంటీ బ్రేకింగ్ సిస్టమ్ సౌకర్యం ఉంది. ప్రస్తుతం యూనిట్ విద్యుత్ ధర రూ.6.95గా ఉండటంతో ఎలక్ట్రిక్ ఫోర్ వీలర్‌లో ఒక కి.మీ.కు రూ.1.39 అవుతుందని. ఇదే పెట్రోల్ వాహనానికి రూ.3.90, డీజిల్ వాహనానికి రూ.3.25 అవుతుందని అధికారులు వివరించారు. యూనిట్ విద్యుత్ రూ.4కే అందిస్తే.. కి.మీ.కు 80 పైసలే అవుతాయని చెప్పారు.

## పేదరిక రహిత రాష్ట్రంగా ఏపీ

**» 5వేల కోట్లతో 30 సంక్షేమ పథకాలు: మంత్రి యనమల**

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన, సమతుల్యత సాధించడంలో భాగంగా సంక్షేమ పథకాల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.68వేల కోట్లు కేటాయించామని ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. రాష్ట్రంలో 9.2శాతం మంది ప్రజలు మాత్రమే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని చెప్పారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన మోదుగుల... రాష్ట్రంలో 21శాతం మంది దారిద్ర్యరేఖ దిగున ఉన్నారని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ సర్వే వెల్లడించిందని అన్నారు. అనంతరం యనమల మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో 9.2శాతం మంది మాత్రమే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ చేసిన సర్వే వేరు, కేంద్ర ప్రభుత్వం చేసిన సర్వే వేరని వివరించారు. పేదరిక నిర్మూలనకు రూ.5వేల కోట్లతో కొత్తగా 35 సంక్షేమ పథకాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. 2022నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా ఏపీని మార్చడమే తమ లక్ష్యమని ప్రకటించారు. కాగా, ఆత్మకూరు-శ్రీశైలం రోడ్డు విస్తరణపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అయ్యన్నపాత్రుడు బదులిచ్చారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణాలకు 71 ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ప్రస్తుతం ఏడు పూర్తి చేశామని, ఇంకా 60కి పైగా ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉందని వివరించారు.

### స్మార్ట్ సిటీ కొంతే: నారాయణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పట్టణాల జాబితాలో ఉన్న నగరం మొత్తం స్మార్ట్ సిటీ కిందకు రాదని మంత్రి నారాయణ అన్నారు. తాము నోటిఫై చేసిన 500 చదరపు అడుగులు లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతం మాత్రమే ఈ పరిధి కిందకు వస్తుందన్నారు. అలాగే విశాఖ నగరం మొత్తం స్మార్ట్ సిటీ కిందకు రాదని, బీచ్‌రోడ్ పరిధిలో ఉన్న కేవలం 500 చదరపు అడుగుల విస్తరణలో ఉన్న ప్రాంతాన్నే ఈ పథకం కింద అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ పథకం కింద తిరుపతి, కాకినాడలకు కేంద్రం రూ.500కోట్లు చొప్పున అందిస్తే, రాష్ట్రం వరుసగా రూ.1,100కోట్లు, రూ.1,441కోట్లు చొప్పున ఖర్చు చేసిందన్నారు.

సెక్రటేరియట్, అసెంబ్లీ డిజైన్లపై

## శాసనసభ్యుల సంతృప్తి

**» వచ్చే నెల 2వ వారంలో సచివాలయానికి టెండర్లు**

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాజధానిలోని పరిపాలనా నగరంలో నిర్మించనున్న సచివాలయం, అసెంబ్లీ, శాసనసభ్యుల నివాసాల డిజైన్లపై ఎమ్మెల్యేలు సంతృప్తి వ్యక్తం చేశారు. మాస్టర్ ఆర్కిటెక్ట్ నార్మన్ ఫోస్టర్ ప్లస్ పార్ట్‌నర్స్ రూపొందించిన ఈ డిజైన్లను శాసనసభ్యుల కోసం శుక్రవారంనాడు వెలగపూడిలోని సచివాలయంలో ప్రదర్శించారు. గురువారమే వీటిని పరిశీలించిన సీఎం కూడా బాగున్నాయన్నారు. పాలవాగుకు ఇరువైపులా 5టవర్లుగా నిర్మితమవనున్న సచివాలయ సముదాయం మొత్తం విస్తీర్ణం 50లక్షల చదరపు అడుగులు. తుది డిజైన్లపై ఏకాభిప్రాయం వ్యక్తమైనందున ఇతర ప్రక్రియలన్నింటినీ పూర్తిచేసి, వచ్చేనెల 2వ వారంలో సెక్రటేరియట్ నిర్మాణానికి టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా డిజైన్ల విశిష్టతల గురించి ఆర్కిటెక్ట్‌లు, అధికారులు వివరించారు. సాధారణ భవనాల మాదిరిగా ఈ సముదాయంలోని భవంతుల లోపల పిల్లర్లు ఉండవని, వాటికి బదులుగా అంతర్గతంగా 'కోర్', బయటి వైపున 'గ్రిడ్ డిజైన్' ఉండి, భవనాల బరువును మోస్తాయని పేర్కొన్నారు. ఈ విధంగా నిర్మితమవుతున్న భవంతుల్లో దేశంలోనే మన సచివాలయం మొదటిదన్నారు. గ్రిడ్ డిజైన్ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టేలా ప్రఖ్యాత కలంకారీ డిజైన్లతోపాటు మరో రెండింటిని నార్మన్ ఫోస్టర్ ప్రతినిధులు చూపించారు. ఈ మూడింటినీ శనివారం అసెంబ్లీ సమావేశాల సమయంలో శాసనసభ్యులకు చూపిస్తారు. వాటిలో వారికేం నచ్చిందో తెలియజేయాలని కోరుతూ స్లిప్‌లు అందజేస్తారు. ఏ డిజైన్‌కు ఎక్కువ మంది మొగ్గుచూపితే అదే సచివాలయ టవర్ల బాహ్య రూపమవుతుంది. ఈ సందర్భంగా శాసనసభ్యులతో సీఎం మాట్లాడారు. వారికోసం రాజధానిలో నిర్మిస్తున్న నివాసాలు డిసెంబరుకల్లా సిద్ధమవుతాయన్నారు. నూతనంగా నిర్మించనున్న శాసనసభ భవంతిలోకి అడుగు పెట్టాలన్న సంకల్పంతో పని చేయాలని కోరారు. దానితో ప్రజలు సంతృప్తి చెందితేనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి గెలుపొంది, అమరావతిలో నిర్మిస్తున్న కొత్త భవంతుల్లో నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనగలుగుతామని చంద్రబాబు చెప్పారు.

భారతమాలలో

## అమరావతి ఓఆర్ఆర్



**» ఫేజ్-1 కిందే పనులు**

**» కార్యాచరణ ప్రణాళికలో చేర్చిన ఎంఓఆర్‌టీహెచ్**

**» హైదరాబాద్-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వేతో లింక్**

**» ఎన్‌హెచ్ 65లో మూడు బైపాస్‌లు**

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి):నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఔటర్‌రింగ్‌రోడ్డుకు లైన్‌క్లియర్ అయింది. ఈ ప్రాజెక్టును జాతీయ రహదారుల పద్దులో చేపట్టేందుకు కేంద్రం అంగీకరించింది. దీన్ని ప్రతిష్ఠాత్మక భారతమాల పరియోజనలో చేర్చింది. ఫేజ్-1లోనే ఈ ప్రాజెక్టును చేపడతారు. ఈ మేరకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (ఎంఓఆర్‌టీహెచ్) తన కార్యాచరణ ప్రణాళికలో చేర్చింది. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే జాబితాలోనూ చేర్చారు. నిజానికి అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వేను ఈ జాబితాలో చేరుస్తారని అంతా భావించారు. ఎంఓఆర్‌టీహెచ్ కూడా తొలినుంచీ ఇదే మాట చెబుతోంది. అయితే ఇప్పుడు దాని ఊసెత్తకుండా, అమరావతి ఔటర్‌రింగ్‌రోడ్డుతోపాటు, విజయవాడ-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వేలో మిగిలిన రహదారి పనులు అంటే బైపాస్‌లను ఇందులో చేర్చారు. 2017-18 నుంచి 2021-22 వరకు అమలయ్యే భారతమాల ప్రాజెక్టు వ్యయం రూ.5.35 లక్షల కోట్లు. 53వేల కిలోమీటర్ల రహదారి అభివృద్ధి, విస్తరణ, నిర్మాణం ప్రధాన లక్ష్యం. తొలిదశలో 24వేల కి.మీ. రహదారుల విస్తరణ, అభివృద్ధి చేస్తారు. ఎక్స్‌ప్రెస్‌వేలను భారీగా చేపడతారు. ఢిల్లీ-జైపూర్, ఢిల్లీ-అమృతసర్-కటారా, కాన్పూర్-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేలను తొలిదశలో చేపట్టాలని తాజాగా నిర్ణయించారు. దక్షిణాదికి 3 ప్రాజెక్టులే దక్కాయి. హైదరాబాద్-విజయవాడ-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే(హెచ్‌వీఏ), అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు(ఎక్స్‌ప్రెస్‌వే), నాగపూర్-హైదరాబాద్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వేలను చేర్చారు. అయితే, హైదరాబాద్-విజయవాడ మధ్య ఉన్న జాతీయ రహదారిలో కంచికచర్ల, నందిగామల్లో బైపాస్‌ల నిర్మాణంతో పాటు ఈ రహదారిని అమరావతి వరకు విస్తరించాలన్న ప్రతిపాదనకు కేంద్రం అంగీకారం తెలిపింది. అమరావతి రింగ్‌రోడ్డును ఈ ప్రాజెక్టు కిందకు తీసుకురావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### మరి మనకెన్ని నిధులు?

భారతమాల ఫేజ్1లో ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం కోసం రూ.50వేల కోట్లు ఖర్చుపెట్టాలని ఎంఓఆర్‌టీహెచ్ ప్రణాళిక రూపొందించింది. ఇందులో ఉత్తరాది ప్రాజెక్టులకే సింహభాగం ఖర్చుకానుంది. మరి అమరావతి రింగ్‌రోడ్డుకు ఏమేరకు నిధులు ఇస్తారన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. నవ్యాంధ్ర రాజధాని అవసరాలకోసం 189 కి.మీ. మేర ఆరు వరుసల రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. దీని నిర్మాణ వ్యయం రూ.17,761 కోట్ల పైమాటే. రెండు జిల్లాలు, 87 గ్రామాలను కలుపుతూ నిర్మించే అమరావతి ఔటర్‌లో 11 ప్రధాన వంతెనలు, ఏడు భారీ రైల్వే ఫ్లైఓవర్(ఆర్‌ఓబీ)లు ప్రతిపాదించారు. జి. కొండూరులో 5.5 కి.మీ. పరిధిలోని పీరెచర్లలో 800 మీటర్ల మేర టన్నెల్స్‌ను ప్రతిపాదించారు. ఫేజ్-1లో చేపట్టే వర్కుల్లో కృష్ణానదిపై 3.1 కి.మీ. మేర, ఫేజ్-2లో 4.8 కి.మీ. మేర ప్రతిష్ఠాత్మక రెండు ఐకానిక్ వంతెనలు ఉంటాయి.

### భూసేకరణ?..భూసమీకరణా?

ఈ ప్రాజెక్టు కోసం 3,404 హెక్టార్లలో భూసేకరణ చేయాలి. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇన్నర్ రింగ్‌రోడ్డుతోపాటు ఔటర్‌కు కూడా భూసమీకరణకు వెళ్లేయోచనలో రాష్ట్ర సర్కారు ఉంది. దీనిపై రైతుల నుంచి కొంత వ్యతిరేకత వస్తోంది. భూసమీకరణకు వీలుకానిపక్షంలో సర్కారు భూసేకరణకే వెళ్లాలి. దీన్ని ఏదోలా ప్రభుత్వం పరిష్కరిస్తుందని, భారతమాల కింద ఔటర్‌ను చేర్చడం హర్షణీయమని అధికారవర్గాలు చెబుతున్నాయి. ముందుగా నిర్ణయించిన డిజైన్స్, ప్రతిపాదనల మేరకే అమరావతి ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మిస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు చెప్పారు. ఇదిలా ఉంటే.. హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్ 65లోని మిగిలిపోయిన మూడు బైపాస్‌ల నిర్మాణం దీనికిందే చేపడతారు. ఇప్పటికే కంచికచర్ల, నందిగామ తదితర ప్రాంతాల్లో భూమిని సిద్ధం చేశారు.

# క్షయ రోగులకు సాయం

**» చికిత్స సమయంలో నెలకు 500**

**» లక్ష మందికి అందించడానికి ఆరోగ్యశాఖ సన్నాహాలు**

**» ఏప్రిల్ నుంచి అమలులోకి**

**» నేడు ప్రపంచ టీబీ డే**

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): క్షయ రోగులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. దేశ వ్యాప్తంగా టీబీ రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వ్యాధిగ్రస్థులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉంది. కృష్ణా జిల్లాలో 2016లో 5,300మంది రోగులు ఉండగా, ఏడాదిలో వీరి సంఖ్య 6,699కి చేరింది. మిగిలిన జిల్లాల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ఈ నేపథ్యంలో టీబీ నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాన్ని తెరపైకి తీసుకువస్తున్నాయి. ఇప్పటి వరకూ ఈ వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం కేవలం మందులు మాత్రమే అందిస్తోంది. ఇకపై రోగులకు సరైన పోషకాహారాన్నీ అందించాలని నిర్ణయించాయి. ఇందుకోసం ప్రతి రోగికి నెలకు రూ.500 ఆర్థిక సహాయాన్ని అందించనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 పద్ధతిలో ఈ ఖర్చును భరిస్తాయి. శనివారం ప్రపంచ టీబీ డే కావడంతో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆరోగ్యశాఖ అధికారులు నిర్ణయించారు. అనివార్యకారణాలతో అది ఏప్రిల్ 5వ తేదీకి వాయిదాపడింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70వేల మంది టీబీ రోగులు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. అయితే ఈ సంఖ్య లక్షవరకూ ఉంటుందని భావిస్తున్నారు. అందువల్ల ఈ పథకాన్ని లక్షమందికి అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిన ఆరోగ్యశాఖ దీనికి రూ.32కోట్ల నిధులను కేటాయించింది.

### వాస్తవానికి దగ్గరగా అంచనాలు

ఆరోగ్యశాఖ అధికారులు వేసిన అంచనా వాస్తవానికి దగ్గరగా ఉందని భావిస్తున్నారు. సామాజిక అపోహలకు భయపడి చాలా మంది రోగులు టీబీకి వైద్యం చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. దీనివల్ల వ్యాధి విస్తరణ వేగంగా ఉంటోంది. ఈ పథకంతో మరికొంతమంది రోగులు బయటకొస్తారని అంచనా వేస్తున్నారు. జిల్లాకొకటిగా ఉన్న టీబీ నిర్ధారణ కేంద్రాలను ప్రతి గ్రామంలోనూ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. సాధారణంగా వ్యాధినిరోధక శక్తి తక్కువ ఉన్నవారిపై టీబీ తొందరగా ఎటాక్ చేస్తుంది. పౌష్టికాహార లోపం దీనికి ప్రధాన కారణం. దీని నివారణకు ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని తెరపైకి తీసుకువచ్చింది. దీనివల్ల వ్యాధినిరోధక శక్తి పెరిగి, టీబీ నయమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ డబ్బులు నేరుగా రోగుల ఖాతాలోకి వెళ్తాయి. 2025 నాటికి రాష్ట్రంనుంచి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ఆరోగ్యశాఖ ముందుకు వెళ్తోంది. ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన 'వాంటెడ్... లీడర్స్ ఫర్ ఏ టీబీ ఫ్రీ వరల్డ్' నినాదంతో మార్చి 24 నుంచి వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుంది.

# ఏపీపై కుట్రలు!



**నాయకత్వాన్ని బలహీనపరిచే వ్యూహం.. టీడీపీ దెబ్బతింటే రాష్ట్రానికీ దెబ్బ.. మనం కలిసికట్టుగా తిప్పి కొట్టాలి**

**ఇప్పుడు కేంద్రంతో ఎలాంటి చర్చలూ వద్దు**

**ఈశాన్య రాష్ట్రాలకు రూ.3వేల కోట్లు**

**నవ్యాంధ్రకు మాత్రం మొండిచేయి**

**టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు ధ్వజం**

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): "దక్షిణాదిలో రాజకీయ నాయకత్వాలను బలహీనపర్చాలని చూస్తున్నారు. సమర్థ నాయకత్వం లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌పై కూడా కుట్ర జరుగుతోంది. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. శుక్రవారం ఆయన తమ పార్టీ ఎంపీలు, ముఖ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాత్రి పొద్దుపోయాక తూర్పు గోదావరి జిల్లా కడియం నర్సరీ రైతులతోనూ సమావేశమయ్యారు. ప్రధాని ఆఫీసులో విశ్వాసం... బయటికి వచ్చి అవిశ్వాసం ప్రకటిస్తారంటూ వైసీపీని విమర్శించారు. తనపై మూడు వైపుల నుంచి దాడి జరుగుతోందన్నారు. "రాష్ట్రానికి న్యాయం చేయాలని మాత్రమే కోరుతున్నాం. అది అడిగితే టీడీపీని బలహీన పర్చాలని కుట్రలు చేస్తున్నారు. టీడీపీ బలహీనపడితే రాష్ట్రం బలహీనపడుతుంది. ప్రజల ఆశలు ఆవిరవుతాయి" అని ఆయన అన్నారు. 1984లో కేంద్రంలోని పెద్దలు ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూలదోసినప్పుడు 161 మంది ఎమ్మెల్యేలు ఒక్కతాటిపై నిలబడ్డారని, వారికి ప్రజలు తోడుగా నిలిచి పోరాడి కేంద్రం వెనుకంజ వేసేలా చూశారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో ఎంపీలు పోరాడాలని, ఐదు కోట్ల మంది ప్రజల హక్కులను... రాష్ట్ర గౌరవాన్ని కాపాడాలని సూచించారు. ఎంపీల పోరాటం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని చంద్రబాబు తెలిపారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నిరసనలే దీనికి నిదర్శనమన్నారు.

### మనకెందుకు ఇవ్వరు?

"పదేపదే కేంద్రం చుట్టూ తిరుగుతున్నా మనకు ఇవ్వాల్సినవి కోత పెడుతున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు మాత్రం కొత్తగా మరో రూ. మూడు వేల కోట్లు ఇస్తూ నిర్ణయం తీసుకొన్నారు. మిగిలిన వారికి ఇచ్చేవాటిని మనం వద్దనడం లేదు. మనకు ఇవ్వాల్సినవి ఎందుకు ఇవ్వడం లేదన్నదే ప్రశ్న. ఎంత ఆందోళన చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదు. రాష్ట్ర ప్రజల మనోభావాలను గాయపరుస్తోంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

### కేంద్ర మంత్రులతో చర్చలు వద్దు

రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అమలు కావాల్సిన వాగ్దానాలపై పార్లమెంటులో పోరాటం చేయాలి తప్ప ఇప్పుడు కేంద్ర మంత్రులతో చర్చలకు కూర్చోవద్దని ఎంపీలకు చంద్రబాబు సూచించారు. కేంద్రంపై ఒకసారి అవిశ్వాసం ఇచ్చిన తర్వాత ఇక చర్చలు సరికాదని, పార్లమెంటులో పోరాటం ద్వారానే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. రైల్వే జోన్‌పై చర్చలకు రావాలని ఆ శాఖ మంత్రి ఆహ్వానం పంపారని, ఏం చేయాలని సుజనా చౌదరి అడిగినప్పుడు ఇలా స్పందించారు. చర్చకు వెళ్తే లోపాయికారీ రాజకీయాలకు పాల్పడుతున్నారని జగన్ తన మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని, అటువంటి అవకాశం ఇవ్వవద్దని మంత్రి యనమల రామకృష్ణుడు సూచించారు. అవిశ్వాసం నోటీసు ఆమోదం పొందడంపైనే ఎంపీలతా దృష్టి కేంద్రీకరించాలని, మరోవైపు దృష్టి మరల్చవద్దని కోరారు. వెల్‌లోకి వెళ్తున్న ఎంపీలను సస్పెండ్ చేసి అవిశ్వాసానికి మద్దతు ఇస్తున్న వారిని లెక్కించాలని తాము స్పీకర్‌ను కోరామని, అయినా పట్టించుకోవడం లేదని సుజనా చెప్పారు.

### పోలవరం పూర్తి చేసి తీరుతాం..

ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా... పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతామని చంద్రబాబు తెలిపారు. "ఏమీ తెలియని వాళ్లు పోలవరం గురించి మాట్లాడుతున్నారు. పునరావాసం ఖర్చు రాష్ట్రమే భరిస్తుందని నేను చెప్పినట్లుగా ఒక వ్యక్తి పేర్కొంటున్నారు. అలా చేస్తే మనం మునిగిపోతాం" అని కడియం నర్సరీల రైతులతో చంద్రబాబు అన్నారు. విభజన హామీలు అమలు చేయాలని కోరితే... కేంద్రం ఎదురుదాడి చేస్తోందని సీఎం విమర్శించారు.

## సవరించిన పోలవరం అంచనాలను ఆమోదించండి

**▸▸ జైట్లీ, గడ్కరీలకు ముఖ్యమంత్రి లేఖ**

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పోలవరం సవరించిన అంచనా వ్యయాన్ని (రూ.58,319.06 కోట్లు) ఆమోదించాలని కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, నితిన్ గడ్కరీలను కోరుతూ లేఖలు రాయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. పోలవరం పాత డీపీఆర్ రూ.16010.45 కోట్లకు సంబంధించి నిధుల వ్యయం పూర్తయినందున భూసేకరణ సహాయ, పునరావాస కార్యక్రమాలు, హెడ్ వర్క్స్ పనుల కోసం కొత్త డీపీఆర్‌ను ఆమోదించాల్సి ఉందని జైట్లీ, గడ్కరీలను కోరనున్నారు. కొత్త డీపీఆర్‌పై కేంద్ర జల సంఘం, కేంద్ర జల వనరుల శాఖ పదే పదే వేస్తోన్న కొర్రీలకు రాష్ట్ర జల వనరుల కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంటేశ్వరరావులు వివరణలు ఇచ్చారు. ఈ వివరణతో కేంద్ర జల వనరుల శాఖ, కేంద్ర జల సంఘం అధికారులు సమ్మతించారు. లిఖిత పూర్వకంగా సమాధాలు పంపితే పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు కొత్త డీపీఆర్‌ను సోమవారం నాటికి కేంద్రానికి పంపనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త డీపీఆర్‌ను ఆమోదించాలంటూ కేంద్ర మంత్రులకు సీఎం లేఖ రాయనున్నారు.

## మాపై చిన్నచూపెందుకు?

**▸▸ రాయితీలు ఈశాన్యానికేనా?.. ఆంధ్రప్రదేశ్‌కు అక్కర్లేదా?**

**▸▸ కేంద్రంపై యనమల, సోమిరెడ్డి ధ్వజం**





అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాలపై అమిత ప్రేమ కనబరుస్తోన్న కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పట్ల వివక్ష చూపుతోందని, టీడీపీపై కోపంతో మోదీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దెబ్బతీస్తోందని రాష్ట్ర మంత్రులు యనమల రామకృష్ణుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం విమర్శించారు. ఏపీ పట్ల మోదీ ప్రభుత్వం ఎందుకు చిన్నచూపు చూపిస్తోందని నిలదీశారు. 'టీడీపీ అవిశ్వాస తీర్మానం కోసం పట్టుబడుతుంటే పుండుమీద కారం జల్లినట్లుగా ఈశాన్య రాష్ట్రాలకు పారిశ్రామిక రాయితీల కింద రూ.3వేల కోట్లు(మార్చి 21న) కేటాయిస్తూ జీవో జారీ చేయడం ఏపీపై వివక్షకు నిదర్శనం. ఈ రాయితీలు మాకు అవసరం లేదా' అని యనమల ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు సభాహక్కుల నోటీసు ఇస్తామని రూ.లక్ష కోట్ల అవినీతి కేసుల్లో ఏ-1, ఏ-2 నిందితులు అనడం హాస్యాస్పదమన్నారు. 'అవిశ్వాస తీర్మానానికి ముందురోజు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో)లో ఉండడం దేనికి సంకేతం? పట్టిసీమ నిర్మాణం పూర్తయిన మూడేళ్ల తర్వాత ఇప్పుడు అవినీతి జరిగిందంటూ బీజేఎల్పీ నేత విష్ణుకుమార్‌రాజు మాట్లాడడం, మరుసటి రోజే విజయసాయిరెడ్డి సీబీఐ విచారణ కోరడమేంటి? బీజేపీ, వైసీపీ, జనసేనల కుమ్మక్కు మహాకుట్ర ప్రజలకు అర్థమవుతోంది' అని చెప్పారు. అక్రమాస్తుల కేసుల్లోని ముద్దాయిలను పక్కనపెట్టుకుని.. అవకాశవాద రాజకీయాలు చేస్తున్న బీజేపీ పెద్దలు టీడీపీపై కోపంతో రాష్ట్ర ప్రజల్ని, ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని సోమిరెడ్డి ఆరోపించారు. మిత్రధర్మం పాటించి, బీజేపీని భుజాన వేసుకుంటే, రాష్ట్రంలో టీడీపీని బదనాం చేయాలని చూడడం దారుణమన్నారు. పీఎంవో ఆర్థిక నేరస్థులకు స్థావరంగా మారుతోందని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ జూపూడి ప్రభాకర్ విమర్శించారు. విజయసాయిరెడ్డి తిష్ఠ వేయడంతో పీఎంవో అపవిత్రమైందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. చంద్రబాబు దమ్మున్న నాయకుడని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు.

## హోదా కోసం ఉద్యమించాలి: మావోయిస్టు పార్టీ

సీలేరు (విశాఖపట్నం), మార్చి 23: రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని మావోయిస్టు పార్టీ ఆంధ్ర-ఒడిశా సరిహద్దు(ఏవోబీ) ప్రాంత ప్రత్యేక కార్యదర్శి చంద్రమౌళి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామంటూ నాడు అన్ని పార్టీల ఆమోదంతో రాష్ట్రాన్ని విభజించారని, అయితే అధికారంలోకి వచ్చిన తరువాత బీజేపీ, టీడీపీలు రాష్ట్రాన్ని అప్పులప్రదేశ్‌గా, నిర్వాసితప్రదేశ్‌గా మార్చాయని శుక్రవారం మీడియాకు విడుదల చేసిన లేఖలో ఆయన విమర్శించారు. పోరాటం ద్వారానే ప్రత్యేక హోదా సాధించుకోవాలని, న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్ర ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని, ప్రజాస్వామికవాదులు, విప్లవ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థులు, మేధావులు, కార్మికులు, రైతులు ఐక్య సంఘటనగా ఏర్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

## పార్లమెంటును బీజేపీ ఆఫీసుగా మార్చారు

**▸▸ ప్రధానిపై రఘువీరా ధ్వజం**



హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పార్లమెంటును బీజేపీ కార్యాలయంగా మార్చేశారని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆరోపించారు. ఆయన ప్రభుత్వంపై లోక్‌సభలో అవిశ్వాస తీర్మానానికి నోటీసిచ్చామని, 27న చర్చ జరపాలని స్పీకర్‌ను కోరామని శుక్రవారమిక్కడ ఇందిరాభవన్‌లో తెలిపారు.

## బాబును జైలుకు పంపినా ఆశ్చర్యం లేదు

**▸▸ కక్ష కట్టే నైజం ప్రధాని మోదీది: నారాయణ**



సూళ్లూరుపేట, మార్చి 23: 'ప్రధాని మోదీ.. ముఖ్యమంత్రి చంద్రబాబును జైలుకు పంపినా ఆశ్చర్యం లేదు.. ఎందుకంటే తనను వ్యతిరేకించేవారిపై కక్షకట్టడం మోదీ నైజం. ఇప్పటికే లాలూప్రసాద్ యాదవ్‌ను జైలుకు పంపారు. ఇక చంద్రబాబు వంతు' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మోదీకి తనను వ్యతిరేకించేవారంటే పడదని, అందుకే చంద్రబాబుపై కోపాన్ని ఆంధ్ర రాష్ట్రంపై చూపుతున్నారని అన్నారు. మోదీ వేధింపులు తాళలేక అరుణచల్ సీఎం కల్‌కోపుల్ ఆత్మహత్య చేసుకున్నారని, ఆయన బతికే ఉంటే మోదీ జైలుకు వెళ్లి ఉండేవారని చెప్పారు. అలాగే నయీమ్‌ను బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా హత్య చేయించారని అన్నారు. పవన్ కల్యాణ్ స్వయంగా సీపీఐ కార్యాలయానికి వచ్చి తాను బీజేపీకి, టీడీపీకి వ్యతిరేకంగా పనిచేస్తానని చెప్పారని వెల్లడించారు. 'తెలంగాణ సీఎం కేసీఆర్ శిఖండి పాత్ర పోషిస్తున్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త కూటమి ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. పార్లమెంటులో మాత్రం అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా వ్యవహరిస్తున్న తీరు ఆయన ద్వంద్వ వైఖరిని ఎత్తిచూపుతోంది' అని చెప్పారు.

## భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో పోరాటం: పవన్



అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మాతృదేశం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ బలిదానం చేశారని.. వారి స్ఫూర్తితో పోరాటం చేస్తామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు ఆయన నివాళులు అర్పించారు. వారి త్యాగం లక్షల మంది మనసుల్ని జ్వలింపచేశాయన్నారు. 'నేను చనిపోకపోతే దేశానికి అదో ఉత్పాతంగా మిగిలిపోతుంది. నేను నవ్వుతూ మృత్యువును అల్లుకుంటే.. భారతదేశంలోని మాతృమూర్తులందరూ తమ బిడ్డలు భగత్‌సింగ్‌లా కావాలని కోరుకుంటారు. బలీయమైన స్వాతంత్ర్య కాంక్ష ఉన్న సమరయోధులు అసంఖ్యాకంగా ఉద్భవిస్తారు. అప్పుడే విప్లవ యోధులు సాగిస్తున్న పోరాటాన్ని నిలువరించడం దుష్ట శక్తులకు సాధ్యం కాదు' అని ఉరి కంబం ఎక్కేందుకు కొద్ది రోజులముందు భగత్ సింగ్ తన మాతృమూర్తితో చెప్పారన్నారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆత్మార్పణను తెలుగు రాష్ట్రాల్లోని యువత ఈనాటికీ స్మరించుకుంటోందన్నారు. ఆర్థికంగా మెరుగైన పరిస్థితులు తీసుకురావడంలో ప్రభుత్వాలు విఫలం కావడంపై వారి స్ఫూర్తితో జనసేన పోరాడుతుందన్నారు.

## ఏపీకి ఆర్థిక లోటే లేదు!

**▸▸ కేంద్ర ప్రభుత్వ సమాధానం**

న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రకు ఆర్థిక లోటే లేదని కేంద్రం తేల్చేసింది. ఇక... 2014-15 ఆర్థిక సంవత్సరానికి రూ.4118కోట్ల మేరకు రెవెన్యూలోటు ఉండగా అందులో రూ.3980కోట్లను ప్రత్యేక సాయంగా చట్ట ప్రకారం అందించామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పొన్ను రాధాకృష్ణన్ వెల్లడించారు. శుక్రవారం లోక్‌సభలో వైసీపీ ఎంపీ ఎం.రాజమోహన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. "నవ్యాంధ్రకు 14వ ఆర్థిక సంఘం అయిదేళ్ల కాలానికి రూ.22,212కోట్ల రెవెన్యూ లోటు గ్రాంటు నిర్ధారించగా... ఇప్పటి వరకు రూ.15,969కోట్లు అందించాం. అయితే వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల కింద గత నాలుగేళ్లుగా పెట్టిన ఖర్చు గురించి ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం లెక్కలన్నీ చెప్పాల్సిందిగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది" అని వివరించారు. కాగా ఏపీలో ముఖ్యమైన ప్రాజెక్టులను పూర్తి చేయలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా అన్న ప్రశ్నకు అలాంటిదేమీ లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

## 50 మందిని లెక్కించలేరా?

**▸▸ ఇదంతా కేంద్రం డ్రామా: ఉండవల్లి**



రాజమహేంద్రవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌ని విభజించిన సమయంలో పార్లమెంటులో ఇప్పటి కంటే దారుణమైన పరిస్థితి ఉంది. ఎంతో మంది గొడవ చేశారు. అయినా లెక్క చేయకుండా రాష్ట్రాన్ని విభజించారు. ఇవాళ వెల్‌లో 50 మందిని లెక్కించలేరా? అప్పుడో విధానం.. ఇప్పుడో విధానమా' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విభజన బిల్లు సమయంలో ఆనాడు సభలో 352 మంది ఉండగా.. 241 మంది ఉన్నట్లు స్పీకర్ లెక్కించారని.. అప్పుడు వెల్‌లో 111 మంది సభ్యులున్నారని.. అయినా విభజన బిల్లును ఆమోదించారని.. మరి ఇప్పుడెందుకు లెక్కించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇది కేంద్రం ఉద్దేశపూర్వకంగా ఆడుతున్న డ్రామాగా అనిపిస్తోందన్నారు.

## జైట్లీని కలవలేదు

**▸▸ ఇది వైసీపీ మైండ్‌గేమ్: సుజనా**



న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని తాను కలిసినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి స్పష్టం చేశారు. ఈ అంశంపై శుక్రవారం ఆయన పార్లమెంటు ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధిష్ఠానం ఆదేశం లేనిదే తానేదీ చేసే ప్రసక్తే లేదన్నారు. ప్యాకేజీ గురించి మాట్లాడేందుకు వెళ్లారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారని అనగా.. 'ఆరోపించడమే వైసీపీ నేతల పని. ఏవేవో కథలు అల్లుతుంటారు. వాళ్లు మైండ్‌గేమ్ ఆడాలనుకుంటున్నారు. మేమేం చేయాలో మాకు తెలుసు' అని సుజనా బదులిచ్చారు.

## అవిశ్వాస తీర్మానానికి మేం వ్యతిరేకం: తంబిదురై

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, వైసీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు లోక్‌సభ డిప్యూటీ స్పీకర్, అన్నాడీఎంకే సీనియర్ నేత తంబిదురై స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ, డీఎంకే నేత స్టాలిన్ డిమాండ్ హాస్యాస్పదంగా ఉందన్నారు. తమిళ ఉపాధి కూలీలను కాల్చి చంపుతున్న చంద్రబాబుకు మద్దతు ఎలా ఇస్తామన్నారు.





పార్లమెంటు ఆవరణలో ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న టీడీపీ, వైసీపీ ఎంపీలు

# ఇక కాంగ్రెస్ అవిశ్వాసం!

**▸▸ 27న చేపట్టాలని ఖర్గే నోటీసు**

**▸▸ టీడీపీ, వైసీపీ కలిపితే 73 మంది**

**▸▸ సభ అవిశ్వాసం చేపట్టక తప్పదు**

**▸▸ ఆరో రోజూ టీడీపీ తీర్మానం బుట్టదాఖలు**

**▸▸ సభలో టీఆర్ఎస్, అన్నాడీఎంకే నిరసనలు**

న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి మండలిపై విశ్వాసం లేదంటూ కాంగ్రెస్ పార్టీ కూడా మోదీ సర్కారుపై యుద్ధం ప్రకటించింది. ఇప్పటివరకూ టీడీపీ, వైసీపీ మాత్రమే అవిశ్వాస నోటీసు ఇవ్వగా అనూహ్యంగా కాంగ్రెస్ లోక్‌సభా పక్షనేత మల్లికార్జున్ ఖర్గే కూడా 27వ తేదీ కోసం నోటీసు ఇచ్చారు. కేంద్రంపై పోరు సాగించేందుకు మొత్తం మూడు పార్టీలు రంగంలోకి దిగాయి. సభలో కాంగ్రెస్‌కు 48 మంది, టీడీపీకి 16 మంది, వైసీపీకి 9 మంది ఎంపీలున్నారు. బయట పార్టీల మద్దతు లెక్కించాల్సిన పని లేకుండా తీర్మానాన్ని చేపట్టవచ్చు., శుక్రవారం ఆరో రోజూ టీడీపీ, వైసీపీ అవిశ్వాసాన్ని ప్రయోగించినా హౌస్ ఆర్డర్ లేదంటూ స్పీకర్ సుమిత్ర మహాజన్ బుట్టదాఖలు చేశారు. లోక్‌సభ ప్రారంభమైన వెంటనే టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. తెలుగుదేశం సభ్యులు ఫ్లకార్డులు పట్టుకుని, కొందరైతే పార్టీ జెండాను కూడా తీసుకొచ్చి వారి స్థానాల్లోనే నిలబడి నిరసన తెలియజేశారు. వైసీపీ ఎంపీలు వారి స్థానాలకే పరిమితమయ్యారు. పార్టీ విప్ అందుకున్న కొత్తపల్లి గీత, బుట్టా రేణుక కూడా వెల్‌లోకి వెళ్లకుండా సీట్లకే పరిమితమయ్యారు. భగత్‌సింగ్‌కు సభ నివాళి అర్పించిన వెంటనే స్పీకర్ ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. ఆందోళనలతో నిమిషంలోపే సభ వాయిదా పడింది. బీజేపీ డ్రామాలు ఆపాలని, ఎందుకిలా వ్యవహరిస్తున్నారని మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన తరువాత టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు ఆందోళనలు మరింత పెంచారు. టీడీపీ, వైసీపీల అవిశ్వాస తీర్మానాన్ని స్పీకర్ ప్రస్తావించారు. అన్నాడీఎంకే ఎంపీలు 'ఓ'అంటూ అరవడంతోపాటు, నోటిపై అరచేతిని కొట్టుకుంటూ పెద్ద శబ్దం వచ్చేలా గందరగోళం సృష్టించారు. టీఆర్ఎస్ సభ్యులు ఫ్లకార్డులు స్పీకర్‌కు అడ్డుగా పెట్టారు. అవిశ్వాసానికి మద్దతు ఇచ్చేవారిని లెక్కించలేనంటూ స్పీకర్ నోటీసులను తిరస్కరించారు. సభ్యుల కోరిక మేరకు శ్రీరామనవమి సందర్భంగా సోమవారం సభకు సెలవు ప్రకటించారు. మంగళవారం లోక్‌సభ సమావేశం కానుంది. ఆ రోజు కోసం టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌లు శుక్రవారమే స్పీకర్ కార్యలయంలో అవిశ్వాసం నోటీసును అందజేశారు.

### కొనసాగిన టీఆర్ఎస్ నిరసనలు

సుప్రీంకోర్టు ఆదేశాలు చూపుతూ కేంద్రం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాల స్వేచ్ఛను హరిస్తోందంటూ టీఆర్ఎస్ ఎంపీలు నిరసన పోరు ఉద్ధృతం చేశారు. తక్షణమే ఆర్టికల్ 16(4)ని రాజ్యాంగ సవరణ చేసి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రిజర్వేషన్లలు కల్పించుకునే హక్కు రాష్ట్రాలకే ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఒక దేశం ఒకే నీతి అవలంభించాలంటూ టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్, మల్లారెడ్డి, నగేష్, బాల్కసుమన్, కొండా విశ్వేశ్వరరెడ్డి, బీబీ పాటిల్, బూర నర్సయ్యగౌడ్, సీతారామ్ నాయక్, పసునూరి దయాకర్. నగేష్ ఫ్లకార్డులు పట్టుకుని వెల్‌లో ఆందోళనలకు దిగారు. కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటుపై అన్నాడీఎంకే ఎంపీలు పోడియం దగ్గర ఆందోళన చేపట్టారు. ఎంపీ జితేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తమకు స్పష్టమైన హామీ వచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదన్నారు.

### నిరవధిక వాయిదా ఎందుకు వేయడం లేదని ప్రజలు అడుగుతున్నారు: వెంకయ్య

రాజ్యసభ పనితీరుపై చైర్మన్ వెంకయ్య నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సభ ప్రారంభమైన వెంటనే ఆయన తన ఆవేదనను వ్యక్తపర్చారు. కానీ దాన్ని కూడా ఎంపీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా వెంకయ్య నాయుడు కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ... మూడు వారాలుగా సభ కార్యకలాపాలకు అంతరాయం కలుగుతూనే ఉందన్నారు. "నా సుదీర్ఘ ప్రజాజీవితంలో ఇలాంటి సంఘటనలు చాలా తక్కువగా చూశాను. అందులో ఇదొకటి. చైర్మన్‌గా నేను అన్ని ప్రయత్నాలు చేశాను, కానీ ఫలితం మాత్రం లేదు" అని నిస్సహాయత వ్యక్తం చేశారు. కొందరు లేవనెత్తుతున్న అంశాల గురించి తాను అర్థం చేసుకున్నానని, కానీ వారాలు వారాలుగా సభను స్తంభించడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. శ్రేయోభిలాషుల నుంచి తనకు కాల్స్ వస్తున్నాయని, సభను నిరవధికంగా ఎందుకు వాయిదా వేయడం లేదని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. వెంకయ్య మాట్లాడడం ముగియగానే టీడీపీ ఎంపీలు సీఎం రమేశ్, తోట సీతారామలక్ష్మి, టీజీ వెంకటేశ్, గరికపాటి మోహన్ రావు వెల్‌లోకి వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని పేర్కొని ఉన్న ప్లకార్డులను పట్టుకొని పెద్దఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్ర రావు ప్లకార్డు పట్టుకొని వెల్‌లోకి దూసుకొచ్చారు. విజయసాయిరెడ్డి వెల్‌లోకి రాలేదు.

### కేంద్రం రాయబారం

పార్లమెంటు సమావేశాలను అడ్డుకోవద్దని విపక్షాలకు పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి విజయ్ గోయల్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పలువురు విపక్ష నాయకులను కలిశారు. మంగళవారం రాజ్యసభలో కొంతమంది సభ్యులకు వీడ్కోలు ఇవ్వాల్సి ఉందని గుర్తు చేశారు. గ్రాట్యుటీ బిల్లును ఎటువంటి చర్చ జరపకుండానే ఆమోదించినట్లే మరికొన్ని బిల్లులకు కూడా విపక్షాలు ఆమోదం తెలుపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.





రాజ్యసభలో చైర్మన్ పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేస్తున్న ఎంపీలు, ప్లకార్డుతో కేవీపీ నిరసన

## సాయిరెడ్డి పీఎంవోలో తిరిగితే తప్పేంటి?

**▸▸ పట్టిసీమ మంచి ప్రాజెక్టే.. కానీ అవినీతి జరిగింది**

**▸▸ ఆధారాలతో సీబీఐకి ఫిర్యాదు చేయాలి**

**▸▸ అప్పుడు 'చట్టం తన పని తాను చేస్తుంది': సుధీష్ రాంబొట్ల**



అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డి ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంవో)లో తిరిగితే తప్పేంటని బీజేపీ ప్రశ్నించింది. ఆయన పలు ఆర్థిక నేరాల కేసుల్లో నిందితుడైనా ఒక పార్టీకి ఎంపీ గనుక పీఎంవోకు వచ్చే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేసింది. బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి సుధీష్ రాంబొట్ల శుక్రవారం విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. 'పట్టిసీమ ప్రాజెక్టు చాలా మంచిది. కానీ అందులో జరిగిన అవినీతిని కాగ్ ఎండగట్టిన తర్వాతే మా పార్టీ అసెంబ్లీలో లేవనెత్తింది. ఈ విషయంలో ఎవరైనా సీబీఐకి ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుంది' అని అన్నారు. మొన్నటి వరకూ జగన్‌తో, ఇప్పుడు పవన్‌తో బీజేపీ కుట్ర చేస్తోందంటూ టీడీపీ చేస్తున్న ఆరోపణలు ఓసీడీ అనే జబ్బు(లేనిది ఉన్నట్లు)ను గుర్తుకు తెస్తున్నాయని ఎద్దేవాచేశారు. 'టీడీపీ అవినీతిని ఎవరు ప్రశ్నిస్తే వాళ్లను ద్రోహులుగా, కుట్రదారులుగా ప్రజల్లో చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రధాని కార్యాలయం 29 సార్లు అపాయింట్‌మెంట్ నిరాకరిస్తుందా? చంద్రబాబు ఎప్పుడెప్పుడు పీఎం అపాయింట్‌మెంట్ కోరారో వెల్లడించాలి' అని డిమాండ్ చేశారు. ఏపీ, తెలంగాణల్లో పరిస్థితి చూస్తుంటే తెలుగుదేశం, కాంగ్రెస్ పొత్తు పెట్టుకునేలా వాతావరణం కనిపిస్తోందని చెప్పారు. ప్రత్యేక హోదాను ఏ రాష్ట్రానికీ పొడిగించలేదని, ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీ మాత్రమే కేంద్రం పొడిగించిందని వివరించారు. ఎన్నికల సమయంలో ప్రత్యేక హోదా కల్పిస్తామని బీజేపీ ఇచ్చిన హామీ వాస్తవమేనని.. అయితే సివిల్ ఇంజనీరింగ్ చదివించాలన్న కుమారుడిని అది బాగలేకుంటే కంప్యూటర్ సైన్స్ చదివించినట్లు కేంద్రం ప్యాకేజీ నిర్ణయం తీసుకుందని వివరించారు. ప్రత్యేక ప్యాకేజీ నిధులు రాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతే కారణమన్నారు. దక్షిణ భారతాన్ని కబళించేందుకు (ఆపరేషన్ ద్రవిడ) బీజేపీ ప్రయత్నిస్తోందన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని తెలిపారు. అవన్నీ ఒక ఫ్లాప్ హీరో చేసిన ఊహాజనిత వ్యాఖ్యలుగా కొట్టిపారేశారు. సినీనటి కవిత మాట్లాడుతూ.. ఏ రాష్ట్రమూ తెచ్చుకోలేనన్ని నిధులు కేంద్రం నుంచి తెచ్చుకున్నామని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు కేంద్రం ఏమీ ఇవ్వలేదనడం ప్రజలు గమనిస్తున్నారన్నారు.

## పీఎంవోను అలా అనడం సభాహక్కుల ఉల్లంఘనే

**▸▸ చంద్రబాబుకు నోటీసులిస్తా.. విజయసాయిరెడ్డి**



న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అత్యంత విలువైన.. ఉన్నతమైన ప్రధానమంత్రి కార్యాలయాన్ని (పీఎంవో) విమర్శిస్తూ నేరస్థులకు అడ్డాగా మారిందని సీఎం చంద్రబాబు అన్నారని.. అది సభాహక్కుల ఉల్లంఘన అవుతుందని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చెప్పారు. పార్లమెంటును, ప్రధానిని తప్పుబడుతున్నారు కాబట్టి ఆయనపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులను అందించబోతున్నానని తెలిపారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. 'చంద్రబాబు తన అవినీతి బయటపడుతుందని.. సీబీఐ వస్తుందని భయంతో గజగజలాడుతూ తిరిగి ఎన్డీఏలో చేరడానికి బీజేపీతో మంతనాలు చేస్తున్నారు. ఆయన రెండు నాలుకలు కలిగిన వ్యక్తి.. గొప్ప నటుడు' అని విమర్శించారు. వైసీపీ ఎప్పుడూ ఇలా చేయదని, తమ విధానం స్పష్టంగా ఉంటుందని, మార్పు ఉండదని అన్నారు. టీడీఎల్పీ సమావేశం అనుకుని అసెంబ్లీలో, మండలిలో చంద్రబాబు గంటల తరబడి మాట్లాడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీలో లేని వ్యక్తి గురించి మాట్లాడుతున్నారని, ఆయనకు పార్లమెంటరీ సంప్రదాయాలు తెలియవా అని ప్రశ్నించారు.



# ఇపుడిక 'ఆస్ట్రేలియా ఫస్ట్'

**పాత విధానం రద్దు.. వీసా రూల్స్ కఠినం చేసిన ఆసీస్.. లక్ష మంది భారతీయులకు దెబ్బ!**

మెల్‌బోర్న్, మార్చి 23: అమెరికా బాటలో ఆస్ట్రేలియా కూడా సాగుతోంది. అమెరికా ఫస్ట్ నినాదం స్ఫూర్తిగా- "ఆస్ట్రేలియా ఫస్ట్" నినాదం అందుకుంది. ఇన్నాళ్లూ అమల్లో ఉన్న అత్యంత కీలకమైన వర్క్-టు-వీసా ప్రోగ్రామ్‌ను పూర్తిగా రద్దు చేసింది. దాని స్థానే కఠినమైన నిబంధనలతో కూడిన కొత్త వ్యవస్థను తీసుకొచ్చింది. ఈ మార్పుల వల్ల పాత విధానం ద్వారా కొనసాగుతున్న దాదాపు లక్ష మంది భారతీయ ఉద్యోగులకు దెబ్బతగులుతుంది. ఇక నుంచి ఆస్ట్రేలియా ఉద్యోగులకు కోత పెట్టి విదేశీయులను తీసుకోరాదు. స్థానిక మార్కెట్‌లో తగిన ఉద్యోగులు లేరన్న కారణం చేతే విదేశాల నుంచీ తెచ్చుకుంటున్నామని కంపెనీలు నిరూపించాలి. ఆస్ట్రేలియన్ వేతన విధానాల్ని స్థానిక ఉద్యోగులకు వర్తింపజేయాలి. విదేశాల నుంచి తెచ్చుకుంటున్న ఉద్యోగులకు రెండేళ్ల పని అనుభవం, ధారాళంగా ఇంగ్లిషులో మాట్లాడగలిగే నేర్పు తప్పనిసరి. ఆ వ్యక్తి మీద క్రిమినల్ కేసులేవీ ఉండరాదు. విదేశాల నుంచి నైపుణ్యం గల వారిని తీసుకొనే యాజమాన్యాలు తమ కంపెనీల్లోని ఆస్ట్రేలియన్ ఉద్యోగులకు తప్పనిసరిగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్న నిబంధనను చేర్చారు. రద్దు చేసిన వీసా వ్యవస్థ పేరు: 457-వీసా ప్రోగ్రామ్. దీని కింద ఏ కంపెనీ అయినా విదేశీ ఉద్యోగులను ఆస్ట్రేలియాకు పంపవచ్చు. నాలుగేళ్లపాటు ఆ ఉద్యోగి అక్కడ పనిచేసే వీలుంటుంది. ఇపుడు మొదట రెండేళ్లకు మాత్రమే ఇచ్చి తర్వాత పొడిగిస్తారు. ఆస్ట్రేలియాలో నైపుణ్యం గల ఉద్యోగులు లేకపోవడం వల్ల అక్కడి ప్రభుత్వం మొదటిసారిగా 1996లోనే దీనిని ప్రవేశపెట్టి 2012లో మరిన్ని వెసులుబాట్లు ఇచ్చింది. కిందటేడది దాదాపు లక్షా 25 వేలకు పైగా విదేశీయులను ఈ ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. వీరిలో 80% మందికి పైగా భారతీయులే. అయితే అనేక కంపెనీలు ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తూ నైపుణ్యం లేని ఉద్యోగులను సొంత అవసరాల కోసం తెచ్చుకుంటున్నాయని అక్కడి డి పార్లమెంట్ ఆఫ్ ఇమిగ్రేషన్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తేల్చింది. దాంతో ఈ విధానాన్ని రద్దు చేస్తామని గతఏడాది ఆ దేశ ప్రధాని మాల్కం టర్న్‌బుల్ చెప్పారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగాన్ని కొంతవరకైనా తగ్గించేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. తాజా మార్పుల వల్ల విదేశీయులకు ఉద్యోగాల సంఖ్య 657 నుంచి 200 కు పడిపోయాయి.

## ఉత్పాదక వ్యయంపై 50% కనీస మద్దతు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 23: రైతులకు ఉత్పాదక వ్యయం కన్నా 50% కనీస మద్దతు ధర పొందేలా విధివిధానాలు తెస్తామని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్ సింగ్ తెలిపారు. రాష్ట్రాలతో చర్చలు జరిపిన అనంతరం నీతి ఆయోగ్ ఈ మేరకు ముసాయిదాను రూపొందించిందని, మరిన్ని చర్చల అనంతరం ముసాయిదాను ఖరారు చేస్తానమి ఆయన చెప్పారు. శుక్రవారం ఫిక్కీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్పాదక వ్యయం కన్నా 50% దాటని కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఉన్న నోటిఫైడ్ పంటలను ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందు సమీక్షిస్తామన్నారు. ఎంఎస్‌పీలకు ఉత్పాదక వ్యయం కన్నా 50% ఎక్కువ ధర చెల్లించేలా ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎంఎస్‌పీల కంటే ధరలు తగ్గితే ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని రైతులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఖజానాకు భారమైనా... రైతుల ప్రయోజనాన్ని కాపాడడమే ప్రధాని మోదీ ఉద్దేశమని తెలిపారు.

## ఇంకా నిర్ణయించుకోలేదు!

- ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ.. రాజకీయ అరంగేట్రంపై ఉత్కంఠ
- 'జేడీ' సన్నిహితుడికి టీడీపీ నేత ఫోన్



మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావును కలిసిన లక్ష్మీ నారాయణ

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్న సీనియర్ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ భవిష్యత్ కార్యక్రమం ఎలా ఉండబోతుందన్నది ఆసక్తి కలిగిస్తోంది. శుక్రవారం ఇక్కడ అసెంబ్లీ ఆవరణ నుంచి టీడీపీ ప్రముఖుడొకరు లక్ష్మీనారాయణ సన్నిహితుడికి ఫోన్‌చేసి మాట్లాడారు. లక్ష్మీనారాయణ ఏం చేయబోతున్నారని ఆయనను అడిగారు. 'లక్ష్మీనారాయణకు రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి ఉంది. ఏ పార్టీలో చేరేది ఇంకా నిర్ణయించుకోలేదు. ఒకటి రెండు రోజుల్లో ఆయనతో మా సమావేశం జరగబోతుంది. అప్పుడు కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో బీజేపీ వైపు వెళ్లవద్దని మాలో కొందరు ఆయనకు చెప్పారు. ఆయన కూడా అదే అభిప్రాయంతో ఉన్నట్లు మాకు అనిపించింది' అన్నట్లు సమాచారం.

## సోనియాగాంధీకి అస్వస్థత, ఢిల్లీకి తరలింపు

సిమ్లా(హిమాచల్‌ప్రదేశ్), మార్చి 23: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అస్వస్థతకు గురయ్యారు. సిమ్లాలో తన కూతురు ప్రియాంకా గాంధీకి చెందిన గృహనిర్మాణ పనులను పరిశీలించేందుకు ఆమె గురువారం ఇక్కడకు వచ్చారు. గురువారం అర్ధరాత్రి ఆమె ఆయాసంతో బాధపడుతుండటంతో ఢిల్లీకి తరలించారని, ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని ఇందిరా గాంధీ వైద్య కళాశాల ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

## పీజీ మెడికల్ కౌన్సెలింగ్ తేదీ పొడిగింపు

న్యూఢిల్లీ, మార్చి 23: నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)లో సాఫ్ట్‌వేర్ సమస్యల కారణంగా పీజీ మెడికల్, డెంటల్ కోర్సుల ప్రవేశానికి.. కౌన్సెలింగ్ దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షను జనవరిలో నిర్వహించగా.. గత నెలలో ఫలితాలు విడుదలయ్యాయి. 'వాస్తవానికి తొలి రౌండ్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు గడువు శనివారంతో ముగియనుంది. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యల కారణంగా.. ఈ గడువును సోమవారానికి (ఈ నెల 26) పొడిగిస్తున్నాం' అని ఆ ప్రకటనలో వివరించింది.

## పీఎంయూవై లబ్ధిదారులకు ఊరట

న్యూఢిల్లీ, మార్చి 23: ఎన్నికల సమయంలో కేంద్రం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు ఊరటనిచ్చింది. ఈ పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పొందిన మహిళలకు రుణంపై గ్యాస్ స్టవ్, మొదటి రీఫిల్‌ను చమురు సంస్థలు అందజేశాయి. ఒప్పందం ప్రకారం తదుపరి రీఫిల్స్‌లో కేంద్రం ఇచ్చే సబ్సిడీని చమురు సంస్థలు రుణ చెల్లింపుల కింద తీసుకుంటాయి. ఏప్రిల్ 1 నుంచి ఆ తర్వాత తీసుకునే 6 రీఫిల్స్ వరకు రీపేమెంట్ తీసుకోబోమని చమురు సంస్థలు ప్రకటించాయి. కొన్ని నెలల్లో కర్ణాటక ఎన్నికలుండడం..వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనుండడంతో సర్కారు ఒత్తిడితో చమురు సంస్థలు ఈ నిర్ణయాన్ని ప్రకటించినట్లు తెలుస్తోంది. 2015 జూన్ నుంచి 3.6 కోట్ల మంది మహిళలు పీఎంయూవై కింద ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు తీసున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

## మార్పులను సమీక్షించాల్సిందే

- ఎస్సీ, ఎస్టీ చట్టంలో సుప్రీం తీర్పుపై.. కాంగ్రెస్ ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ, మార్చి 23: ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టంలో కీలక మార్పులు చేస్తూ సుప్రీంకోర్టు ఇటీవల తీసుకున్న నిర్ణయంపై కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఎకాయెకి అరెస్టులు లేకుండా, నిందితులకు వెంటనే బెయిల్ వచ్చేలా చట్ట సవరణలు చేయాలని డిమాండ్ చేసింది.

### అది తిరోగమన తీర్పు: సీపీఎం

ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టంలో సుప్రీంకోర్టు మార్పులు చేయడాన్ని 'తిరోగమన' తీర్పుగా సీపీఎం పొలిట్‌బ్యూరో అభివర్ణించింది. శుక్రవారం జరిగిన ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో ఈ తీర్పు వెనక ప్రభుత్వం తరఫు న్యాయవాదుల వైఫల్యం ఉందని ఆరోపించింది.

## నేడు గంటసేపు లైట్లు ఆపేద్దాం: కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 23: ఎర్త్ అవర్ సందర్భంగా అందరూ శనివారం గంటసేపు లైట్లు ఆపాలని కేంద్ర పర్యావరణశాఖ మంత్రి హర్షవర్ధన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'మార్చి 24న ఎర్త్ అవర్ సందర్భంగా నేను కూడా నా ఇల్లు, కార్యాలయంలో ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు లైట్లు ఆపుతాను. మీరు కూడా అదే పని చేయాలి' అని కోరారు.



ఆస్ట్రేలియాలోని హామెలిన్ సముద్ర తీరం తిమింగలాల కళేబరాలతో నిండిపోయింది. పెర్త్‌కు 315 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ తీరానికి కనీసం 150 తిమింగలాలు కొట్టుకువచ్చాయి. కొన ఊపిరితో ఉన్న 15 తిమింగలాలను సముద్రంలోనికి విడిచిపెట్టారు. తిమింగలాలు మరణించడానికి కారణమేంటనేది ఇంతవరకూ తెలియలేదు.

# ఆయుష్మాన్ భారత్!



## నగదు రహిత వైద్యానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

- జూలై తర్వాత అమలుకు నిర్ణయం
- కుటుంబానికి రూ.5 లక్షల వరకు కవరేజీ

న్యూఢిల్లీ, హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్! బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త పథకం! నిరుపేదకు ఆరోగ్య ధీమా! కుటుంబానికి రూ.5 లక్షల వరకూ కవరేజీ! ఈ ఏడాది జూలై తర్వాత దీనిని అమల్లోకి తీసుకు రావాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. దేశంలోని 10 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరే ఈ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దీని అమలుకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి అధ్యక్షతన ఆయుష్మాన్ భారత్-నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ మిషన్ (ఏబీ-ఎన్‌హెచ్‌ఆర్‌ఎం) కౌన్సిల్‌ను, పాలక మండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇది ప్రభుత్వ నిధులతో ప్రారంభం కానున్న ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య పథకమని, దేశవ్యాప్తంగా 10 కోట్ల నిరుపేద, బలహీన వర్గాల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఈ పథకం అమలుకు ప్రాథమికంగా రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేబినెట్ నిర్ణయించిందని, అవసరమైతే మరిన్ని కేటాయించడానికి సిద్ధమని స్పష్టం చేశారు. ఈ నిధులను అత్యాధునిక యంత్రాల ఏర్పాటు, లబ్ధిదారుల గుర్తింపు, రాష్ట్రాలకు ప్రీమియం చెల్లింపు తదితరాలకు వినియోగిస్తామని చెప్పారు. బీమా మోడల్ తరహాలో పథకాన్ని అమలు చేయనున్నామన్నారు. 2018- 19; 2019-20 సంవత్సరాలకు కలిపి రూ. 10 వేల కోట్లు కేటాయించామని, ఏడాదికి రూ.5 వేల కోట్లు ఖర్చు చేయనున్నామని తెలిపారు. రాబోయే 4 నెలల్లో అన్ని రాష్ట్రాల్లోనూ ఏకకాలంలో పథకాన్ని పట్టాలపైకి ఎక్కించనున్నట్లు తెలిపింది. ఇందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. పథకం అమలు, రాష్ట్రాల బాధ్యతలపై తెలంగాణ ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో మనోహర్‌తో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ ఎలా ఉండబోతోందో తెలిపారు. పూర్తిస్థాయి మార్గదర్శకాలను త్వరలో విడుదల చేస్తామని వెల్లడించారు. ఏప్రిల్ 30 నాటికి రాష్ట్రాలకు ఎస్ఈసీసీ డేటా పంపిస్తారు. జూలై 31నాటికి ఆస్పత్రుల ఎంప్యానల్‌మెంట్, ఐటీ సిస్టమ్స్ పరీక్ష పూర్తి చేస్తారు.

### ఆరోగ్య బీమాకు ఊపు

ఆయుష్మాన్ భారత్ పథకంతో దేశవ్యాప్తంగా ఆరోగ్య బీమాకు మంచి ఊపు రానుందని క్రిసిల్ స్పష్టం చేసింది. ఇప్పటికే 33 శాతం జనాభాకు ఆరోగ్య బీమా ఉందని, ఇది 50 శాతానికి చేరనుందని తెలిపింది. ఇక, ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేస్తే, పేదలకు ఖర్చు తగ్గుతుందని, పేదరికం నుంచి ప్రజలను బయటకు తీసుకు రావచ్చని వైద్య రంగ నిపుణులు స్పష్టం చేశారు. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు కూడా మెరుగుపడతాయన్నారు.

### క్లెయిమ్ చేసుకునేది ఇలా..

అప్పటికే ఉన్న రోగాలకు కూడా పథకం వర్తిస్తుంది. ఆస్పత్రిలో చేరడానికి ముందు, చేరిన తర్వాత పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయించుకోవచ్చు. అయితే, ఎంపిక చేసిన కొన్ని రోగాలు మాత్రం దీని పరిధిలోకి రా వు. ఇక, రాష్ట్రాల స్థాయిలో కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఎంప్యానెల్ చేస్తారు. వాటిలో నగదు రహిత వైద్యం అందిస్తారు. ప్రైవేటు ఆస్పత్రుల ఎంప్యానెల్‌మెంట్‌కు కొన్ని నిబంధనలు విధిస్తారు. దేశవ్యాప్తంగా ఎంప్యానెల్ చేసిన ఏ ఆస్పత్రిలో అయినా లబ్ధిదారులు చేరవచ్చు. నగదు రహిత వైద్యానికి సంబంధించి నీతి ఆయోగ్ నిర్దిష్ట ఐటీ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది.

### పథకానికి నిధులు ఎలా?

ఈ పథకానికి ఏటా రూ.12 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా. దీనిని కేంద్ర, రాష్ట్రాలు ఉమ్మడిగా భరిస్తాయి. కేంద్రం ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా సొమ్మును చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, ఇటీవలి కేంద్ర బడ్జెట్లో 1 శాతం హెల్త్ సెస్‌ను అదనంగా విధించారు. ఆ నిధులను ఈ పథకానికి వినియోగిస్తారు.



నిరుపేదలు అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలైతే శస్త్ర చికిత్స ఖర్చులు భరించలేక ఆస్తులను తెగనమ్ముకోవాల్సి వస్తోంది. వైద్య

### పథకం లక్ష్యం

ఖర్చులు భరించలేక ఏటా 6 కోట్ల కుటుంబాలు పేదరికంలోకి జారిపోతున్నాయి. వివిధ వర్గాలకు బీమా పథకాలు ఉన్నా.. నిరుపేదలకు అటువంటి అవకాశం లేదు. అందుకే, తీవ్రమైన జబ్బుల బారినపడిన నిరుపేదలు అప్పుల పాలవకుండా చూడటమే ఈ పథకపు లక్ష్యమని కేంద్రం చెబుతోంది. దేశంలో దాదాపు 50% మందికి లబ్ధి చేకూర్చాలని నిర్దేశించుకుంది.



### అమలు చేసేది ఇలా..

జాతీయ స్థాయిలో ఏబీ-ఎన్‌హెచ్‌ఆర్‌ఎం కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తారు. అలాగే, రాష్ట్రస్థాయిలో అన్ని రాష్ట్రాలూ స్టేట్ హెల్త్ ఏజెన్సీని ఏర్పాటు చేసుకోవాలి. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే వివిధ ఆరోగ్య పథకాల అమలుకు ట్రస్టులు ఉన్నాయి. వాటి ద్వారా కూడా ఈ పథకాన్ని అమలు చేసుకోవచ్చు. ఆయా రాష్ట్రాల ఎంపికను బట్టి, ఇన్స్యూరెన్స్ మో డల్, ట్రస్ట్ మోడల్‌ను అమలు చేస్తారు. ఇందుకు రాష్ట్రాలు ఒక ఎస్క్రో ఖాతాను తెరవాలి. వీటి ద్వారా కేంద్రం నిధులు పంపుతుంది. పథకం అమల్లో రాష్ట్రాలకు పూర్తి వెసులుబాటు కల్పిస్తారు. ఏ చికిత్సకు ఎంత చెల్లించాలనేది కేంద్రమే ఖరారు చేస్తుంది. స్థానిక పరిస్థితులను బట్టి మార్పులు చేసుకోవచ్చు. కేన్సర్ సహా 1,350 ట్రీట్‌మెంట్ ప్యాకేజీలను ఖరారు చేశారు.

### ఎవరికి లబ్ధి!?



దేశవ్యాప్తంగా 10.74కోట్ల కుటుంబాలకు అంటే, దాదాపు 50 కోట్లమంది ప్రజలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చనున్నారు. వీరిలో 8.03 కోట్ల కుటుంబాలు గ్రామీణ ప్రాంతాలకు చెందినవైతే, 2.33 కోట్ల కుటుంబాలు పట్టణ ప్రాంతాల్లోవి. కచ్చా ఇల్లున్న, 16-59 మధ్య పెద్దవాళ్లు లేని కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీలు, భూమిలేని నిరుపేదలు, కూలీలు దీని కిందకు వస్తారు. తాజాగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక కుల గణన ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. కుటుంబంలో ఎంతమంది ఉన్నా పథకం వర్తిస్తుంది. పుట్టిన బిడ్డ నుంచి పండు ముదుసలి వరకు ఏటా రూ.5 లక్షల మేరకు ఉచిత వైద్యం అందిస్తారు. కుటుంబానికి ప్రీమియం ఎంత ఉంటుందని ఖరారు చేయకపోయినా 1000-1200 ఉండవచ్చని నీతి ఆయోగ్ అంచనా వేస్తోంది. దీనిని ప్రభుత్వమే చెల్లిస్తుంది.

# ఎన్నాళ్లీ 'గర్భ'శోకం!

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో కానరాని లాప్రోస్కోపీ విధానం
- ఆరోగ్యశ్రీలో తొలగించి ఆరోగ్య రక్షలో ప్రైవేటుకు
- గర్భసంచి తొలగింపు సర్జరీల్లో అసమానతలు
- నిలువు, అడ్డ కోతలతో మహిళల యాతన

గుంటూరు(సంగడిగుంట), మార్చి 23 : పేదలకు ఇప్పటికీ సర్కారు వైద్యమే పెద్ద దిక్కు. ఆధునిక వైద్యసేవలందించేందుకు ప్రభుత్వాలు కోట్లు ఖర్చు చేస్తున్నా.. కొన్ని వైద్యసేవలు మాత్రం వారికి అందని ద్రాక్షగా ఉంది. ప్రధానంగా మహిళల్లో తలెత్తే గర్భసంచి సమస్యలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు అందడం లేదు. ఈ విధానాన్ని ప్రైవేటు ఆసుపత్రులు దుర్వినియోగం చేశాయన్న ఆరోపణలతో ఆరోగ్యశ్రీ పథకం నుంచి మినహాయించడం పెద్ద సమస్యగా మారింది. ఆరోగ్యరక్ష పథకంలో చేర్చినా.. ప్రైవేటు ఆసుపత్రుల మాయాజాలంతో పేద మహిళలు అన్నిరకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

**ఇదీ సమస్య..:** మహిళలకు రుతుస్రావంలో ఇబ్బందులు, గర్భాశయంలో గడ్డలు, సర్వికల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) వంటివి వచ్చినప్పుడు చికిత్సకు వీలుకాని పరిస్థితిలో గర్భసంచిని పూర్తిగా తొలగించాల్సి ఉంటుంది. గతంలో ఇందుకు పెద్దాపరేషన్(హిస్టెరెక్టమి) నిర్వహించే వారు. గర్భాశయంలో ఉన్న కణుతల పరిణామాన్ని బట్టి నిలువు కోత లేదా అడ్డకోతలతో ఈ సర్జరీలు నిర్వహించే వారు. కోలుకునేందుకు మూడు నెలల సమయం పడుతుంది. అడ్డ కోతకు గంట సమయం కాగా, నిలువు కోతకు కేవలం 30 నిమిషాలే కావడంతో ఎక్కువ మంది దీనికే ప్రాధాన్యం ఇచ్చే వారు. అయితే ఈ విధానంలో భవిష్యత్తులో హెర్నియా వంటి సైడ్‌ఎఫెక్ట్‌లు వచ్చేందుకు అవకాశం పెచ్చు. సామాన్య జనానికి ఇదితెలియక, ఆ విధమైన శస్త్రచికిత్సలు చేయించుకుని ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొనేవారు.

### అందుబాటులో లాప్రోస్కోపీ విధానం

2000 సంవత్సరం నుంచి లాప్రోస్కోపీ విధానం అమలులోకి వచ్చింది. తొలినాళ్లలో గర్భసంచి తొలగింపులు ఆరోగ్యశ్రీలో అమలు చేశారు. అయితే ప్రైవేటు ఆసుపత్రులు కాసులకు కక్కుర్తిపడి విచ్చలవిడిగా ఈ శస్త్రచికిత్సలు చేసి ప్రభుత్వ నిధులు కొల్లగొడుతుండడంతో ప్రభుత్వం దీనిని ఆరోగ్యశ్రీ నుంచి తొలగించింది. అదే సమయంలో 133 రకాల వ్యాధులకు చికిత్సను ప్రైవేటు ఆసుపత్రుల నుంచి తొలగించి ప్రభుత్వ ఆసుపత్రులకే పరిమితం చేసింది. దీంతో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం గగనమైపోయింది. మెజార్టీ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రభుత్వంఅన్ని వసతులతో లాప్రోస్కోపీ ప్రవేశపెట్టినప్పటికీ కేవలం కొన్ని సందర్భాల్లోనే చేస్తున్నారు. కారణం ఈ విధానంలో సర్జరీకి మూడు గంటల సమయం పట్టడమే కాకుండా, సిబ్బంది కొరత సాకు చూపుతున్నారు. అదే ఓపెన్ సర్జరీ అయితే 45 నిమిషాలు చాలు. ఇదే వైద్యులు వారి సొంత ఆసుపత్రుల్లో మాత్రం వేలకు వేలు డబ్బులు గుంచి లాప్రోస్కోపీ విధానంలో గర్భసంచిని తొలగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు కోతలు తప్పడం లేదు. సరాసరిన గుంటూరు జిల్లాలోనే రోజుకు పది వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ తరహా ఆపరేషన్లు జరుగుతున్నాయి.

### ఆరోగ్య రక్షలో చేర్చినా దోపిడీయే!

ఈ నేపథ్యంలో ఏడాది క్రితం ప్రభుత్వం ఆరోగ్య రక్ష పథకం ప్రవేశపెట్టి ప్రైవేటు ఆసుపత్రులలో కూడా గర్భసంచి తొలగింపు సర్జరీలు నిర్వహించుకోవచ్చని నిబంధనలను తెచ్చింది. దీంతో అవగాహన ఉన్నవారు 15 రోజుల ముందు రూ.1200 చెల్లించి ఆరోగ్యరక్ష పథకంలో చేరి ఈ సర్జరీ నిర్వహించుకుంటున్నారు. దీనికయ్యే ఖర్చును ప్రభుత్వం ఆయా ఆసుపత్రులకు విడుదల చేస్తుంది. అయితే కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఈ నిబంధనను తెలియనివ్వకుండా ఓపెన్ సర్జరీ నిర్వహించి లాప్రోస్కోపీ విధానం ద్వారా చేసినట్లు నిధులు కాజేస్తున్నట్లు వైద్యులే చెబుతున్నారు. దీనికి తోడు కొన్ని సమయాల్లో అంటే.. గర్భసంచిలో చిన్న గడ్డలు ఉన్నప్పుడు వెజైనల్ ద్వారా నేరుగా గర్భసంచిని తీసివేసే అవకాశం ఉంది. అయితే ఈ రకమైన శస్త్రచికిత్సలు ఆరోగ్యరక్ష పథకంలో లేదు. పైగా ఈ పథకంలో ఉన్న మహిళలకు సైతం కీహోల్ సర్జరీ చేసి వారికి అనారోగ్య సమస్యలు పెంచుతున్నారు.

# భూసారం.. నిస్సారం!



వేములదీవిలో చౌడు భూములు

- విస్తరిస్తున్న క్షారభూములు
- ప్రమాదస్థాయిలో ఉదజని సూచిక
- ఉప్పునీరు, చేపల చెరువులు, అధిక ఎరువులు కారణాలు
- ఏడాదిలోపే లక్ష ఎకరాలకు పెరిగే చౌడు
- పశ్చిమ తీరంలో ప్రమాదఘంటికలు

ఏలూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సారవంతమైన భూములు.. పుష్కలంగా సాగునీరు.. ఎటుచూసినా పచ్చని పొలాలు. ఏటా రెండు పంటలు.. పండిన సిరులతో రైతు ఇంట బంగారం. ఇదీ ఒకప్పటి పశ్చిమ గోదారి తీరంలోని పరిస్థితి. మరి ఇప్పుడో? భూములు నిస్సారమవుతున్నాయి. ఏటా రెండుపంటలు పండే భూములు ఉప్పుతేలుతున్నాయి. ఒకపంట పండించడమే గగనమవుతోంది. ఒక్క నరసాపురం నియోజకవర్గంలోనే పదుల ఎకరాల్లో ఉన్న చౌడుభూములు వేల ఎకరాలకు మళ్లాయి. మరిన్ని భూములు ఆ దిశగానే ఉన్నాయి. ఇందుకు కారణాలు అనేకం!!

### రెండు దశాబ్దాల నుంచే...

గోదావరి జిల్లాల్లో భూమిలో సారం నిస్సారంగా మారుతున్న విషయాన్ని రెండు దశాబ్దాల క్రితమే గమనించారు. 2006 ప్రాంతంలోనే కేంద్రం ప్రయోగాత్మకంగా కొన్ని మండలాలను తీసుకుంది. చౌడుభూముల నివారణకు వీలుగా ఏయే చర్యలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పించేందుకు పైలెట్ పథకాన్ని ప్రారంభించింది.

ఇప్పటికి 20 ఏళ్లు దాటింది. పైలెట్ పథకం ఏనాడో ముగిసింది. ఇప్పుడు రైతుల తిప్పల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు.





### ఎందుకిలా జరుగుతోంది?

వాస్తవానికి గోదావరి జిల్లాల్లో సార్వా, దాళ్వాపంటలు సాగవుతాయి. అప్పట్లో నీటి కొరత ఉండేది కాదు. రాను రానూ గోదావరిలో నీటి లభ్యత తగ్గింది. కాలువలకు సాగునీరు పుష్కలంగా విడుదల చేసే ప్రక్రియ కాస్తా.. వంతులవారీ విధానానికి పరిమితమైంది. ఇదే తరుణంలో నరసాపురం రూరల్ మండలంలో పరిస్థితి ఇంకో రకంగా మారింది. రెండుపంటలు పండే పొలాల్లో ఒక పంటే కనాకష్టంగా మారింది. దర్భరేవు సమీపాన సముద్రపునీరు ఎగువకు చేరకుండా ఏనాడో స్లూయిస్ నిర్మాణం జరిగింది. అయితే ఈ స్లూయిస్ మరమ్మతులు పట్టించుకోలేదు. ఈస్ట్‌పోక్లేర్ ప్రాంతంలోనూ ఇదే తీరు. ఎప్పుడైతే స్లూయిస్‌లు బలహీనపడ్డాయో.. అప్పటినుంచే నరసాపురం భూములకు గండం వచ్చిపడింది. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వ నిర్లక్ష్యం కాస్త రైతులకు ఇప్పుడు శాపంగా మారింది. ఈ సముద్రపు నీరు కాలువలకు ఎగబాకుతూ వచ్చింది. ఫలితంగా భూమిలో ఉప్పులవణశాతం పెరిగింది. దీని ప్రకారం ఉదజని సూచిక 6.5 ఉండాల్సి ఉండగా, ఇప్పుడదికాస్త 15-20కు చేరింది. భూమిలో సారం కోల్పోయినట్లు ప్రమాద ఘంటికలను మోగించింది. అంటే భూములు చౌడుబారినట్లే. వ్యవసాయోగ్యానికి పనికిరావు. ఇదిగాక.. భూగర్భ జలాలు తగ్గటం, పొలాల్లో నీరు నిల్వ ఉండటం, క్షారసూచికలు ఎక్కువగా కనపడటం కూడా భూమిలో చౌడు శాతం పెరగడానికి కారణమవుతోంది. దీనికితగ్గట్టుగా మడ అడవులు క్షీణించడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. దీనికితోడు చేపల చెరువుల వల్ల పంటభూముల్లో నీటి నిల్వలు పెరిగిపోయాయి. ఎక్కడైతే నీటి నిల్వ శాతం ఎక్కువగా ఉంటుందో ఆ ప్రాంతంలోనే చౌడుబారేగుణం పెరుగుతూ ఉంటుంది. అక్షరాల ఇప్పుడు అదే జరుగుతోంది.

### వ్యవసాయాధికారులు ఏమంటున్నారంటే..

క్షారభూముల్లో సారం పెరగాలంటే ఎకరాకు 250 కిలోల జిప్సం ఎరువును వాడాల్సిందే. అంతేకానీ ఎరువుల డీలర్లు చెప్పిన ప్రకారం రైతులు వ్యవహరించడం మంచిది కాదని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.

### అసెంబ్లీలో లేవనెత్తిన సమస్య

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే మాధవనాయుడు ఈ విషయాన్ని లేవనెత్తారు. దర్భరేవు స్లూయిస్‌కు మరమ్మతులు చేయాల్సిందిగా ఆయన మరీ మరి కోరారు. సమస్యను వివరిస్తూనే.. ఒకప్పుడు లక్షల విలువచేసే పంటపొలాలపై ఇదేమాదిరిగా నిర్లక్ష్యం చేస్తే ఇక పంటలు ఇక్కడ మచ్చుకైనా కనిపంచనే కనిపించదన్నారు.

### ఆక్వా చెరువుల వల్లే...



30 ఏళ్ల క్రితం శివారు ప్రాంతాల్లోనూ రెండు పంటలు సాగు చేసేవాళ్లం. దిగుబడి అధికంగా వచ్చేది. ఎప్పుడైతే ఆక్వా సాగు మొదలైందో పంట పొలాలు, కాల్వల్లో ఉప్పుటేరు నీరు కలవడం మొదలుపెట్టింది. దీనివల్ల భూములు చౌడుగా మారిపోయాయి.

- దొంగ పెద్దిరాజు, ఎల్‌బి చర్ల

### స్లూయిస్ తలుపులను ఆధునికీకరించాలి



దర్భరేవు, బియ్యపుతిప్ప స్లూయిస్ తలుపులు శిథిలావస్థకు చేరాయి. పోటు పాటులకు గోదావరి నీరు పంట కాల్వల్లోకి వచ్చి చేరుతోంది. దీని వల్ల దర్భరేవు, సారవ, చామకూరిపాలెం, వేములదీవి, మోడీ ప్రాంతాల్లో భూములు చౌడు బారిపోతున్నాయి. గతంలో ఎన్నోసార్లు స్లూయిస్ తలుపులను బాగు చేయాలని ప్రభుత్వాన్ని విన్నవించాం. పనులు పూర్తయితే కొద్దిగా ఫలితం ఉంటుంది. ఇటు ఆక్వా చెరువుల తవ్వకాలపై నియంత్రణ ఉండాలి. పంట కాల్వలను ఆధునికీకరించి శివారు ప్రాంతాలకు నీరివ్వాలి.

- కటకంశెట్టి మాణిక్యాలరావు, ఎల్‌బీ చర్ల

## జూ. ప్రపంచకప్‌లో వివాన్‌కు రెండు పతకాలు



**సిడ్నీ:** భారత జూనియర్ షూటర్ వివాన్ కపూర్ ప్రపంచ కప్‌లో అదరగొట్టాడు. సిడ్నీలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్‌లో వ్యక్తిగత ట్రాప్, టీమ్ ఈవెంట్‌లోనూ సత్తాచాటి రెండు కాంస్యాలు సాధించాడు. వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్ ఫైనల్స్‌లో వివాన్ 40 పాయింట్లకు 30 స్కోరు చేసి కాంస్యం అందుకున్నాడు. పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో వివాన్, లక్షయ్, అలీ అమాన్ ఎలాహితో కూడిన భారత జట్టు మూడోస్థానం దక్కించుకొంది.




## ఆసియా బిలియర్డ్స్ ఫైనల్లో పంకజ్

**యాంగాన్ (మయన్మార్):** భారత స్టార్ క్యూయిస్ట్ పంకజ్ ఆడ్వాణీ మరో టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచాడు. ఆసియా బిలియర్డ్స్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన పంకజ్.. ఫేవరెట్ హోదాకు న్యాయం చేస్తూ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో పంకజ్ 5-1 స్కోరు తేడాతో భారత్‌కే చెందిన ధ్వజ్ హారియాపై విజయం సాధించాడు. అంతకుముందు క్వార్టర్స్‌లో స్థానిక ఫేవరెట్ ఆంగ్ తేను 5-1తో చిత్తుచేసి పంకజ్ సెమీస్ చేరాడు. మహిళల విభాగంలో భారత్‌కు చెందిన కీరత్ భందాల్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. సెమీస్‌లో కీరత్ 0-3తో థాయ్‌లాండ్ క్రీడాకారిణి సిరిపరన్ నునత్‌కమాజన్ చేతిలో ఓడిపోయింది.

## దీపిక, కోహ్లీ నటించడం 'కుదరదు'

### రూ.11 కోట్ల డీల్‌ను వదులుకున్న ఆర్‌సీబీ





**ముంబై:** క్రికెట్ సెన్సేషన్ విరాట్ కోహ్లీ.. బాలీవుడ్ క్వీన్ దీపికా పదుకోన్ కలిసి ఓ యాడ్‌లో కనిపిస్తే చూడాలని ఎవరనుకోరు? ఐపీఎల్ జట్టు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కూడా ఇదేవిధంగా భావించి ఓ ప్రకటన షూట్ చేయాలని అనుకుంది. కానీ అలా జరిగే అవకాశం లేదని తర్వాత తేలడంతో ఆ భారీ డీల్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది.. ఐపీఎల్‌కు ముందు ప్రముఖ ట్రావెలింగ్ సంస్థ గోఐబీబో.కామ్‌తో ఒప్పందానికి ఆర్‌సీబీ సంప్రదింపులు జరిపింది. దీనికి తగ్గట్టుగా ఆ సంస్థ అంబాసిడర్‌గా ఉన్న దీపికా పదుకోన్, కోహ్లీ మధ్య ఓ యాడ్ షూట్ చేద్దామని కూడా అనుకున్నారు. అయితే కోహ్లీ, ఆర్‌సీబీ మధ్య ఉన్న కాంట్రాక్ట్ ఇందుకు అడ్డు తగిలింది. ఇతర సెలెబ్రిటీలతో కలిసి అతడు వ్యాపార ప్రకటనల్లో కనిపించకూడదనేది ఆ నియమం. దీంతో ఈ నిబంధన వారికే బెడిసికొట్టడంతో రూ.11 కోట్ల విలువైన స్పాన్సర్‌షిప్‌ను కోల్పోవాల్సి వచ్చింది. అయితే దీపికాతో కలిసి నటించనని కోహ్లీ చెప్పినట్టు కథనాలు వెలువడ్డాయి.

## నేను సంతకం చేయను..

### ప్రియా గుప్తా నియామకంపై అమితాబ్ చౌధరి



**న్యూఢిల్లీ:** పరిపాలకుల కమిటీ (సీఓఏ), బీసీసీఐ మధ్య మరోసారి వివాదం రాజుకునేలా కనిపిస్తోంది. నూతన జనరల్ మేనేజర్ (మార్కెటింగ్)గా ప్రియాగుప్తా నియామకంపై బోర్డు కార్యదర్శి అమితాబ్ చౌధురి అభ్యంతరం వ్యక్తం చేస్తుండడమే దీనికి కారణం. ఆమె అపాయింట్‌మెంట్ లెటర్‌పై సంతకం పెట్టేది లేదని ఆయన తేల్చిచెప్పాడు. గతంలో ఓ పత్రికలో పనిచేసినప్పుడు బాలీవుడ్ నటి దీపికా పదుకోన్‌పై ప్రియా అసభ్యకరంగా కథనాన్ని రాసిందని ఆయన గుర్తు చేశాడు. అలాగే ఇంతటి అత్యున్నత పదవిని నిర్వహించే సామర్థ్యం ఆమెకు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. అసలు బీసీసీఐలాంటి పాపులర్ సంస్థకు మార్కెటింగ్ పదవి అవసరమా? అని కూడా ఆయన ప్రశ్నించాడు. ఈమేరకు బోర్డు సీఈవో రాహుల్ జోహ్రి, సీఓఏ, ఇతర బీసీసీఐ అధికారులకు ఈమెయిల్ పంపాడు. జస్టిస్ లోధా ప్యానెల్ కూడా ఈ పదవిని ప్రతిపాదించలేదని తెలిపాడు ఏడాదికి రూ.1.65 కోట్ల వేతనంతో ఆమెను సీఓఏ నియమించగా ప్రొటోకాల్ ప్రకారం అపాయింట్‌మెంట్ లేఖలపై కార్యదర్శి సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే గత వారం సీఓఏ విడుదల చేసిన మార్గదర్శకాలతో గుప్తా నియామకంపై సీఈవో జోహ్రి, లేక జీఎం (క్రికెట్ ఆపరేషన్స్) సాబా కరీంలలో ఒకరు సంతకం చేసినా సరిపోతుంది. 2014లో దీపికా 'క్లీవేజ్ షో' గురించి టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రియా గుప్తా రాసిన ఆర్టికల్ సంచలనం సృష్టించింది. దీనికి దీపికా కూడా అప్పట్లో ఘాటుగానే బదులిచ్చింది. 'మహిళను కాబట్టే తనకు వక్షోజాలు ఉన్నాయని, నీకేమైనా సమస్యా? సినిమాల్లో పాత్రను బట్టి మేం నటిస్తాం' అంటూ కౌంటరిచ్చింది. దీనికి బదులుగా దీపికా ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొట్టే వస్త్రధారణ చేస్తుందని ప్రియా గుప్తా మరో కథనం రాసింది.




వీర్‌ధవళ్ ఖడే

# ఈతలో మోతెక్కిస్తాడా!

### గత వైభవానికి తహతహ ● 'కామన్వెల్త్' తొలిమెట్టు అంటున్న స్విమ్మర్ ఖడే

**యుక్త వయస్సులో అంతర్జాతీయ ఖ్యాతి..దానితోపాటు లభించే ఆర్థిక ప్రయోజనాలతో ఒక్కసారిగా మారే జీవితం..వీటన్నింటికీ పొంగిపోకుండా ఆటపైనే మనసు నిలిపి కెరీర్‌లో మరింత దూసుకుపోయేవారు కొందరైతే..ఆ పేరు ప్రతిష్ఠలతో వచ్చే సౌకర్యాలను అనుభవిస్తూ కెరీర్‌ను విస్మరించేవారు మరికొందరు. రెండో కోవకు చెందినవాడు స్విమ్మర్ వీర్‌ధవళ్ ఖడే.16 ఏళ్ల ప్రాయంలోనే ఒలింపిక్స్‌లో తలపడి ఆపై లభించిన విజయాలతో గర్వం తలకెక్కి కెరీర్‌లో వెనుకపడి.. తర్వాత తప్పుతెలుసుకొని ఇప్పుడు కామన్వెల్త్ క్రీడలతో పునర్ వైభవానికి తహతహలాడుతున్నాడు ఈ స్విమ్మర్.**

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

వీర్‌ధవళ్ ఖడే.. 16 ఏళ్ల వయస్సులో 2008 బీజింగ్ ఒలింపిక్స్ బరిలోకి దిగినప్పుడు దేశం దృష్టంతా అతడిపై నిలిచింది. అత్యంత పిన్నవయస్సులో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత స్విమ్మర్‌గా అతడు రికార్డు నెలకొల్పడమే దానికి కారణం. ఆ విశ్వక్రీడల్లో పురుషుల 50మీ., 100 మీ., 200 మీ. ఫ్రీస్టయిల్‌లో తలపడిన ధవళ్.. 100 మీ.లలో జాతీయ రికార్డు బద్దలుగొట్టి ఔరా అనిపించాడు. అయితే ఆ మూడు ఈవెంట్లలో అతడు సెమీఫైనల్స్‌కు కూడా అర్హత సాధించలేదనుకోండి! ఇకపోతే ఖడే ఇటీవల సింగపూర్ జాతీయ వయో పరిమిత స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నప్పుడు సింగపూర్, ఇండోనేసియా స్విమ్మర్లు అతడిని కోచ్‌గా భావించారు. కారణం.. 2010 ఆసియా క్రీడల తర్వాత ధవళ్ కొన్ని ఏళ్లపాటు అంతర్జాతీయ పోటీల్లో తలపడకపోవడమే. అందువల్ల పలువురు అంతర్జాతీయ స్విమ్మర్లకు అతడెవరో తెలియకపోవడంలో వింతేమీ లేదు. 'గోల్డ్ కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌కు ముందు నన్ను నేను పరీక్షించుకోవడానికి సింగపూర్ పోటీల్లో పాల్గొన్నా. అక్కడ రెండు పతకాలు గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది' అని ధవళ్ చెప్పాడు.

**ఆసియాడ్ కాంస్యంతో సత్తా..**

బీజింగ్ ఒలింపిక్స్‌తో ఒక్కసారి వెలుగులోకి వచ్చిన ధవళ్..ఆ తర్వాత రెండు సంవత్సరాలకు గ్వాంగ్ ఝౌ (చైనా)లో జరిగిన ఆసియా క్రీడల్లో కాంస్య పతకంతో సత్తా చాటాడు. ఆపై అతడి ప్రతిభ మసకబారడంతో 2012 ఒలింపిక్స్, 2014 కామన్వెల్త్, 2016 రియో ఒలింపిక్స్‌ను మిస్సయ్యాడు. 'నాకు ఎదురైన అనుభవాలు మరే భారత స్విమ్మర్‌కు ఎదురై ఉండవు. 2008 ఒలింపిక్స్ క్వాలిఫై అయినప్పటి క్షణాలు నాకు ఇప్పటికీ గుర్తు. ఓ స్విమ్మర్‌కు కావాల్సిన ఆహారం సమకూర్చుకోలేని దయనీయస్థితిలో ఉన్నా. బిస్కెట్లతో కడుపు నింపుకొని పోటీలు గెలిచిన సందర్భాలున్నాయి. వాటన్నింటినీ మనోధైర్యంతో ఎదుర్కొని సత్తా చాటా. ఒలింపిక్స్ తర్వాత పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. ఇక 2010 ఆసియాడ్‌లో పతకం గెలవడంతో పరిస్థితి బాగా మెరుగైంది. ఆ తర్వాత ఏడాదికి అర్జున అవార్డు కూడా లభించింది' వీర్‌ధవళ్ వివరించాడు.

**విజయ 'గర్వం'..**

ఆ తర్వాత ఖడే కెరీర్‌లో తిరోగమనం ప్రారంభమైంది. అందుకు విజయగర్వమే కారణమని చెప్పాడు. '2010 నుంచి 2017 వరకూ నా ప్రతిభ దిగజారింది. కొద్దిపాటి విజయాలు దక్కగానే కొందరికి గర్వం తలకెక్కుతుంది. నాకూ అదే జరిగింది' అని అంగీకరించాడు. అతడి ప్రతిభకు మెచ్చిన మహారాష్ట్ర ప్రభుత్వం ఖడేకు తహసీల్దార్ ఉద్యోగం ఇచ్చింది. ఆ ఉద్యోగ బాధ్యతలు కూడా తాను కెరీర్ నుంచి దృష్టి మళ్లించడానికి కారణమయ్యాయని వివరించాడు. 'పని ఒత్తిడి బాగా ఉండేది. దాంతో ఉదయాన్నే లేచి స్విమ్మింగ్ ప్రాక్టీస్‌కు వెళ్లలేకపోయా. ఫలితంగా 20 కేజీల బరువు పెరిగా. అలా కెరీర్‌లో వెనుకబడ్డా' అని ధవళ్ వివరించాడు. '2010 ఆసియాడ్‌లో కాంస్య నెగ్గాక తదుపరి ఆసియా గేమ్స్‌లో స్వర్ణ పతకం గెలవాలని లక్ష్యంగా పెట్టుకొన్నా. కానీ అది జరగలేదు. 2014లో ఎన్నికల విధులతో తీరకలేకుండా గడపాల్సి వచ్చింది' అని వివరించాడు. ఇక తన స్విమ్మింగ్ కెరీర్ ముగిసిందని ఖడే భావిస్తున్న తరుణంలో అతడికి ముంబై బదిలీ అయింది. దాంతో మళ్లీ కెరీర్ కొనసాగించాలని నిర్ణయించుకొన్నాడు. 'ముంబై వెళ్లాక రోజుకు రెండుసార్లు ఆరు గంటలపాటు స్విమ్మింగ్ సాధన చేయడంతోపాటు జిమ్‌లో రెండు గంటలు తీవ్రంగా కష్టించా. ఫలితంగా నా శరీరాకృతి మునుపటి స్థాయికి వచ్చింది. అలా మళ్లీ కెరీర్ దారిలో పడింది' అని ఖడే వెల్లడించాడు. కెరీర్ తిరిగి గాడినపడుతున్న తరుణంలో కుటుంబంలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. తండ్రి మరణించడంతో ఖడే విషాదంలో మునిగిపోయాడు. 'నన్ను ఓ క్రీడాకారుడిగా చూడాలనుకున్న తపనతో ఐదేళ్ల వయస్సప్పుడు స్విమ్మింగ్‌లో చేర్పించారు. కెరీర్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు ఎంతో బాధపడ్డారు. స్విమ్మర్‌గా నేను మళ్లీ పేరు ప్రఖ్యాతులు గడించాలని భావించారు' అని ధవళ్ వేదనతో చెప్పాడు. ఇక.. గోల్డ్‌కోస్ట్‌లో 50 మీ., ఫ్రీస్టయిల్, 50మీ., బటర్‌ఫ్లైలో బరిలోకి దిగుతున్న వీర్..అక్కడ తన అవకాశాలపై వాస్తవ దృక్పథంతో ఉన్నాడు. పోటీ చాలా తీవ్రంగా ఉన్నా తన శక్తిమేర రాణిస్తానన్నాడు.

## ఇంగ్లండ్ ఘన విజయం

### ● ఆసీస్ చిత్తు ● టీ20 ముక్కోణపు సిరీస్



నటాలి

**ముంబై:** మహిళల టీ20 ముక్కోణపు సిరీస్‌లో ఇంగ్లండ్ గ్రాండ్‌గా బోణీ చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. నటాలి స్కివర్ (68), టామీ బ్యూమంట్ (58) అజేయ అర్ధ శతకాలతో చెలరేగడంతో.. ఆసీస్ నిర్దేశించిన 150 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ మరో 18 బంతులు మిగిలుండగానే రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా.. కెప్టెన్ రేచల్ హేన్స్ (65) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. ఓపెనర్ అలెస్సా హీలే (31), గార్డెనర్ (21) సహకారం అందించారు. ఇంగ్లండ్ బౌలర్లు జెన్నీ గన్ (3/26) మూడు వికెట్లు పడగొట్టగా.. నటాలి స్కివర్ (2/29)కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో ఓపెనర్లు డానియల్ వయాట్ (18), బ్రయోని స్మిత్ (1) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. అయితే వన్ డౌన్‌లో వచ్చిన బ్యూమంట్, స్కివర్ ధాటిగా ఆడడంతో ఇంగ్లండ్ గెలుపు దిశగా సాగింది. వీరు 3 వికెట్‌కు అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నమోదు నమోదు చేశారు.

## వణికించిన బౌలర్లు

**ఆస్ట్రేలియా 245/9** | **మధ్యాహ్నం 2 గం. నుంచి సోనీ సిక్స్‌లో**



మోర్కెల్ (4/87)

**కేప్‌టౌన్:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో దక్షిణాఫ్రికా బౌలర్లు ఆధిక్యం ప్రదర్శించారు. మోర్నీ మోర్కెల్ (4/87), రబాడ (3/81) చెలరేగడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 9 వికెట్లకు 245 పరుగులు చేసింది. ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్ (77) ఆరంభంలో రాణించగా చివర్లో లియోన్ (47) పోరాడాడు. ఫిలాండర్‌కు రెండు వికెట్లు దక్కాయి. మోర్కెల్ తన కెరీర్‌లో 300 వికెట్లు పడగొట్టిన ఐదో ప్రొటీస్ బౌలర్‌గా నిలిచాడు. అంతకుముందు సఫారీ జట్టు 97.5 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌట్ అయ్యింది. టెస్టుల్లో.. ఓపెనర్ ఎల్గర్ (141 నాటౌట్) అజేయంగా నిలవడం ఇది మూడోసారి. దీంతో డెస్మండ్ హేన్స్ (విండీస్) రికార్డును సమం చేశాడు. అలాగే ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఐదు క్యాచ్‌లు అందుకోవడంతో వికెట్ కీపర్ కాకుండా ఓ ఇన్నింగ్స్‌లో ఈ ఫీట్ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అతడికంటే ముందు పది మంది కూడా ఐదు క్యాచ్‌లు అందుకున్నారు.



### వార్నర్‌పై ప్రేక్షకుడి దుర్భాషలు..

**కేప్‌టౌన్:** క్వింటన్ డికాక్‌తో ఘర్షణ తర్వాత దక్షిణాఫ్రికాలో ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ టార్గెట్‌గా మారాడు. మూడో టెస్టు సందర్భంగా ఓ ప్రేక్షకుడు.. వెంటపడి మరీ వార్నర్‌ను దుర్భాషలాడాడు. రబాడ బౌలింగ్‌లో వరుసగా 4,4,6,4 బాదిన తర్వాత వార్నర్ అవుటై డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తుండగా.. అతడిని వెంబడించిన ఆ ప్రేక్షకుడు మెట్లు ఎక్కుతుండగా ఫెన్సింగ్ అవతల నుంచి వార్నర్‌ను పిలిచి తిట్లు లంకించుకున్నాడు. దీంతో ఆగ్రహించిన వార్నర్ కూడా అతడితో గొడవకు దిగాడు. పరిస్థితి గమనించిన భద్రతాధికారులు వెంటనే అక్కడకు చేరుకుని ఆ ప్రేక్షకుడిని అదుపులోకి తీసుకున్నారు. డర్బన్‌లో జరిగిన టెస్టులో సౌతాఫ్రికా కీపర్ క్వింటన్ డికాక్, వార్నర్ మధ్య గొడవ జరిగిన సంగతి తెలిసిందే.

## విలియమ్సన్ రికార్డు శతకం

**న్యూజిలాండ్ 229/4** | **ఉ. 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్ -1లో**



విలియమ్సన్ (102)

**ఆక్లాండ్:** కెప్టెన్ కేన్ విలియమ్సన్ (220 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 102) న్యూజిలాండ్ తరపున చరిత్ర సృష్టించాడు. అత్యధిక సెంచరీలు (18) సాధించిన తొలి బ్యాట్స్‌మన్‌గా నిలుస్తూ.. తను మార్టిన్ క్రో, రాస్ టేలర్‌లను అధిగమించాడు. అయితే ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఈ డే అండ్ నైట్ టెస్టుకు రెండో రోజు ఆటకు వర్షంతో అంతరాయం కలిగింది. దీంతో 23.1 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆట ముగిసే సమయానికి కివీస్ 92.1 ఓవర్లలో నాలుగు వికెట్లకు 229 పరుగులు చేసింది. విలియమ్సన్ సెంచరీ కాగానే వర్షం గంటసేపు అంతరాయం కలిగించింది. ఆ తర్వాత అతను వెంటనే అవుట్ కాగా రెండోసారి కూడా భారీ వర్షంతో ఆటంకం ఏర్పడింది. నాలుగు గంటల అనంతరం అంపైర్లు ఆటను రద్దు చేశారు. నికోల్స్ (49 బ్యాటింగ్), వాట్లింగ్ (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అండర్సన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ప్రస్తుతం ఆతిథ్య జట్టు 171 పరుగుల ఆధిక్యంలో ఉంది.

### క్రీడా మంత్రిత్వ శాఖపై ఎన్‌ఆర్‌ఏఐ ఫైర్

కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత బృందం వెంట వెళ్లే 'ఇతరు'ల జాబితాను కేంద్ర కీడా శాఖమంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ కత్తిరించడంతో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. 41 మంది ఇతరుల జాబితాలో 21 మందికి అనుమతి ఇచ్చేందుకు మంత్రి ససేమిరా అన్నారు. వీరిలో స్టార్‌షట్లర్లు సింధు తల్లి, సైనా తండ్రితోపాటు షూటర్ హీనా సిద్దూ భర్త, ఆమె కోచ్ రోనక్ పండిట్ ఉన్నారు. రోనక్ పేరును జాబితా నుంచి తొలగించడంపై జాతీయ రైఫిల్ సంఘం (ఎన్‌ఆర్‌ఏఐ) చీఫ్ రణిందర్ సింగ్...మంత్రిత్వ శాఖపై ట్విట్టర్‌లో సెటైర్‌విసిరారు. 'గోల్డ్‌కోస్ట్‌లో కంటే కూడా ఇక్కడే పోరాడాల్సి వస్తోంది' అని మంత్రినుద్దేశించి ఆయన వ్యాఖ్యానించాడు.

### సన్‌రైజర్స్ ఆన్‌లైన్ టిక్కెట్ల అమ్మకం షురూ!

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మ్యాచ్‌ల ఆన్‌లైన్ టిక్కెట్ల అమ్మకం శుక్రవారం మొదలైంది. ముందస్తుగా కొనుగోలు చేయాలనుకున్నవారు తమ వెబ్‌సైట్ www.sunrisershyderabad.inకు వెళ్లి నచ్చిన మ్యాచ్ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చంటూ సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ట్విట్టర్‌లో ప్రకటించింది. సన్‌రైజర్స్ తమ తొలిమ్యాచ్‌ను ఉప్పల్ వేదికగా ఏప్రిల్ 9న రాజస్థాన్ రాయల్స్‌తో ఆడనుంది. టిక్కెట్ కనీస ధర రూ. 500 కాగా, గరిష్ఠంగా రూ. 3,906 నిర్ణయించారు. మిగతా స్టాండ్స్ టిక్కెట్ల ధరలు రూ. 781, రూ. 976, రూ. 1,171, రూ. 2,734, రూ. 3,906తో అందుబాటులో ఉన్నాయి.



### కామన్వెల్త్ నుంచి సౌమ్యజిత్ అవుట్

**న్యూఢిల్లీ:** అత్యాచార కేసు ఎదుర్కొంటున్న టేబుల్ టెన్నిస్ ప్లేయర్ సౌమ్యజిత్ ఘోష్‌ను కామన్వెల్త్ బృందం నుంచి తప్పించారు. అతడిపై తాత్కాలిక సస్పెన్షన్ వేటు వేశారు. 'సౌమ్యజిత్‌పై తాత్కాలిక సస్పెన్షన్ విధించాం. పోలీసు దర్యాప్తు, కోర్టు తీర్పు తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామ'ని భారత టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ (టీటీఎఫ్ఐ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

### సౌత్‌జోన్ మహిళల

## చాంపియన్ ఆంధ్ర

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** బీసీసీఐ సౌత్‌జోన్ అంతర్‌రాష్ట్ర మహిళల అండర్-23 టీ20 లీగ్‌లో ఆంధ్ర జట్టు విజేతగా నిలిచింది. ఆంధ్ర 20 పాయింట్లతో టాపర్‌గా నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. కేరళ (16 పాయింట్లు) రన్నరప్ ట్రోఫీ దక్కించుకుంది. శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర 33 రన్స్‌తో గోవాపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. ఝాన్సీ లక్ష్మి 43, పద్మజ 20 పరుగులతో రాణించారు. అనంతరం గోవా 17.5 ఓవర్లలో 77 రన్స్‌కే కుప్పకూలింది. సంజులా నాయక్ (30) టాప్ స్కోరర్. పద్మజ 3 వికెట్లు పడగొట్టింది. కాగా, మరో మ్యాచ్‌లో హైదరాబాద్ 6 వికెట్లతో తమిళనాడుపై నెగ్గింది. తొలుత రచన (3/6), శ్రావణి (3/9) దెబ్బకు.. తమిళనాడు 19.5 ఓవర్లలో 57 రన్స్‌కే ఆలౌటైంది. అనూష (30) రాణించింది. తర్వాత త్రిష (22), మహేశ్వరి (21 బంతుల్లో ఫోర్‌తో 19 నాటౌట్) రాణించడంతో హైదరాబాద్ 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి అలవోకగా గెలిచింది. మరో మ్యాచ్‌లో కేరళ 5 వికెట్లతో కర్ణాటకను ఓడించింది. కర్ణాటక 82/7 స్కోరు చేయగా.. కేరళ 16 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి గెలుపు వాకిట నిలిచింది.

## వరల్డ్‌కప్‌కు అఫ్ఘాన్ క్వాలిఫై




**హరారే :** అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రంలో ఎన్నో సంచనాలు సృష్టించిన ఆఫ్ఘానిస్థాన్ మరోసారి సత్తా చాటింది. ఐసీసీ క్వాలిఫయింగ్ టోర్నీ ఆఖరి సూపర్ సిక్స్ మ్యాచ్‌లో ఐదు వికెట్లతో ఐర్లాండ్‌ను ఓడించి వన్డే వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించింది. వాస్తవంగా... అఫ్ఘాన్ ప్రపంచకప్‌కు క్వాలిఫై కావడం అద్భుతమనే చెప్పాలి. గ్రూప్ దశలో మూడు మ్యాచ్‌ల్లో ఒక్క దానిలోనూ గెలవని అఫ్ఘానిస్థాన్ సున్నా పాయింట్లతో సూపర్ సిక్స్‌లో ప్రవేశించింది. అయితే, సూపర్ సిక్స్‌లో విండీస్, ఐర్లాండ్, జింబాబ్వేపై విజయం సాధించడం తోపాటు ఇతర మ్యాచ్‌ల ఫలితాలు కూడా అఫ్ఘాన్ జట్టు వరల్డ్ కప్ కలను సాకారం చేశాయి. శుక్రవారం ఐర్లండ్‌తో మ్యాచ్‌లో షహజాద్ (54) ధాటి బ్యాటింగ్‌కు గుల్బదిన్ నయీబ్ (45), అస్ఘర్ (39 నాటౌట్) సమయోచిత ఇన్నింగ్స్ తోడవడంతో 210 లక్ష్యాన్ని ఆ జట్టు సునాయాసంగా ఛేదించింది. అంతకుముందు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్..ఓవర్లలో 7 వికెట్లకు 209 రన్స్ చేసింది.

**పాపం జింబాబ్వే..**

జింబాబ్వే జట్టు 1979 తర్వాత తొలిసారి ప్రపంచకప్‌నకు దూరమైంది. వర్షం బారిన పడిన గురువారంనాటి సూపర్ సిక్స్ మ్యాచ్ చివరి ఓవర్ వరకూ ఉత్కంఠ భరితంగా సాగింది. అయితే యూఏఈ మూడు పరుగుల (డక్‌వర్త్ లూయిస్ నిబంధనతో) తేడాతో ఆతిథ్య జింబాబ్వేను కంగుతినిపించింది.



బీజేపీ ఎంపీల సమావేశంలో ప్రధాని మోదీ, అమిత్ షా, ఆద్వాణీ

## ఏపీకి అన్యాయం చేయలేదు

- నిరాశా నిస్పృహలతోనే అవిశ్వాసాలు
- పార్లమెంటును జరగనివ్వడం లేదు
- ప్రజల్లోకి వెళ్లి వివరించండి.. టెక్నాలజీని ఉపయోగించుకోండి
- బీజేపీ ఎంపీలకు ప్రధాని పిలుపు

న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఎలాంటి అన్యాయం చేయలేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు పార్లమెంటును స్తంభింపజేస్తూ.. కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ విషయాన్ని ఎంపీలు తమ తమ నియోజకవర్గాల్లో విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి మరీ చెప్పాలని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తమ ఎంపీలకు పిలుపిచ్చారు. ప్రతిపక్షాలు నిరాశానిస్పృహలకు లోనైందునే పార్లమెంటును అడ్డుకుంటున్నాయని.. అవిశ్వాస తీర్మానాల పేరుతో సభాకార్యకలాపాలను సాగనివ్వడం లేదని ధ్వజమెత్తారు. బీజేపీని ఎన్నికల్లో ఓడించలేమన్న నిస్పృహతో.. నిస్సహాయతతో ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టాలని మోదీ కోరారు. అంబేడ్కర్ జయంతి దినమైన ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకు ప్రభుత్వం అమలు చేయదలుచుకున్న సంక్షేమ కార్యక్రమాల క్యాలెండర్‌ను ఆయన ఈ సందర్భంగా విడుదల చేశారు. ఎంపీలనుద్దేశించి ప్రసంగించడానికి బదులు మోదీ వారితో చర్చలను జరిపారు. కొత్త పార్టీ కార్యాలయాన్ని.. పార్టీ పని సంస్కృతిని ప్రతిబింబించేందుకు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కాంగ్రెస్ కార్యకలాపాలు సోనియాగాంధీ నివాసం నుంచి జరుగుతాయని, బీజేపీ ఆ అవసరం లేదని మోదీ చెప్పారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వాస్తవాలు వివరించాలని కోరారు. శనివారం నుంచి సోమవారం వరకు పార్లమెంటుకు మూడు రోజులు సెలవని.. ఈ సమయాన్ని ఎంపీలు ప్రజల్లోకి వెళ్లేందుకు ఉపయోగించుకోవాలని షా కోరారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. గత పది ఎన్నికల్లో బీజేపీ గెలిచేందుకు ఇదే కారణమైందని చెప్పారు. నీతి ఆయోగ్ ద్వారా 115 జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ఎలా చేపట్టనున్నదీ సమావేశంలో ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు.

# ఆప్‌కు లాభం..

## 20 మంది ఎమ్మెల్యేల అనర్హతపై ఊరట

- కేంద్రం నోటిఫికేషన్‌ను రద్దు చేసిన హైకోర్టు
- లాభదాయక పదవుల కేసులో తీర్పు
- మళ్లీ విచారించాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 23: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి భారీ ఊరట.. లాభదాయక పదవులకు సంబంధించి 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఢిల్లీ హైకోర్టు రద్దు చేసింది. ఈ కేసును మళ్లీ మొదటి నుంచీ విచారించాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి ఎన్నికల కమిషన్ సిఫారసులు చట్టాన్ని నీరుగార్చడం, చెడు సంప్రదాయమని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ చందర్ శేఖర్‌లతో కూడిన ధర్మాసనం తీవ్రంగా వ్యాఖ్యానించింది. అనర్హత వేటు వేయడానికి ముందు మౌఖిక విచారణ జరపలేదని, ఎమ్మెల్యేల వాదన వినలేదని, సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించారని స్పష్టం చేసింది. ఎమ్మెల్యేల పిటిషన్‌ను తిరిగి ఎన్నికల కమిషన్‌కు పంపించింది. మంత్రులకు పార్లమెంటరీ సెక్రటరీలుగా 20 మంది ఎమ్మెల్యేలను 2015 మార్చిలో ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. దాంతో, వారంతా లాభదాయక పదవుల్లో కొనసాగుతున్నారని, ఆర్థిక ప్రయోజనాలు పొందారని, వారి శాసన సభ్యత్వాలను రద్దు చేయాలంటూ ఢిల్లీ హైకోర్టులో కాంగ్రెస్ పార్టీ పిటిషన్ దాఖలు చేసింది. అప్పట్లో రోజువారీగా విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు.. వారిని పార్లమెంటరీ సెక్రటరీలుగా నియమించడాన్ని 2016 సెప్టెంబరులో తప్పుబట్టింది. అనంతరం 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై ఎన్నికల కమిషన్ అభిప్రాయాన్ని కోరింది. దాంతో, తాము లాభదాయక పదవులు చేపట్టలేదని ఎమ్మెల్యేలు చెప్పజాలరని, వారిపై అనర్హత వేటు వేయాలని ఈ ఏడాది జనవరి 19న ఈసీ సిఫారసు చేసింది. దానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేశారు. అనర్హతను సవాల్ చేస్తూ మళ్లీ ఆప్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును మళ్లీ ఎన్నికల కమిషన్‌కు అప్పగించాలని, మొదటి నుంచీ విచారణ చేసేలా ఆదేశించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై స్టే ఇచ్చేందుకు అప్పట్లో ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఆ 20 నియోజక వర్గాల్లోనూ ఎన్నికల నిర్వహణకు తొందర పడొద్దని, షెడ్యూలు విడుదల చేయడంలో సంయమనం పాటించాలని ఆదేశించింది. ఇదే కేసుకు సంబంధించి శుక్రవారం తీర్పు వెలువరించింది. "రాష్ట్రపతికి ఎన్నికల కమిషన్ ఇచ్చిన అభిప్రాయం చట్టాన్ని నీరుగార్చడమే. సహజ న్యాయ సూత్రాలను పాటించకుండా చెడు సంప్రదాయాన్ని నెలకొల్పడమే. మౌఖిక విచారణ జరపడంలో, ఎమ్మెల్యేల వాదన వినడంలో, కేసు ఉచితానుచితాలను బట్టి సమస్యను పరిష్కరించడంలో విఫలమైంది" అంటూ కేసును తిరిగి ఎన్నికల కమిషన్‌కు అప్పగించింది. కాగా.. తమ పోరాటం కొనసాగిస్తామని ఢిల్లీ పీసీసీ చీఫ్ అజయ్ మాకెన్ స్పష్టం చేశారు. ఆ ఎమ్మెల్యేలు ఆర్థిక ప్రయోజనాలు పొందారని ఉద్ఘాటించారు.



ఆప్ ఎమ్మెల్యేలతో కలసి విజయ సంకేతం చూపుతున్న కేజ్రీవాల్, సిసోడియా

### సత్యమే గెలిచింది: కేజ్రీవాల్

కోర్టు తీర్పు వెలువడిన వెంటనే 'సత్యమే గెలిచింది' అంటూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. "ఎమ్మెల్యేలపై దురుద్దేశపూర్వకంగా అనర్హత వేటు వేశారు. ఢిల్లీ ప్రజలకు హైకోర్టు న్యాయం చేసింది. ఇది వారి విజయం" అంటూ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతుండడంతో శాసన సభలోనే ఎమ్మెల్యేలు 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. అంతలోనే, ఆ 20 మంది ఎమ్మెల్యేలూ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనవచ్చని స్పీకర్ రూలింగ్ ఇచ్చారు.



కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇస్సాక్

## దక్షిణాది సమరం!

### పన్నుల పంపకంలో కేంద్రం వివక్ష

- 2011 లెక్కల ప్రకారం పంపిణీ
- తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబు
- గొంతు కలిపిన కర్ణాటక, కేరళ
- దక్షిణాది భేటీకి కేరళ పిలుపు
- సంసిద్ధత వ్యక్తం చేసిన రాష్ట్రాలు

తిరువనంతపురం, మార్చి 23: ఇప్పటిదాకా దక్షిణాదిపై వివక్ష గురించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులు మాత్రమే పోరాడుతూ వస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా కేరళ కూడా గొంతు కలుపుతోంది. కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇస్సాక్ దక్షిణాది రాష్ట్రాల ఆదాయాన్ని.. అభివృద్ధి అవసరాల పేరుతో ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఇదే అంశంపై ఏప్రిల్ 10న తిరువనంతపురంలో దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ఆర్థిక శాఖ కార్యదర్శులకు లేఖలు రాశానని, అందరూ సమావేశానికి వస్తామని ఫోన్లో చెప్పారన్నారు. రాష్ట్రాలకు నిధుల పంపిణీకి 1971 జనాభా లెక్కలకు బదులు 2011 లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని పదిహేనో ఆర్థిక సంఘానికి కేంద్ర ప్రభుత్వం సిఫార్సు చేసినప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు ఆగ్రహంతో ఉన్నాయి. జనాభా నియంత్రణను పాటించి అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలకు శాపంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉండటం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో అవి తమ అభ్యంతరాలను గట్టిగానే చెప్పాయి. "కుటుంబ నియంత్రణను సమర్థంగా అమలు చేయడమే మా పాపమా?" అని థామస్ ఇస్సాక్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సును గట్టిగా వ్యతిరేకించాలని ఇప్పటికే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ట్వీట్ చేశారు. సిద్దరామయ్య ట్వీట్ వెలువడిన గంటల్లోనే కేరళ నుంచి సంఘీభావ ప్రకటన వచ్చింది. తొలి నిరసన వ్యక్తం చేసింది మాత్రం ఏపీ సీఎం చంద్రబాబే. కేంద్రం డబ్బులు, రాష్ట్రం డబ్బులు అంటూ ఉండవని, అన్నీ పన్ను చెల్లింపుదారు డబ్బులేనని అన్నారు. దీనికి కర్ణాటక సీఎం సిద్దరామయ్య మద్దతు పలుకుతూ, "కేంద్రానికి వచ్చే పన్నుల్లో 9.56 శాతం కర్ణాటక నుంచే అందుతున్నాయి. అందులో కేవలం 4.5 శాతమే తిరిగి రాష్ట్రానికి అందుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది" అన్నారు.



ఉగ్రదాడి జరిగిన ట్రెబెస్‌లోని సూపర్ మార్కెట్

## ఫ్రాన్స్‌లో మూడు ఉగ్రదాడులు

- చెలరేగిపోయిన ఐఎస్ ఉగ్రవాది
- ముగ్గురు మృతి, పలువురికి గాయాలు
- ముగిసిన ఆపరేషన్, ఉగ్రవాది హతం

ట్రెబెస్ (ఫ్రాన్స్), మార్చి 23: ఇస్లామిక్ స్టేట్)కు చెందిన ఒక ఉగ్రవాది శుక్రవారం ఫ్రాన్స్‌లో టెర్రర్ సృష్టించాడు. మూడు గంటల పాటు కొంత మందిని బందీలుగా ఉంచి, కాల్పులు జరిపాడు. వరుస దాడులు చేసి కనీసం ముగ్గురిని బలిగొన్నాడు. ఫ్రాన్స్‌ను వణికించిన ఈ ఘటనలు దక్షిణ ప్రాంతంలో చోటు చేసుకున్నాయి. అనంతరం భద్రతా సిబ్బంది కాల్పుల్లో ఆ ఉగ్రవాదిని మరణించాడు. మొరాకో దేశస్థుడిగా అనుమానిస్తున్న ఈ ఉగ్రవాది కార్కసోన్, ట్రెబెస్‌ల వద్ద మూడు వేర్వేరు దాడులకు పాల్పడి ముగ్గురిని చంపి.. పలువురిని గాయపరిచాడు. తొలుత కార్కసోన్ వద్ద ఒక కారును హైజాక్ చేసి అందులో ప్రయాణిస్తున్న వ్యక్తిని కాల్చి చంపి, డ్రైవర్‌ను గాయపరిచాడు. తర్వాత సమీపంలో తోటి ఉద్యోగులతో కలిసి జాగింగ్ చేస్తున్న ఒక పోలీసుపై కాల్పులు జరిపాడు. వెంటనే ట్రెబెస్ పట్టణానికి వెళ్లి అక్కడ ఉన్న ఒక సూపర్ మార్కెట్లోకి చొరబడ్డాడు. కొంత మందిని బందీలుగా చేసి, వారిలో ఇద్దరిని కాల్చి చంపేశాడు. ఆ సూపర్ మార్కెట్లో ఉగ్రవాది మూడు గంటలకుపైగా ఉండిపోయాడు. కత్తులు, తుపాకి, గ్రెనేడులతో వచ్చిన ఆ ఉగ్రవాది సూపర్ మార్కెట్లోకి వెళ్లేముందు "అల్లాహు అక్బర్" అని గట్టిగా అరిచాడని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. ఆ సమయంలో సూపర్‌మార్కెట్లో ఉన్న పది మంది వెనుక ద్వారం గుండా సురక్షితంగా బయటపడ్డారు. ఈ లోగా భద్రతా సిబ్బంది ఆ భవనాన్ని చుట్టుముట్టడంతో ఉగ్రవాది మిగిలిన వారిని విడిచిపెట్టేశాడు. ప్రస్తుతం బ్రస్సెల్స్‌లో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుల్ మెక్రాన్ హుటాహుటిన పారిస్ చేరుకుంటున్నారు. ఇది ఉగ్రవాదుల పనేనని ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్ అన్నారు.




## యూపీలో ప్రతీకారం తీర్చుకున్న బీజేపీ

### బీఎస్పీ అభ్యర్థిని ఓడించిన కమలం పార్టీ.. చివరి క్షణం దాకా హైడ్రామా

**క్రాస్ ఓటింగ్‌తో కౌంటింగ్ 2 గంటలు నిలిపివేత**

**మిగిలిన 6 రాష్ట్రాల్లో సజావుగా ముగిసిన ఎన్నికలు.. ఎగువ సభకు 59 మంది ఎన్నిక**

న్యూఢిల్లీ, మార్చి 23: రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలు ఉత్తరప్రదేశ్‌లో అత్యంత ఉత్కంఠను రేపాయి. ఈ మధ్య జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో జరిగిన పరాభవానికి బీజేపీ ప్రతీకారం తీర్చుకుంది. అనూహ్యంగా తన అభ్యర్థిని దింపి.. బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిని ఓడించింది. బీఎస్పీ ఎమ్మెల్యేకు వల వేసి- క్రాస్ ఓటింగ్ చేయించి- అమిత్‌షా చక్రం తిప్పారు. యూపీలో మొత్తం 10 సీట్లు ఖాళీ అయ్యాయి. వాటికి 11 మంది పోటీపడ్డారు. అసెంబ్లీలో బలాబలాలను బట్టి బీజేపీ మొత్తం పదింటిలో ఎనిమిది సీట్లను సులువుగా కైవసం చేసుకుంది. గెలిచిన ప్రముఖుల్లో అరుణ్ జైట్లీ, జీవీఎల్ నరసింహారావు, వికాస్ తోమర్, అశోక్ బాజపేయి, ఎస్‌డీ రాజ్‌భర్, అనిల్ జైన్, కాంతా కర్దమ్, హెచ్‌ఎస్ యాదవ్ అనాయాసంగా గెలిచారు. ఇక సమాజ్‌వాదీ పార్టీ నుంచి జయా బచ్చన్ గెలుపు కూడా ఇబ్బంది లేకుండానే ముగిసింది. బీజేపీకి చెందిన అనిల్ అగర్వాల్‌కు, బీఎస్పీ అభ్యర్థి భీమ్‌రావ్ అంబేడ్కర్‌కు నువ్వా నేనా అన్నట్లు పోటీ ఏర్పడింది. బీఎస్పీకి 18 సీట్లున్నాయి. ఎస్పీతో కలుపుకొంటే ఈ స్థానాన్ని వశం చేసుకొనేదే..! కానీ బీజేపీ ఒక బీఎస్పీ ఎమ్మెల్యేకు వల వేసింది. అనిల్ కుమార్ సింగ్ అనే ఆ శాసనసభ్యుడు బీజేపీకి ఓటేశాడు. దీనికి తోడు సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే నితిన్ అగర్వాల్ కూడా బీజేపీకే ఓటేశాడు. మరో రెండు చిన్న పార్టీలు- అప్నా దళ్ (9), సుహేల్‌దేవ్ బహుజన్ భారతీయ పార్టీ (4)లు బీజేపీకి జైకొట్టారు. దీంతో అంతిమంగా బీజేపీ విజయఢంకా మోగించింది. పార్టీల ఏజెంట్లకు తమ ఓట్లను చూపించనందున ఈ రెండు ఓట్లూ చెల్లవని ప్రకటించాలంటూ బీఎస్పీ-ఎస్పీలు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఓట్ల లెక్కింపును నిలిపివేశారు. చివరకు సీసీటీవీ ఫుటేజీ చూశాక ఏ అవకతవకలూ జరగలేదని నిర్ధారించి రాత్రి 8 గంటలకు కౌంటింగ్‌ను తిరిగి మొదలెట్టారు. రాజ్యసభ మొత్తం బలం 245. 16 రాష్ట్రాల్లో 59 సీట్లు వచ్చే నెల ప్రథమార్థంలో ఖాళీ అవుతున్నాయి. వీటిలో 33 సీట్లు ఏకగ్రీవమయ్యాయి. ఆరు రాష్ట్రాల్లోని 25 స్థానాలకు శుక్రవారం ఓటింగ్ జరిగింది. వీటిలో బెంగాల్‌లోని ఐదు స్థానాలకు ఆరుగురు పోటీ పడ్డారు. గెలవబోమని తెలిసినా సీపీఎం నుంచి రాబిన్ దేవ్ రంగంలోకి దిగారు -ఓడిపోయారు. బీజేపీ ఈ ఎన్నికల ద్వారా రాజ్యసభలో అత్యధిక స్థానాలున్న పార్టీగా అవతరించింది.



రాజ్యసభ సభ్యత్వ పత్రాన్ని సీఎం చంద్రబాబుకు చూపుతున్న రమేశ్

**రాజ్యసభ సీట్లు.. ఎవరికి ఎన్ని?**

| | పార్టీ | పోటీ లేకుండా గెలిచిన ఎంపీలు | పోటీ చేసి గెలిచిన ఎంపీలు | మొత్తం |
|---|---|---|---|---|
| 1 | బీజేపీ | 16 | 12 | 28 |
| 2 | కాంగ్రెస్ | 5 | 5 | 10 |
| 3 | టీఎంసీ | 0 | 4 | 4 |
| 4 | బీజేడీ | 3 | - | 3 |
| 5 | టీఆర్ఎస్ | 0 | 3 | 3 |
| 6 | టీడీపీ | 2 | - | 2 |
| 7 | ఆర్జేడీ | 2 | - | 2 |
| 8 | జేడీయూ | 2 | - | 2 |
| 9 | ఎస్పీ | - | 1 | 1 |
| 10 | వైఎస్ఆర్‌సీపీ | 1 | - | 1 |
| 11 | ఎన్‌సీపీ | 1 | - | 1 |
| 12 | శివసేన | 1 | - | 1 |
| 13 | లెఫ్ట్ | - | 1 | 1 |
| మొత్తం | | 33 | 26 | 59 |

## కిచిడీలా పెన్షన్ విధానాలు

న్యూఢిల్లీ, మార్చి 23: పెన్షన్ విధానాలు కిచిడీలా తయారయ్యాయని సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. పదవీ విరమణ అనంతరం అందే ప్రయోజనాల కోసం వయోధికులు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని పేర్కొంది. తాను పదవీవిరమణ పొంది 27ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ పెన్షన్ మొత్తం అందడంలేదంటూ ఓ రైల్వే రిటైర్డ్ ఉద్యోగి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తా ధర్మాసనం విచారణ జరిపి పైవిధంగా స్పందించింది. పదవీ విరమణ అనంతరం వయోధికుల జీవితం సాఫీగా సాగేందుకు ఉపయోగపడాల్సిన పెన్షన్ విధివిధానాలు కిచిడీలా తయారయ్యాయని పేర్కొంది. పెన్షన్ విధానాలు, ప్రయోజనాల క్రమబద్ధీకరణకు ఓ చట్టాన్ని రూపొందించాలని సూచించింది.




## తత్కాల్ పాస్‌పోర్ట్‌కు ఆధార్ అక్కర్లేదు

న్యూఢిల్లీ, మార్చి 23: తత్కాల్‌లో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారికి ఆధార్ తప్పనిసరి కాదు. ఇప్పటికే ఈ అంశాన్ని సుప్రీంకోర్టు రాజ్యాంగ వ్యవహారాల బెంచ్ స్పష్టం చేయగా.. తాజాగా శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పునరుద్ఘాటించింది. బృందా గ్రోవర్ అనే న్యాయవాది తాను బంగ్లాదేశ్‌లో జరగనున్న కాన్ఫరెన్స్‌కు హాజరవ్వాల్సి ఉందని.. 'తత్కాల్‌లో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నానని బెంచ్‌కి తెలిపారు. ఆధార్ వివరాలు ఇవ్వలేదనే కారణంతో తన దరఖాస్తును తిరస్కరించారని వివరించారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం తన వద్దనున్న కేసులో తుది తీర్పు వెలువరించే వరకు.. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు మినహా.. మిగతావాటికి ఆధార్ తప్పనిసరి చేయకూడదని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేసింది.

## కేసీఆర్ నన్ను మరచిపోయారు: శరద్ యాదవ్

న్యూఢిల్లీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కోసం నిరాహార దీక్ష చేస్తున్న కేసీఆర్ ప్రాణాలు కాపాడాలని తాను లోక్‌సభలో పోరాడితే.. ముఖ్యమంత్రి అయిన తర్వాత కేసీఆర్ తనను ఒక్కసారి కూడా పలుకరించలేదని జనతాదళ్(యూ) నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు శరద్ యాదవ్ అన్నారు. గురువారం నాడు పార్లమెంట్‌లో తనకు ఎదురైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డిలతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## సీబీఐ కోర్టుకు హాజరైన జగన్

- విచారణ ఏప్రిల్ 6కు వాయిదా

హైదరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో వైసీపీ అధినేత వైఎస్ జగన్ శుక్రవారం సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరయ్యారు. ఇదే కేసులో ఇతర నిందితులు కూడా కోర్టు ముందు హాజరయ్యారు. వాన్‌పిక్ సంస్థ పెట్టుబడులపై దాఖలు చేసిన చార్జిషీట్ నుంచి తన పేరును తొలగించాలంటూ ఎంపీ విజయసాయిరెడ్డి దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌పై ఆయన తరఫు న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. తదుపరి విచారణను ఏప్రిల్ 6కు వాయిదా వేశారు. ఇదిలావుండగా పెన్నా, ఇందూ పెట్టుబడులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన కేసులో కూడా నిందితులు కోర్టు ముందు హాజరయ్యారు. ఈ కేసు విచారణను కూడా ఏప్రిల్ 6కు వాయిదా వేశారు.

## చంద్రయాన్ 2 వాయిదా

చెన్నై, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చంద్రుని పరిశోధనకై ఉద్దేశించిన చంద్రయాన్ 2 ప్రయోగం వాయిదా పడింది. ఏప్రిల్ నెలలో వుంటుందని ముందుగా భావించినా కొన్ని అనివార్య సాంకేతిక కారణాలతో వాయిదా వేస్తున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) చైర్మన్ డాక్టర్ కె శివన్ తెలిపారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
***Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.***